ముహూర్తం

శ్రీ హేవళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, ఫాల్గుణ మాసం, తిథి: బహుళ ద్వాదశి మ. 3.05 వరకు, అనంతరం త్రయోదశి; నక్షత్రం: శ్రవణం మ. 2.39 వరకు, అనంతరం ధనిష్ఠ; అమృతకాలం: తె. 5.30 నుండి; వర్జ్యం: సా. 6.58 నుండి 8.42 వరకు; దుర్ముహూర్తం: ఉ. 11.36 నుండి 12.24 వరకు; రాహుకాలం: మ. 12.00 నుండి 1.30 వరకు; యమగండం: ఉ. 7.30 నుండి 9.00 వరకు;

Estd 1938

ఆంధ్రప్రభ

www.prabhanews.com

Journalism first!

సంపుటి:56 • సంచిక: 332 • బుధవారం 14 మార్చి 2018 • హైదరాబాద్ • పేజీలు:12+4 • వెల:5.00. Published from:Hyderabad|Vijayawada|Guntur|Rajahmundry|Visakhapatnam|Tirupati|Karimnagar|Kurnool|Suryapet|Anantapur|Nellore|Nizamabad



స్వామి గౌడ్‌పై దాడి దారుణం

అసెంబ్లీకే మాయని మచ్చ

దుర్మార్గమైన సంఘటన.. స్పీకర్ ఆవేదన

హరీష్ తీర్మానానికి అసెంబ్లీ ఆమోదం

కోమటిరెడ్డి... సంపత్

సభ్యత్వం రద్దు

అసెంబ్లీలో 11మంది... మండలిలో ఆరుగురు కాంగ్రెస్ సభ్యుల సస్పెన్షన్



గాంధీభవన్ వద్ద కోమటిరెడ్డి, సంపత్ నిరసన దీక్ష

హైదరాబాద్, ఆంధ్రప్రభ: శాసనసభలో సభ్యుల అనుచిత ప్రవర్తనపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంది. సమావేశాల తొలిరోజు నిరసనకు దిగిన ఇద్దరు సభ్యుల సభ్యత్వాలను శాశ్వతంగా రద్దు చేయడం, 11 మంది కాంగ్రెస్ సభ్యులను ఈ సెషన్ మొత్తం సస్పెండ్ చేయడం వంటి కీలక పరిణామాలు రెండోరోజు సభలో చోటుచేసుకున్నాయి. అటు శాసనమండలిలోనూ ఆరుగురు సభ్యులను సస్పెండ్ చేస్తూ డిప్యూటీ చైర్మన్ నేతి విద్యాసాగర్ నిర్ణయం తీసుకున్నారు. గవర్నర్ ఉభయసభలనుద్దేశించి సోమవారం ప్రసంగిస్తున్న సమయంలో ఆయనపై దాడికి ఉపక్రమించి, మండలి చైర్మన్ స్వామీగౌడ్ కన్ను గాయానికి కారకులైన నల్గొండ శాసనసభ్యుడు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి. అలంపూర్ శాసన సభ్యుడు సంపత్‌కుమార్‌ల శాసనసభ్యత్వాలను శాశ్వతంగా రద్దు చేస్తూ స్పీకర్ మధుసూదనాచారి కీలక నిర్ణయం ప్రకటించారు. గవర్నర్ ప్రసంగాన్ని అడ్డుకునే ప్రయత్నంలో భాగంగా జరిగిన దాడికి కారణమైన సభ్యుల తీరుపై స్పీకర్ మధుసూదనాచారి తీవ్రంగా తప్పుపట్టారు. క్షమించరాని ఘటనగా ఆయన అభివర్ణించారు. స్పీకర్ నిర్ణయం తర్వాత కాంగ్రెస్ సభ్యుల ఆందోళనతో శాసనసభ దద్దరిల్లింది. మంగళవారం ఉదయం 10 గంటలకు సభ ఆరంభం కాగానే స్పీకర్ మధుసూదనాచారి తన ఆవేదనను వ్యక్తం చేస్తూ చట్ట సభల్లో ఇది వాంఛనీయం కాదని వాపోయారు. ఆ తర్వాత శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి హరీష్‌రావు సభ్యుల సస్పెన్షన్, సభ్యత్వాల రద్దుపై తీర్మానాన్ని ప్రవేశపెట్టడం, శాసనసభ ఏకగ్రీవ తీర్మాణంతో ఆమోదం చకచకా జరిగిపోయాయి. సభా మర్యాదలు మంటగలిపారని పేర్కొంటూ క్రమశిక్షణా చర్యల్లో భాగంగా ప్రధాన ప్రతిపక్ష నేత జానారెడ్డితోపాటు టీపీసీసీ చీఫ్ ఉత్తమ్ కుమార్‌రెడ్డి, మల్లు భట్టి విక్రమార్క, ఉపనేత టి జీవన్‌రెడ్డి, జె గీతారెడ్డి, జి చిన్నారెడ్డి, డికే అరుణ, పద్మావతిరెడ్డి, టి రాంమోహన్‌రెడ్డి. డి మాధవరెడ్డి. ⇨ 2వ పేజీలో...



అరాచక శక్తుల్ని అణిచేస్తాం

రాజకీయ నాయకుల ముసుగులో అరాచకాలు కుదరవు

శాంతిభద్రతలు భేషుగ్గా ఉన్నచోట ఇలాంటి సంఘటనలా?

అంతిమ నిర్ణేతలు ప్రజలే: అసెంబ్లీలో సీఎం కేసీఆర్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఆరాచక శక్తుల పీచమణచడంలో తమ ప్రభుత్వం వెనుకడుగు వేయబోదని, రాజకీయ నేతల ముసుగులో ఆరాచకాలు సృష్టిస్తామంటే కుదరదని ముఖ్యంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు తీవ్ర స్వరంతో హెచ్చరించారు. నాలుగేళ్లనుంచి తెలంగాణలో టీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ⇨ 2వ పేజీలో...

భగ్గుమన్న కాంగ్రెస్

దీక్షలో ఆ ఇద్దరు

నేడు హైకోర్టులో పిటిషన్‌కు నిర్ణయం

మూకుమ్మడి రాజీనామాలకు సిద్ధపడ్డ సభ్యులు

తొందరవద్దని వారించిన ఢిల్లీ పెద్దలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: మాజీ మంత్రి, ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఆలంపూర్ ఎమ్మెల్యే సంపత్ కుమార్‌లు గాంధీభవన్‌లో 48గంటల పాటు 'ప్రజాస్వామ్య పరిరక్షణ' పేరుతో నిరహార దీక్షకు కూర్చున్నారు. గాంధీభవన్ ఆవరణలో సాయంత్రం 5 గంటలకు కోమటిరెడ్డి, సంపత్ దీక్షకు కూర్చోగా.. టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీఎల్పీ నేత జానారెడ్డి, మండలిలో విపక్ష నేత షబ్బీర్ అలీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లు భట్టివిక్రమార్కలు ప్రారంభించారు. బుధవారం ఉదయం ఈ ఇద్దరు నేతలకు మద్దతుగా సీఎల్పీ నేత జానారెడ్డి, ఉత్తమ్, భట్టివిక్రమార్కతో పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కూడా దీక్షకు దిగనున్నారు. అంతే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా కూడా వివిధ నియోజక వర్గాల్లో ఆందోళనలు, ధర్నాలు చేయడంతో పాటు సంఘీభావంగా హైదరాబాద్‌కు ⇨ 3వ పేజీలో...



వెయ్యి కోట్ల ఆస్తులతో

దేశంలోనే సంపన్న ఎంపీ జయాబచ్చన్

ఆభరణాల విలువ రూ.62 కోట్ల పైనే

రూ.13 కోట్లు విలువ చేసే 12 వాహనాలు

న్యూఢిల్లీ: బాలీవుడ్ మాజీ నటీమణి, మెగాస్టార్ అమితాబ్ బచన్ సతీమణి ఎంపీ జయాబచన్ రూ.1000 కోట్ల విలువైన ఆస్తులతో దేశంలోనే సంపన్న పార్లమెంట్ సభ్యురాలిగా గుర్తింపు పొందారు. అంతేకాక ఈ రికార్డుతో దేశంలోనే సంపన్న అత్తగా మారిపోయారు. 2004 నుంచి ఉత్తర్‌ప్రదేశ్ నుంచి మూడు పర్యాయాలు రాజ్య సభ ఎంపీగా ఎన్నికైన జయాబచన్ ఎంపీగా కాలపరిమితి ముగియటంతో నాలుగో పర్యాయం మళ్లీ నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా జయా బచన్ తన ఆస్తులను వెల్లడించారు. ఎంపీగా జయ మళ్లీ గెలిస్తే దేశంలోనే అత్యంత సంపన్న ఎంపీగా గుర్తింపును పొందనున్నారు. 2012లో ⇨ 9వ పేజీలో...

ఉపఎన్నికలకు తెరాస రెడీ!

నల్గొండ ఇన్‌ఛార్జ్‌గా హరీష్

ఆలంపూర్‌కు కేటీఆర్?

కర్ణాటక ఎన్నికలతోపాటు ఈ ఉపఎన్నికలు?

10 లో

నేడు మరో ఇద్దరిపై చర్య?

రామ్మోహన్‌రెడ్డి, వంశీచంద్ సభ్యత్వాల రద్దుకు కసరత్తు

వీడియో పుటేజీలను మరోసారి పరిశీలించిన స్పీకర్

కోమటిరెడ్డి, సంపత్ సభ్యత్వాల రద్దుపై గెజిట్ విడుదల

కేంద్ర ఎన్నికల సంఘానికి సమాచారం





హైదరాబాద్, ఆంధ్రప్రభ: మరో ఇరువురు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేల సభ్యత్వాలు రద్దు కానున్నాయా? ఈ దిశగా ప్రభుత్వం పావులు కదుపుతోందా? ఈ ఇద్దరిపై వేటువేస్తూ మంత్రి హరీష్‌రావు బుధవారం శాసన సభలో తీర్మానాన్ని ⇨ 9వ పేజీలో...



మావోల మెరుపుదాడి

9మంది జవాన్ల మృతి

• మందుపాతర పేల్చి ఆ తర్వాత కాల్పులు

• ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌కు ప్రతిచర్య • ఆపరేషన్‌లో వంద మందికిపైగా మావోయిస్టులు

చింతూరు, ప్రభ న్యూస్: ఛతీస్‌గఢ్ రాష్ట్రంలోని దండకారణ్యం సీఆర్పీఎఫ్ జవాన్ల రక్తంతో నెత్తురోడింది. మంగళవారం మావోయిస్టులు మెరుపుదాడికి దిగారు. 9 మంది సీఆర్పీఎఫ్ జవాన్లను పొట్టన పెట్టుకున్నారు. ఆంధ్రా - తెలంగాణ రాష్ట్రాల సరిహద్దు రాష్ట్రమైన ఛత్తీష్‌గఢ్ రాష్ట్రం సుకుమా జిల్లా, కిష్టారం పోలీస్ స్టేషన్ పరిధిలోని కిష్టారం - పాలోడి గ్రామాల మధ్య మావోయిస్టులు భారీ మందు పాతరను పేల్చేశారు. ఈ పేలుడులో సీఆర్పీఎఫ్ జవాన్లు ప్రయాణిస్తున్న బుల్లెట్ ప్రూఫ్ వాహనం ధ్వంసమైంది. 212 సీఆర్పీఎఫ్ బెటాలియన్‌కు చెందిన 9 మంది సీఆర్పీఎఫ్ జవాన్లు ఈ ఘటనలో అశువులు బాశారు. మరో ⇨ 9వ పేజీలో...

జనసేన దిశానిర్దేశం నేడే

• భవిష్యత్తు కార్యాచరణకు అంకురార్పణ • ఆవిర్భావ సభకు విస్తృతమైన ఏర్పాట్లు • బందోబస్తుకు డీజీపీకి లేఖ • 2లక్షల మంది వస్తారని అంచనా

8 లో



గుంటూరు జిల్లా నాగార్జున వర్సిటీ ఎదురుగా ఉన్న మైదానంలో సిద్ధమవుతున్న బహిరంగ సభా వేదిక




కె. వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో సుచీంద్రన్‌తో అవగాహన ఒప్పందం

సిరిసిల్లలో రూ.100 కోట్ల పెట్టుబడితో

అపెరల్ సూపర్ హబ్

7

జౌరా..!



ఎంపీ కవితకు ప్రధాని మోడీ సర్‌ప్రైజ్

ప్రధాని సంతకంతో తెలుగులో లేఖ

జన్మదినం రోజు శుభాకాంక్షల వెల్లువ

5 లో



కేప్‌టౌన్: ఓ గుణపాఠం!

ప్రపంచానికి ప్రమాద ఘంటికలు • తాగునీటి ఎద్దడిని ఎదుర్కొనేదెలా?

(న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి)

ప్రపంచానికి ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. ఇంతవరకు రాజ్యాల విస్తరణ, ఆధిపత్య ప్రదర్శన, సంపద, ఇంధన వనరుల కోసం యుద్ధాలు సాగాయి. కాగా తాగునీటి కోసం దేశాలు పరస్పర యుద్ధాలకు తెగబడే దుస్థితి ముంచుకొస్తోంది. ఇప్పటికే ప్రపంచంలో ఆరింట ఒక వంతు ప్రాంతాలు తాగునీటి ఎద్దడితో సతమతమౌతున్నాయి. మూడుమాసాల క్రితం ప్రపంచ పర్యాటక కేంద్రం దక్షిణాఫ్రికాలోని కేప్‌టౌన్‌లో అత్యంత తీవ్ర నీటి ఎద్దడి ఏర్పడింది. ఆదిలో ఇది కేప్‌టౌన్ వరకే పరిమితంగా భావిస్తే మూడు మాసాలు తిరిగేసరికి ప్రపంచంలోనే ఐదొందల అతిపెద్ద నగరాల్లో ప్రతి మూడింటిలో ఒక చోట తీవ్ర ఎద్దడి మొదలైంది. సముద్రతీరం వెంబడి కేవలం మూడు అడుగుల లోతులోనే భూగర్భజలాలు లభ్యమైన ప్రాంతంగా ప్రపంచ గుర్తింపు పొందిన కేప్‌టౌన్‌లో ఇప్పుడు నీటి కోసం వారాలు, నెలల తరబడి వేచిచూడాల్సిన పరిస్థితి నెలకొంది. యూరోప్‌లోని వివిధ దేశాలకు చెందిన ఉన్నత కుటుంబీకులు, ఆస్తిపరులు తమ ⇨ 9వ పేజీలో...





అసెంబ్లీ సమావేశాలు

అసెంబ్లీ మీడియా పాయింట్

ఎలా సస్పెండ్ చేస్తారు?



హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : పార్లమెంట్‌లో కేసీఆర్ కూతురు నిరసన వ్యక్తం చేస్తే ఒక విధంగా అసెంబ్లీలో మేము నిరసన వ్యక్తం చేస్తే సస్పెన్షన్ వేటు వేస్తారా అంటూ కాంగ్రెస్ ప్రతిపక్ష నాయకుడు సీనియర్ ఎమ్మెల్యే జానారెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలను సస్పెన్షన్ చేయడంపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మీడియా పాయిం ట్‌లో ఈ విషయంపై ఆయన మాట్లాడారు. దీనిని బ్లాక్ డేగా అభివర్ణించారు. ఈ చర్యను ప్రజ లందరూ గమనిస్తున్నా రన్నారు. మొదటి రోజు జరిగిన సంఘటన విచారకర మని, ఆ సంఘటనను తాము ఖండిస్తున్నా మని, దీనిపై ఓ కమిటీని వేసి చర్యలు తీసుకుంటే పద్ధతిగా ఉండే దన్నారు. గవర్నర్ ప్రసంగం రోజు జరిగిన సంఘటనపై చర్యలు స్పీకర్ ఎలా తీసుకుంటారో సమాధానం చెప్పా లన్నారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి ఇలాంటి దుస్థితి పడుతుందని అనుకోలేదన్నారు. కాంగ్రెస్ ప్రభు త్వం అధికారంలో ఉన్నప్పుడు హరీష్ రావు బల్లలు ఎక్కి మైక్‌లు విసిరినప్పుడు గుర్తు లేదా అని ఆయన ప్రశ్నించారు. తప్పును తప్పని చెబితే కేసీఆర్‌కు నచ్చడం లేదని ఆయన అన్నారు. తమను టీఆర్ఎస్ వాళ్లు ఎన్నికోలేదని ప్రజాస్వామ్య బద్ధంగా గెలిచామని, తాము ప్రజలకు జవాబుదారీగా వ్యవహరిస్తున్నామని దీనిని సీఎం కేసీఆర్ గుర్తిం చాల న్నారు. ఈ సంఘటనపై తాము ప్రజల్లోకి వెళతామన్నారు. హామీలను అమలు చేయకపోగా అడిగినందుకు మాపై కక్షగట్టిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

రూల్స్ తెలుసుకోవాలి!



శాసనసభ రూల్స్ గురించి స్పీకర్‌తో పాటు ప్రభుత్వం తెలుసుకోవాలని ఎమ్మెల్యే ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. స్పీకర్ తీసుకున్న నిర్ణయం ఏకపక్షంగా ఉందన్నారు. రాజ్యాంగ బద్ధంగా వ్యవహరించాల్సిన ఆయన టీఆర్ఎస్ పార్టీ స్పీకర్‌గానే వ్యవహరిస్తున్నార న్నారు. ఇన్ని సంవత్సరాలుగా పార్టీ ఫిరాయించిన వారిపై చర్యలు తీసుకోమంటే ఇప్పటివరకు స్పందించని స్పీకర్ మొదటిరోజు జరిగిన సంఘటనపై మాత్రం వెంటనే స్పందించారని ఆయన వాపో యారు. ఎమ్మెల్యేలపై ఏ రూల్ కింద చర్యను తీసుకున్నారో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని పార్లమెంట్‌తో పాటు రాష్ట్రపతికి నివేదిస్తామన్నారు. ప్రభుత్వం అణచివేయాలని ప్రయత్నిస్తే ప్రజలు తిరగబడతారన్నారు. కేసీఆర్ చెబితేనే స్వామిగౌడ్ సరో జినీ ఆస్పత్రిలో చేరారని ఇదంతా కేసీఆర్ ఆడుతున్న నాటకమన్నారు. ప్రభుత్వ ఒత్తిడికి మీడియా కూడా లొంగిపోయిందని దీనివల్ల ప్రజాస్వామ్యంలో ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. మీడియా కూడా ఒన్‌సైడ్‌గా వ్యవహరిస్తుందన్నారు. స్పీకర్ అంటే తమకు గౌరవమని కానీ ఆయన తీసుకున్న నిర్ణయం ప్రజాస్వామ్య బద్ధంగా లేదన్నారు. అసెంబ్లీని ఇక్కడ కాకుండా ప్రగతిభవన్‌లో పెట్టుకోవాలని ఆయన ఎద్దేవాచేశారు.

విపక్షం లేకుండానే బడ్జెట్ ఆమోదమా

బడ్జెట్‌ను ఆమోదించాలంటే ప్రతిపక్షాల ఆమోదం ఉండాలని ఎమ్మెల్యే మల్లు భట్టివిక్రమార్క పేర్కొన్నారు. ప్రతిపక్షాలను సస్పెండ్ చేసి ప్రభుత్వమే తమ సొంత పార్టీ ఎమ్మెల్యేల మద్ధతుతో బడ్జెట్‌ను ఆమోదిం చుకోవాలని చూస్తుందని దీనిని ప్రజలు గమనిస్తున్నా రని ఆయన ఆరోపించారు. బడ్జెట్‌పై ప్రతిపక్షాల చర్చ జరగకుండా ఆమోదించిన సంఘటన ఏ శాసనసభ చరిత్రలో జరగలేదన్నారు. గవర్నర్ ప్రసంగం చేస్తున్న సమయంలో జరిగిన సంఘటనపై గవర్నర్ మాత్రమే చర్య తీసుకోవాలని, స్పీకర్‌కు ఆ అధికారం లేదన్నారు. దీనికి సంబంధించి 2007 సంవత్సరంలో జరిగిన ఓ సంఘటనను ఆయన సెక్షన్‌తో సహా వివరించారు. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ప్రజాస్వామ్యంలో అతిపెద్ద దాడిగా ఆయన పేర్కొన్నారు. తమకు జరిగిన అన్యాయంపై ఉద్యమించడానికి సిద్ధమన్నారు.



మామా అల్లుళ్ల డ్రామా?



మామాఅల్లుడు కలిసి డ్రామా ఆడుతున్నారని ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి ఆరోపించారు. హరీష్‌రావు, కేసీఆర్ దీనికి స్కెచ్ వేశారని ఆయన పేర్కొన్నారు. తన కుటుంబ కోసం రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని ఆయన ఆరోపించారు. మొదటగా తనపై, సంద్రపై ఇదే అసెంబ్లీలో వేటు వేశారని, ఇప్పుడు ఈ పద్ధతిని అందరికీ వర్తింప చేస్తు న్నారన్నారు. స్వామిగౌడ్ రెండు కళ్లకు దెబ్బ తాకిందని కేసీఆర్ చెప్పమంటే ఆయన చెబుతారని ఆయన ఎద్దేవా చేశారు. అసలు ఏ కన్నుకు దెబ్బతాకిందో స్పష్టత ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. దీనికి సంబం ధించిన వీడియో ఫుటేజీని విడుదల చేయాలన్నారు.

మా నోరు నొక్కుతున్నారు



ప్రభుత్వం ప్రజాస్వామ్య బద్ధంగా వ్యవహరించడం లేదని, కనీసం ప్రజలు ఎన్నుకున్న తమ నోరునొక్క డానికి ప్రయత్నిస్తుందని బీజేపీ ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి ఆరోపించారు. అసెంబ్లీలో ప్రజా సమస్యలపై మాట్లాడ దామంటే మైక్‌ను కూడా ఇవ్వటం లేదన్నారు. మైక్ ఇచ్చినా ఒకటి, రెండు నిమిషాలకే కట్ చేస్తూ తమను అసహానానికి గురిచేస్తుందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంఐఎం వాళ్లకు 15 నిమిషాలకు మాట్లాడే అవకాశం ఇచ్చారని, ప్రభుత్వానికి ఎవరైతే మద్ధతు ఇస్తారో వారికే మైక్‌లో మాట్లాడేందుకు అవకాశం ఇవ్వడం విడ్డూరంగా ఉందన్నారు. మేము ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తే కాంగ్రెస్‌కు మద్ధతు ఇస్తున్నామని సీఎం కేసీఆర్ ఆరోపిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. కేసీఆర్ కాంగ్రెస్‌లో పుట్టాడని ఆయనకు కాంగ్రెస్‌తో సంబంధాలు ఉన్నాయని తమ పార్టీకి ఆ అవసరం లేదన్నారు. కేంద్రంలో ఉన్నది తమ ప్రభుత్వమేనని చాలా రాష్ట్రాల్లో కాంగ్రెస్‌ను ఓడించి తమ పార్టీ జెండాను పాతామని ఆయన తెలిపారు. త్వరలో ఇక్కడ కూడా అదే జరుగుతుందన్నారు. ఒక ప్రతిపక్ష నాయకుడిని సస్పెండ్ చేసిన ఘనత ఈ ప్రభుత్వానికే దక్కిందన్నారు. సీఎం పిచ్చి పరాకాష్టకు చేరిందన్నారు. సభ్యుల హక్కులను కాలరాసే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు.

అన్నింటిపై ఆంక్షలు



ఈ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ధర్నాచౌక్‌ను ఎత్తివేసిందని ఎమ్మెల్యే ఆర్. కృష్ణయ్య ఆరోపించారు. ఆపై ప్రభుత్వ తప్పులను ఎత్తిచూపేందుకు నిర్వహించే సభాస్థలి ప్రతి దానిపై ఆంక్షలు విధించిందన్నారు. దీంతోపాటు ప్రజల తరఫున పోరాడే ఎమ్మెల్యేల హక్కులను కూడా ప్రభుత్వం కాలరాస్తుందన్నారు. ప్రజల గొంతును అణచివేస్తే అందరూ తిరగబడతా రన్నారు. కేసీఆర్ నిరంకుశ పాలనకు త్వరలోనే ప్రజలు చరమగీతం పలుకుతారన్నారు. కేసీఆర్ అహంకారాన్ని ప్రదర్శిస్తున్నారన్నారు. ప్రభుత్వం తన అధికారాన్ని కాపాడు కోవడానికి ప్రతిపక్షాలను భయభ్రాంతులకు గురి చేయడానికి ప్రయత్నిస్తుంద న్నారు. ఇప్పటికే పలు పార్టీల నుంచి ఎమ్మెల్యేలను ప్రభుత్వం కొనుగోలు చేసిందన్నారు. దారికి రాని వారిని సస్పెన్షన్ చేస్తూ ఇబ్బందులకు గురిచేయాలని చూస్తోందని దీనిని అందరూ ముక్తకంఠంతో ఖండించాలన్నారు.

సిద్ధాంతాలు వీడి ఒక్కటవుతామంటే

చేసేదేం లేదు

- మా దగ్గర రిపోర్టులు ఉన్నాయి
- జానా ఏం చేశారో నీకు తెలుసా..?
- కిషన్‌రెడ్డిని ప్రశ్నించిన ముఖ్యమంత్రి కేసీఆర్



ఆంధ్రప్రభ, హైదరాబాద్ : ముఖ్యమంత్రి కేసీఆర్, బీజేపి ఎమ్మెల్యే కిషన్‌రెడ్డిల మధ్య తీవ్రస్థాయిలో వాదోపవాదాలు చోటుచేసుకున్నాయి. సభనుంచి ప్రతిపక్ష నేత జానారెడ్డిని సస్పెండ్ చేయడం సరికాదన్న కిషన్‌రెడ్డి వ్యాఖ్యలపై సీఎం కేసీఆర్ స్పందించారు. నిన్న జానారెడ్డి ఏం చేశారో మీకు తెల్సా..మా దగ్గర రిపోర్టులు లేవా...? ఉట్టిగానే సస్పెండ్ చేసామా..? జానారెడ్డిపై మాకు గౌరవం లేదా...సందర్భం దొరికింది కాబట్టి అందరం ఒక్కటవుదామని అనుకుంటే మంచిది కాదు..నిన్న జరిగిన ఘటనను కిషన్‌రెడ్డి సమర్థించాలనుకుంటున్నారా అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. తాము మౌనం పాటించాలా...సభ తీర్మానం చేసింది..ఇంకా చర్చ ఎందుకు? లేని కథలు ఎందుకు? ఎందుకీ వితండ వాదాలు? ప్రజా జీవితంలో ఇలాంటి ఘటనలు సిగ్గుచేటు అని పేర్కొన్నారు.

జానారెడ్డిని అందరికంటే ఎక్కువగా గౌరవించింది తానేనని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. సిద్ధాంతాలను వీడి ఏకమవుతామంటే చేసేదేమీ లేదని, 2/3 సభ్యుల ఆమోదంతో సభ నిర్ణయం తీసుకుంది..అందరూ ఈ తీర్మానం గౌరవించాలి..అటువైపు ఉన్న ముగ్గురు సభ్యులు సభ నడుపుతామంటే ఎలా? ఇటువైపున్న 90 మంది సభ్యులు మాట్లాడకుండా ఉండాలా? అని ప్రశ్నించారు.

ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి బదులిస్తూ ఎవరి దయా దాక్షిణ్యాలతో తాము సభకు రాలేదన్నారు. తెలంగాణ ఎంపీలు పార్లమెంట్‌లో స్పీకర్ ముకంపై ప్లేకార్డులు పెడుతున్నారని ఆరోపించారు. నేను ఏ పార్టీపేరు చెప్పలేదు..సభలో జానారెడ్డి గౌరవంగా కూర్చున్నారు...గతంలో సభలో లేకుండా ఖమ్మంలో ఉన్న సభ్యుడిని సస్పెండ్ చేశారు. ఇది మంచిదా? అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సీఎంకు ఎందుకీ అసహనం? అంటూ ప్రశ్నించారు. సీఎం తర్వాత ముఖ్యనేత జానారెడ్డి అని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. జానారెడ్డి బీఏసిలో ఈ అంశంపై ఆవేదన వ్యక్తం చేశారు...నాలుగేళ్ళలో ప్రతిపక్ష నేతగా సభ



నిర్వహణకు సహకరించారు..అయినా సస్పెండ్ చేయడం సభకు శోభగా ఉండదు..తీర్మానానికి ముందు అందరితో మాట్లాడితే బాగుండేది...ఇది దురదృష్టకరం అని కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

అరాచక శక్తుల్ని అణిచేస్తాం

(మొదటిపేజీ తరువాయి)

శాంతిభద్రతలు బ్రహ్మాండంగా ఉన్నాయి. అన్ని వర్గా లకు రక్షణ ఉంది. .దీనిని చూసి ఓర్వలేక అరాచకాలు సృష్టిద్దా మని విపక్షాలు చూస్తే సహించం. గత నాలుగేళ్లుగా సభ హుం దాగా నడుస్తోంది. కొత్త రాష్ట్రంలో బడ్జెట్‌ను రాత్రి 12 అయినా ఆమోదించుకున్న తీరు ఉంది. కొత్త రాష్ట్రంలో సభ నిర్వహణ పట్ల అనేక సందర్భాల్లో ప్రశంసలు వచ్చాయి. ఈ నిర్ణయం కఠినమే..కానీ తప్పదు..సభలో గవర్నర్‌ను కొడదా మను కున్నా. తప్పిపోయింది..అని ఒప్పుకోవడం లైవ్‌లో చూశా ను. ఇది దురదృష్టకరం...రాజకీయాల్లో అసహనం ఎందుకు... కాంగ్రెస్ సభ్యులు బైట, సభలో కొనసాగిస్తున్న ఆరా చకాలకు ఇది పరాకాష్ట...దీనిని సహించేది లేదు అని సీఎం కేసీఆర్ ఘాటుగా స్పందించారు. శాసనసభలో కాంగ్రెస్ సభ్యుల సస్పెన్షన్ తర్వాత ఆయన ఈ అంశంపై మాట్లాడారు.

విషపూరిత కుట్రలు..ప్రచారాలు..

తనపై కాంగ్రెస్ పార్టీ కక్షపూరితంగా వ్యవహరించిందని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి టీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన ఐదు రోజులకే కాంగ్రెస్ నేతలు అసంతృప్తి వ్యక్తం చేస్తూ తన దిష్టిబొమ్మలను దహనం చేశారని, జెండా దిమ్మలను కూల్చేశారని గుర్తు చేశారు. నేను ఢిల్లీకి వెళ్తే కేసీఆర్ వెంట కుక్క కూడా రాదు అని ప్రచారం చేశారు. తనపై దుష్ప్రచారం చేశారని పేర్కొన్నారు. విషపూరిత కుట్రలు ప్రచారం చేశారు.. కేసీఆర్‌కు ఏదో జబ్బు వచ్చింది...అందుకే అమెరికా పోతుండు...కేసీఆర్ అక్కడే సచ్చిపోతడు అని ప్రచారం చేశారు.నాలుగేళ్లుగా ప్రచారం చేస్తున్నారు...ఇది వినడానికే బాధనిపిస్తోంది అధ్యక్షా అంటూ ఆవేదనను వ్యక్తం చేశారు.

ప్రభుత్వంపై, ప్రతిపక్షంపై ప్రజలు ఏమనుకుంటున్నరు అని తెలిపే ఘట్టమే ఎన్నికలు...తెలంగాణలో ఈ నాలుగేళ్లలో అనేక ఎన్నికలు జరిగాయి. ఏ ఒక్క ఎన్నికా కాంగ్రెస్ గెలవలేదు. డిపాజిట్ కూడా తెచ్చుకోలేదు..అన్ని పార్టీలు ఒక్కటై పోటీ చేసినా అచ్చంపేటలో 20సీట్లకు ఒక్క సీటు పొందలేక పోయారు. చీప్ పాలిటిక్స్ చేస్తున్నారు అని దుయ్యబట్టారు.

ఆరునూరైనా నేను ప్రజలకు జవాబుదారీ..సభకు ధన్యవాదాలు, సభ్యులు సంస్కారహీనంగా ప్రవర్తించొద్దు...గత సమావేశాల్లోనే బీఏసిలో స్పష్టంగా చెప్పాం...మేం చర్చకు సిద్ధం...ఎన్ని రోజులైన సభ నడుపుతాం...ఆరాచకం ఎందుకు...అసహనం ఎందుకు...హద్దు మీరుతున్నారు... హక్కులకు భంగం కల్గించొద్దు...ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టడం సభ్యుల హక్కు..ప్రజలముందు నగ్నంగా బైట పడిన కాంగ్రెస్‌కు నాటకమాడే ఉద్దేశం ఉంటది..

కౌన్సిల్ ఛైర్మ న్‌కు ఎందుకుంటది అని ప్రశ్నించారు. కాంగ్రెస్ సభ్యులతీరుపై తమకు ముందే సమాచారం ఉందన్నారు. సభనుంచి పారి పోవాలని పథకం వేశారని, నిరవధిక సస్పెండ్ చేయించుకుని పోవాలని చూస్తున్నారని విమర్శించారు. సరైన సందేశం ప్రజలకు ఇచ్చేలా..సభ నిర్వహణను కఠినం చేస్తున్నాం... అంతిమ న్యాయనిర్ణేతలు ప్రజలే... ఆరాచకాన్ని సహిస్తే ప్రజలు హర్షించరు అని పేర్కొన్నారు.



కోమటిరెడ్డి.. సంపత్

సభ్యత్వం రద్దు


(మొదటిపేజీ తరువాయి)

వంశీచంద్‌రెడ్డిలపై ఈ సెషన్ మొత్తానికి వేటు వేశారు. అదేవిధంగా శాసనమండలిలోనూ ఘటనకు సంబంధం ఉన్న కాంగ్రెస్ సభ్యులైన షబ్బీర్ అలీ, పొంగులేటి సుధాకర్‌రెడ్డి, సంతోష్, దామోదర్‌రెడ్డి, ఆకుల లలిత, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిలను ఈ సెషన్ మొత్తం సస్పెండ్ చేస్తున్నట్లు కౌన్సిల్ డిప్యుటీ ఛైర్మన్ నేతి విద్యాసాగర్ ప్రకటించారు.

కాగా శాసనసభలో స్పీకర్ నిర్ణయంతో ఆందోళన చెందిన కాంగ్రెస్ సభ్యులు తమతమ స్థానాల్లో లేచినిలబడి అభ్యంతరాలు తెలపడం, మార్షల్స్ రంగ ప్రవేశంతో అలజడి చెలరేగింది. భారీగా మోహరించిన మార్షల్స్‌తో ఒకరిద్దరు సభ్యులు వాగ్వాదాలు చేసినప్పటికీ స్పీకర్ పదేపదే విజ్ఞప్తి చేయడంతో సస్పెన్షన్‌కు గురైన సభ్యులు సభనుంచి నిష్క్రమించారు. కాగా కాంగ్రెస్ సభ్యులపై సస్పెన్షన్ వేటు వేసే సమయంలో సీఎం కేసీఆర్ సభలో లేరు. సస్పెన్షన్‌కు గురైన సభ్యులు బైటికి వెళ్లిపోయిన తర్వాత ఆయన సభకు వచ్చారు. కాగా ప్రభుత్వ నిర్ణయాన్ని ఎంఐఎం స్వాగతించగా మిగతా విపక్షాలు సరైంది కాదంటూ వ్యాఖ్యానించాయి. బీజేపి సభ్యుడు కిషన్‌రెడ్డి ఈ సందర్భంగా చేసిన వ్యాఖ్యలపై సీఎం కేసీఆర్ ఆగ్రహంతో స్పందించారు. వారి మధ్య స్వల్ప వాగ్వాదం చోటుచేసుకుంది.

తన వైఖరి చాటిన సర్కార్...

శాసనసభా హుందాతనం, గౌరవానికి, నిబంధనల అతిక్రమణను ఎట్టిపరస్థితుల్లోనూ సహించేది లేదన్న ప్రభుత్వం ఈ నిర్ణయంతో తన వైఖరిని చాటిచెప్పింది. అదేవిధంగా మరో 11మంది కాంగ్రెస్ సభ్యులను ఈ ఘటనకు బాధ్యులుగా చేస్తూ ఈ సమావేశాలు మొత్తానికి సస్పెండ్ చేస్తూ స్పీకర్ మధుసూదనాచారి నిర్ణయం ప్రకటించారు. బడ్జెట్ సమావేశాలు ముగిసేవరకు బహిష్కరణ అమలులో ఉంటుందని సభాపతి ప్రకటించారు. ఈ నిర్ణయం తర్వాత కాంగ్రెస్ సభ్యులు లేచి నిలబడగా విపక్ష నేత జానారెడ్డి తనకు మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలని కోరారు. హౌజ్‌ను వీడే ముందు మా అప్పీల్‌ను వినాలి అంటూ ఆయన చేసిన అభ్యర్థనను స్పీకర్ తోసిపుచ్చారు.



తీవ్రంగా కలత చెందిన సభాపతి...

మంగళవారం రెండో రోజు అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ఆరంభం కాగానే సభాపతి మధసూదనాచారి తొలి రోజు ఘటనలపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తీవ్రమైన స్వరంతో ఇలాంటి ఘటన దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. మనస్తాపంతో మాట్లాడుతున్నానని, సభను హుందాగా నిర్వహించడం తన విద్యుక్త ధర్మం అని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు మాయని మచ్చలుగా మిగిలిపోతాయని ఆవేదన వ్యక్తం చేసిన ఆయన 4ఏళ్ల శాసనసభా చరిత్రలో ఇదో మచ్చగా అభివర్ణించారు. దుర దృష్టకర, దుర్మార్గమైన ఇంతటి బాధాకరమైన ఘటన, గవర్నర్‌పై దాడిని చూసి షాక్‌కు గుర య్యానని చెప్పారు. చట్టసభలకు ఇది వాంఛనీయం కాదని దేశంలో ఎన్నో రాష్ట్రాలు తెలంగాణ సభ నిర్వ హణ పట్ల తమ హర్షం తెలిపాయని, సభ్యులు హుం దాగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. క్లిప్పింగ్‌లను చూసిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలని అవకాశం ఇచ్చానని, తెలిసి ఉద్దేశపూర్వకంగా చేసిన పని ఇదని ఆయనస్పష్టం చేశారు. బాధాకరమే అయినప్పటికీ ఈ నిర్ణయం అనివార్య చర్యగా తీసుకో తప్ప దంలేద న్నారు. అంతకుముందు శాసనసభా వ్యవహా రాల శాఖ మంత్రి హరీష్‌రావు మాట్లాడుతూ నిన్నటి ఘటన పెద్ద తప్పుగా అభివర్ణించారు. చట్టసభలు, రాష్ట్రాన్ని అవమానపర్చేలా వారి చర్యలున్నాయని పేర్కొంటూ సభ్యుల సస్పెన్షన్ తీర్మానాన్ని సభలో ప్రవేశపెట్టారు. శాసనసభ ఆమెదం తర్వాత కాంగ్రెస్ సభ్యులు బైటికి వెళ్లారు. ఆ తర్వాత స్పీకర్ మధుసూదనాచారి ప్రశ్నోత్తరాలను అనుమతించారు.

ఇక వారిద్దరూ మాజీలే : హరీశ్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్ర శాసనసభ సభ్యత్వం రద్దుచేసిన ఇద్దరు సభ్యులు ఇక మాజీలేనని రాష్ట్ర శాసనసభ వ్యవహారాల శాఖా మంత్రి హరీష్‌రావు అన్నారు. మంగళవారం శాసనసభలాబీల్లో మీడియాతో చిట్‌చాట్ చేసిన ఆయన ఆ రెండు శాసనసభ స్థానాలు ఖాళీ అయిన విషయాన్ని సభ ఎన్నికల కమిషన్‌కు తెలియపరుస్తుందని, కర్ణాటకతో పాటు ఖాళీ అయిన రెండు అసెంబ్లీస్థానాలకు కూడా ఎన్నికలు జరిగే అవకాశాలున్నాయని పేర్కొన్నారు.

సస్పెన్షన్‌ను సమర్థిస్తున్నాం

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : వచ్చే ఎన్నికల్లో కూడా టీఆర్ఎస్ పార్టీ గెలవాలని కోరుకుంటున్నామని. అందుకు తమ పార్టీ సహకారం ఉంటుందని ఎంఐఎం శాసనసభా పక్ష నాయకుడు అక్బరుద్దీన్ ఓవైసీ అన్నారు. సీఎం కేసీఆర్ తిరిగి ముఖ్యమంత్రి కుర్చీలో కూర్చోవాలన్నదే తమ ఆకాంక్షని చెప్పారు. శాసనసభలో అనుచితంగా వ్యవహరించిన కాంగ్రెస్ సభ్యులను సభ నుంచి సస్పెండ్ చేయడాన్ని సమర్థిస్తున్నట్లు ఎంఐఎం పక్ష నాయకుడు



అక్బరుద్దీన్ ఓవైసీ చెప్పారు. శాసనమండలి ఛైర్మన్ స్వామిగౌడ్‌పై హెడ్‌ఫోన్‌తో జరిగిన దాడికి సంబంధించిన వీడియోను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మైనారిటీలకు ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలపై ప్రశంసలు కురిపిస్తూనే జాప్యం జరుగుతున్న కార్యక్రమాలపై సుతిమెత్తగానే ప్రభుత్వంపై విమర్శలు కురిపించారు. గవర్నర్‌పై హెడ్‌ఫోన్ విసిరితే శాసనమండలి ఛైర్మన్ స్వామిగౌడ్‌కు తగిలిందని ఆ పార్టీ నాయకులు చెప్పడం దుర దృష్టకరమన్నారు. పాతబస్తీ అభివృద్ధి కోసం గతంలో దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి రూ. 2 వేల కోట్లు కేటాయించారని, టీఆర్ఎస్ ప్రభుత్వం కూడా రూ.5 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా పర్యాటక కేంద్రాలను కలుపుతూ ట్రామ్ రైలు మార్గాన్ని ఏర్పాటు చేయాలని, దీనివల్ల పర్యాటకంగా నగరంమరింత అభివృద్ధి చెందుతుందని సూచించారు. మైనారిటీలకు సంబంధించి సుధీర్ కమిషన్ సమర్పించిన రెండో నివేదికను సభ ముందు పెట్టాలని డిమాండ్ చేశారు. అలాగే ఎస్టీలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అధికార భాషా సంఘంలో ఉర్దూ మాతృభాష వ్యక్తిని సభ్యుడిగా నియమించాలని కోరారు.

చక్రబంధంలో విపక్షం ఉక్కిరిబిక్కిరి

తెరాసలో హుషారు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరరావు వ్యూహాత్మకతకు విపక్షం ఉక్కిరిబిక్కిరైంది. ఈసారి శాసనసభ సమావేశాల్లో దూకుడుగా వ్యవహరించాలని నిర్ణయించుకున్న విపక్షాన్ని.. ఒక్కరోజులోనే చక్రబంధంలో బిగించి కోలుకోలేని షాక్‌నిచ్చారు. విపక్షం సస్పెన్షన్‌ను ఊహిస్తే.. శాసనసభసభ్యత్వం రద్దు ద్వారా సంచలన నిర్ణయం ప్రకటించారు. గత నాలుగేళ్ళుగా తెలంగాణ శాసనసభలో 8సెషన్స్ జరగ్గా.. ప్రతి సెషన్‌కు ఒక్కో వ్యూహాన్ని అమలుచేస్తూ సభపై ఆధిపత్యం కొనసాగిస్తున్నారు. ఒక సెషన్‌లో అమలు చేసిన వ్యూహాన్ని.. మరో సెషన్‌లో అమలుచేయకుండా పకడ్బందీ వ్యూహరచనతో విపక్షాన్ని వ్యూహాల ఉచ్చులో బిగిస్తున్నారు. ఈసారి తొమ్మిదవ శాసనసభ సమావేశాల్లో కాంగ్రెస్ గట్టిగా గొడవచేయాలని నిర్ణయించుకుందని, సస్పెన్షన్ కోరుకుంటోందంటూ.. ముందుగానే టిఆర్ఎస్ శాసనసభాపక్షసమావేశంలో చెప్పిన ముఖ్యమంత్రి కెసిఆర్.. గొడవ చేస్తే వేటుతప్పదని ముందే ప్రకటించారు. విపక్షం ఒక్కడుగు వేస్తే.. నాలుగుఅడుగులు ముందుకు వెళ్ళి ఆలోచించే సిఎం.. అనూహ్యనిర్ణయాలతో విపక్ష కాంగ్రెస్‌ను ఉక్కిరిబిక్కిరి చేశారు. సభలో మైక్ విసిరిన నల్లగొండ ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకటరెడ్డిపై, ఆలంపూర్ ఎమ్మెల్యే సంపత్ కుమార్‌లపై సస్పె న్షన్ వేటు పడుతుందని అంతా ఊహించగా, అనూహ్యంగా అంతకంటే తీవ్ర నిర్ణయాలను పరిశీలించిన ముఖ్యమంత్రి కెసిఆర్ సభ్యత్వరద్దుకు మొగ్గు చూపారు. ఈ సెషన్‌కు సభ్యు లందరినీ సస్పెండ్ చేయడంతో పాటు గత కొంతకాలంగా ముఖ్యమంత్రి కెసిఆర్‌ను, ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేస్తున్న కోమటిరెడ్డి, సంపత్‌లను.. ఉచ్చుబిగించి శాసనసభ్యత్వం రద్దు చేశారు. టిఆర్ఎస్ తీసుకున్న అనూహ్యనిర్ణయంతో.. ప్రభుత్వంపై పోరాడేందుకు వ్యూహాలు రచించిన కాంగ్రెస్ పూర్తి ఢిఫెన్స్‌లోకి వెళ్ళిపోయింది. ఇలా ఎలా జరిగిందో అర్థంకాక.. ఆత్మరక్షణ ధోరణిలో పడి పోయింది.

గవర్నర్ ప్రసంగంపై చర్చ ముగిశాక.. మండలి ఛైర్మన్ స్వామిగౌడ్‌కు తగిలిన గాయం గురించి తెలిసిన అధికారపక్షం షాక్‌కు గురైంది. సభలో గవర్నర్‌ను లక్ష్యంగా చేసుకుని మైక్ విసిరానని, అది పొరపాటున మండలి ఛైర్మన్‌కు తగిలి ఉంటుందంటూ మొదట కోమటిరెడ్డి ప్రకటించడంతో.. ఇదే అదునుగా టిఆర్ఎస్ పకడ్బందీ వ్యూహరచన చేసింది. సభలో అల్లరి చేసి.. దాడికి కారణమైన సభ్యుల విషయంలో ఎలా వ్యవహరించాలి, సభను అడ్డుకోవాలని నిర్ణయించిన కాంగ్రెస్ పట్ల ఎలా వ్యవహరించాలన్న దానిపై పార్టీ ముఖ్యులతో పాటు న్యాయ నిపుణలతోనూ సోమ వారం రాత్రి సుదీ ర్ఘంగా చర్చించారు. ఇదే సందర్భంలో నల్లగొండ ఎస్పీని కూడా బదిలీచేశారు. మంగళవారం ఉదయం సాధారణ సస్పెన్షన్‌కు సిద్ధపడి వచ్చిన కాంగ్రెస్ సభ్యులకు కోలుకోలేని షాక్‌నిచ్చారు. ఇద్దరుసభ్యుల సభ్యత్వం రద్దుచేస్తూ మైండ్ బ్లాక్ చేశారు. 11మంది సభ్యులను సభనుండి బహిష్కరించారు. సభ నిర్ణయాన్ని ఎంఐఎం సమర్థించగా, అధికారపక్షం తీసుకున్న నిర్ణయంతో విపక్షం ఒక్కసారిగా ఖంగుతిందని టిఆర్ఎస్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ప్రజాస్వామ్య వ్యవస్థలో చట్టాలను గౌరవించాలని, ప్రశ్నలు వదిలేసి.. దాడులకు దిగితే ఇలాంటి చర్యలు తప్పవంటూ చర్యను సమర్థిస్తున్నాయి. సభ్యత్వరద్దు నిర్ణయం, కాంగ్రెస్ సభ్యులపై చర్యల నేపథ్యంలో మునుపెన్నడూ లేనిరీతిలో అధికారపక్ష సభ్యుల్లో ఉత్సాహం పెల్లుబికింది. ఒకేరోజు 30మందికి పైగా సభ్యులు పోటాపోటీగా మీడియా ముందుకు వచ్చారు. కెసిఆర్ వ్యూహాత్మకత ఫలితంగా విపక్షం డిఫెన్స్‌లో పడగా, టిఆర్ఎస్ సభ్యుల్లో ఉత్సాహం పరిఢవిల్లింది.







ప్రజాక్షేత్రంలో తేల్చుకుంటాం!

- అసెంబ్లీ నిర్ణయాన్ని తీవ్రంగా పరిగణిస్తున్న కాంగ్రెస్
- రాజీనామాల నిర్ణయం వాయిదా
- రాష్ట్రవ్యాప్తంగా నిరసనలకు పిలుపు
- నేడు వ్యూహ రచన



హైదరాబాద్, ఆంధ్రప్రభ: బడ్జెట్ సమావేశాల సందర్భంగా సోమవారం శాసనసభలో జరిగిన పరిణామాల నేపథ్యంలో తమ ఎమ్మెల్యేల శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేయడాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా పరిగణిస్తోంది. ఈ విషయంలో ప్రభుత్వాన్ని ఎండగట్టేందుకు ప్రజాక్షేత్రంలోకే వెళ్లాలని నిరసనలు, ఆందోళనలు, దిష్టిబొమ్మ దహనం వంటి కార్యక్రమాలతో హోరెత్తించాలని ఆ పార్టీ ఒక నిర్ణయానికి వచ్చినట్టు తెలుస్తోంది. ఎమ్మెల్యేల సభ్యత్వాల రద్దు, సస్పెన్షన్ అంశంపై దూకుడుగా ముందుకు వెళ్లాలని నిర్ణయించింది. బుధవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాలని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ జిల్లా అధ్యక్షులను, ఇతర నేతలను కోరింది. సభ్యత్వం కోల్పోయిన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సంపత్‌లు మంగళవారం సాయంత్రం నుంచి 48 గంటల పాటు ప్రజాస్వామ్య పరిరక్షణ దీక్ష పేరుతో గాంధీ భవన్‌లో నిరాహారదీక్ష చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ దీక్షకు సంఘీభావంగా రాష్ట్రం లోని అన్ని జిల్లా కేంద్రాలు, నియోజకవర్గాలు, మండల కేంద్రాలు, గ్రామాల్లో పార్టీ శ్రేణులంతా దీక్షలు ప్రారంభించాలని కోరింది. ఎమ్మెల్యేల సభ్యత్వాల రద్దు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కాంగ్రెస్ ఎమ్మెల్యేల సస్పెన్షన్‌ను ఉపసంహరించుకోవాలని కోరుతూ జిల్లా కేంద్రాల్లో కలెక్టర్లను నియోజకవర్గ కేంద్రాల్లో ఆర్డీవో, మండల కేంద్రాల్లో ఎమ్మార్వోలను కలిసి వినతిపత్రాలను అందజేయాలని కోరింది. కోమటిరెడ్డి, సంపత్‌లపై చర్యలకు వ్యతిరేకంగా నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాల్లో భారీ నిరసన సభలు నిర్వహించాలని కాంగ్రెస్ పార్టీ వ్యూహరచన చేస్తోంది. ఈ మేరకు కాంగ్రెస్ అధినాయకత్వాన్ని కోరినట్టు సమాచారం. అక్కడి నుంచి అనుమతి రాగానే ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు మరింత ఉధృతంగా నిర్వహించాలని కాంగ్రెస్ నేతలు భావిస్తున్నారు. బడ్జెట్ సమావేశాల తొలిరోజు సమావేశం కాకుండానే నిరసనకు దిగిన తమను ప్రభుత్వం అకారణంగా సస్పెన్షన్ వేటు వేసిందని ఈ విషయంలో ప్రజాక్షేత్రంలోకి వెళ్లాలని ఆ పార్టీ నిర్ణయించింది. శాసన సభలో మండలి చైర్మన్‌పై తాను దాడి చేశానని ప్రభుత్వం ఆరోపించడం అవాస్తవమని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పునరుద్ఘాటించారు. గవర్నర్ ప్రసంగాన్ని అర్ధాంతరంగా ముగించడంతో ఆగ్రహానికి గురయ్యానని, దాంతో హెడ్‌ఫోన్స్ నేలకేసి కొట్టానని చెప్పారు. ఈ క్రమంలో సీఎం కేసీఆర్ దర్శకత్వంలో హైడ్రామా జరిగిందని ఆయన ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చని ప్రభుత్వం ఈ విషయాన్నీ శాసనసభలో తాము ప్రస్తావించి ఇరుకున పెడతామని భావించి ముందుగానే తమపై సస్పెన్షన్ వేటు వేసిందని ఆరోపించారు. కాగా తమను సస్పెండ్ చేసే అధికారం అధికార పక్షానికి లేనేలేదని కాంగ్రెస్ వాదిస్తోంది. గవర్నర్ ప్రసంగం సందర్భంగా జరిగిన ఘటనపై నిర్ణయాధికారం గవర్నర్‌దేనని ఈ తప్పు అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వానిది కాదని విపక్ష నేత జానారెడ్డి చెప్పారు. నియంతృత్వ ధోరణిలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ ఎమ్మెల్యేలంతా మూకుమ్మడి రాజీనామాలు చేయాలని భావించారు. కానీ ఇలా చేయడంవల్ల అధికార పక్షానికి అవకాశమిచ్చినట్టు అవుతుందని భావించిన కాంగ్రెస్ ఈ ప్రతిపాదనను తాత్కాలికంగా విరమించుకున్నట్టు సమాచారం. శాసన మండలి చైర్మన్ స్వామిగౌడ్‌పై దాడి జరగనే లేదని, దమ్ముంటే ప్రభుత్వం దాడి ఘటనకు సంబంధించిన వీడియో ఫుటేజీలను బయటపెట్టాలని డిమాండ్ చేశారు.

ఇదిలా ఉండగా, సోమవారం శాసనసభలో జరిగిన ఘటన గవర్నర్ పరిధిలోని అంశమని చర్యలు తీసుకునే అధికారం ఆయనకు మాత్రమే ఉందని అందరినీ సస్పెండ్ చేయడం రాజ్యాంగ విరుద్ధమని సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైంది కాబట్టే ప్రజల దృష్టిని మరల్చేందుకు సస్పెన్షన్ వ్యవహారాన్ని తెరపైకి తెచ్చిందని కాంగ్రెస్ ఆరోపించింది. కావాలనే ఉద్దేశపూర్వకంగానే తమ పార్టీ ఎమ్మెల్యేలను సభనుంచి గెంటివేశారని చెబుతోంది. సీఎం కేసీఆర్ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని సభలో ఒక సంఘటన జరిగితే బయట సీఎం కేసీఆర్ ఆడుతున్న నాటకం మరో విధంగా ఉందని కాంగ్రెస్ దుయ్యబడుతోంది. స్వామిగౌడ్‌పై దాడి జరిగినదడం అవాస్తవమని తమ పార్టీకి చెందిన ఇరువురు శాసనసభ్యులు హెడ్‌ఫోన్స్ విసిరిన దృశ్యాలను మాత్రమే చూపిస్తున్నారని ఇతర దృశ్యాలు చూపెట్టకపోవడంలో అంతర్యమేంటని ఆ పార్టీ ప్రశ్నిస్తోంది. సోమవారం గవర్నర్ తన ప్రసంగాన్ని ముగించకుండానే గాయమైందని చెబుతున్న మండలి చైర్మన్ స్వామిగౌడ్ గవర్నర్‌ను కారుదాకా తీసుకువెళ్ళి నవ్వుతూ సాగనంపారని ఆ తర్వాత సీఎం కేసీఆర్ శాసనసభలోని తన కార్యాలయంలో కూర్చుని ఒక పథకం ప్రకారం నాటకానికి తెరలేపారని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. ఈ సస్పెన్షన్లకు ప్రభుత్వం మూల్యం చెల్లించుకోక తప్పదని న్యాయం కోసం ప్రజల్లోకి వెళతామని పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్‌రెడ్డి వివరించారు.

అవసరమైతే 'సుప్రీం'కు
న్యాయనిపుణులతో కాంగ్రెస్ చర్చలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: కాంగ్రెస్ పార్టీకి చెందిన ఇద్దరు సభ్యుల (కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సంపత్‌కుమార్) సభ్యత్వం రద్దు, ఉభయ సభల్లోని మిగతా సభ్యుల సస్పెన్షన్ పై కాంగ్రెస్ పార్టీ న్యాయస్థానాన్ని ఆశ్రయించాలని నిర్ణయం తీసుకున్నది. న్యాయ నిపుణులతో ఆ పార్టీకి చెందిన నేతలు చర్చలు జరిపి.. బుధవారం హై కోర్టులో సవాల్ చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటి అవసరమైతే సుప్రీంకోర్టు మెట్లు ఎక్కడానికి కూడా సిద్ధం అవుతున్నారు. ఇప్పటి వరకు వివిధ రాష్ట్రాల్లోని పరిస్థితులు, సుప్రీంకోర్టు సూచనలను కూడా అధ్యయనం చేస్తున్నారు. అంతే కాకుండా అసెంబ్లీ, మండలిలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సస్పెన్షన్ విషయంలో విపక్షాల మద్దతును కూడగట్టుకోవాలనే అభిప్రాయానికి వచ్చారు. అసెంబ్లీలో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సభ్యత్వం రద్దు, సస్పెన్షన్ వేటు పడిన తర్వాత సీఎల్పీ కార్యాలయంలో జానారెడ్డి అధ్యక్షతన సమావేశమై భవిష్యత్‌లో అనుసరించే వ్యూహంపై చర్చించారు. ఆ తర్వాత సీనియర్ న్యాయవాది జంధ్యాల రవిశంకర్‌తోనూ సమావేశమై అసెంబ్లీలో జరుగుతున్న పరిణామాలపై చర్చించారు.

కాంగ్రెస్ సభ్యులపై ప్రభుత్వం అనుసరించిన తీరు, శాసన సభాపతి తీసుకున్న నిర్ణయం ఏకపక్షంగా ఉందని, సభ్యుల హక్కులను కాలరాసే విధంగా ఉన్నట్లు అభిప్రాయానికి వచ్చారు. సభ్యులపై సభలో చర్యలు తీసుకునే విచక్షణాధికారం స్పీకర్ ఉన్నప్పటికి ముందుగా సభ్యులకు నోటీసులు ఇవ్వడం లేదా ఒక కమిటిని వేసి విచారణ జరిపించడం లేదంటే అసెంబ్లీ ఎథిక్స్ కమిటీ సూచనలైనా పరిగణలోకి తీసుకోవాల్సి ఉంటుందని కాంగ్రెస్ సభ్యులు అభిప్రాయ పడుతున్నారు. దీంతో పాటు ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగం చేసినప్పుడు జరిగిన సమయంలో స్పీకర్ ఆధీనంలో సభ ఉండదన్నారు. గవర్నర్ ప్రసంగం తర్వాత, బీఏసీ సమావేశం అయ్యాక సభా వ్యవహారాలు స్పీకర్ ఆధీనంలోకి వస్తాయనే అభిప్రాయం కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. ఇదిలా ఉంటే వివిధ రాష్ట్రాల్లో జరిగిన అంశాలను, హైకోర్టు, సుప్రీం కోర్టుల తీర్పులను కూడా కోట్ చేయాలని నిర్ణయం తీసుకున్నారు.

మూకుమ్మడి రాజీనామాలొద్దన్న ఢిల్లీ పెద్దలు

తెలంగాణ అసెంబ్లీలో కాంగ్రెస్ సభ్యుల సభ్యత్వం రద్దు, ఎమ్మెల్యేల సస్పెన్షన్ విషయాన్ని పార్టీ హై కమాండ్‌కు కాంగ్రెస్ నేతలు వివ రించారు. ఇద్దరు సభ్యుల సభ్యత్వాన్ని రద్దుకు నిరసనగా మూకుమ్మడి రాజీ నామాలు చేయాలని నిర్ణయించారు. బడ్జెట్ సమావేశాల మొత్తం ఎమ్మెల్యేలను సభ నుంచి బయటకు పంపడం తీవ్రంగా పరిగ ణిస్తున్నారు. పార్టీ హై కమాండ్ పెద్దలు మాత్రం తెలంగాణ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, మూకుమ్మడి రాజీనామాలకు వెళ్లొద్దని సూచిం చినట్లు తెలి సింది.

అసెంబ్లీ తీరుపై ఏఐసీసీ ఖండన

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: కాంగ్రెస్ ఎమ్మెల్యేలను తెలంగాణా అసెంబ్లీ సమావేశాల నుంచి సస్పెండ్ చేయడాన్ని కాంగ్రెస్ అధిష్ఠానం ఖండించింది. కాంగ్రెస్ సభ్యుల సభ్యత్వ రద్దు, సస్పెండ్ చేయడాన్ని ఏఐసీసీ తరపున ఆ పార్టీ తెలంగాణా రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి ఆర్.సి. కుంతియా ఢిల్లీలో మండి పడ్డారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ లను శాసనసభ నుంచి సస్పెండ్ చేయడం దురదృష్టకరమని ఆయన అన్నారు. కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సంపత్‌ల సభ్యత్వ రద్దు అప్రజాస్వామికమని విమ ర్శించారు. కాంగ్రెస్ హయాంలో అసెంబ్లీలో హరీష్ రావు వ్యవ హరించిన తీరు గుర్తులేదా? అని ప్రశ్నించారు. పార్ల మెంట్‌లో తెరాస ఎంపీలు వెల్ లోకి దూసుకెళ్లి గందరగోళం సృష్టించినప్పుడు లేని తప్పు అసెంబ్లీలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు చేస్తే వచ్చిందా...? అని ప్రశ్నిం చారు. ఎమ్మెల్యేలను సస్పెండ్ చేసినంత మాత్రాన ఆందోళనలు ఆగవని తేల్చి చెప్పారు. సభలో గందరగోళం జరిగినప్పటి ఫుటేజీ బయటపెట్టాలని డిమాండ్ చేశారు.

బహిష్కరణ నిర్ణయం సబబేనా?

- గవర్నర్ ప్రసంగం రోజున స్పీకర్‌కు అధికారాలు లేవంటున్న న్యాయనిపుణులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్ర శాసనసభ నుంచి కాంగ్రెస్ సభ్యుల బహిష్కరణ, సస్పెండ్ చేస్తూ స్పీకర్ తీసుకున్న నిర్ణయం వివాదాస్పదమవుతోంది. సభా కార్యక్రమాలు ప్రారంభం కాకముందే క్రమశిక్షణా చర్య తీసుకునే అధికారం స్పీకర్‌కు లేదని న్యాయ కోవిదులు స్పష్టంచేసున్నారు. సభా కార్యక్రమాలు ప్రారంభమైన తర్వాతే స్పీకర్‌కు పూర్తి అధికారాలు వస్తాయని, కానీ సోమవారం జరిగిన సంఘటనపై నిర్ణయం తీసుకునే అధికారం స్పీకర్‌కు లేదని న్యాయ నిపుణులు చెబుతున్నారు. సభా నిబంధనలు అమల్లోకి రానందున స్పీకర్ నిర్ణయం చెల్లదని స్పష్టంచేస్తున్నారు.

పార్లమెంట్, శాసనసభల్లో సభ్యుల అనుచిత ప్రవర్తనపై సస్పెన్షన్లు, బహిష్కరణ వేటువేసే అధికారం కేవలం సభా కార్యక్రమాలు ప్రారంభమైన తర్వాతే స్పీకర్‌కు దక్కుతుంది. ఉభయ సభల సభ్యులను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించినప్పుడు బిజినెస్ రూల్స్ వర్తించవు. గవర్నర్ ప్రసంగం ముగిశాక సభ వాయిదా పడుతుంది. మరుసటి రోజు సభ ప్రారంభమైన తర్వాత సభా నిబంధనలు అమల్లోకి వచ్చి సభా కార్యక్రమాలపై పూర్తి అధికారాలు స్పీకర్‌కు వస్తాయి. అప్పటి నుంచి సభ్యుల క్రమశిక్షణపై చర్యలు తీసుకునేందుకు స్పీకర్‌కు అధికారాలు ఉన్నందున సభా సిఫారసు మేరకే సస్పెన్షన్ చేసే అవకాశం ఉంటుందని న్యాయ నిపుణులు స్పష్టంచేస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్ శాసనసభ చరిత్రలో సభ్యులను బహిష్కరించిన దాఖలాలు ఇంతవరకు లేవు. అలాగే గతంలో ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న ఎన్‌టి రామారావును 1994లో శాసనసభ నుంచి సస్పెండ్ చేసిన తర్వాత మళ్ళీ ఇప్పుడు ప్రతిపక్షనేత జానారెడ్డిపై సస్పెన్షన్ వేటు వేయడం గమనార్హం. సభలో లేనప్పటికీ తనను సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ ఎన్‌టిఆర్ తానే సభను సస్పెండ్ చేస్తున్నానని అంటూ ఆరు నెలల పాటు శాసనసభలో అడుగు పెట్టలేదు. ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో విజయం సాధించి ముఖ్యమంత్రి హోదాలోనే మళ్ళీ శాసనసభలో అడుగు పెట్టిన విషయం తెలిసిందే. ఎన్‌టిఆర్‌ను సస్పెండ్ చేయడంపై అప్పట్లో రాజకీయ దుమారం చెలరేగింది. ఆ తర్వాత ప్రతిపక్ష నాయకుడిని సస్పెండ్ చేసిన సంఘటన రెండు దశాబ్దాల తర్వాత పునరావృతమైంది. సభా కార్యక్రమాలకు సభ్యులు అడ్డుపడితే వారిని మాత్రమే సస్పెండ్ చేసి ప్రతిపక్ష నేతలను వదిలివేయడం సాంప్రదాయంగా వస్తోంది. అయితే సభ్యులందరినీ సస్పెండ్ చేసినపుడు ప్రతిపక్ష నేత కూడా నిరసన వ్యక్తంచేస్తూ సభ నుంచి వెళ్ళిపోవడం పరిపాటి. కానీ రాష్ట్ర శాసనసభలో మరోసారి సభ్యులతో పాటు ప్రతిపక్ష నేతను సస్పెండ్ చేయడం గమనార్హం. పార్లమెంట్, వివిధ రాష్ట్రాల శాసనసభల్లో సభ్యుల ప్రవర్తనపై అనేకసార్లు సస్పెన్షన్లు, బహిష్కరణ చర్యలు తీసుకున్న సందర్భాలు ఉన్నాయి. సాక్షాత్తు ఇందిరాగాంధీని కూడా సభనుంచి బహిష్కరించిన సంఘటన అప్పట్లో సంచలనం సృష్టించింది. సభ్యుల ప్రవర్తన అనుచితంగా ఉన్న సందర్భంలో చర్యలు తీసుకునే సంపూర్ణ అధికారం స్పీకర్‌కు ఉంటుంది.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2008లో ప్రకాశం జిల్లా పర్యటన సందర్భంగా ఎమ్మెల్యే కరణం బలరాం స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలపై ఆరు నెలలపాటు శాసనసభ నుంచి సస్పెండ్ చేశారు.

అయితే సభా వెలుపల తాను చేసిన వ్యాఖ్యలపై సభలో నిర్ణయం తీసుకునే అధికారం లేదని వాదించినప్పటికీ, స్పీకర్‌పై సభలో, బయట ఎలాంటి వ్యాఖ్యలు చేసినా అది క్రమశిక్షణా చర్య కిందకు వర్తిస్తుందని స్పీకర్ రూలింగ్ ఇచ్చి సస్పెన్షన్‌ను కొనసాగించారు. ఇదిలా ఉండగా, ఆంధ్రప్రదేశ్ శాసనసభలో 2015లో ఎమ్మెల్యే రోజా స్పీకర్‌ను ఉద్దేశించి సభలో చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణించి ఏడాది పాటు సస్పెండ్ చేశారు. తన సస్పెన్షన్‌ను సవాల్ చేస్తూ కోర్టును ఆశ్రయించినప్పటికీ ఆమెకు ఉపశమనం దొరకలేదు. 1977లో సాక్షాత్తు దేశ ప్రధాన మంత్రిగా పనిచేసిన ఇందిరాగాంధీని లోక్‌సభ నుంచి బహిష్కరించారు. 1964లో అనుచిత ప్రవర్తన కారణంగా మహారాష్ట్ర శాసనసభ ఒక సభ్యుడిని బహిష్కరించింది.



సభ్యత్వాల రద్దు... ఎక్కడెక్కడ!

తెలంగాణలో ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేల సభ్యత్వాన్ని అసెంబ్లీ స్పీకర్ శాశ్వతంగా రద్దు చేయడం సంచలనంగా మారింది. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కొమటిరెడ్డి వెంకట్ రెడ్డి,సంపత్ కుమార్ ల వైఖరిని ఖండిస్తూ స్పీకర్ మధుసూధనాచారి ఈ నిర్ణయం తీసుకున్నారు. అయితే దేశవ్యాప్తం గాగతంలోనూ ఇలాంటి ఘటనలు చోటుచేసుకున్నాయి.

సెప్టెంబర్ 18, 2017 : అన్నాడీఎంకే నేత దినకరన్ వర్గానికి చెందిన 18 మంది తిరుగుబాటు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు పడింది. సీఎం పళని స్వామిపై తిరుగుబావుట ఎగురవేసిన ఆ ఎమ్మెల్యేలను అనర్హులుగా తమిళనాడు అసెంబ్లీ స్పీకర్ పి.ధనపాల్ ప్రకటించారు.

27 మార్చి 2016 : ఉత్తరాఖండ్‌లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా తిరుగుబావుటా ఎగరవేసిన 9 మంది కాంగ్రెస్ పార్టీ రెబల్ ఎమ్మెల్యేలపై ఆ రాష్ట్ర స్పీకర్ అనర్హత వేటు వేశారు. ఆ తర్వాత వారు సుప్రీంకోర్టుకు వెళ్లినా.. స్పీకర్ నిర్ణయాన్ని సర్వోన్నత న్యాయస్థానం సమర్థించింది.విశ్వాస పరీక్షల ఓటు వేసేందుకు ఆ 9మందిని అనుమతించలేదు.

అక్టోబర్ 2011: 2011లో కర్నాటకలో యడ్యూరప్ప ప్రభుత్వ హయాంలో ఆనాటి స్పీకర్ 11 మంది ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్నఅభియోగంపై వేటుపడింది. ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించడాన్ని గతంలో సుప్రీంకోర్టు రద్దు చేసింది.

ఇక చట్టసభల్లో : ప్రజా సమస్యలను హుందాదాగా చర్చించి పరిష్కారాలు కనుగొనాల్సిన చట్టసభలు బలప్రదర్శనకు వేదికవుతున్నాయి. అలాంటి సందర్భాలను ఓ సారి పరిశీలిద్దాం.

చీర లాగారని: తమిళనాడు అసెంబ్లీలో జయలలిత ప్రతిపక్ష నాయకురాలుగా ఉన్నప్పటి ఘటన ఇది. 1989 మార్చి 25న రాష్ట్ర ముఖ్యమంత్రిగా, ఆర్థికమంత్రిగా ఉన్న కరుణానిధి అసెంబ్లీలో బడ్జెట్ ప్రసంగాన్ని చదువుతున్న సమయంలో ... తన చీర కొంగును డీఎంకే మంత్రి దురై మురుగన్ లాగారని జయలలిత ఆమె ఆరోపించారు. అది చూసి సభలో ఉన్న అధికార పార్టీ సభ్యులు మరింత హేళనగా నవ్వారు. అవమానభారంతో ఆగ్రహంతో జయలలిత ఊగిపోయారు. 'మిమ్మల్ని గద్దె దింపాకే అసెంబ్లీలో అడుగుపెడతా' అని శపథం చేశారు. అన్నట్టుగానే తదుపరి ఎన్నికల్లో ఆమె విజయ ఢంకా మోగించి అసెంబ్లీలో అడుగుపెట్టారు.

ఎమ్మెల్యేపై చేయిచేసుకున్న బీజేపీ నేతలు : 2015 అక్టోబర్‌లో స్వతంత్ర సభ్యుడు షేక్ అబ్దుల్ రషీద్‌పై జమ్ము కశ్మీర్ అసెంబ్లీలో అధికార బీజేపీ ఎమ్మెల్యేలు చేయి చేసుకున్నారు. .పశు మాంసాన్ని నిషేధిస్తూ అసెంబ్లీలో బిల్లును ఆమోదించినా, దాన్ని ఖాతరు చేయబోనని ప్రకటించిన రషీద్ శ్రీనగర్ ఎమ్మెల్యే హాస్టల్‌లో బీఫ్ పార్టీ కూడా ఏర్పాటు చేశారు.ఆ వ్యవహారంపై సభలో తీవ్ర దుమారం రేగింది. ఆగ్రహంతో బీజేపీ ఎమ్మెల్యేలు అతనిపై దాడి చేశారు.

కేరళ అసెంబ్లీలో నేతల కుస్తీ : 2015 మార్చి 13న కేరళ అసెంబ్లీలో చోటుచేసుకున్న ఘటన దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. అసెంబ్లీలోనే సభ్యులు గల్లాలు పట్టుకొని దాడులు చేసుకోగా, ఇద్దరు మహిళా సభ్యులు కూడా గాయపడ్డారు. ఆర్థిక మంత్రి కేఎం మణిని బడ్జెట్ ప్రవేశపెట్టకుండా ప్రతిపక్ష ఎల్డీఎఫ్‌కు చెందిన సభ్యులు చేసిన ప్రయత్నం తీవ్ర గలాటాకు దారితీసింది.స్పీకర్ కుర్చీని ధ్వంసం చేశారు. మైకులు విరిచేశారు. కంప్యూటర్లు, ఫోన్లు విసిరేశారు.

భగ్గుమన్న కాంగ్రెస్..దీక్షలో ఆ ఇద్దరు

(మొదటిపేజీ తరువాయి)

పెద్ద ఎత్తున కేడర్ రావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం చంద్రశేఖర్ రావుపై మండిపడ్డారు. తెలంగాణలో ప్రజాస్వామ్యం ఖూనీ అయిందని తెలంగాణ ప్రజలకు, కేసీఆర్ కుటుంబానికి యుద్ధం మొదలైందని ఆయన హెచ్చరించారు. ప్రభుత్వ వైఫల్యాలను సభలో ఎండగడుతామనే భయంతోనే తమ పార్టీకి చెందిన ఇద్దరు ఎమ్మెల్యేల సభ్యత్వం రద్దు చేస్తూ.. ప్రధాన ప్రతిపక్ష నేత జానారెడ్డితో సహా తామందరిపైన సస్పెన్షన్ వేటు వేయడం శోచనీయమని ఆయన దుయ్యబట్టారు. తెలంగాణలో పోలీసు రాజ్యం నడుస్తోందని ఆయన మండిపడ్డారు. శాసన మండలి చైర్మన్ స్వామిగౌడ్ అంటే తామందరికి గౌరవం ఉందని, గతంలో ఉద్యోగ సంఘం నాయకుడిగా కూడా సన్నిహితంగా ఉండేవారని ఉత్తమ్ తెలిపారు. అయితే సీఎం చంద్రశేఖర్‌రావు మాత్రం ఒక కొత్త డ్రామాకు తెరలేపాడని విమర్శించారు. స్వామిగౌడ్‌పై జరిగిన దాడికి సంబంధించిన విడియో పుటేజీని ప్రభుత్వం ఎందుకు బయటపెట్టడం లేదన్నారు. చైర్మన్ స్వామిగౌడ్‌కు ఎలాంటి గాయం కాలేదన్నారు. సభా సంప్రదాయాలపై మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు.. ఇదే గవర్నర్‌పై గతంలో దాడి చేసిన విషయం మర్చిపోయావా..? అంటూ ఉత్తమ్ నిలదీశారు. గవర్నర్ ప్రసంగం ప్రతులను చించి వేయడమే కాకుండా బెంచీలు ఎక్కికొట్టిన విషయం గుర్తుంచుకోవాలన్నారు. అధికారం ఎప్పుడు శాశ్వతం కాదని, భవిష్యత్‌లో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని ఉత్తమ్ హెచ్చరించారు.

ఫిరాయింపు ఎమ్మెల్యేలపై చర్యలేవి..?

వివిధ పార్టీల నుంచి టీఆర్ఎస్‌లో చేరిన ఫిరాయింపు ఎమ్మెల్యేలపై ఫిర్యాదు చేస్తే స్పీకర్ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో చెప్పాలని ఉత్తమ్ అన్నారు. తమ పార్టీకి చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలపై మాత్రం ఒక్క రోజులోనే అనర్హత వేటు ఎలా వేస్తారని ఆయన పేర్కొన్నారు. సీఎం చంద్రశేఖర్‌రావు ఎమ్మెల్యేలను కొనుగోలు చేశారని ఆయన ఆరోపించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు గవర్నర్ ప్రసంగంలో లేకపోవడంతో వెల్‌లోకి వెళ్లితే.. పోలీసులు, మార్షల్స్ తమపై దాడులు చేశారని ఆయన వివరించారు. పార్లమెంట్‌లో కూడా టీఆర్ఎస్ ఎంపీలు స్పీకర్‌పై కాగితాలు విసిరేశారని ఆయన వివరించారు. టీఆర్ఎస్ ఎంపీలకో ఒక రూల్.. అసెంబ్లీలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు మరొక న్యాయమా..? అంటూ ఉత్తమ్ నిలదీశారు.

కేసీఆర్ హటావో- తెలంగాణ బచావో..

రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ పెద్ద ఎత్తున ఉద్యమం చేపట్టనున్నట్లు ఉత్తమ్ తెలిపారు. కేసీఆర్ హటావో- తెలంగాణ బచావో అంటూ ప్రజల్లోకి వెళ్లుతామన్నారు. సీఎం కేసీఆర్‌తో పాటు ఆయన కుటుంబానికి అహంకారం పెరిగిపోయిందన్నారు. తెలంగాణ సొమ్మును దోచుకోవడానికి ఇప్పటి వరకు నలుగురే ఉండేవారని, ఇప్పుడు మరో వ్యక్తి చేరాడని సంతోష్‌నుద్దేశించి ఉత్తమ్ వ్యాఖ్యానించారు. తెలంగాణను వ్యతిరేకించిన ఎంఐఎం పార్టీ దోస్తానా ఎలా కుదిరిందని ఆయన నిలదీశారు. విపక్షాలను సస్పెండ్ చేస్తున్న ప్రభుత్వం అసెంబ్లీ సమావేశాలను ప్రగతి భవన్‌లోగాని టీఆర్ఎస్ భవన్ లేదంటే ఫాంహౌజ్‌లో నిర్వహించుకోవాలని ఉత్తమ్ సూచించారు.

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఓడించి తీరుతామన్నారు. సీఎల్పీ నేత జానారెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యలపై నిలదీస్తామనే భయంతోనే తమను సస్పెండ్ చేశారని ఆయన విమర్శించారు. అధికార పార్టీకి కనువిప్పు కలిగేలా ప్రజలు ఉద్యమించాలన్నారు. రాష్ట్రంలో నియంత పాలన సాగుతోందని టీ పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లు భట్టివిక్రమార్క ఆరోపించారు. దేశ చరిత్రలోనే తెలంగాణలో ప్రజాస్వామ్యం హత్యకు గురైందన్నారు. పోలీసు రాజ్యంగా మార్చి అరెస్టులు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. కేసీఆర్‌లాంటి నియంతలను చాల మందిని చూశామని మండలిలో విపక్ష నేత షబ్బీర్‌అలీ అన్నారు. టీఆర్ఎస్‌లో వాళ్లు నిరసన చేయవచ్చు కానీ, తెలంగాణలో మేం నిరసన చేయడానికి వీలు లేదా అన్నారు. ఈ దీక్షలో మాజీ మంత్రులు డీకే అరుణ, రేవంత్‌రెడ్డి, దానం నాగేందర్, పొన్నం ప్రభాకర్, వి. హనుమంతరావు, చిన్నారెడ్డి, ఎమ్మెల్యేలు వంశీ చందర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, పద్మావతి రెడ్డి, ఎమ్మెల్సీలు ఆకుల లలిత, దామోదర్‌రెడ్డి, టీపీసీసీ కోశాధికారి గూడూరు నారాయణరెడ్డి, మాజీ ఎంపీలు మల్లు రవి, అంజన్‌కుమార్ యాదవ్ తదితరులు హాజరై మాట్లాడారు.

సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్

ఆంధ్రప్రభ

బుధవారం 14 మార్చి 2018

అన్నదాతల మహా ప్రదర్శన

అన్నదాతల నినాదాలతో సోమవారంనాడు వాణిజ్య రాజధాని ముంబాయి నగరం హోరెత్తింది. నాసిక్ నుంచి 180 కిలో మీటర్ల దూరం పాదయాత్ర చేసిన వేలాది రైతుల ఒత్తిడికి మహారాష్ట్ర ప్రభుత్వం తలొగ్గింది. ఈ మహా ప్రదర్శన రైతుల విశ్వరూపానికి సంకేతంగా నిలిచింది. రైతుల్లో చిత్తస్థైర్యాన్ని పెంచింది. ఈ ప్రదర్శనలో పాల్గొన్న రైతుల్లో అటవీ భూముల కోసం ఏళ్ళ తరబడి పోరాటాలు సాగిస్తున్న ఆదివాసీ సంఘాల వారు ఉన్నారు. వారందరి డిమాండ్ మేరకు అటవీ భూముల్లో వ్యవసాయానికి ముఖ్యమంత్రి దేవేందర్ ఫడ్నవిస్ అనుమతిస్తామని ప్రకటించారు. ఇందుకు అభ్యంతరం లేదని చెబుతూనే ఒక కమిటీని వేస్తామనడంతో హామీని నీరుగారుస్తారేమోనన్న అనుమానం రైతుల్లో ఏర్పడటం అసహజమేమీ కాదు. ఉవ్వెత్తున ఉద్యమాలు, ఆందోళనలు సాగినప్పుడు వాటిని చల్లార్చేందుకు పూర్వపు ప్రభుత్వాలు ఇలాంటి కమిటీలు ఎన్నింటినో వేశాయి. వాటి నివేదికలు ఏళ్ళ తరబడి దుమ్ముకొట్టుకుంటున్నాయి. రైతుల స్థితిగతులు మాత్రం ఎక్కడ వేసిన గొంగడి అక్కడేనన్న చందంగా ఏమాత్రం మార్పు లేకుండా ఉంటున్నాయి. ఈ నేపథ్యంలో నాసిక్ నుంచి ముంబయికి వామపక్ష అనుబంధమైన అఖిల భారత్ కిసాన్ సభ నిర్వహించిన మహా ప్రదర్శన కూడా విఫలయత్నం అవుతుందోమోనన్న భయాందోళనలు కలగడం సహజం.

మన దేశంలో భూమిని నమ్ముకున్న రైతులు భూదేవంత సహనంతో తమ సమస్యల పరిష్కారానికి ఆందోళనలు సాగిస్తున్నారు. వారు ఎంత సహనాన్ని పాటిస్తున్నా, సంఘ వ్యతిరేక శక్తులు ఇలాంటి ఆందోళనల్లో ప్రవేశించి హింస పెచ్చరిల్లేట్టు చేసిన ఘటనలు కూడా ఇంకా మన స్మృతి పథంలోనే ఉన్నాయి. ఆరు రోజుల పాటు సాగిన రైతుల పాదయాత్రలో ఇటువంటి శక్తులు ప్రవేశించకుండా ప్రశాంతంగా ముగిసేట్టు చర్యలు తీసుకున్న భారత్ కిసాన్ సభ నాయకులను అభినందించాల్సిందే. రైతులు ఇప్పుడు హామీలతో సంతృప్తి చెందే స్థితిలో లేరనీ, వారిని తక్షణం ఆదుకునేందుకు కార్యాచరణను చేపట్టాలనీ, గాంధేయవాది అన్నాహజారే ప్రధానికి రాసిన లేఖలో పేర్కొన్నారు. సరిగ్గా ఈ మహాప్రదర్శన ముంబయి చేరే సమయానికే ప్రధాని మోడీకి అందేట్టు హజారే లేఖ రాయడం సందర్భోచితమే. రైతుల సమస్యలపై మహారాష్ట్రలో శరద్ జోషి, తెలుగునాట ఆచార్య ఎన్జీ రంగా, ఉత్తరప్రదేశ్‌లో మహేంద్రసింగ్ తికాయత్ వంటి నాయకులు రాజీలేని పోరాటాలు సాగించి చరిత్ర సృష్టించారు. శరద్ జోషి కేవలం చెరకు రైతుల సమస్యలపైనే ఎక్కువగా పోరాడేవారు. దేశవ్యాప్తంగా వామపక్షాల అనుబంధ సంఘాల రైతు సంఘాల పోరాటాలు కూడా చరిత్ర పుటల్లో స్థానం సంపాదించుకున్నాయి. ఈ పోరాటాల్లో అధిక భాగం తాత్కాలిక డిమాండ్ల కోసం జరిగినవే. ఈ నేపథ్యంలో నాసిక్ నుంచి ముంబయి వరకూ జరిగిన రైతు మహాపాదయాత్ర సార్థకమయ్యేందుకు ముఖ్యమంత్రి ఫడ్నవిస్ ఇచ్చిన హామీలు అమలయ్యేలా ఒత్తిడి తేవల్సిన బాధ్యత రైతు మహాసభ మీద ఉంది. అడవుల్లో వ్యవసాయం చేసుకోవడానికి అనుమతి ఇవ్వాలన్న డిమాండ్ కూడా చాలా పాతది. తెలుగునాట కూడా ఆదివాసీ సంఘాలు ఈ డిమాండ్‌పై ఎన్నో సందర్భాల్లో ప్రభుత్వాలకు మహజర్లు సమర్పించాయి. పింక్ బాల్ వర్మ్ అనే చీడ వల్ల వేలాది ఎకరాల్లో పంట దెబ్బతిన్న కారణంగా రైతులను తక్షణం ఆదుకోవాలన్న డిమాండ్‌కి ఫడ్నవిస్ అంగీకరించడం ముదావహం. అఖిల భారత్ కిసాన్ సభ వామపక్ష అనుబంధమైనదైనప్పటికీ, రాజకీయాలు చోటు చేసుకోకుండా కేవలం రైతుల డిమాండ్ల పైనే మొదటి నుంచి ఉద్యమాన్ని నడపడం వల్లనే ముఖ్యమంత్రి నుంచి స్పష్టమైన హామీ లభించింది. కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ గత నెల ఒకటో తేదీన ప్రవేశపెట్టిన సాధారణ బడ్జెట్‌లో రైతులకు మద్దతు ధర గురించి స్పష్టమైన ప్రతిపాదనలు చేశారు. అవి అమలులోకి వస్తే రైతులకు కొంత ఊరట లభిస్తుంది. మద్దతు ధరకూ, పెట్టుబడులకూ మధ్య ఉన్న వ్యత్యాసాన్ని కూడా చెల్లించే పథకాన్నిఅమలు జేయనున్నట్టు జైట్లీ ప్రకటించారు. మధ్యప్రదేశ్‌లో అమలులో ఉన్న భవంతర్ భుగ్దాటన్ యోజన పథకాన్ని మరింత మెరుగు పర్చి దేశవ్యాప్తంగా అమలు జేసేందుకు యోచిస్తున్నట్టు ఆయన ప్రకటించారు. మద్దతు ధరపై అవిభక్త ఆంధ్రప్రదేశ్‌లో బోనస్ పథకం పేరిట అమలయిన పథకానికి ఇది దగ్గరగా ఉంది. పథకాలూ, కార్యక్రమాలు మంచివే అయినా, వాటి ఫలితాలు అసలైన లబ్ధిదారులకు చేరేట్టు చూడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలపై ఉంది. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యం వల్లే రైతులకు న్యాయం జరగడం లేదని కేంద్రం, కేంద్రం సకాలంలో మద్దతుధర ప్రకటించకపోవడం వల్లనే రైతులను ఆదుకోలేకపోతున్నామని రాష్ట్రాలు వివరిస్తున్నాయి. వీటి వల్ల రైతులకు ఒరిగేదిఏమీలేదు. రైతు సంక్షేమ పథకాల అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేసినప్పుడే రైతులకు న్యాయం చేకూరుతుంది. డాక్టర్ స్వామినాథన్ సిఫార్సులు రాజకీయ పార్టీలకు ఎన్నికల ప్రచారం సందర్భంగా గుర్తుకొస్తాయి. అధికారంలోకి రాగానే వాటిని విస్మరించడం పరిపాటి. రైతుల రుణాల మాఫీ విషయంలోనూ, గిట్టుబాటు ధర విషయంలోనూ కేంద్రం చొరవ తీసుకుని రాష్ట్రాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని ఏ రాష్ట్రంలో ఏమేరకు సాయం అవసరమో నిర్ధారణ చేసి మరీ సాయం అందేలా చూడాలి. మొక్కుబడి పథకాలు, ప్రకటనల వల్ల రైతులకు మేలు ఒనగూరదు. వాటి కోసం కేటాయించే కోట్లాది రూపాయిలు దళారుల జేబుల్లోకి వెళ్తాయి. ప్రస్తుతం జరుగుతున్నది అదే. 2019 ఎన్నికల ముందుపూర్తి స్థాయి బడ్జెట్ కావడం వల్ల గత ఫిబ్రవరిలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి పెద్ద పీట వేశారన్న సంగతి బహిరంగ సత్యం. ఓట్లను దృష్టిలో పెట్టుకుని కాకుండా, రైతుల సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలి. పార్టీలూ, ఓట్ల రాజకీయాలకు అతీతంగా నిర్ణయాలు తీసుకున్నప్పుడే రైతుల సమస్యలు పరిష్కారం అవుతాయి. సాగునీటి ప్రాజెక్టులు ఎన్ని అమలులోకి వచ్చినా, రైతులు ప్రకృతి మీద ఆధారపడే వ్యవసాయం చేస్తున్న కారణంగా, తరచూ నష్టాలబారిన పడవల్సి వస్తోంది. రైతులు అప్పుల పాలు కావడానికీ, ఆత్మహత్యలు చేసుకోవడానికి వ్యవసాయం దైవాధీనం కావడమే ప్రధాన కారణమన్న విషయాన్ని ప్రభుత్వాలు స్పృహలోఉంచుకుంటే అన్నదాతను ఆదుకోవడం పెద్ద కష్టమేమీ కాదు.

మంచి మాట

మన అదృష్టాలను, దురదృష్టాలను మనమే సృష్టించుకొని వాటిని విధి అంటాము.

-బెంజమిన్ డిజ్రయేలీ

నిఘాతో కుంభకోణాలకు అడ్డుకట్ట

బ్యాంకుల్లో నిఘా లోపమే కుంభకోణాలకు తావిస్తోందా? నిఘా వ్యవస్థ సక్రమంగా పనిచేయకపోవడానికి కారణమెవరు? అన్ని కుంభకోణాల చరిత్రనూ పరిశీలిస్తే మానవ వనరుల విభాగ వైఫల్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ఏదైనా తప్పు చోటుచేసుకోకుండా ఉండాలంటే రుగ్మత నిర్మూలన కంటే ముందు అదుపు అత్యవసరం. ఫలానా చోట తప్పు జరుగుతోంది అనే అంశాన్ని ఇట్టే పట్టేయగల వ్యవస్థ ఇందుకు అత్యవసరం. నిఘా విభాగం ఇందులో కీలకపాత్ర వహిస్తుంది. నేరాలను అదుపు చేసే వ్యవస్థ ఉంటే కుంభకోణాలకు తావుండదు. అధికారులను మూడేళ్ళకోసారి, గుమస్తాలను ఐదేళ్ళకోసారి ఒకే స్థాయిలోనూ.. లేదా ఒకే కార్యాలయంలోనూ ఉండకుండా బదిలీలు చేసేలా చూడాల్సిన బాధ్యత సెంట్రల్ విజిలెన్స్ కమిషన్‌పైఉంది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫైనాన్షియల్ సర్వీసెస్(డిఎఫ్ఎస్) కిందటేడాది ప్రతిపాదించిన ఎన్‌హాన్స్‌డ్ యాక్సెస్ అండ్ సర్వీస్ ఎక్సలెన్స్ (ఇఎఎస్ఇ) అజెండా అమలును తీవ్రంగా పరిశీలించాల్సిన తరుణం ఇదే. ప్రభుత్వ రంగ బ్యాంకు ఆరోగ్యకరంగా ఉండేందుకు విధులు, బాధ్యతలను డిఎఫ్ఎస్ రూపొందించింది. బ్యాంకుల్లో కంప్యూటర్ల వినియోగం పెరుగుతున్నప్పటికీ అవి కూడా మానవ ఆధారితమైనవే. సంస్థను పునరుత్తేజం చేయాల్సిన అంశంపై మానవ వనరుల విభాగం దృష్టి కేంద్రీకరించాల్సుంది. దశాబ్దకాలం నుంచి ఉన్న సమస్యాత్మక రుణాలు, కుంభకోణాల కారణంగా సుషుప్తావస్థలోకి జారిపోయిన ప్రభుత్వ రంగ బ్యాంకులను పరిష్కరించేందుకు ఇది తప్పనిసరి. ఉద్యోగ నియామకాలు, పారితోషికాలు, నైపుణ్య సాధన, పరిశోధన వంటి అంశాలపై బ్యాంకులు దృష్టిని సారించాలి. వీటిలో పరిశోధన అత్యంత ప్రధానమైనది. బ్యాంకింగ్‌ను జ్ఞాన ఆధారిత పరిశ్రమగా గుర్తించాలి. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఇందులో భాగమైనందున నిర్ణయాలు తీసుకునే ముందు అందుకనుగుణంగా పరిశోధన సాగించి, అభివృద్ధి దిశగా వెళ్ళేలా చూసుకోవాల్సిన బాధ్యతుంది. సాధారణంగా పిఎస్‌యులలో ఈ విధానం చాలా తక్కువగా కనిపిస్తుంది. పరిశోధన లేకపోవడం వల్లే బ్యాంకులకు అవకాశాలు తగ్గిపోతున్నాయి. పరిశోధన విభాగమున్న బ్యాంకులు ఆర్థిక అధ్యయనాలకు వాటిని వినియోగించుకుంటున్నాయి. పరిశోధన విభాగం ముందుగా తన సేవలను సొంత బ్యాంకు అభివృద్ధికి ప్రత్యక్షంగా కానీ, పరోక్షంగా కానీ కేటాయించాలి. ఆ తరవాతే వ్యవస్థ సమర్థతను చూసుకోవాలి. వాణిజ్య ఫలితాలు మానవ వనరుల విభాగ సమర్థతపై ఆధారపడి ఉంటాయని హార్వర్డ్ బిజినెస్ రివ్యూ సర్వే వెల్లడించడం దీని ప్రాధాన్యతను సూచిస్తోంది. హెచ్ఆర్ అంటే మనం చేసే పనికాదు. మన వ్యాపారాన్ని నడిపించే వ్యవస్థ అది అని లాస్ వేగాస్ క్యాసినో ప్రమోటర్ స్టీవెన్ విన్ అంటారు. ఆయన ప్రస్తుతం మి టూ అనే ప్రచారంలో నిమగ్నమయ్యారు. పిఎస్‌యు బ్యాంకుల్లో హెచ్ఆర్‌విభాగం ప్రధాన స్రవంతిలోకి వచ్చి, కార్పొరేట్ వ్యూహాలనూ, అజెండాలనూ నిర్దేశించాల్సిన సమయం ఆసన్నమైంది.

పంజాబ్ నేషనల్ బ్యాంక్ కుంభకోణం పబ్లిక్ సెక్టార్ ప్రైవేట్ సెక్టార్ బ్యాంకుల మధ్య చర్చకు వేదికగా మారిపోయింది. ప్రైవేటు కంపెనీలే బ్యాంకుల్ని మోసగిస్తున్నాయి. ఉద్దేశపూర్వకంగా రుణాను ఎగవేసేవారు ప్రైవేటు రంగంలోనే ఉన్నారంటూ ఓ బ్యాంకు చైర్మన్ చేసిన వ్యాఖ్య చేదు నిజాన్ని వెల్లడిస్తోంది. పిఎన్‌బి కుంభకోణం బూచిని చూపించి, బ్యాంకుల్ని ప్రైవేటైజ్ చేయాలనే నిర్ణయానికి రావడం తగదని 60మంది ఆర్థికవేత్తలున్న ఓ బృందం ప్రభుత్వాన్ని హెచ్చరించింది. విఫలమైన ప్రైవేటు బ్యాంకును సైతం బెయిల్ అవుట్ చేయాలని కేంద్ర నిర్ణయం తీసుకుంటే ఇక బ్యాంకుల ప్రైవేటీకరణ ఎందుకు...ఇలా చర్చలు సాగిపోతున్నాయి. ఇక్కడ ఆ బ్యాంకు ఛైర్మన్ ఓ విలువైన అంశాన్ని వెల్లడించారు. బ్యాంకులు పబ్లిక్ సెక్టర్‌లో ఉన్నప్పటికీ అవి ప్రైవేటు రంగంలోనే ఎక్కువగా



పెట్టుబడులు పెడతాయి. పెద్దపెద్ద సంస్థలకే బ్యాంకు నిధులు చేరుతున్నాయనేదే ఆ అంశం. సోషలిజం అంటూ ప్రభుత్వ రంగ బ్యాంకులు మడికట్టుకు కూర్చోలేవు. ప్రైవేటు రంగానికి సేవలందిస్తూ దేశ ఆర్థికాభివృద్ధికి దోహదపడతాయి. దీన్ని ప్రాతిపదికగా తీసుకుంటే ప్రభుత్వ, ప్రభుత్వేతర రంగ బ్యాంకుల మధ్య వ్యత్యాసం కనిపించదు. బ్యాంకుల జాతీయాకరణ భారత ఆర్థిక వ్యవస్థను విస్తరించడంలో కీలకపాత్ర పోషించింది. మధ్య తరగతి, చిన్న తరగతి వాణిజ్య సంస్థలు, పెద్ద రైతులకు అవకాశాలను కల్పించింది. మధ్య తరగతికి భరోసా కల్పించడమే కాక, పేద వర్గాలకు బాసటగా నిలిచింది. అభివృద్ధి చెందుతున్న దేశంలో ప్రభుత్వ రంగం ఆర్థికంగా బలపడడానికి ఒక సాధనంగా మాత్రమే ఉపయోగపడుతుంది. ఇటలీ కమ్యూనిస్టు పార్టీ వ్యవస్థాపకుల్లో ఒకరైన అమదేవ్ బోర్డిగ.. సోవియట్ యూనియన్‌ను ధనస్వామ్య సమాజంగా మారుతున్న చూశారు. ఆయన మరణం తరవాత జరిగిన పరిణామాలు ఆ అభిప్రాయం వాస్తవమని తేల్చాయి.

జాతీయ బ్యాంకుల్లో బహిర్గతమైన కుంభకోణాలు, ఖాయిలాపడ్డ రుణాలు ఏదో తప్పు చోటుచేసుకుందనే భావననే కలిగిస్తోంది. ప్రైవేటు బ్యాంకులలోనూ ఎన్పీయేలు పెద్ద సంఖ్యలోనే ఉన్నాయని బయటపడింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ అధీనంలో బ్యాంకులు ఇంకా ఉండాలా అనే ప్రశ్నను ఇవి లేవనెత్తుతున్నాయి. దేశ ఆర్థిక వ్యవస్థను బలపరిచేందుకు ఇవి అవసరమా అనే వాదననూ తెస్తున్నాయి. ఇక్కడ 2007-2009 మధ్యలో ఆర్థిక సంక్షోభ సమయంలోనూ ప్రభుత్వ బ్యాంకులు పనితీరు చాలా చక్కగా ఉంది. రిజర్వు బ్యాంకు డిప్యూటీ గవర్నర్‌గా ఉన్న విరళ్ ఆచార్య, నిరుపమా కులకర్ణి ఆ సమయంలో బ్యాంకుల పనితీరుపై చేసిన అధ్యయనంలో ఆ విషయం వెల్లడైంది. ప్రభుత్వ భరోసా కారణంగానే ఆ బ్యాంకులు చక్కగానూ, సమర్థంగానూ పనిచేయగలిగాయని వారు దీనికి భాష్యం చెప్పారు. ఆ సమయంలో డిపాజిట్లపై వడ్డీ రేట్లను పెంచడమే కాకుండా, రుణాలను ఎక్కువగానే మంజూరు చేశాయి.

1947 నుంచి 1955 వరకూ 365 బ్యాంకులు విఫలమయ్యాయి. డిపాజిటర్లను ఇబ్బందుల్లోకి నెట్టాయి. 1969 జులై 19 అర్ధరాత్రి పెద్ద వాణిజ్య బ్యాంకులను జాతీయం చేశారు. వీటిలో ఉన్న సొమ్ము 85శాతం ఖాతాదారులదే. ఇది జరిగి దాదాపు 5దశాబ్దాలు కావస్తోంది. అప్పటి నుంచి బ్యాంకింగ్ వ్యవస్థను విస్తృతం చేసి, ప్రజలకు చేరువచేయడానికి ప్రయత్నాలు సాగాయి. భారత్‌లో ఇప్పుడు ఒక బిలియన్ కంటే ఎక్కువగా బ్యాంకు ఖాతాలున్నాయి.

భారతీయ ఆర్థిక వ్యవస్థమున్నెన్నడూ లేనంత బలోపేతంగా ఉంది. ప్రభుత్వ రంగ బ్యాంకులే ఇప్పుడు అవసరం లేదు. ఇవి ప్రస్తుతం చాలా బలహీనంగా ఉన్నాయి. ఇది భారత ఆర్థిక వ్యవస్థకు చిక్కులా పరిణమిస్తోంది. టెక్నాలజీ కారణంగా ఖర్చులు చాలా వరకూ తగ్గిపోయాయి. చిన్న బ్యాంకులు, పేమెంట్ బ్యాంకులు, కంపెనీలు, టెలికం కంపెనీలు, మైక్రో ఫైనాన్స్ సంస్థలు బ్యాంకులు చేసే పనుల్ని చాలా తేలిగ్గా నిర్వహించగలవు. సామాజికంగా అవసరమైన ఎటువంటి లక్ష్యాలైనా సాధించడానికి వీలైన భరోసాను ఆర్బీఐ ప్రైవేట్ రంగ బ్యాంకులకు ఇస్తోంది.

ఆర్థికావసరాలు ఇప్పుడు సమస్య కాదు. బ్యాంకుల ప్రైవేటీకరణకు రాజకీయ ఒత్తిళ్ళే అడ్డుపడుతున్నాయి. రాష్ట్రాలు చేపట్టే సామాజిక కార్యక్రమాలకు ప్రభుత్వ బ్యాంకుల నుంచే నిధులు అందుతుంటాయి. పంజాబ్ నేషనల్ బ్యాంక్ కుంభకోణం మోడీ ప్రభుత్వానికి ఒక చక్కని అవకాశాన్ని కల్పిస్తోంది. ప్రభుత్వ ప్రమేయం తక్కువ..ఎక్కువ నిర్వహణ సామర్థ్యం అంశాలను పునాదిగా ముందడుగేయాలి. దీనితో పాటు మానవ వనరుల విభాగాన్ని నిఘా వ్యవస్థను చురుకుగా ఉంచేలా చూడాలి. ఈ చర్యలు బ్యాంకింగ్ రంగంలో కుంభకోణాల బెడదను చాలావరకూ తగ్గించగలవు.

- సుబ్రహ్మణ్యం వివిఎస్ కూచిమంచి

అబుర్ఝ్ మడ్‌లో అన్నల రాజ్యం!

జనజీవనానికి సుదూరంగా ఎత్తయిన, ఏట వాలుగా ఉండే కొండల్లో విస్తరించి ఉన్న అబుర్ఝ్ మడ్ అడవుల్లో ప్రభుత్వం లేదు. అక్కడ అన్నల రాజ్యం సాగుతోంది. ఆ ప్రాంతానికి సరైన రోడ్డు సౌకర్యాలు లేవు. అక్కడి నుంచి బాహ్య ప్రపంచానికి సమాచారం అందదు. చత్తీస్‌గఢ్‌లోని నారాయణ్ పూర్ జిల్లాలో ఓర్చా బ్లాకు, బిజాపూర్, దంతేవాడ జిల్లాల్లోని కొంత భాగంలో ఈ అడవి విస్తరించి ఉంది. అటు మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా సరిహద్దులో ఉంది. ఈ అడవుల్లో మొత్తం 237 గ్రామాలు ఉన్నాయి. వీటి జనాభా 40,000, ఈ గ్రామాల్లో నివసించేవారు అబుజ్ మరియా అనే కొండ జాతి వారు. ఇక్కడ రెవిన్యూ రికార్డుల పరిధిలో ఈ గ్రామాలు లేవు. అలాగే, ప్రభుత్వ యంత్రాంగం కూడా లేదు. మావోయిస్టు నక్సలైట్ల మాటే ఇక్కడ శాసనం. పిల్లలను స్కూలుకు వెళ్ళొద్దంటే వారు మానేయాల్సిందే. తమ భావజాలాన్ని వ్యాపింపజేయడానికి రూపొందించిన గీతాలను ఆలపించే బాధ్యత బాలికలకు అప్ప జెప్పారు. ఓర్చా అనే ప్రాంతం ఓ లంక లాంటింది. అది నారాయణ్ పూర్ జిల్లా కేంద్రానికి 70 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఓర్చాలో ప్రతి బుధవారం సంత జరుగుతుంది. ఆ సంతలో విక్రయించేందుకు చుట్టపక్కల గ్రామాల నుంచి తేనె, చింతపండు, కుంకుళ్ళు, వంటి అటవీ ఉత్పత్తులు తెస్తారు. అక్కడ సంతల్లో గిరిజనుల నుంచి అటవీ ఉత్పత్తులను పెద్ద ఎత్తున కొనుగోలు చేసే వారంతా ఇతర ప్రాంతాలకు చెందిన వ్యాపారస్తులూ, కాంట్రాక్టర్లే. అతి తక్కువధరకు అటవీ ఉత్పత్తులను కొనుగోలు చేసి గిరిజనులను దోచుకుని పోవడం ఇంకా కొనసాగుతోంది. నిజానికి ఇలాంటి దోపిడీని అరికట్టేందుకు నక్సలైట్లు అడవుల్లో ప్రవేశించారు. అడవి పుత్రులను కాంట్రాక్టర్ల దోపిడీ నుంచి విముక్తం చేస్తామన్న నినాదంతోనే నక్సలైట్లు ఉద్యమం ప్రారంభించారు. దేశంలో రెవిన్యూ మ్యాప్ లేని ప్రాంతం ఏదైనా ఉందంటే అది అబుర్ఝ్ మడ్ మాత్రమే. ఇక్కడి గ్రామాల మధ్య రహదారులే లేనప్పుడు బస్సు సౌకర్యం ఎలాఉంటుంది. అలాగే, విద్యుత్, ఫోన్ కనెక్షన్లు కూడా లేవు. ఏడు దశాబ్దాల స్వతంత్ర భారత దేశంలో ఇప్పటికీ ఇలాంటి మారుమూల ప్రాంతాలు ఉన్నాయంటే ఆశ్చర్యమే మరి. ఈ గ్రామాల్లో నివసించేవారు నాగరిక ప్రపంచానికి బహూ దూరంగా నివసిస్తున్నారు. అబుర్ఝ్ మడ్ కారడవుల ప్రాంతం కనుకనే, నక్సలైట్లు ఇక్కడ స్థావరాలు ఏర్పాటు చేసుకున్నారు. నక్సలైట్ల కోసం వేటలో తరచూ భద్రతాదళాలు ఈప్రాంతంలో మోహరిస్తు న్నాయి. నక్సలైట్లకు ఆశ్రయం కల్పిస్తున్నారనీ, ఆహారం అందిస్తున్నారని ఆరోపిస్తూ స్థానికులను భద్రతాదళాలు వేధిస్తున్నాయి. ఈ ప్రాంతంలో రోడ్ల నిర్మాణాన్ని నక్సలైట్లు వ్యతిరేకిస్తున్నారు. నక్సలైట్లను అణచివేసే వ్యూహంలో భాగంగా పూర్వపు యూపీఏ ప్రభుత్వం ఏజెన్సీ ప్రాంతాల్లో మారు మూల గ్రామాలకు రోడ్లు నిర్మించే కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది. అయితే, నక్సలైట్లు అడ్డుకోవడం వల్ల ఈ కార్యక్రమం సాగలేదు. ఇప్పటికీ అనేక గ్రామాలకు సరైన రవాణా సౌకర్యంలేదు. రోడ్లు సక్రమంగా లేకపోయినా ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని నాలుగు బస్సు సర్వీసులను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. అయితే, అవి సక్రమంగా తిరగడం లేదు. ఎక్కడికక్కడ నక్సలైట్లు బస్సులను ఆపేయడంతో ఆ సర్వీసులు నామమాత్రంగా మిగిలాయి. ఓర్చాలోని సంతల్లో తమ ఉత్పత్తులను విక్రయించడానికి మారుమూల గ్రామాల ప్రజలు రెండేసి రోజులు నడిచి వెళ్ళాల్సి వస్తుంది.



పదిహేనేళ్ళ నుంచి....: ఓర్చా ప్రాంతంలో మావోయిస్టులు తిష్ఠ వేసి పదిహేను సంవత్సరాలు అవుతుంది. ఓర్చా బ్లాకులో మావోయిస్టులు 50 పైగా పాఠశాలలను ధ్వంసం చేశారు. ఈ ప్రాంతంలో సరైన వైద్య సౌకర్యం లేదు. ఒకే ఒక వైద్యుడు ఉన్నాడు. ఆయన కూడా వారానికి ఒక సారి మాత్రమే వస్తాడు. ఈలోగా ప్రజలకు ఏ జబ్బు చేసినా, రోగం వచ్చినా, ఆకుపసరు వైద్యం తప్ప వేరేమార్గం లేదు. అసలు ఈ ప్రాంతం బాహ్య ప్రపంచానికి దూరంగా బ్రిటీష్ వారి కాలం నుంచి ఉంటోంది. దీని అభివృద్ధిపై ఆనాటి పాలకులు కూడా దృష్టి పెట్టలేదు. అయితే, ఈప్రాంతం అటవీ ఉత్పత్తులకు ప్రసిద్ధం కావడం వల్ల మైదాన ప్రాంతాలకు చెందిన కాంట్రాక్టర్లూ, వర్తకులూ వచ్చి చౌకధరకు అటవీ ఉత్పత్తులను కొనుక్కుని పోతుంటారు.

ఇండో టిబిటెన్ భద్రతాదళాల సహకారంతో ఈ ప్రాంతంలో రోడ్ల నిర్మాణ కార్యక్రమాన్ని ప్రారంభించినా అవి సజావుగా సాగడం లేదు. ఐటిబిపి దళాలపై నక్సలైట్లు దాడులు చేయడం, వారు తిప్పి కొట్టడం సాధారణం అయిందని బస్తర్ రేంజి పోలీసు ఇన్‌స్పెక్టర్ జనరల్ వివేకానంద ఒక ఇంటర్వ్యూలో తెలిపారు. మావోయిస్టుల ప్రాబల్యం క్రమంగా తగ్గుతోందనీ, ప్రజల్లో చైతన్యం వెల్లివిరుస్తోందని ఆయన తెలిపారు. స్థానికులు ఇప్పుడు మావోయిస్టులు ఏం చెబితే అదివినే పరిస్థితిలో లేరని ఆయన అన్నారు. ఈ ప్రాంతంలో వోటర్ గుర్తింపు కార్డులు, ఆధార్ కార్డులను పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆయన చెప్పారు.

అబుర్ఝ్ మడ్ ప్రాంత వాసులను జనజీవన స్రవంతిలో చేర్చడానికి తాము అనుసరిస్తున్న వ్యూహాలు నెమ్మదిగా ఫలిస్తున్నాయని ఆయన చెప్పారు. ప్రజల్లో చైతన్యం తీసుకుని రావడానికి ప్రభుత్వమూ, భద్రతాదళాలు ప్రయత్నాలు సాగిస్తున్నప్పటికీ, గ్రామాల్లో ప్రజలు ఇప్పటికీ నక్సలైట్లు అదుపులోనే ఉంటున్నారు. వారికి భద్రతపై భరోసా ఇవ్వగలిగితే నక్సలైట్ల ఉచ్చు నుంచి బయటపడాలని ఆరాటపడుతున్న వారెంతో మంది ఉన్నారు. వారికి భరోసా ఇచ్చేది ఎవరు? భద్రతాదళాల వల్ల అది లభించడం లేదు. ఇటు నక్సలైట్లూ, అటు భద్రతా దళాల మధ్య గిరిజనులు నలిగి పోతున్నారు.

- పద్మనాభ స్వామి

వామపక్షం కుదేలు..కాషాయం జిగేలు

కాలానుగుణంగా సిద్ధాంతాన్ని మార్చుకొని ప్రజల ఆకాంక్షలకు ధీటుగా స్వయం సంస్కరణకు సిద్ధపడకపోబట్టే, వామపక్షకూటమి దారుణ పరాజయాలు ఎదుర్కోవాల్సి వస్తోంది. అద్భుత మేధో సంపత్తికి చిరునామాగా విరాజిల్లే పశ్చిమబంగ మూడున్నర దశాబ్దాల వామపక్ష కూటమి పాలనలో ఎందుకు గణనీయంగా పురోగమించలేకపోయింది? వ్యవసాయ ప్రధాన రాష్ట్రమైన త్రిపురను తీసుకొన్నా - పెరుగుతున్న పేదరికం, తక్కువగా తలసరి ఆదాయం, అరకొర మౌలిక వసతులు, అటవీ ఖనిజ సంపదను సరైన రీతిలో వినియోగించుకోలేకపోవడం, పారిశ్రామిక ప్రగతిలో మందగమనం, ఉరుముతున్న నిరుద్యోగం వంటి

సమస్యలెన్నో దశాబ్దాలుగా వెంటుడుతున్నాయి.. సంపద సృష్టిస్తేనే కదా దాని పంపిణీ సాధ్యపడేది? ఇప్పటికే అసోం, మణిపూర్, అరుణాచల్‌ప్రదేశ్‌లలో పాలనపగ్గాలు చేపట్టిన భారతీయ జనతాపార్టీ తాజాగా ఎన్నికలు జరిగిన త్రిపుర, నాగాలాండ్, మేఘాలయల్లోనూ విజయ దుందుభి మోగించింది. 2013 నాటి అసెంబ్లీ ఎన్నికల్లో ఈ మూడు రాష్ట్రా ల్లోని మొత్తం 180 స్థానాలకు గాను భాజపా గెలవగలిగింది కేవలం ఒక్కటి. అలాంటిదిప్పుడు పాతికేళ్ళుగా అగర్తలా అధికార పీఠంపై పాతుకుపోయిన వామపక్ష కూటమి సర్కారును పెకళించి దాదాపు నాలుగింట మూడొంతుల మెజారిటీతో భాజపా కూటమి కాషాయ జెండా ఎగరేయడం అద్భుత పరిణామం. సమవాదం సమాజవాదమే జనస్వామ్య వేదమంటూ ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా వామపక్షాలు ఎదిగొచ్చిన రోజుల్లో పశ్చిమబంగ, కేరళ, త్రిపుర వంటి రాష్ట్రా ల్లో వాటికి అపూర్వ ఆదరణ లభించింది. కమ్యూనిస్టు కూటమిని దశాబ్దాలుగా శిరసున మోసినా, ఆదర్శం ఆచరణకొచ్చి సగటు మనిషి జీవనంలో గుణాత్మకమార్పు కనిపించకపోయేసరికి 2011 లో పశ్చిమబంగ బ్యాలెట్ పెట్టెల్లో నిశ్శబ్ద విప్లవం పుట్టుకొచ్చింది. తదుపరి ఏడేళ్ళకు త్రిపురలోనూ అదే పునరావృతమైంది. ఉత్తర దక్షిణ ధృవాలుగా మోహరించిన భిన్న సైద్ధాంతిక శక్తులైన భాజపా, లెఫ్ట్‌ల మొట్టమొదటి

ముఖాముఖి పోరుగా త్రిపుర సమరాంగణం జాతీయస్థాయిలో ఆసక్తి రేకెత్తించింది. అవినీతి మకిలంటని ముఖ్యమంత్రిగా, అత్యంత నిరాడంబరుడిగా మాణిక్ సర్కారుకు ఉన్న మంచిపేరు, వామపక్షకూటమి కంచుకోట బద్దలు కాకుండా రక్షించలేకపోయింది. రాష్ట్రం చిన్నదా పెద్దదా అన్నది కాదు, విజయం

సాధించడమే లక్ష్యంగా, సమగ్ర వికాసమే వాగ్దానంగా, పరాయితనం కనిపించకుండా స్థానిక పార్టీలకు పెద్దవాటా కట్టబెట్టి, సైద్ధాంతికంగా పట్టు విడుపులతో సరైన భాగస్వామ్యాలకు అంటుకట్టి భాజపా సాగిస్తున్న



అప్రతిహత జైత్రయాత్ర ఈశాన్యంలోనూ కొత్త పుంతలు తొక్కింది. అరుణ కాంతులతో అస్తమించే సూర్యుడు కాషాయ వర్ణంతో ఉదయిస్తాడంటూ ప్రధాని మోడీ చేసిన వ్యాఖ్య, త్రిపురలో విజయం కమలనాథులకు ఎంత ప్రత్యేకమో విపులీకరిస్తోంది. నాగాలాండ్‌లోనూ మిత్రపక్షమైన యునైటెడ్ నాగా డెమొక్రటిక్ పార్టీ (యూఎన్‌డీపీ) అండతో సాధారణ మెజారిటీ సాధించి అధికారానికి నిచ్చెన వేసిన తీరు స్ఫూర్తిమంతం. 1972 లో రాష్ట్ర ప్రతిపత్తి పొందిన మేఘాలయ నాటి తొలి ఎన్నికల్లో తప్ప ఎన్నడూ ఏ ఒక్క పార్టీకి విస్పష్ట మెజారిటీ కట్టబెట్టిన దాఖలాల్లేవు. గత ఎన్నికల్లో 23 సీట్లలో గెలిచిన కాంగ్రెస్, మేఘాలయ యునైటెడ్ అలయెన్స్ పెట్టి, చిన్నా చితకా పార్టీల మద్దతు రాబట్టి అయిదేళ్ళు బండి నెట్టుకొచ్చినా, ఈసారి హస్తం పార్టీకి మరో రెండు స్థానాలు తగ్గిపోయాయి. ఈ నేపథ్యంలో కొత్త సమీకరణలతో భాజపా భాగస్వామిగా మరో సంకీర్ణం కొలువుతీరినా ఆశ్చర్యంలేదు. రెండు దశాబ్దాలుగా మాణిక్ సర్కార్ ముఖ్యమంత్రిత్వం వహిస్తున్న రాష్ట్రంలో చలో పల్టాయి (మార్పు తీసుకొద్దాం పదండి) అంటూ నినదించిన భాజపాకు త్రిపుర జనవాహిని అక్షరాలా బ్రహ్మరథం పట్టింది. ఓట్లు తగ్గవచ్చేమోగాని మెజారిటీకి ఢోకా ఉండబోదన్న వామపక్ష కూటమి, కమల కూటమి దెబ్బకు ఓట్లలో భారీగా

కోతపడకపోయినా, సీట్లపరంగా 1972 నాటి స్థాయికి తిరోగమించింది. గతంలో జరిగిన పది అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఏ ఒక్కసారీ ఒక్కసీటూ గెలవలేకపోయినా

భాజపా, ఈసారి గురిచూసి ఏనుగు కుంభస్థలాన్నే కొట్టింది. పదిహేనేళ్లుగా కేవలం ఒకటిన్నర శాతం ఓట్లకే పరిమితం అవుతూ వచ్చిన కమలం పార్టీ ఈసారి ఎకాయెకి 43 శాతం ఓట్లతో చరిత్ర సృష్టించింది. గిరిజనుల్లో పట్టును కోల్పోయేపార్టీ మట్టికరవక తప్పదన్న రాజకీయ గుణింతాన్ని పూర్తిగా ఆకళించుకొన్న భాజపా, ఇండిజినియస్ పీపుల్స్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర (ఐపీఎఫ్‌టి)తో పొత్తు కుదుర్చుకోవడం ద్వారా స్థానిక గిరిజనుల అండ సంపాదించగలిగింది. యాభయ్యేళ్ళ క్రితం రాష్ట్ర ప్రతిపత్తి పొందిన త్రిపురలో తొలిపదేళ్ళు కాంగ్రెస్‌దే అధికారం. 1977లో వామపక్షకూటమి దెబ్బకు దిమ్మ తిరిగిన కాంగ్రెస్ 17.7 శాతం ఓట్లు సాధించి కూడా ఏ ఒక్క సీటూ దక్కించుకోలేని నాడు బిక్కమొగమేసింది. తదాదిగా పదేళ్ళపాటు నృపేన్ చక్రవర్తి ముఖ్యమంత్రిత్వంలో అధికారం సాగించిన వామపక్ష కూటమికి 1988లో కాంగ్రెస్ చేతిలోనే భంగపాటు ఎదురైంది. 1993లో తిరిగి పుంజుకొన్న వామపక్ష కూటమికి ఎదురన్నదే లేకపోయింది. 33-36 మధ్య ఓట్ల శాతంతో 10-13 నడుమ సీట్లు సాధిస్తూ వచ్చిన కాంగ్రెస్ ప్రతిపక్ష స్థానానికే అతుక్కుపోయింది.

-కీర్తి నాగరాజు

అన్నదాత పాదయాత్ర స్ఫూర్తి దాయకం

మహారాష్ట్రలో అఖిల భారత కిసాన్ సభ నాయకత్వంలో ముప్పై వేలమంది రైతులు నాసిక్ నుండి ముంబై వరకు 180 కిలోమీటర్ల దూరం సాగించిన పాదయాత్ర చారిత్రాత్మకం. స్ఫూర్తిదాయకం. రైతాంగం, ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యల్ని ఆ రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకురావడానికి ఎంచుకున్న మార్గమే కాకుండా, దాన్ని అమలు చేసిన తీరు కూడా అత్యంత ప్రశంసనీయం. కాళ్లకు చెప్పులు కూడా లేని పేద రైతులు, ఆదివాసీలు అత్యంత క్రమశిక్షణతో పౌరులెవ్వరికీ ఏమాత్రం ఇబ్బంది కలగని రీతిలో అంత దూరమూ నడవడం ఒక ఎత్తైతే, మహానగర జనజీవనం తమవల్ల అసౌకర్యానికి లోనుకాకూడదని అర్ధరాత్రి దాటిన పిమ్మట యాత్ర కొనసాగించడమన్నది వారి సున్నితత్వాన్ని మచ్చుతునక. పౌర సమాజం కూడా తనవంతుగా వారికి మద్దతు పలకడం ఒక మంచి పరిణామం. ప్రభుత్వం వారి డిమాండ్లన్నింటినీ ఆమోదిస్తున్నట్టు ప్రకటించడం బాగున్నా, ఎంతవరకూ అమలు జరుగుతాయో చూడాల్సిందే. రైతాంగం కానీ ఆదివాసీలు కానీ అడుగుతున్నవి గొంతెమ్మ కోర్కెలేమీ కాదు. న్యాయమైన కనీసపు చేయూతలు. స్వామినాధన్ కమిటీ సూచనల్ని అమలు చేయమన్నా, అటవీ హక్కుల్ని చట్టప్రకారం అమలు చెయ్యమన్నా అవి ప్రభుత్వాలు అడగకుండానే అమలు పర్చాల్సిన విషయాలు. వాటికోసం రోడ్డెక్కాల్సిన దుస్థితి అన్నదాతకు కలగడం శోచనీయం. లక్షలాది రైతులు ఆత్మహత్యలకు పాల్పడినపిమ్మట, కోట్లాది మంది రైతు కుటుంబాలు చితికిపోయిన తర్వాత, వ్యవసాయరంగం కుదేలైపోతున్న తరుణంలో కూడా ప్రాథమిక స్థాయి సాయం కూడా పొందలేకపోవడం, ఏరకంగా చూసినా తీరని అన్యాయం. అయితే మహారాష్ట్ర రైతాంగం ఉద్యమాన్ని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలూ, కేంద్రం గమనంలోకి తీసుకోవాలి. వారు లేవనెత్తిన సమస్యలు దేశవ్యాప్తంగా అందరివీ. కనుక ఎక్కడికక్కడ ఆ తరహా ఉద్యమాలు జరిగేవరకూ ఎదురుచూడకుండా దేశంలో వ్యవసాయ రంగం దుస్థితిని దూరంచేసే చర్యలు చేపట్టాలి. రుణమాఫీలు, మద్దతు ధరలు, అటవీ హక్కులు కేవలం హామీలుగా మిగల రాదు.

-డా.డి.వి.జి.శంకరరావు, మాజీ ఎంపీ, పార్వతీపురం.

కవితకు ప్రధాని మోడీ సర్‌ప్రైజ్

జన్మదినం రోజు శుభాకాంక్షల వెల్లువ



హైదరాబాద్, ఆంధ్రప్రభ: నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత జన్మదినం సందర్భంగా ప్రధాని నరేంద్రమోడీ సర్‌ప్రైజ్ ఇచ్చారు. ఆంగ్లంలో కాకుండా తెలుగులో మోడీ కవితకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ లేఖ పంపారు. మీ జన్మదినం సందర్భంగా నా హృదయపూర్వక శుభాకాంక్షలు స్వీకరించండి. దేశ ప్రజలకు సేవలు అందించేందుకు వీలుగా కావాల్సిన ఆరోగ్య, ఆనందమయ జీవితం ప్రసాదించాలని భగవతుని కోరుతున్నాను అంటూ మోడీ సంతకంతో ఉన్న లేఖ పంపడంతో కవిత ఆశ్చర్యపోయింది. ప్రధానికి కృతజ్ఞతలు తెలిపింది. ముఖ్యమంత్రి కెసిఆర్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపి ఆశీర్వదించారు. నిజామాబాద్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో తెలంగాణ జాగృతి, తెలంగాణ బొగ్గుగని కార్మికసంఘం, టిఆర్ఎస్, టిఆర్ఎస్‌వి ఆధ్వర్యంలో కవిత జన్మదిన వేడుకలు జరిగాయి.

రవీంద్రభారతిలో..

తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో కవిత జన్మదినం సందర్భంగా జయహో జననీ నీరాజనం వీడియోపాటల సిడిని ఆవిష్కరించారు. మేడే రాజీవ్‌సాగర్, శ్రవణ్‌ల ఆధ్వర్యంలో కార్యక్రమం జరగ్గా, ఈ సందర్భంగా కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా కస్తూర్బా గాంధీ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నడుస్తున్న పాఠశాలకు చైర్మన్ పద్మావతి రూ.1లక్షల అందజేశారు. కార్యక్రమానికి ప్రభుత్వ సలహాదారు రమణాచారి మాట్లాడుతూ కవిత సామాజిక చైతన్యదీప్తి అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ సాహిత్యఅకాడమీ చైర్మన్ నందిని సిధారెడ్డి, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడిహరికృష్ణ, రాజీవ్‌సాగర్, నవీన్ ఆచారి పాల్గొన్నారు. పెద్దపల్లి జిల్లాకు చెందిన సైకత శిల్పి రేవల్లెశంకర్ పెద్దపల్లి జిల్లా కార్యాలయం ఎదుట ఇసుకపై కవిత సైకత చిత్రం వేయగా, ఆకట్టుకుంది.

అభివృద్ధిలో దేశానికే ఆదర్శం



హైదరాబాద్,ఆంధ్రప్రభ: వివిధ అభివృద్ధి సంక్షేమ పథకాల అమలులో టీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే ఆదర్శరాష్ట్రంగా నిలిపిందని ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. మంగళవారం శాసనమండలిలో గవర్నర్ ప్రసంగంపై ధన్యవాదాల తీర్మానానికి సంబంధించిన చర్చలో భాగంగా పల్లా మాట్లాడుతూ రాష్ట్రంలో సాగునీటిపథకాల రీడిజైన్లతో వ్యవసాయరంగం రూపురేఖలు మారనున్నాయన్నారు. 24గంటల విద్యుత్ అమలులో ప్రభుత్వం ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. మిషన్ భగీరథ అద్భుత పథకం అని విదేశీ ప్రభుత్వాలు కూడా ప్రశంసిస్తున్నాయన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఇప్పటికే 35వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ కూడా ఇచ్చిందన్నారు. ప్రభుత్వం అన్నిరంగాల్లో రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో ముందుకు నడిపిస్తోందని పల్లా రాజేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. ఇదే అంశంపై ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ మాట్లాడుతూ టీఆర్ఎస్ ప్రభుత్వం రైతుల ప్రభుత్వం అన్నారు. రాష్ట్రంలో 35లక్షల మంది రైతులకు రుణమాఫీ జరిగిందన్నారు. వ్యవసాయరంగానికి నాణ్యమైన 24గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్టు తెలిపారు. కోటి ఎకరాలకు సాగునీరివ్వాలన్నదే ఈ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. గవర్నర్ ప్రసంగం రాష్ట్ర అభివృద్ధికి అద్దం పట్టిందని ప్రభాకర్ పేర్కొన్నారు.

అధికారం అంటే ప్రజలసొమ్ము కాజేయటం కాదు

ఎమ్మెల్సీ నారదాసు

హైదరాబాద్,ఆంధ్రప్రభ: అధికారం అంటే ప్రజల సొమ్మును కాజేయటం కాదని ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు అన్నారు. కౌన్సిల్‌లో మంగళవారం గవర్నర్ ప్రసంగంపై ధన్యవాదాల తీర్మానం చర్చలో భాగంగా నారదాసు మాట్లాడుతూ అధికారం అంటే ఒక బాధ్యత అని ఒక లక్ష్యాన్ని సాధించటం అని అన్నారు ముఖ్యమంత్రి కేసీఆర్ గొప్ప సోషల్ ఇంజనీర్ అని అన్నారు. సమాజంలో మానవ వనరు పెద్ద సంపద అని , విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. గవర్నర్ ప్రసంగం ప్రజల ఆకాంక్షలకు అద్దం పట్టిందని నారదాసు లక్ష్మణ రావు పేర్కొన్నారు.

సకల ఉద్యోగుల మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

హైదరాబాద్,ఆంధ్రప్రభ: ఈ నెల 25న తెలంగాణ ఎంప్లాయిస్ జెఏసి తలపెట్టిన సకల ఉద్యోగుల మహాసభ పోస్టర్‌ను టీజీవోస్ వ్యవస్థాపక అధ్యక్షుడు వి శ్రీనివాస్‌గౌడ్ ఆవిష్కరించారు. ఉద్యోగుల న్యాయమైన కోరిక సిపిఎస్‌ను రద్దుచేసి ఓపిఎస్ వచ్చే విధంగా ప్రభుత్వం కృషి చేయాలన్నారు. ఉద్యోగులకు 11వ పిఆర్‌సి ప్రకటించి జూలై 1నుంచి అమలులోకి తేవాలని కోరారు. ఆంధ్రలో పనిచేస్తున్న తెలంగాణ ఉద్యోగులను వెనక్కు తేవాలని, ఉద్యోగుల విభజన సమస్యలను పరిష్కరించాలని, ఆర్డర్ టూ సర్వ్ విధానాన్ని ఎత్తివేసి ట్రాన్స్‌ఫర్‌లను వెంటనే చేపట్టాలని చెప్పారు. సకల ఉద్యోగుల మహాసభను విజయవంతం చేయాలని టిజివోఎస్ అధ్యక్షులు మమత కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఎ సత్యనారాయణ, ఉపాధ్యక్షులు డాక్టర్ మధుసూదన్ గౌడ్, రవీందర్‌రావు, నగరశాఖ అధ్యక్షులు జి వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షులు ఎంబి కృష్ణయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఏబీకే ప్రసాద్ సతీమణి సుధారాణి మృతి



హైదరాబాద్, ఆంధ్రప్రభ : సీనియర్ సంపాదకులు ఏబీకే ప్రసాద్ సతీమణి సుధారణి కన్నుమూశారు. గత కొంత కాలంగా అస్వస్థతతో ఉన్న సుధారాణి కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మంగళవారం ఉదయం చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమె భౌతిక కాయాన్ని మాదాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్‌కు తరలించారు. బుధవారం మధ్యాహ్నం ఒంటిగంటకు జూబ్లీహిల్స్‌లోని మహా ప్రస్థానంలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సుధారాణి మృతిపట్ల పలువురు రాజకీయనాయకులు, పాత్రికేయులు , ప్రముఖులు సంతాపం ప్రకటించారు. ఆమె భౌతికకాయంపై పుష్పగుచ్ఛం వేసి నివాళులు అర్పించారు.

ఆర్గనైజేషన్ అండ్ పోలీసు రీఫామ్స్ ఏడీజీపీగా రాజీవ్ రతన్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఆర్గనైజేషన్ అండ్ పోలీసు రీఫామ్స్ ఏడీజీపీగా రాజీవ్ రతన్ మంగళవారం పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఫైర్ సర్వీసెస్ డీజీగా రాజీవ్‌రతన్ ఆర్గనైజేషన్ అండ్ పోలీస్ రీఫామ్స్ ఏడీజీపీగా బదిలీ అయ్యారు. రాజీవ్ రతన్ 1991 బ్యాచ్‌కు చెందినవారు.

తెలంగాణ ప్రభుత్వము

[illegible]

తేది: 26.02.2018

తేది: 28.02.2018

1	2	3	4	5	6	7	8	9	10	11	12	13	14	15
[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]

(మిగతా 6వ పేజీలో)



బ్యాంకు ఖాతాలతో ఆధార్ లింకేజీ పొడిగింపు

• సుప్రీంకోర్టు ఆదేశం • సబ్సిడీ లబ్దిదారులకు వర్తించదు

న్యూఢిల్లీ : ఆధార్‌తో వివిధ రకాల సేవలతో అనుసంధానం గడు వును సుప్రీంకోర్టు పొడి గిస్తూ.. మంగళవారం నాడు నిర్ణయం తీసు కుంది. ఆధార్‌తో మొబైల్, బ్యాంకు ఖాతాల అను సంధా నం ఆధార్ కేసుపై తుది నిర్ణయం వెలు వడే వరకు పొడి గించింది. వాస్తవానికి ఈ నెల 31వ తేదీలోగా ఆధార్‌తో బ్యాంకు, మొబైల్‌నెంబర్లను అనుసంధానం చేసుకోవాల్సి ఉంది. సుప్రీంకోర్టు తాజా నిర్ణయంతో ఇప్పటి వరకు ఆధార్‌తో అనుసంధానం చేసుకొని వారికి అతి పెద్ద ఊరట లభించిందని చెప్ప వచ్చు. అయితే సుప్రీం తాజా నిర్ణయం మాత్రం సెక్షన్7 కింద ప్రభుత్వం నుంచి సబ్సిడీల లబ్ది పొందే వారికి ఇది వర్తించదని పేర్కొంది. అయితే విని యోగదారులు తమ మొబైల్ నెంబర్లు, బ్యాంకు ఖాతాలతోపాటు ఇతర వాటికి అనుసంధానం చేసుకోవాలంటే చేసుకోవచ్చునని సూచించింది. కాగా తత్కాల్ పాస్‌పోర్ట్ కోసం ఆధార్ తప్పనిసరి కాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ ఆర్డర్‌ను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి దీపక్‌మిశ్రా, న్యాయమూర్తులు, ఎకె సిక్రీలు, ఎఎం ఖాన్‌వాల్కర్, డీవై చంద్రచూడ్‌లతో పాటు అశోక్ భూషన్‌లున్నారు. ఇదిలా ఉండగా సుప్రీంకోర్టు 2013లోనే ప్రభుత్వాన్ని సంక్షేమ పథకాల కోసం ఆధార్ నెంబర్ ఇవ్వాలని బలవంతం చేయరాదని ఆదేశించింది.

పొదుపు ఖాతాదారులకు ఊరట

ముంబై : ప్రభుత్వరంగానికి చెందిన స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా మంగళవారం నుంచి ఎస్‌బీఐ సరాసరి కనీస నిల్వలు పాటించని ఖాతా దారులపై కాస్తా కనికరం చూపించింది. రుసుము ను 75 శాతం వరకు తగ్గించింది. ఈ చార్జీల విషయానికి వస్తే మెట్రో, అర్బన్ సెంటర్‌లలో గరిష్ఠంగా నెలకు రూ.50తో పాటు 18 శాతం విధించే వారు ఇక నుంచి నెలకు రూ.15తో పాటు పన్ను విధిస్తారు. అర్బన్ మెట్రో కస్టమర్లు నెలకు కనీస బ్యాలెన్స్ రూ.3,000 వరకు ఖాతాలో ఉంచా ల్సి ఉంటుంది. సెమి అర్బన్, గ్రామీణ ప్రాంతాల్లోని బ్యాంకుల విషయానికి వస్తే రూ.40 నుంచి రూ.12క ు రూ.10కి సవరించాయి. ఈ రెండు చోట్ల అంటే సెమి అర్బన్ ప్రాంతాల్లో ఖాతాదారులు నెలకు రూ.2,000, గ్రామీణ ప్రాంతాల్లోని ఖాతాదా రులు నెలకు రూ.1,000 కనీన నిల్వలు బ్యాంకులో ఉంచుకోవాల్సి ఉంటుంది. వివరాల్లోకి వెళితే మెట్రో నగరాల్లో కనీస నిల్వలు 50 శాతం తగ్గితే ప్రస్తుతం రూ.30తో పాటు జీఎస్టి విధించే వారు. ఇక నుంచి రూ.10తో పాటు జీఎస్టి విధిస్తారు. అదే కనీస నిల్వలు 50 నుంచి 75 శాతం తగ్గితే రూ.40 ఫ ్లస్ జీఎస్టి, ప్రస్తుతం దాన్ని 12 ఫ్లస్ జీఎస్టి ప్రతిపాదించారు. అదే కనీస నిల్వలు 75 శాతం తగ్గితే ప్రస్తుతం రూ.50తో పాటు జీఎస్టి విధిస్తుండగా .. దాన్ని రూ.15 ఫ్లస్ జీఎస్టి ప్రతిపాదించారు. సెమి అర్బన్ ప్రాంతాల విషయానికి వస్తే కనీస నిల్వలు రూ.2,000 ఉంచాలి. 50 శాతం తగ్గితే రూ.20 ఫ్లస్ జీఎస్టి ప్రస్తుతం రూ.7.50 ఫ్లస్ జీఎస్టి, అదే 50 నుంచి 75 శాతం మధ్యలో తగ్గితే మాత్రం ప్రస్తుతం రూ.30 ఫ్లస్ జీఎస్టి విధిస్తున్నారు. దీన్ని రూ.10 ఫ్లస్ జీఎస్టి, అదే 75 శాతం నిల్వలు తగ్గితే మాత్రం రూ.40 ఫ్లస్ జీఎస్టిని రూ.12.00 ఫ్లస్ జీఎస్టిగా ప్రతిపాదించారు. గ్రామీణ ప్రాంతాల విషయానికి వస్తే కనీస నిల్వలు రూ.1,000 ఉంచాలి. కనీస నిల్వలు 50 శాతం తగ్గితే ప్రస్తుతం రూ.20 ఫ్లస్ జీఎస్టీ దీన్ని రూ.5.00 ఫ్లస్ జీఎస్‌టి ప్రతిపాదిం చబోతున్నారు. అదే 50-75 శాతం వరకు తగ్గితే ప్రస్తుతం రూ.30 ఫ్లస్ జీఎస్టి దాన్ని రూ.7.50 జీఎస్టిగా ప్రతిపాదించనున్నారు. అదే 75 శాతం తగ్గితే మాత్రం రూ.40 ఫ్లస్ జీఎస్టి, రూ.10.00 జీఎస్టి ప్రతిపాదించారు. ప్రభుత్వ రంగానికి చెందిన స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) పొదుపుఖాతాల్లో కనీస నిల్వలు (మినిమమ్ బ్యాలెన్స్) ఉంచనందుకు ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి జనవరి వరకు 41.16 లక్షల పొదుపు ఖాతాలను మూసేసింది. ఈ విషయం సమాచారం చట్టం కింద వెల్లడైంది. గత ఏప్రిల్‌లో ఎస్‌బీఐ నెలవారి కనీస నిల్వలు పాటించనందుకు అపరాధ రుసుమును ఐదు సంవత్సరాల తర్వాత తిరిగి ప్రవేశపెట్టింది.

ఎల్‌ఓయూలకు చెల్లుచీటీ!

• నీరవ్ మోడీ దెబ్బకు ఆర్‌బీఐ నిర్ణయం • దిగుమతి వ్యాపారులపై ప్రభావం

ముంబై: వజ్రాల వ్యాపారి నీరవ్‌మోడీ లెటర్స్ ఆఫ్ అండర్‌టేకింగ్ (ఎల్‌ఓయు)ల ద్వారా పంజాబ్ నేషనల్ బ్యాం కుకు రూ.12,700 కోట్లు మోసం చేసిన తర్వాత రిజర్వుబ్యాంకు ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) లో చలనం కనిపించింది. మంగళ వారం నాడు ఆర్‌బీఐ అన్నీ బ్యాంకులకు ఒక నోటిఫికేషన్ జారీ చేస్తూ.. ఇక నుంచి లెటర్ ఆఫ్ అండర్‌స్టాండిగ్, లేదా లెటర్ ఆఫ్ కంఫర్ట్స్ (ఎల్‌ఓసీ)ల జారీని తక్షణమే నిలిపివేయాలని ఆదేశించింది. వజ్రాల వ్యాపారి నీరవ్‌మోడీతో పాటు మెహుల్‌చోక్సీలు బ్యాంకుల నుంచి చట్టవ్యతిరేకంగా ఎల్‌వోయులు దక్కించు కొని పీఎన్‌బీకి రూ.12,700 కోట్లు మోసం చేశారు. అయితే ఆర్‌బీఐ అకస్మాత్తుగా తీసుకున్న నిర్ణయంతో దేశంలో ఆర్థిక పర్యమైన వాణిజ్య కార్యకలాపాలపై ప్రభావం ఉంటుంది. ఇక్క డ ఎల్‌ఓయుల విషయానికి వస్తే విదేశాల నుంచి దేశంలోకి వచ్చే దిగుమతులపై బ్యాంకులు కంపెనీలకు ఎల్‌వోయులు ఇస్తుంటాయి.

అయితే ఆర్‌బీఐ జారీ చేసిన నోటిఫికేషన్‌లో దేశంలోకి వచ్చే దిగుమతులపై కంపెనీలకు యధావిధిగా ఎల్‌వోయులను జారీ చేసుకోవచ్చునని, ఆయా కంపెనీ పరపతి, నిజాయితీని బట్టి నిబంధనలకు అనుగుణంగా ఇవ్వవచ్చునని సూచించింది. పెద్దమొత్తంలో మధ్య కాలానికి, దీర్ఘకాలానికి మాత్రం ఎలాంటి గ్యారంటీ లేకుండా మాత్రం జారీ చేయరాదని కోరింది. అయితే కొన్ని రకాల కస్టమర్లకు, ట్రేడర్లు మాత్రమే ఇది వర్తిస్తుందని.. వీలైనంత వరకు ఇలాంటి వారికి ఎల్‌వోయులు వద్దని సూచించింది.

గీతాంజలి గ్రూపు ఛైర్మన్ మెహుల్ చోక్సీలో రూ.7,080.86 కోట్లు మోసం చేస్తే, మిగిలిన మొత్తం నీరవ్ మోడీకి చెందిన కంపెనీలు మోసం చేశాయి. వీరిద్దరు దేశం నుంచి పారిపోయారు. ప్రస్తుతం సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్ (ఎస్‌ఎఫ్‌ఐఓ) దర్యాప్తు చేస్తోంది. ఇదిలా ఉండగా మోడీ, చోక్సీలకు చెందిన కంపెనీలు పీఎన్‌బీ నుంచి మోసపూరితంగా ఎల్‌ఓయులు దక్కించుకొని విదేశాల్లోని భారతీయ బ్యాంకుల నుంచి రుణాలు తీసుకొనే వారు. కాగా ముంబైలోని ఒకే బ్రాంచీకి చెందిన ఉద్యోగులకు వీరిద్దరకి ఎల్‌వోయులు జారీ చేయడానికి సహాపడ్డారు. ఇలాంటి మోసాలు పునరావృతం అయ్యే అవకాశాలున్నాయని ఆర్‌బీఐ బ్యాంకులను హెచ్చరించింది. ఆగస్టు 2016 నుంచి మూడు సందర్భాల్లో కనీసం ఇలాంటి సంఘటనలు జరిగినట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపింది. స్విఫ్ట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (స్విఫ్ట్ సాఫ్ట్‌వేర్)లో మోసాలు జరిగే అవకాశాలున్నాయి కాబట్టి వాటి భద్రత్రపై దృష్టి పెట్టాలని సూచించింది.

ఎల్‌ఓయు, ఎల్‌ఓసీల ప్రభావం: ఎల్‌ఓయులు, ఎల్‌ఓసీ లు రద్దు చేయడంతో ఫైనాన్స్ వ్యాపారంతో పాటు రూపాయిపై ప్రభావం చూపుతుంది. ముఖ్యంగా వజ్రాలు నగల రంగంపై కనిపిస్తోంది. ఈ రంగానికి చెందిన వ్యాపారులు దిగుమతులపై పెట్టుబడులకు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. దీంతో నగల వ్యాపారులు డాలర్లను స్పాట్ మార్కెట్ నుంచి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఇది నగల వ్యాపారులకు ఖరీదైన వ్యవహారంగా మారుతుందని ఈ రంగానికి చెందిన వ్యాపారులు వాపోతున్నారు. పీఎన్‌బీఐ స్కాం వెలుగు చూసిన తర్వాత ఆర్‌బీఐ ఎల్‌వోయులను రద్దు చేసింది. ఎల్‌వోయులతో పాటు ఇతర గ్యారంటీలపై నిబంధనలను కట్టుదిట్టం చేసింది. ప్రస్తుతం బ్యాంకులు మరిన్ని డాక్కుమెంట్లు కావాలని కంపెనీలను కోరుతున్నాయి. ఇప్పటికే పలు బ్యాంకులు ఎల్‌ఓయులు, ఎల్‌వోసీల స్క్రూటిని మరింత కట్టుదిట్టం చేశాయి. వ్యాపారులు దిగుమతులపై చెల్లింపులను జాప్యం చేయడానికి వీల్లేదు. దీంతో వారు డాలర్లను బహిరంగా మార్కెట్లో కొనుగోలు చేయాల్సిన పరిస్థితులు ఏర్పడుతుందని బ్యాంకింగ్ వర్గాలు తెలిపాయి.

ఎల్‌వోయుల కాలపరిమితి 90 రోజులే : ఎల్‌వోయులు లేదా ఎల్‌ఓసీల విషయానికి వస్తే బ్యాంకులు దిగుమతి డాక్యుమెంట్లకు వ్యతిరేకంగా 90 రోజుల కోసం జారీ చేస్తాయి. సాధారణంగా ప్రతి బ్యాంకు ఇదే పద్ధతిని పాటిస్తుంటాయి.

ఈ లోహ విహంగాలు యమదూతలు!

- ఇండిగో, గోఎయిర్ సర్వీసుల నిలిపివేత
- లోపభూయిష్టమైన ఇంజిన్లు
- ఏడాదిన్నరగా పదే పదే మొరాయింపు
- ప్రతిరోజూ ఇండిగో సర్వీసులు వెయ్యి
- గోఎయిర్ సర్వీసులు 230
- బట్టబయలైన ఒళ్ళు జలదరించే నిజాలు



హైదరాబాద్ : విమానప్రయాణికులారా జర భద్రం! మీకు తెలియకుండానే మీరు గత కొన్ని నెలల నుంచి ఇండిగో, గో ఎయిర్‌లలో ఎంతటి ప్రమాదకరమైన పరిస్థితుల్లో విమాన ప్రయాణాలు చేశారో తెలియదు. పౌరవిమానయాన శాఖ డైరెక్టర్ జనరల్ (డీజీసీఏ)సోమవారం నాడు ఎ320 నియో జెట్స్ ఇంజిన్‌లతో నడిచే ఇండిగో, గోఎయిర్ విమానాలను పూర్తిగా నిలిపివేయాలని సోమవారం ఆదేశాలిచ్చే వరకు అసలు విషయం విమానప్రయాణికుడికి తెలియదు. ఈ రెండు విమానయాన సంస్థలకు చెందిన విమానాలు టేకాఫ్ అయిన గంట లోపలే ఆకాశంలో ఒక ఇంజిన్ పనిచేయ కపోవ డంతో డీసీసీఏ రెండు సంస్థలకు ప్రాట్ అండ్ వైట్నీ (పీడబ్ల్యు)కి చెందిన విమానాలను నిలిపివేయాలని ఆదేశం చింది. ఇక్కడ అసలు విషయానికి వస్తే డీజీసీఏ ఆదేశాలు వెలువడే వరకు ఈ రెండు ఎయిర్‌లైన్స్ విమానప్రయాణికుల ప్రాణాలను పణంగా పెట్టి విమానాలను నడిపిందని చెప్పుకోవచ్చు.

కొన్ని నెలల నుంచి తరచూ ఇంజిన్లల్లో లోపాలు: ఎ 320నీయోస్‌ను యూరోపియన్ ఎయిర్‌క్రాఫ్ట్ తయారీ సంస్థ ఎయిర్‌బస్ రూపుదిద్దుతోంది. అమెరికన్ ఎయిరోస్పెస్ మాన్యుఫ్యాక్చరర్ ప్రాట్ అండ్ వైట్నీ (పీడబ్ల్యు) టర్బోఫ్యాన్ ఇంజిన్లు తయారు చేస్తోంది. ఇటీవల కాలంలో తరచూ ఈ ఇంజిన్లల్లో లోపాలు తలెత్తున్నాయి. అయితే ఈ రెండు ఇంజిన్ల విమానంలో ఒక ఇంజిన్ విఫలం అయినా.. మరో ఇంజిన్‌తో విమానం యధావిధిగా నడుస్తుంది. దీంతో ప్రయాణికులకు ప్రమాద మా?: అంటే అవునని ఈ రంగానికి చెందిన నిపుణులు చెబుతున్నారు. అహ్మదాబాద్ నుంచి లక్నో వెళుతున్న ఇండిగో ఎ320 విమా నం ఆకాశం లో ఒక ఇంజిన్ పనిచేయడం మానే సిం ది. అంతకు ముందు మార్చి 5వ తేదీన ఇండిగోకు చెందిన 320 నియో ఇంజిన్ విమా నం ముంబై నుంచి టేకాఫ్ అయ్యి ముందుకు సాగలేదు. టేకాఫ్ అయిన అరగంటలోనే తిరిగి ల్యాండ్ కావాల్సి వచ్చిం ది. ఫిబ్రవరి 24వ తేదీన గోఎయిర్‌కు చెందిన ఎ320 నియో ఇంజిన్ లేహ్ నుంచి టేకాఫ్ అయ్యి తర్వాత ఆకాశం లోనే ఇంజిన్ పనిచేయడం మానేసింది. దీంతో రంగంలోకి దిగిన డీజీసీఏ తక్షణమే ఈ విమాన సర్వీసులను నిలిపివేయాలని ఆదేశించింది.

ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటం : డీజీసీఏ తాజాగా తీసుకున్న చర్యల విమానయాన సంస్థలు సర్వీసులు నిలిపివేశాయి కానీ. గతంలో పలుమార్లు ఇంజిన్లు విఫలం అయ్యాయి. అయితే ఇవేమీ డీజీసీఏ దృష్టికి రాలేదు.

గత మూడు దశాబ్దాల నుంచి విమానయాన రంగంలో కూడా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చాయి. దీంతో ఇంజిన్లల్లో లోపాలు ఎప్పుడో ఒకసారి మాత్రమే జరుగుతున్నాయి. ఏడాది ప్రాతిపదికన తీసుకుంటే ప్రపంచవ్యాప్తంగా సుమరు 25 ఇంజిన్లల్లో లోపాలు వెలుగు చూశాయి. లేదా పది లక్షల విమాన ప్రయాణాల్లో ఒకసారి ఇంజిన్ విఫలం జరిగిందని చెప్పుకోవచ్చు. ఇండిగో విషయా నికి వస్తే 18 నెలల కాలంలో సరాసరి వారానికి ఒకసారి ఇంజిన్‌లో లోపాలు తెలెత్తాయి. ఈ రంగానికి చెందిన నిపుణు ల ప్రకారం ఇది ప్రపంచరికార్డు అని చెబుతున్నారు. ఇంత జరు గుతున్నా ప్రయాణి కుడికి మాత్రం తాము ఎంతటి ప్రమా దకరమైన పరిస్థితుల్లో ప్రయాణి చేస్తున్నామో తెలియదు!

తరచూ ఇంజిన్లల్లో లోపాలపై స్పందన: అయితే తరచూ జరుగుతున్న ఈ లోపాలను గుర్తించి ఫిబ్రవరి 9వ తేదీన యూరోపియన్ పౌర విమానయాన నియంత్రణా సంస్థ పీడబ్ల్యు1000 ఇంజిన్ల తయారీని నిలిపివేయాలని ఆదేశించింది. ప్రాథమిక విచారణలో పలుమార్లు ఇంజిన్‌లో లోపాలు గమనించామని, విమానాలను అలానే నిడిపిస్తే రెండో ఇంజిన్‌పై ప్రభావం పడి అది కూడా పనిచేయ కుండా నిలిచిపోయే అవకా శాలున్నయని పేర్కొంది.

ఇదిలా ఉండగా గత నెలలో బొంబాయి హైకోర్టులో ప్రజా ప్రయోజనాల వాజ్యం (పిల్) వేయడం జరిగింది. ఎ320 నియో ఇంజిన్లతో నడిచే విమానాలను పూర్తిగా నిలిపి వేయా లని కోర్టును కోరింది. దీనిపై కోర్టు డీజీసీఏను స్పందించాలని కోరింది. పరిస్థితి ఇలానే కొనసాగితే విమానా ప్రయాణాలు అత్యంత ప్రమాదకరంగా పరిణమించే అవకాశాలున్నాయి. ఒకవైపు దేశంలో విమానప్రయాణికుల సంఖ్య విపరీతంగా పెరిగిపోతోంది. దీంతో భారతీయ గగనతంలో ట్రాఫిక్ విపరీతంగా పెరిగిపోతోంది. పెరిగిపోతున్న ట్రాఫిక్‌కు తగ్గట్టు విమాన యానరంగంలో మౌలిక సదుపాయాలు లేవు. ఆకాశంలోనే విమాన ప్రమాదాలు తృటిలో తపి ్పన సంఘటనలు 28 శాతం పెరిగాయని డీజీసీఏ గణాంకాలు చెబుతున్నాయి.

డిగో, గో ఎయిర్ విమానాలు నిలిపివేత

ముంబై : పౌరవిమానయానశాఖ డైరెక్టర్ జనరల్ (డీజీసీఏ) తక్షణమే 11 ఎయిర్‌బస్ ఎ-320 న్యూఇంజిన్ ఆప్షన్ (నియో) విమానాలను నిలిపివేయాలని ఆదేశించింది. ఈ విమానాలకు ప్రాట్ అండ్ వైట్నీ (పీడబ్ల్యు) లోపభూయిష్టమైన ఇంజిన్లు బిగించారని గుర్తించింది. ఇటీవలే ఇండిగో ఎ-320 నియో అహ్మదాబాద్ నుంచి లక్నోకు రూట్‌లో బయలుదేరిన విమానం టేక్‌ఆఫ్ కాగానే ఒక ఇంజిన్ పనిచేయడం మానేసింది. ఈ విషయాన్ని సోమవారం డీజీసీఏకు సమాచారం అందించారు. కాగా గత పక్షం రోజుల్లో ఎ-320 విమానం ఆకాశంలోనే ఇంజిన్ పనిచేయకపోవడం ఇది మూడవ సారి. ఇలాంటి అనుభవమే ఫిబ్రవరి 24న గోఎయిర్ లేహ్ ప్రయాణికులకు జరిగింది. కాగా మార్చి 5వ తేదీన ఇండిగో ముంబై విమాన ప్రయాణికులు అనుభవాన్ని చవిచూశారు.

కాగా ఇండిగోకు ఇలాంటి విమానాలకు ఎనిమిది ఉండగా.. గోఎయిర్‌కు మూడు విమానాలున్నాయి. కాగా డీజీసీఏ రెండు విమానయాన సంస్థలకు పీడబ్ల్యు 1100 ఇంజిన్ సీరియన్ నెంబర్ 450 వినియోగిం చవచ్చ వద్దని కోరింది. ఇవన్నీ పాత విడిభాగాలని పేర్కొంది. త్వరలోనే ఈ అంశాన్ని యూరోపియన్ నియం త్రణా సంస్థతో పాటు పీఅండ్ డబ్ల్యు ముందు లెవనెత్తు తామని పేర్కొంది.

సిరిసిల్లలో అపెరల్ సూపర్ హబ్

• రూ. 110 కోట్ల పెట్టుబడి అవగాహన పత్రాలు మార్చుకున్న టెక్స్‌టైల్స్ కమిషనర్ • చేనేత కార్మికుల జీవితాలను మెరుగుపరచడమే లక్ష్యం • మంత్రి కేటీఆర్



హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్రంలో చేనేత రంగాన్ని పటిష్టపరిచి నేత కార్మికుల జీవితాలను బాగు చేయాలన్న ఏకైక లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తోందని పరిశ్రమలు, జౌళిశాఖ మంత్రి కేటీ రామారావు అన్నారు. గత బడ్జెట్‌లో రూ.1200 కోట్లు కేటాయించామని, ఇందులో చేనేతకు రూ.425 కోట్లు, మిగిలిన మొత్తం మరమగ్గాలకు ఇచ్చామని ఆయన చెప్పారు. సిరిసిల్లలో ఏర్పాటు చేస్తున్న అపెరల్ పార్కులో కరూర్‌కు చెందిన కె వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్ 20 ఎకరాల్లో రూ.110 కోట్ల పెట్టుబడితో అపెరల్ సూపర్ హబ్‌ను నెలకొల్పుతోందని మంత్రి చెప్పారు. దీనికి సంబంధించి కె వెంచర్స్ సీఈవో సుచీంద్రన్, రాష్ట్ర టెక్స్‌టైల్స్ కమిషనర్ శైలజా రామయ్యర్ ఒక అవగాహన ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు.

ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ, ఈ సూపర్ హబ్‌లో అత్యాధునిక టెక్నాలజీతో కూడిన యంత్రాలు ఏర్పాటు చేస్తారని, సిరిసిల్ల పరిసర ప్రాంతాల చేనేత కార్మికులకు ఈ హబ్‌లో ఫ్యాషన్, డిజైనింగ్, కటింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ తదితర విభాగాల్లో శిక్షణ ఇస్తారని తెలిపారు. మూడేళ్ళలో మూడు దశల్లో ఈ హబ్‌ను పూర్తి చేస్తారని, ఇది ఉత్పత్తి ప్రారంభిస్తే 15వేల మందికి ప్రత్యక్షంగా, మరో 15వేల మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తుందని చెప్పారు. ఈ హబ్‌లో ప్రత్యేకంగా స్కిల్ డవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేస్తారని చెప్పారు. ఇక్కడ ఉత్పత్తి చేసే దుస్తులను మళ్ళీ కె వెంచర్స్ కంపెనీ పూర్తిగా కొనుగోలు చేస్తుందని మంత్రి కేటీఆర్ తెలిపారు.

చేనేత కార్మికుల కుటుంబాలకు నెలకు కనీసం రూ.25వేల ఆదాయం కల్పించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ప్రోత్సాహాన్ని అందిస్తోందని చెప్పారు. గద్వాలలో హ్యాండ్లూమ్ పార్కు, గుండ్లపోచంపల్లిలో అపెరల్ పార్కు, వరంగల్‌లో కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కుతో పాటు సిద్దిపేట, జమ్మికుంట, నారాయణపేట్ తదితర ప్రాంతాల్లో టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. చేనేత కార్మికులకు నూలు, రసాయనాలు, రంగులను 50శాతం సబ్సిడీపై అందిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం కొనుగోలు చేసే దుస్తులను చేనేత కార్మికులచే సేకరిస్తున్నామని మంత్రి చెప్పారు. రాష్ట్రంలో కేవలం వెయ్యికోట్ల మేరకే చేనేత ఉత్పత్తులు ఎగుమతి అవుతుంటే, తిర్పూర్ నుంచి రూ.36వేల కోట్ల దుస్తులు ఎగుమతి చేస్తున్నారని ఆయన చెప్పారు. తమ సంస్థ సిరిసిల్ల వద్ద నెలకొల్పే అపెరల్ సూపర్ హబ్ దేశంలోనే అత్యంత నైపుణ్యం కలిగిన ఉత్పత్తులను సాధించనుందని కె వెంచర్స్ సీఈవో సుచీంద్రన్ చెప్పారు. ఈ సంస్థ సిరిసిల్ల ప్రాంతానికి మూలస్తంభం నిలుస్తుందని చేనేత కార్మికులకు అత్యుత్తమ టెక్నాలజీతో కూడిన శిక్షణ ఇస్తామని ఆయన చెప్పారు.

‘పట్టణాలకు పట్టం’



ఎట్టణాల అభివృద్ధికి నిర్దిష్ట ప్రణాళికలతో ప్రభుత్వం ముందుకు పోతుందని పురపాలక శాఖ మంత్రి కె.టి. రామారావు తెలిపారు. పట్టణాల అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతను ఇస్తుందని, ఇప్పటికే పట్టణాలకు అవసరమైన నిధులను ప్రభుత్వం సమకూరుస్తుందని పేర్కొన్నారు. ఇక మీదట పట్టణాల పురోగతికి తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా మరిన్ని నిధులు ఇవ్వనున్నట్లు మంత్రి వెల్లడించారు. పట్టణాల అభివృద్ధి, తీసుకోవలసిన చర్యలపైన జిల్లా కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లతో కేటిఆర్ సచివాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తెలంగాణలోని 39 శాతం జనాభా పట్టణాల్లో జీవిస్తుందని, త్వరలో ఏర్పడనున్న నూతన పురపాలికలతో పట్టణాల్లో జీవించే వారి సంఖ్య మరింత పెరుగుతుందని మంత్రి వివరించారు. పట్టణాలను పక్క ప్రణాళికలతో అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ప్రజల అవసరాల మేరకు పట్టణాల్లో మౌలిక వసతులు మెరుగుపడవలసి ఉందన్నారు. కొత్త జిల్లా కేంద్రాలు, ఇతర పట్టణాలను ప్రణాళికా బద్ధంగా, పక్కా రోడ్ మ్యాప్‌తో అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని కలెక్టర్లకు సూచించారు. పట్టణాలకు టియూఎఫ్ ఐడిసి ద్వారా ఇస్తున్న నిధులను నిర్దిష్ట గడువులోగా ఖర్చు చేయవలసి ఉందన్నారు. పట్టణాల్లో చేపట్టాల్సిన పనుల విషయంలో సిద్దిపేటను రోల్ మోడల్‌గా తీసుకోవాలన్నారు. పట్టణాల్లో జంక్షన్ టూ జంక్షన్ రోడ్ల అభివృద్ధి, మోడల్ మార్కెట్, పాదాచారుల మార్గాలు, బస్ బేలు, మురికి కాలువల అభివృద్ధి, శ్మశాన వాటికలు, పార్కుల అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టవలసి ఉందన్నారు.

జర్నలిస్టులకు ఆన్‌లైన్‌లో బస్ పాసుల

రాష్ట్రంలోని జర్నలిస్టులకు ఆన్ లైన్‌లో బస్ పాస్‌లు జారీ చేయడానికి ఆర్టీసీ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఇక మీదట బస్ పాస్‌లు తీసుకొనేందుకు జర్నలిస్టులు ఆర్టీసీ కార్యాలయాలకు రావలసిన అవసరం లేదని తెలిపింది. ఏప్రిల్ ఒకటవ తేదీ నుండి వర్తించే విధంగా తెలంగాణలోని జర్నలిస్టులందరికీ ఆన్‌లైన్‌లో బస్ పాసులను జారీ చేయబోతున్నామని పేర్కొంది. రాష్ట్ర, జిల్లా జర్నలిస్టులకు ఇక మీదట ఒకే బస్ పాస్‌ను జారీ చేయడం జరుగుతుంది. ఆర్టీసీ వెబ్ సైట్‌లో జర్నలిస్టులు బస్ పాస్ కోసం దరఖాస్తు చేసు కొనవలసి ఉంటుంది. సంబంధిత సమచార పౌరసంబంధాల అధికారులు జర్నలిస్టుల దరఖాస్తులన ధృవీకరించిన వెంటనే బస్ పాస్ కౌంటర్లలో పాస్‌లను పొందవచ్చన్నారు. అన్ని స్థాయిల్లో జర్నలిస్టులకు ఎస్ఎంఎస్ ద్వారా సమాచారం చేరవేసే వెసులుబాటు కూడా కల్పించారు. సర్వీస్ ఛార్జీగా రూ. 30లు చెల్లించవలసి ఉంటుంది. అక్రిడిటిటేషన్‌లు కలిగి ఉన్న జర్నలిస్టులు ఈ నెల 25 నుండి ఆన్ లైన్‌లో దరఖాస్తు చేసుకొనవలసి ఉంటుంది. అన్‌లైన్‌లో బస్ పాస్ కోసం దరఖాస్తు చేసుకొనే జర్నలిస్టులు తనకు అప్పటికే జారీ చేయబడిన అక్రిడిటేషన్ కార్డును అప్‌లోడ్ చేయవలసి ఉంటుంది. ఆధార్ నెంబర్, పని చేసే సంస్థ పేరు, సెల్‌ఫోన్ నెంబర్, చిరునామాలను తప్పనిసరిగా నమోదు చేయవలసి ఉంటుందని అధికారులు తెలిపారు.

గల్ఫ్ బాధితులను ఆదుకుంటాం

మంత్రి కేటీఆర్‌కు ఎమ్మెల్యేల వినతి



హైదరాబాద్,ఆంధ్రప్రభ: గల్ఫ్‌లో అనేక సమస్యలు ఎదుర్కొంటున్న తెలంగాణ వాసులను ఆదుకోవాలని రాష్ట్ర ఐటీ, ఎన్ఆర్ఐ శాఖల మంత్రి కేటీఆర్‌కు ఎమ్మెల్యేలు విజ్ఞప్తి చేశారు. మంగళవారం అంసెబ్లీ లాబీల్లో ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్ బీగాల గణేశ్ తదితరులు మంత్రి కేటీఆర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఉపాధికోసం వలస వెళ్లిన తెలంగాణ వాసులను గల్ఫ్‌లో అక్కడి పాలకులు, వివిధ కంపెనీల యాజమాన్యాలు అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. పాస్‌పోర్టులు కూడా లాక్కుని నిర్బంధిస్తున్నారని వివరించారు. చనిపోతే సాటి కార్మికులే చందాలు వేసుకుని శవాలను స్వగ్రామాలకు పంపాల్సివస్తోందన్నారు. గల్ఫ్‌లోని తెలంగాణ వాసులకు అండగా నిలవటమే కాకుండా అక్కడి తెలంగాణ వాసుల సమస్యలు ఎప్పటికపుడు పరిష్కరించేందుకు సమన్వయకర్తను నియమించాలని మంత్రి కేటీఆర్‌కు ఎమ్మెల్యేలు విజ్ఞప్తి చేశారు.

బంగారు తెలంగాణ దిశగా అడుగులు



హైదరాబాద్,ఆంధ్రప్రభ: బంగారు తెలంగాణ సాధన కోసం ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వపాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. రెసిడెన్షియల్ స్కూల్స్‌తోపాటు ప్రభుత్వ స్కూల్స్‌ని ప్రోత్సహించనున్నట్టు స్పష్టం చేశారు. మంగళవారం రవీంద్రభారతిలో తెలంగాణయుటిఎఫ్ విద్యాసదస్సును నిర్వహించింది. సదస్సుకు సంఘం రాష్ట్ర అధ్యక్షులు సి స్వామిరెడ్డి అధ్యక్షత వహించారు. విద్యా సదస్సులో మంత్రులు ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు. సంఘ ప్రధాన కార్యదర్శి మల్లారెడ్డి నివేదికను సమర్పించారు. విద్య లేకుండా బంగారు తెలంగాణ సాధ్యం కాదని మంత్రులు అన్నారు. అందుకే విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. మధ్యాహ్న భోజనానికి సన్నబియ్యం ఇస్తున్నామని, హాస్టల్స్‌లోనూ సన్నబియ్యం సరఫరా చేస్తున్నామని మంత్రులు చెప్పారు. విద్యకు అధికప్రాధాన్యం ఇస్తున్నాం కాబట్టే వందలాది రెసిడెన్షియల్ స్కూల్స్‌ను ప్రారంభించామన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులను మంచి పౌరులుగా తీర్చిదిద్దాలని సూచించారు. ప్రభుత్వ విద్యారంగాన్ని రక్షించుకోవల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉంటుందని అన్నారు.

రాజ్యసభ బరిలో నలుగురు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్రానికి సంబంధించి ఖాళీకానున్న మూడు రాజ్యసభ స్థానాల కోసం ఐదు నామినేషన్లు దాఖలు కాగా, సాంకేతిక కారణాలతో ఇండిపెండెంట్ జాజుల భాస్కర్ వేసిన నామినేషన్ తిరస్కరించారు. టిఆర్ఎస్‌కు సంబంధించిన మూడు నామినేషన్లు, కాంగ్రెస్ అభ్యర్థి నామినేషన్‌ను ఆమోదించారు. టిఆర్ఎస్‌కు చెందిన జోగినిపల్లి సంతోష్‌కుమార్, బడుగుల లింగయ్యయాదవ్, బండ ప్రకాష్, కాంగ్రెస్‌కు చెందిన పి.బలరాం నామినేషన్‌ను ఆమోదించారు. నామినేషన్ల ఉపసంహరణకు గురువారం సాయంత్రం వరకు గడువు ఉంది.

యూనివర్శిటీల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం



హైదరాబాద్,ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రంలోని యూనివర్సిటీల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహారిస్తోందని అఖిలభారత విద్యార్థి పరిషత్ విమర్శించింది. సర్కార్ నిర్లక్ష్యాన్ని ఎండగడుతూ ఏబివిపి మంగళవారం ఉస్మానియా యూనివర్సిటీలో నిరసన ర్యాలీ నిర్వహించింది. ఏబివిపి సెంట్రల్ వర్కింగ్ కమిటీ సభ్యులు మట్ట రాఘవేందర్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో శ్రీహరి, ప్రవీణ్, శ్రీశైలం, తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు. వందేళ్ల ఉత్సవాల సందర్భంగా ఉస్మానియా యూనివర్సిటీకి కేటాయించిన రూ. 200 కోట్లు ఇప్పటి వరకు విడుదల చేయలేదని రాఘవేందర్ విమర్శించారు. తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన ఉస్మానియా యూనివర్సిటీకి రాష్ట్రం వచ్చిన తరువాత గత నాలుగేళ్లుగా టిఆర్ఎస్ ప్రభుత్వం ఒరగబెట్టింది ఏమి లేదని మండిపడ్డారు. యూనివర్సిటీని మోడల్ యూనివర్సిటీగా తీర్చిదిద్దడం కోసం రూ. 1000 కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీ 2400 ఎకరాల్లో ఉండగా 1000 అన్యాక్రాంతం అయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

రూ. 20వేల కోట్లతో బీసీ సబ్‌ప్లాన్ ఏర్పాటు చేయాలి

ఈటలకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం విజ్ఞప్తి



హైదరాబాద్,ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రంలో వెనుకబడిన తరగతుల వారికి రూ. 20వేల కోట్లతో బీసీ సబ్ ప్లాన్‌ను ఏర్పాటు చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. బీసీల అభివృద్ధికి బడ్జెట్‌లో రూ. 10వేల కోట్లను కేటా యించాలని ఆర్థిక, పౌర సరఫరాల శాఖ మంత్రి ఈటల రాజేందర్‌కు సంఘం జాతీయ అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆర్ కృష్ణయ్య విజ్ఞప్తి చేశారు. మంగళవారం అసెంబ్లీలో జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ కృష్ణ, నీల వెంకటేష్, ఎన్ భూపేష్‌సాగర్ తదితరులతో కలిసి విజ్ఞప్తి చేశారు.బీసీల సమస్యలు తెలుసుకొని వాటిపై మంత్రులు రూపొందించిన బీసీ డిక్లరేషన్‌లోని అంశాలకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని వారు మంత్రి ఈటలను కోరారు. 2018-19 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో రూ. 10వేల కోట్లను కేటాయించాలన్నారు. బీసీ కార్పొరేషన్‌కు ఏటా రూ. 2వేల కోట్లు కేటాయించాలని, ఎంబీసీ కార్పొరేషన్‌కు ప్రత్యేకంగా మరో రూ. 2వేల కోట్లను కేటాయించాలని కోరారు. బీసీ కులవృత్తుల కోసం ఏర్పాటు చేసిన 14 ఫెడరేషన్లకు జనాభా ఆధారంగా నిధులను కేటా యించాలన్నారు. కులాంతర వివాహాలు చేసుకునే వారికి ఇచ్చే ఆర్థిక ప్రోత్సాహాన్ని రూ. 10వేల నుంచి రూ. 2 లక్షలకు పెంచాలని కోరారు. బీసీ స్టడీ సర్కిల్ బడ్జెట్‌ను రూ. 25 కోట్ల నుంచి రూ. 250 కోట్లకు పెంచాలన్నారు. ఉన్నత విద్యను అభ్యసించే బీసీ విద్యార్థులందరికీ ర్యాంకులతో సంబంధం లేకుండా పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ఇవ్వాలని కోరారు. జాతీయస్థాయి ఐఐటీ, ఐఐఎం, ఎన్ఐటీ కోర్సులు చదివే బీసీ విద్యార్థులకు ఫీజురీయింబర్స్‌మెంట్ మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

దరఖాస్తు గడువు పెంపు

హైదరాబాద్,ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ రెసిడెన్షియల్ స్కూల్స్‌లో 5వ తరగతిలో చేరడానికి దరఖాస్తు చేసుకోవడానికి గడువును పెంచినట్టు సాంఘిక సంక్షేమ గురుకుల సొసైటీల కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. తుది గడువును 16 నుంచి 20 వరకు పొడిగించినట్టు ఆయన మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు

నిర్మాణ రంగంలోకి కర్దా కన్‌స్ట్రక్షన్

హైదరాబాద్,ఆంధ్రప్రభ: నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ కర్దా కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ నిర్మాణ రంగంలోకి ప్రవేశించినట్టు కర్దా కంపెనీ ఛైర్మన్ నరేష్ కర్దా వెల్లడించారు. రియల్ ఎస్టేట్ రంగంలో గణనీయమైన స్థానాన్ని సంపాదించిన తమ సంస్థ ఈనెల 16నుంచి స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో కూడా లిస్టింగ్ కానుందన్నారు. ఐపిఒ ద్వారా మొత్తం 4300000 ఈక్విటీ వాటాలను జారీ చేయటం ద్వారా రూ.77.40కోట్లకు చేరుతామని అంచనా వేశామన్నారు. కంపెనీ ప్రధానంగా నాణ్యత , తక్కువ ఖర్చుతో అభివృద్ధిపై దృష్టి కేంద్రీకరించినిట్టు తెలిపారు. రియల్ ఎస్టేట్ పరిశ్రమలో సమకాలిన నిర్మాణాలతో ప్రాజెక్టును బలంగా అమలు చేస్తూ నాణ్యమైన నిర్మాణాలపై దృష్టిపెట్టినట్టు ఛైర్మెన్ సురేష్‌కర్దా ఈ మేరకు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

టెన్త్‌కు నిమిషం నిబంధన లేదు

• 5 నిమిషాల వరకు అవకాశం • రేపటి నుంచి ఎస్ఎస్‌సీ పరీక్షలు • 2542 కేంద్రాలు ఏర్పాటు • 26 సమస్యాత్మక కేంద్రాలు..వాటిలో సీసీ కెమెరాలు ఏర్పాటు • ఏప్రిల్ 2 నుంచి మూల్యాంకనం ప్రారంభం • పాఠశాల విద్య సంచాలకులు జి. కిషన్

హైదరాబాద్,ఆంధ్రప్రభ: రాష్ట్ర వ్యాప్తంగా రేపటి నుంచి ప్రారంభం కానున్న ఎస్ఎస్‌సి పరీక్షల్లో నిమిషం నిబంధనను అమలు చేయడం లేదు. విద్యార్థులు పరీక్షా కేంద్రానికి రావడానికి అదనంగా 5 నిమిషాల సమయంకేటాయించారు. గత ఏడాదిలో మాదిరిగానే ఈ ఏడాది అమలు చేస్తామని పాఠశాల విద్య సంచాలకులు జి కిషన్ స్పష్టం చేశారు. రేపటి నుంచి ప్రారంభం కానున్న ఎస్ఎస్‌సి పరీక్షలకు సంబంధించి చేసిన ఏర్పాట్లను ఆయన మంగళవారం ప్రభుత్వ పరీక్షల సంచాలకులు బి సుధాకర్‌తో కలిసి మీడియాకు తెలిపారు.

రాష్ట్ర వ్యాప్తంగా 11,103 స్కూల్స్ నుంచి 5,38,867 మంది విద్యార్థులు ఎస్ఎస్‌సి పరీక్షలకు హాజరు కానున్నారు. వారిలో బాలురు 2,76,388 మంది ఉండగా బాలికలు 2,62,479 మంది ఉన్నారు. 5,03,117 మంది రెగ్యులర్ విద్యార్థులు, 35,750 మంది ప్రైవేటు వారు, మరో 20,838 మంది ఒకేషనల్ విద్యార్థులు ఉన్నారు. విద్యార్థులకోసం 2542 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. 4 టీమ్‌లు స్పెషల్ ఫ్లయింగ్ స్క్వాడ్స్, 148 ఫ్లయింగ్ స్క్వాడ్స్‌లను నియమించారు. పరీక్షలకు విద్యార్థులందరూ సివిల్ దుస్తుల్లోనే హాజరు కావాలని, ఎవరూ కూడా వారి వారి స్కూల్ యూనిఫామ్‌లతో హాజరు కావొద్దని స్పష్టం చేశారు. ఇప్పటికే హాల్‌టికెట్లను ఆయా స్కూల్స్‌కి పంపించామని, స్కూల్ నుంచి హాల్ టికెట్లు అందని వారు, స్కూల్‌లో తీసుకోని వారు నేరుగా డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు. పరీక్షా కేంద్రంలోనికి ఎవరికి సెల్‌ఫోన్‌లను అనుమతించరు. పరీక్షల సందర్భంగా అన్ని శాఖల సమన్వయంతో పనిచేయాలని నిర్ణయించినట్టు కిషన్ తెలిపారు. ఎస్ఎస్‌సి హాల్ టికెట్ ఉన్న విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించారని, అవసరమయిన మేరకు బస్సులను ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులను కోరామన్నారు. పరీక్షా కేంద్రాల దగ్గర 144 సెక్షన్‌ను అమలు చేయాలని పోలీసు అధికారులను కోరామన్నారు. పరీక్షల సమయంలో విద్యుత్ కోతలు లేకుండా చూడాలని విద్యుత్ శాఖ అధికారులను కోరామని, అందుకు వారు అంగీకరించారని తెలిపారు. ఎండల తీవ్రత నేపథ్యంలో పరీక్షా కేంద్రంలో ఒక ఏఎన్ఎంతోపాటు అవసరమైన ప్రథమచికిత్స మందులను ఏర్పాటు చేసినట్టు కిషన్ చెప్పారు.

రాష్ట్ర వ్యాప్తంగా 26 పరీక్షా కేంద్రాలు సమస్యాత్మకమైనవిగా గుర్తించామని, వాటిలో ప్రత్యేకంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి పరీక్షలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఏప్రిల్ 2 నుంచి మూల్యాంకనాన్ని ప్రారంభిస్తామని స్పష్టం చేశారు.

పరీక్షలకు హాజరు కానున్న విద్యార్థులు మీడియం వారీగా....

తెలుగు మీడియం	1.78 లక్షలు
ఇంగ్లీష్ మీడియం	3.12 లక్షలు
ఉర్దూ మీడియం	11 వేలు
హిందీ మీడియం	370
మరాఠీ మీడియం	189
తమిళ మీడియం	07



టీఆర్‌టీ పరీక్షల ప్రాథమిక కీ విడుదల

హైదరాబాద్,ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల భర్తీ కోసం నిర్వహించిన ఉపాధ్యాయ నియామక పరీక్షలకు సంబంధించిన ప్రాథమిక కీని నేడు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ తన వెబ్‌సైట్‌లో పొందు పర్చనుంది. ప్రాథమిక కీపై అభ్యర్థులకు ఉన్న అభ్యంతరాలను 21 నుంచి 31 వరకు స్వీకరిస్తారని కమిషన్ కార్యదర్శి ఏ వాణిప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో అభ్యంతరాలను కేవలం ఇంగ్లీష్‌లోనే స్వీకరిస్తారు. వాటికి సంబంధించిన సపోర్టింగ్ డాక్యుమెంట్స్‌ను పిడిఎఫ్‌లో అటాచ్ ఫైల్‌గా చేయాల్సి ఉంటుంది. అభ్యంతరంలో హాల్‌టికెట్ నంబర్, పేపర్ కోడ్, సీరిస్, ప్రశ్న నంబర్, ప్రశ్న ఐడీని పిడిఎఫ్ ఫైల్‌లో తప్పకుండా చేర్చాల్సి ఉంటుందని ప్రకటనలో తెలిపారు.

‘అండర్ టేకింగ్‌పై రగడ’

• ఇన్విజిలేటర్ల నుంచి తీసుకొన్న అండర్ టేకింగ్‌పై వ్యతిరేకత • ఉపసంహరించుకోవాలంటున్న ఉపాధ్యాయ సంఘాలు



హైదరాబాద్,ఆంధ్రప్రభ: ఎస్ఎస్‌సి పరీక్షల నేపథ్యంలో ఇన్విజిలేటర్ల నుంచి తీసుకోనున్న అండర్ టేకింగ్‌పై ఉపాధ్యాయ సంఘాల నుంచి తీవ్ర నిరసన వ్యక్తం అవుతోంది. పరీక్షా హాల్‌లో కాపీ జరిగితే తనదే బాధ్యత, తనపై చర్యలు తీసుకోవచ్చని పేర్కొంటూ హాల్‌లో ఇన్విజిలేటింగ్ బాధ్యతలు నిర్వర్తించే ఇన్విజిలేటర్ రాతపూర్వకంగా అండర్ టేకింగ్ ఇవ్వాలని ప్రభుత్వ పరీక్షల సంచాలకులు జారీ చేసిన ఉత్తర్వులపై రాష్ట్రంలోని అన్ని ఉపాధ్యాయ సంఘాలు అభ్యంతరాన్ని వ్యక్తం చేస్తున్నాయి. వెంటనే ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు. ఎవరైనా ఉద్దేశపూర్వకంగా అక్రమాలకు పాల్పడితే అటువంటి వారిని కఠినంగా శిక్షించడానికి యాక్ట్ 25/1997 ప్రకారం ప్రభుత్వానికి అధికారం ఉంది. సదరు యాక్ట్‌లో ఎక్కడా ఇన్విజిలేటర్ల నుంచి అండర్ టేకింగ్ తీసుకోవాలని పేర్కొనలేదు. రేపటి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఎస్ఎస్‌సి పరీక్షలు ప్రారంభం అవుతున్న సంగతి తెలిసిందే. పరీక్షలు ఏప్రిల్ 2 వరకు కొనసాగనున్నాయి.

ఎక్కడో ఒక దగ్గర పరీక్ష హాల్‌లో అక్రమాలు చోటు చేసుకున్నాయనే కారణంతో ఇన్విజిలేటర్లందరినీ అండర్ టేకింగ్ ఇవ్వాలనటం ఉపాధ్యాయులను అవమానించడమేనని. వారిని భయాందోళనకు గురిచేయడానికే ఉత్తర్వులు జారీ చేశారని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(టిఎస్‌యుటిఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ రాములు, ప్రధాన కార్యదర్శి చావ రవి విమర్శించారు. ఈ ఉత్తర్వులు పరీక్షలు ప్రశాంతంగా జరగడానికి ఏమాత్రం ఉపయోగపడవని వారు తెలిపారు. ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించుకోవాలని వారు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పరీక్ష హాల్‌లో మాస్ కాపీయింగ్ జరిగితే తానే బాధ్యున్ని అంటూ అక్కడ ఇన్విజిలేటింగ్ బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయుడితో హామిపత్రం తీసుకోవడం అర్థరహితం అని తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ ప్రాధానోపాధ్యాయుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు సింగిడి లక్ష్మారెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజబాను చంద్రప్రకాశ్ అన్నారు. వెంటనే ఉత్తర్వులను ఉపసంహారించుకోవాలని వారు డిమాండ్ చేశారు. అక్రమాలు జరిగితే యాక్ట్ 25 ప్రకారం చర్యలు తీసుకొనే అధికారం ప్రభుత్వానికి ఉందని వారు గుర్తు చేశారు. ఇప్పుడు కొత్తగా ఉత్తర్వులు ఇవ్వాల్సిన అవసరమే లేదన్నారు.

యాక్ట్ 25 ప్రకారం పరీక్షా హాల్‌లో అక్రమాలు జరిగితే అక్కడ విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులపై చర్యలు తీసుకుంటే తామేమి అభ్యంతరం చెప్పలేదని, కానీ ఇప్పుడు కొత్తగా హామి పత్రం తీసుకోవడం ఏంటని పిఆర్‌టియు టిఎస్ రాష్ట్ర అధ్యక్షులు పి సరోత్తంరెడ్డి, ప్రధాన కార్యదర్శి జి చెన్నకేశవరెడ్డి ప్రశ్నించారు. పరీక్షల నిర్వహణలో సీసీ కెమెరాలను ఉపయోగిస్తున్నారని తద్వారా అక్రమాలు బయటపడే అవకాశం ఉంటుందని, అయినా ఇటువంటి హామి పత్రం తీసుకోవడం ఉపాధ్యాయులను అవమానించడమేనని వారు విమర్శించారు. వెంటనే ఉత్తర్వులను ఉపసంహారించుకోకపోతే ఎస్ఎస్‌సి పరీక్షల విధులను బహిష్కరిస్తామని వారు స్పష్టం చేశారు.

పరీక్ష హాల్‌లో మాస్ కాపీయింగ్ జరిగితే తానే బాధ్యున్ని అంటూ అక్కడ ఇన్విజిలేటింగ్ బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయుడితో హామిపత్రం రాయించుకోవడం సరికాదని తెలంగాణ టీచర్స్ ఫెడరేషన్(టిటిఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈ రఘునందన్ అన్నారు. పరీక్ష హాల్‌లో కాపీయింగ్ జరిగితే అందుకు ఒక్క ఇన్విజిలేటరే ఎందుకు బాధ్యుడు, పర్యవేక్షణ కోసం నియమించిన ఫ్లయింగ్ స్క్వాడ్స్, సిట్టింగ్ స్క్వాడ్స్, పరీక్షలు నిర్వహిస్తున్న చీఫ్ సూపరింటెండెంట్‌ను కూడా బాధ్యులను చేయాల్సి ఉంటుంది. వారిని కాదని కేవలం ఇన్విజిలేటర్‌ను మాత్రమే బాధ్యున్ని చేయడం అంటే ఉపాధ్యాయులను భయభ్రాంతులకు గురి చేయడమేనని వెంటనే ఉత్తర్వులను ఉపసంహారించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. హామిపత్రం ఉత్తర్వులను వెంటనే ఉపసంహారించుకోవాలని తెలంగాణ టీచర్స్ యూనియన్(టిటియు) రాష్ట్ర అధ్యక్షులు వేణుగోపాలస్వామి, ప్రధాన కార్యదర్శి రాధకృష్ణడిమాండ్ చేశారు.

పరీక్షహాల్‌లో అక్రమాలు జరిగితే తానే బాధ్యున్ని అంటూ ఇన్విజిలేటర్ హామి పత్రం ఇవ్వాలంటూ ప్రభుత్వ పరీక్షల సంచాలకులు ఇచ్చిన ఉత్తర్వులను వెంటనే ఉపసంహారించుకోవాలని స్కూల్ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్(ఎస్‌టియుటిఎస్) రాష్ట్ర అధ్యక్షులు బి భుజంగరావు, ప్రధాన కార్యదర్శి జి సదానంద్‌గౌడ్ డిమాండ్ చేశారు. మాల్‌ప్రాక్టీస్‌కు ఇన్విజిలేటింగ్ చేస్తున్న ఇన్విజిలేటర్ నుంచి హామి పత్రం తీసుకోవడం అంటే అతన్ని భయభ్రాంతులకు గురిచేయడమేనని వెంటనే ఈ ఉత్తర్వులను ఉపసంహారించుకోవాలని పిఆర్‌టియు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మారెడ్డి అంజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం చెన్నయ్య డిమాండ్ చేశారు. పరీక్షహాల్‌లో అక్రమాలు జరిగితే తమపై చర్యలు తీసుకోవాలని ఇన్విజిలేటర్ నుంచి తీసుకోనున్న హామిపత్రం ఉత్తర్వులను వెంటనే ఉపసంహారించుకోవాలని తెలంగాణ ప్రోగ్రోసీవ్ టీచర్స్ ఫెడరేషన్(టిపిటిఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు బి కొండల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మైన శ్రీనివాస్ డిమాండ్ చేశారు.

భయంలేదు...లాలూచీ పడను

ఎన్ని కష్టాలైనా పడతా..చంద్రబాబు భావోద్వేగం, కంటతడి

● రాజీపడను..వెనుకడుగు వేయను..● ఎన్టీఆర్ ఆత్మగౌరవం ఇస్తే..నేను ఆత్మ విశ్వాసం కల్పించా..

● రాజధానికి సహకరించాల్సిన బాధ్యత కేంద్రానికి లేదా ● మోడీపై వైకాపాకు విశ్వాసం ఉంటే అవిశ్వాసం ఎందుకు?




అమరావతి, ఆంధ్రప్రభ: నవ్యాంధ్ర అభివృద్ధికి నిరంతరం కష్టపడుతున్నామని, చేయూతనిచ్చి ఆదుకుంటుందనే బీజేపీతో పొత్తుపెట్టుకున్నామని, కాని, కేంద్రం హామీలను నెరవేర్చడం లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. శాసనసభలో మంగళవారం ఆయన ప్రసంగిస్తూ, తీవ్ర భావోద్వేగానికి గురై ఒక సమయంలో కంటతడి కూడా పెట్టుకున్నారు. రాజధానిని డ్రీమ్ సిటీ అని కొందరు హేళన చేస్తున్నారని, నిర్మాణం పూర్తయితే జాతికి అది ఎంతో గౌరవాన్ని తెచ్చిపెడుతుందని చంద్రబాబు అన్నారు. రాష్ట్ర అభివృద్ధి విషయంలో తాను ఎట్టి పరిస్థితిలోనూ రాజీపడే ప్రశ్నే లేదన్నారు. విభజనతో అష్టకష్టాలు పడుతున్న రాష్ట్రా నికి సహకరించాల్సిన బాధ్యత లేదా అని ఆయన ప్రశ్నించారు. నాకు ఎవరన్నా భయం లేదు... లాలూచీ పడను... ఆ అవసరం కూడా లేదు... రాజీపడను... ఎన్నికష్టాలైనా పడతానని ఆయన ఉద్వేగంగా అన్నారు. నాడు ఎన్టీఆర్ తెలుగువారికి ఆత్మగౌరవాన్ని ఇస్తే నేడు రాష్ట్ర ప్రజలకు తాను ఆత్మవిశ్వాసం కల్పించానని చంద్రబాబు అన్నారు. మనం సమాఖ్య వ్యవస్థలో ఉన్నామని, రాష్ట్రా నికి రావాల్సినవన్నీ సక్రమంగా ఇవ్వాల్సిందేనని అంటూ, రాష్ట్ర రెవిన్యూ లోటుపై కేంద్రం ఏకపక్ష గణాంకాలు చెబుతోందన్నారు. విపక్ష నేత జగన్ మోహన్‌రెడ్డి ద్వంద్వ రీతితో వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ప్రధాని మోడీపై విశ్వాసం ఉందని ఒకపక్క ప్రకటిస్తున్నారని, మరోపక్క అవిశ్వాసానికి తమతో కలిసిరమ్మంటున్నారని, అంత విశ్వాసం వారికి ఉన్నప్పుడు మరి అవిశ్వాసం ఎందుకని చంద్రబాబు ప్రశ్నించారు. రాష్ట్రా నికి పోలవరం జీవనాడి వంటిదని, దానికి కూడా గండికొట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. పోలవరంపై వేలకోట్ల అవినీతి జరిగిందని విపక్షం ఆరోపిస్తుంటే, ప్రతిపనికీ కేంద్రం కొర్రీలు పెడుతోందన్నారు. పోలవరానికి రాష్ట్రం ఖర్చుచేసిన నిధుల్లో ఇంకా రెండు వేల 500 కోట్లను కేంద్రం ఇవ్వాల్సి ఉందన్నారు. డీపీఆర్‌లను త్వరగా ఆమోదించి సకాలంలో నిధులను విడుదల చేస్తేనే పోలవరం 2019 నాటికి పూర్తవుతుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కేంద్రం సహకరించడం వల్లే రాష్ట్రంలో రెండంకెల వృద్ధి సాధ్యమవుతోందని రాష్ట్ర బీజేపీ నేతలు అంటున్నారని, అటువంటప్పుడు ఆ పార్టీ పాలిత రాష్ట్రా ల్లో రెండంకెల అభివృద్ధి ఎందుకు జరగడం లేదని చంద్రబాబు సూటిగా ప్రశ్నించారు. తాము నిరంతరం కష్టపడుతున్నందువల్లే రెండంకెల వృద్ధి సాధ్యమవుతోందని, ఇందుకు అధికార యంత్రాంగం తోడ్పాటు కూడా ఎంతో ఉందన్నారు. రాష్ట్ర ప్రజల మనోభావాలను కేంద్రం గౌరవించాలని, ప్రజలు ఎప్పుడూ మోసపోరని, వైకాపాతో సహా అందరికీ తగిన సమయంలో శాశ్వతంగా శిక్షిస్తారన్నారు. ఏ1, ఏ2 నిందితులు నేరుగా ప్రధానమంత్రి మోడీని కలుసుకుంటున్నారని, ఈ విషయాన్ని రాష్ట్ర ప్రజలు గమనిస్తూనే ఉన్నారన్నారు. వాళ్లు దోచుకున్నదంతా రాష్ట్ర ప్రజల సొమ్మేనన్నారు. నేను చెప్పేది సామాన్యుడికి కూడా స్పష్టంగా అర్ధమవుతుంటే రాష్ట్ర బీజేపీ నేతలకు అర్థం కాకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. నిధులు ఇవ్వని కేంద్రాన్ని వదిలి వైకాపా నన్ను విమర్శిస్తోందని, దీన్నిబట్టే దాని ద్వంద్వనీతిని అర్థం చేసుకోవచ్చున్నారు. రైల్వే జోన్‌ను బీజేపీ నేతలు సాధిస్తారని ఆశిస్తున్నానని చంద్రబాబు అన్నారు. అమరావతి శంకుస్థాపన సందర్భంగా విభజన హామీలన్నీ నెరవేరుస్తానని ప్రధాని మోడీ చెప్పారని, ఇప్పుడు వాటిని నెరవేర్చమనే తాము కోరుకుంటున్నామని చెప్పారు. రాయలసీమలో కరవును పారదోలామని, రైతాంగాన్ని అన్నివిధాలా ఆదుకున్నామని చెప్పారు. అమరావతికి కేంద్రం ఇచ్చింది కేవలం రెండు వేల 500 కోట్లేనన్నారు. రైతులు 40 వేల కోట్ల విలువైన 33 వేల ఎకరాలు అందిస్తే కేంద్రం ఇవ్వాల్సింది ఇంతేనా అని ఆయన ప్రశ్నించారు. దేశ చరిత్రలో రైతులు 33 వేల ఎకరాలను ఇవ్వడం ఎప్పుడైనా జరిగిందా అని ఆయన అన్నారు. రాజధాని నిర్మితమైతే కేంద్రానికి కూడా ఆదాయం వస్తుందన్న విషయాన్ని మరువరాదన్నారు. అసెంబ్లీ సీట్ల పెంపుపై తాను ఎప్పుడూ చర్చించలేదని, కేవలం విభజన అంశాలపైనే ప్రధానితో మాట్లాడానని చెప్పారు. కేంద్రం ఇప్పటివరకూ ఇచ్చింది కేవలం 12 వేల 900 కోట్లేనని ఆయన చెప్పారు. రైల్వేజోన్‌ను తక్షణం ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం విభజన హామీల అమలులో కేంద్ర నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించింది.

పేదరిక నిర్మూలనలో ఏపీ టాప్

● ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు

అమరావతి, ఆంధ్రప్రభ: పేదరికనిర్మూలన సూచికలో గతసంవత్సరానికి సంబంధించి ఆంధ్రప్రదేశ్ మెరుగైన సామర్థ్యాన్ని ప్రదర్శించిందని ముఖ్య మంత్రి నారా చంద్ర బాబునాయుడు అన్నారు. మల్టీ డైమెన్షనల్ పావర్టీ ఇండెక్స్ 2017కు సంబంధించిన నివే దికను ఆయన మంగళవారం అసెం బ్లీలోని తన ఛాంబర్‌లో ఆర్థిక శాఖ మంత్రి యనమల రామకృష్ణుడుతో కలిసి విడుదల చేశారు. రాష్ట్ర ప్లానింగ్ శాఖ, బ్రిటన్‌లోని ఆక్స్‌ఫర్డ్ యూనివర్శిటీల సంయుక్త ఆధ్వర్యంలో తయారైన నివేదిక విడుదల సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌కు అంతర్జాతీయ స్థాయిలో 51వ ర్యాంకు రావడం విశేషమని, ఫలితంగా 0.0825 పాయింట్లు రావడం శుభసూచకమని అన్నారు. అదే విధంగా దేశంలో 0.1911 ఇండెక్స్ విలువతో 66వ స్థానాన్ని దక్కించుకోవడం కూడా మరో విశేషమన్నారు. రాష్ట్ర స్థాయిలో 0.00468 ఎంపీఐ విలువతో తూర్పుగోదావరి జిల్లా మంచి సామర్థ్యాన్ని ప్రదర్శించిందని, అదే విధంగా 0.1271 ఎంపీఐ విలువతో విజయనగరం జిల్లా తక్కువ ర్యాంకును సాధించినట్లు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం క్రమం తప్పకుండా జాతీయ, అంతర్జాతీయ సూచికలను ప్రదర్శించడంలో మంచి కృషి జరుపుతోందని అన్నారు. రాష్ట్ర ప్రణాళిక శాఖ గతంలో సంతోష సూచిక మరియు అంతర్జాతీయ పోటీతత్వ సూచిక నివేదికను కూడా సిద్ధం చేయడం జరిగిందని అన్నారు. కాగా విద్య, ఆరోగ్యం, జీవన ప్రమాణాలకు సంబంధించి పేదరికం సూచికలను తయారు చేయడం జరిగింది. 2013లో ప్లానింగ్ కమిషన్ నిర్దేశించిన ప్రమాణాల మేరకు ఎంపీఐ మేథాడాలజీని వృద్ధి చేయడం జరిగింది. ఈ నేపథ్యంలో ఆక్స్‌ఫర్డ్ పావర్టీ, హ్యూమన్ డెవలప్‌మెంట్ ఇనిషియేటివ్, యూనివర్సిటీ ఆఫ్ ఆక్స్‌ఫర్డ్‌లు చేసిన కృషిని ముఖ్యమంత్రి అభినందించారు. ఈ నివేదిక విడుదల కార్యక్రమంలో ఎంపీఐ ఎస్టిమేషన్ ప్రాజెక్టుకు చెందిన అలెన్‌జాన్, భాస్కర్ సోమయాజి, సౌమ్య గుహతో పాటు ప్రతిమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేదాల పరిరక్షణ అందరి బాధ్యత



విశాఖపట్నం, ప్రభ న్యూస్ : భగవంతుని ఉచ్వాశ, నిచ్వాశాలే వేదాలని, వాటిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మన అందరిపైనా వుందని విశాఖ శ్రీ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతీ మహాస్వామి అన్నారు. పీఠంలో వేద పాఠశాలను స్థాపించి 15 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ శారదా పీఠం వేద పరిరక్షణకు ఎంతో కృషి చేస్తోందన్నారు. ఎంతో మంది వేద, స్మార్త విద్యార్థులను తీర్చిదిద్దడం జరిగిందని, వారంతా యావత్ భారతదేశంలో ఉన్నత స్థానాల్లో వున్నారన్నారు. దక్షిణాది రాష్ట్రాల్లో ఎక్కడైనా ఏ ప్రాంతంలోనైనా పోషించడానికి గానీ, ఆర్థిక భారంతో వున్న వేద పాఠశాలల్లో గల గురువులను, విద్యార్థులను విశాఖ శ్రీ శారదా పీఠం దత్తత తీసుకోవాలని నిర్ణయించామని తెలిపారు. వారిని శారదా పీఠానికి తరలించి, వసతి సమకూర్చి వేద విద్యతోపాటు అనేక అంశాల్లో బోధన చేయాలని భావిస్తున్నామని పేర్కొన్నారు. ఉత్తీర్ణత పొందిన వారికి జగద్గురు శంకరాచార్య వేద పాఠశాల తరపున ఉత్తీర్ణతా పత్రం, లక్ష రూపాయలు బహూకరిస్తామని వివరించారు. ఆసక్తి గల వారు పీఠాన్ని సంప్రదించాలని కోరారు.

విస్తృత భద్రత కల్పించండి!

● నాకు ఏదైనా జరిగితే పోలీసు శాఖదే బాధ్యత

అమరావతి, ఆంధ్రప్రభ: నేడు జరగనున్న జనసేన పార్టీ ఆవిర్భావ సభ ప్రశాంతంగా, విజయవంతంగా జరిగేందుకు విస్తృతమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ రాష్ట్ర డీజీపీ డాక్టర్ ఎం.మాలకొండయ్యకు మంగళవారం లేఖ రాశారు. అదే విధంగా తనకు వ్యక్తిగత భద్రతను కూడా మరింతగా పెంచాలని కోరారు. సభకు రాష్ట్రం నలుమూలల నుంచి 2 లక్షల మందికి పైగా భారీ ఎత్తున కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చే అవకాశం ఉన్నందున శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆయన డీజీపీని కోరారు.14న సభ అనంతరం, తనకు వ్యక్తిగత రక్షణ చర్యలు కూడా తీసుకోవాలని లేఖలో కోరారు.14 తేదీ తర్వాత కూడా తనకందిస్తున్న వ్యక్తిగత భద్రతను కొనసాగించాలని కోరారు. తాను భద్రత కోరుతున్నది ప్రదర్శనా కుతుహలంతో మాత్రమే కాదని, ప్రస్తుతం సమాజంలో ఉన్న కుల ఉద్యమాలు, వర్గ పోరాటాలు, రాజకీయ అణచి వేతల నడుమ సున్నితమైన సామాజిక రాజకీయ సమస్యలతో భద్రత ముడిపడి ఉందన్నారు. తన మీద ఏదైనా దాడి జరిగితే ప్రజాజీవితంపై అది తీవ్ర ప్రభావం చూపించే అవకాశం ఉన్నందున ముందస్తు చర్యలు అనివార్యమన్నారు. గతంలో భీమవరం పట్టణంలో తన ఫ్లెక్సీ చింపి వేసినందుకే దాదాపు రెండు వేల మంది అభిమానులు ధర్నా చేయడం వల్ల శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందనే ఉద్దేశంతో పోలీస్ వారు కొంతమందిని అదుపులోకి తీసుకోవడం మీ దృష్టికి వచ్చే ఉంటుందన్నారు. అదే విధంగా కాకినాడలో కూడా సభా ప్రాంగణంలో జరిగిన తొక్కిసలాట, విజయవాడలో ఉద్దానం బాధితుల విషయమై ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును కలవడానికి వచ్చినప్పుడు దాదాపు రెండు గంటల పాటు ట్రాఫిక్ స్తంభించి, ప్రజలు ఇబ్బందిపడ్డారని లేఖలో డీజీపీకి గుర్తు చేశారు. అలాగే ఇటీవల అనంతపురం ప్రాంతంలో పర్యటిస్తున్నప్పుడు జరిగిన తొక్కిసలాటతో పాటు పలు సంఘటనను దృష్టిలో ఉంచుకుని తానీ ఈ భద్రతను కోరుతున్నట్లు పేర్కొన్నారు.

జనసేన దిశానిర్దేశం నేడే

● నేడే భవిష్యత్ కార్యచరణ ప్రకటన



అమరావతి, ఆంధ్రప్రభ: జనసేన పార్టీ అధర్వంలో జరిగే బహిరంగసభకు సర్వం సిద్ధమైంది. గుంటూరు జిల్లా ఆచార్య నాగార్జున యూనివర్శిటీ ఎదురుగా ఉన్న మైదానంలో పార్టీ సభా ఏర్పాట్లను చేసింది. పార్టీ ఏర్పాటైన తర్వాత మొదటిసారిగా నిర్వహిస్తున్న బహిరంగ సభ కావడంతో పాటు పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ ఈ సభా వేదిక నుంచే కార్యకర్తలకు దిశా నిర్దేశం చేస్తుండడంతో ఎంతో ప్రాతిష్టాత్మకంగా తీసుకుని, సభను నిర్వహించేందుకు పార్టీ నాయకత్వం అన్ని ఏర్పాట్లను పూర్తిచేసింది. లక్ష మందికి పైగా కూర్చునే విధంగా బహిరంగ సభా వేదిక వద్ద పార్టీ నాయకులు ఏర్పాట్లు చేశారు. ప్రజలు ఎటు వంటి ఇబ్బందిపడకుండా అన్ని సౌకర్యాలు కల్పించారు. పెద్ద ఎత్తున బారికేడ్లు ఏర్పాటు చేయడంతో పాటు ప్రముఖులు కూర్చునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయడం గమనార్హం.సినిమా సెట్టింగ్‌ను తలతన్నే రీతిలో సభా వేదికను ఘనంగా తీర్చిదిద్దారు.పవన్ కల్యాణ్ సినీనటుడు కావడంతో జనం భారీ ఎత్తున సభకు తరలివచ్చే అవకాశం ఉండడంతో అందుకు తగిన రీతిలో ఏర్పాట్లు చేశారు.అంతేకాకుండా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఉండేందుకు ముందస్తు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసేందుకు పవన్‌కల్యాణ్ స్వయంగా రాష్ట్ర డీజీపీ మాలకొండయ్యకు ప్రత్యేకించి, లేఖ కూడా రాశారు. దీంతో డీజీపీ ఆదేశాల మేరకు సభావేదిక వద్ద పెద్ద ఎత్తున పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.అంతేకాకుండా ఎవరి పడితే వారు వేదిక వద్దకు తోచుకురాకుండా ఉండేందుకు మీడియాకు ప్రత్యేకించి,పాసులు జారీ చేశారు.వేదిక వద్ద ముందు వరుసలో ఆహ్వానం ఉన్న ప్రముఖులు, వివిధపార్టీల నాయకులు కూర్చునే విధంగా చర్యలు తీసుకున్నారు.ఆ తర్వాత పక్కనే మీడియాకు అవకాశం కల్పించారు. ఎలక్ట్రానిక్ మీడియా వారికి క ూడా ప్రత్యేకించి,ఏర్పాట్లు చేశారు.అయితే మీడియాకు కూడా పరిమిత సంఖ్యలోనే పాసులు అందజేశారు. మహిళలకు కూడా ప్రత్యేకించి, కుర్చునేందుకు చర్యలు తీసుకున్నారు.వేదిక వద్దకు ప్రజలు దూసుకురాకుండా ఉండేందుకు కార్యకర్తలకు కూడా ముందుగానే ప్రత్యేకించి, శిక్షణ ఇచ్చారు. ఇటు పోలీసులు,అటు పార్టీ కార్యకర్తలు జనాన్ని కంట్రోల్ చేసే విధంగా చ ర్యలు తీసుకున్నారు.వందలాది మంది స్వచ్ఛంద సేవా కార్యకర్తలను నియమించారు.సభావేదిక వద్దకు పోవాలంటే ప్రధాన రహదారి నుంచి సుమారు కిలో మీటరు దూరం నడిచి వెళ్లాల్సి ఉంటుంది.ఈ సందర్భంగా ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నంకాకుండా ఉండేందుకు పోలీస్ శాఖ గట్టి చర్యలు తీసుకుంటున్నది.ఇప్పటికే డీజీపీ ఆదేశాలతో పోలీస్ యంత్రాంగం ఆ దిశగా చర్యలకు ఉపక్రమించింది. సభకు వచ్చేవారి వాహనాల విషయంలో కూడా ప్రత్యేకించి ఎక్కడ నిలిపేయాలో పోలీసులు అన్ని చర్యలు తీసుకున్నారు.

శ్రీవారి సేవలో రాజస్థాన్ సీఎం



తిరుమల, ప్రభ న్యూస్: తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి వారిని రాజస్థాన్ సీఎం వసుంధర రాజే కుటుంబ సభ్యులతో కలసి మంగళవారం వేకువజామున శ్రీవారికి నిర్వహించే అర్చన సేవలో పాల్గొని శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయంలో రాజస్థాన్ సీఎంకు టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ దగ్గరుండి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు ఆశీర్వచనం పలుకగా అధికారులు తీర్థ ప్రసాదాలు అందచేశారు.

ఘనంగా కోయల్ ఆళ్వార్ తిరుమంజనం

● ఆలయాన్ని శుద్ధి చేసిన టీటీడీ



తిరుమల, ప్రభ న్యూస్: తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో 18న విళంబినామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం నాడు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనాన్ని టీటీడీ అత్యంత ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ మాట్లాడుతూ సంవత్సరంలో నాలుగు సార్లు ఈ కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం ఆనవాయితీగా వస్తుందని తెలిపారు. ఉగాది, ఆణివారి ఆస్థానం, వైకుంఠ ఏకాదశి, బ్రహ్మోత్సవం పర్వదినాలకు ముందుగా వచ్చే మంగళవారం నాడు ఈ కార్యక్రమాన్ని నిర్వ హిస్తారని తెలియజేశారు. ఇందులో భాగంగా తిరుమల శ్రీవారి ఆలయంలో మంగళవారం ఉదయం 6 గంటల నుంచి 11 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని అర్చకులు ఆగమోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకుని అర్జిత సేవలైన అష్టదళపాదపద్మారాధన సేవను టీటీడీ రద్దు చేసింది. ఇతర అర్జిత సేవలను యధాతథంగా నిర్వహించారు. ఆలయంలో ఆనందనిలయం మొదలుకొని బంగారు వాకిలి వరకు, ఆలయ ప్రాంగణం, గోడలు, పై కప్పు, పూజా సామాగ్రి తదితర అన్ని వస్తువులను నీటితో శుభ్రంగా కడిగారు. ఈ సమయంలో స్వామివారి మూల విరాట్టును శ్వేతవస్త్రంతో పూర్తిగా కప్పివేశారు. శుద్ధి పూర్తి అయిన తర్వాత నామకోపు, శ్రీ చూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలిగడ్డ తదితర పరిమళ భరిత సుగంధ ద్రవ్యాలతో తయారు చేసిన లేపనంతో ఆలయ గోడలకు పూశారు. ఆనంద నిలయం మొదలుకొని బంగారు వాకిలి వరకు అత్యంత పవిత్రంగా ఒక మహాయజ్ఞంలా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం స్వామివారి మూలవిరాట్టుకు ఆలయ అర్చకులు ఆగమోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించి మధ్యాహ్నం 12 గంటల నుంచి భక్తులను స్వామివారి దర్శనానికి అనుమతించారు. ఈ కార్యక్రమంలో తిరుమల జేఈవో శ్రీనివాసరాజు, సీవీఎస్ఓ రవికృష్ణ, ఆలయ డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్, ఇతర అధికారులు పల్గొన్నారు.

విశాఖలో రైల్వేజోన్ భగభగలు

● జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద వామపక్షాల ధర్నా



విశాఖపట్నం, ప్రభ న్యూస్ బ్యూరో: విశాఖ కేంద్రంగా తక్షణమే రైల్వేజోన్ ప్రకటించాలని మంగళవారం పలు రాజకీయ పార్టీలు వేర్వేరుగా నిరసన ప్రదర్శనలు నిర్వహించాయి. ఉత్తరాంధ్ర ప్రజల మనోభావాలు దెబ్బతీసే విధంగా భారతీయ జనతాపార్టీ వ్యవహరిస్తుందని ఈ ప్రాంత ప్రజల చిరకాల వాంచగా మారిన రైల్వేజోన్ ఏర్పాటుకు తక్షణమే చర్యలు ప్రారంభించాలని ఆయా పార్టీల నేతలు డిమాండ్ చేశారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సీపీఎం, సీపీఐ పార్టీలు ధర్నా కార్యక్రమం నిర్వహించాయి.

ఈ సందర్భంగా ఆయా పార్టీల నేతలు ఎం.పైడిరాజు, బి.గంగారావులు, మాట్లాడుతూ 2014 ఎన్నికల్లో ఇచ్చిన వాగ్ధానాలను అమలు చేయాలని, ఎన్నికల్లో ఓట్లు దండుకొని ఇప్పుడు జోన్ ఏర్పాటుకు అవకాశం లేదని ప్రకటించడం బీజేపీకి తగదు న్నారు. బీజేపీ డౌన్‌డౌన్, టీడీపీ డౌన్‌డౌన్ అంటూ వామపక్షాల కార్యకర్తలు నినాదా లు చేశారు. మరో పక్క విశాఖ రైల్వేస్టేషన్ వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అక్కడ టీడీపీ పార్టీ శ్రేణులు భారీ ఎత్తున ఆందోళన నిర్వహిస్తారని సమాచారం అందుకున్న పోలీ సులు భారీగా మోహ రించారు. అయినప్పటికి కొంత మంది ఆందోళనకారులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. కొంత సేపటి తరువాత అక్కడ నుంచి పార్టీ శ్రేణులు వెళ్లిపోయినప్పటికి మరోసారి వచ్చే అవకాశం ఉందని పోలీసులు భారీగా పహారా కాశారు. ఇదిలా ఉండగా రైల్వేజోన్ ఏర్పాటుకు అవకాశం లేదని బోర్డు ప్రకటించడంతో ఇప్పుడు ఉత్తరాంధ్రలో నిరసన ధ్వనులు మిన్నంటాయి. ఇప్పటి వరకు విశాఖకు రైల్వేజోన్ ఖాయమంటూ భాజాపా, టీడీపీ శ్రేణులు ప్రకటిస్తూ వచ్చాయి. తీరా ఎన్నికలకు ముందు జోన్ ఏర్పాటుకు అవకాశం లేదని స్పష్టం చేస్తుండడంతో ఈ ప్రాంత ప్రజలు తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

హస్తిన తీరు ఆక్షేపణీయం

● విభజన హామీలు అమలు చేయాల్సిందే ● అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానం

అమరావతి ఆంధ్రప్రభ: ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం 2014లోని అంశాలు, ఆనాటి ప్రధాని ఇచ్చిన హామీల అమలులో జరుగుతున్న జాప్యం, వీటి విషయంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిపట్ల రాష్ట్ర శాసనసభ తీవ్ర అభ్యంతరాన్ని, నిరసనను వ్యక్తం చేసింది. విభజన హామీలు, ప్రత్యేకహోదా అంశాలపై శాసనసభలో మంగళవారం చర్చ జరిగింది. చర్చ అనంతరం పలు తీర్మానాలను సభ ఆమోదించింది. అనంతరం రాష్ట్ర డిమాండ్లను తక్షణమే అమలు చేయాలని కేంద్రాన్ని కోరుతూ ఏపీ అసెంబ్లీ ఏకగ్రీవంగా తీర్మానించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన అశాస్త్రీయంగా జరిగిందని, ఏపి అభివృద్ధికి కేంద్రం మోకాలడ్డుతోందని, విభజన హామీలను అమలు చేయాల్సిందేనని సభ పేర్కొంది. నూతనంగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిందని, ఆస్తుల అప్పుల విభజనలో, విద్యుత్ పంపిణీలో, పన్నుల వసూళ్ళు, తిరిగి చెల్లింపుల్లో రాష్ట్రానికి మిక్కిలి నష్టం జరిగిందని, విభజన చట్టం ప్రకారం రాజధాని అమరావతి నిర్మాణానికి కేంద్రం ఆర్థిక సాయం చేయాలని తీర్మానించారు. రాష్ట్రానికి రైల్వే జోన్ కావాలని, ఉక్కు కర్మాగారం స్థాపించాలని . ఓడ రేవు కావాలని, పెట్రో కెమికల్ పరిశ్రమ ఏర్పాటుకావాలని తీర్మానంలో కోరారు. నియోజకవర్గాల సంఖ్య పెరగాలని, అనేక విద్యా, పరిశోధన సంస్థలు ప్రారంభించాలని, ఉమ్మడి రాష్ట్రంలోని సంస్థల విభజన పూర్తికావాలని, విభజన బిల్లు రాజ్యసభలో ఆమోదింప చేయడానికి ఆనాటి ప్రధానమంత్రి ఆరు హామీలతో కూడిన ప్రకటన చేసారని తీర్మానంలో తెలిపారు. అయులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వడం, ఆదాయం కోల్పోతున్న రాష్ట్రానికి రెవెన్యూలోటును భర్తీ చేయడం, బుందేల్‌ఖండ్, కోరాపుట్-బోలాంగిర్-కలహండి తరహాలో వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక సాయాన్ని అందించడం రైల్వేజోన్ ఇవ్వడం పేర్కొన్నారు. విద్యా సంస్థల పురోగతి మందంగా ఉందని, ఇప్పుడు ఇస్తున్న కేటాయింపులను చూస్తే ఇవి వచ్చే ఇరువై యేళ్ళకైనా పూర్తవుతాయా అని సందేహాన్ని సభ వ్యక్తం చేసింది. ఉమ్మడి రాష్ట్రంలోని సంస్థల విభజన నత్తనడక నడుస్తోందని, నియోజకవర్గాల పునర్విభజన ఊసేలేదని విజయవాడ, గుంటూరు పట్టణాలకు డ్రైనేజీ కోసం ఇచ్చిన డబ్బు కూడా రాజధాని అమరావతికి ఇచ్చినట్లు చూపిస్తున్నారని సభ అభిప్రాయపడింది. యుటిలైజేషన్ సర్టిఫికేట్లు ఇచ్చినా ఇవ్వలేదన్నట్లు ప్రకటనలు ఇచ్చి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని, వెనుకబబడిన జిల్లాల అభివృద్ధికి ఇస్తున్న సాయం నామమాత్రంగా ఉందని, రాష్ట్రం పట్ల కేంద్రం అవలంభిస్తున్న ఈ నిర్లక్ష్య దోరణిని శాసనసభ తీవ్రంగా ఖండించింది. పోలవరం మన రాష్ట్రానికి జీవనాడి అని. మన ప్రజల చిరకాల స్వప్నమని సభ అభిప్రాయపడింది. ఏడు ముంపు మండలాలను మనకు బదలాయించిన తర్వాత కేంద్రం నుంచి అందాల్సిన సాయం మందగించడం దురదృష్టకరమని శాసనసభ భావించింది. ఈ ప్రత్యేక సహాయం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులు పెద్దగా రాకపోగా, ప్రత్యేక హోదా రాష్ట్రాలకు పన్ను రాయితీలు, పారిశ్రామిక ప్రోత్సాహకాలు కొనసాగిస్తున్నారని సభ అభిప్రాయపడింది.

ఏసీబీ వలలో మున్సిపల్ ఆర్‌ఐ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఏసీబీ వలకు ఓ మున్సిపల్ ఆర్ చిక్కాడు. వరంగల్ రూరల్ జిల్లా నర్సంపేట నగర పంచాయతీలో పనిచేస్తున్న ఆర్‌ఐ మెరుగు మురళి రూ.10వేలు లంచం తీసుకంటూ ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. వివరాల్లోకి వెళితే.. వరంగల్ రూరల్ నర్సంపేట నగర పంచాయతీ పరిధిలో నివాసం ఉంటున్న జడల వెంకటేశ్వర్లు ఇంటి ఓనర్‌షిప్ ధ్రువీకరణ కోసం నగర పంచాయతీకి 2017 డిసెంబర్ 22న దరఖాస్తు చేశారు. దీనికిగాను నగర పంచాయతీలో పనిచేస్తున్న ఆర్‌ఐ మెరుగు మురళి రూ.30 వేలు లంచం డిమాండ్ చేశారు. దీంతో వెంకటేశ్వర్లు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు.

2019 మార్చి నాటికి గ్రామాల్లో భూగర్భ డ్రైనేజీ పూర్తి

● మంత్రి నారా లోకేష్ స్పష్టం

అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో భూగర్భ డ్రైనేజీ నిర్మాణానికి నెలాఖరు లోగా టెండర్ల ప్రక్రియను పూర్తి చేయనున్నట్లు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ చెప్పారు. వచ్చే ఏడాది మార్చి నాటికి రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో భూగర్భ డ్రైనేజి కార్యక్రమాన్ని పూర్తి చేస్తామని శాసనసభలో మంత్రి స్పష్టం చేశారు. దేశంలో 86 గ్రామ పంచాయతీలను ఆదర్శ గ్రామ పంచాయతీలుగా తీసుకుంటే, ఇందులో 36 గ్రామాలు ఆంధ్రప్రదేశ్‌కు చెందినవేనన్నారు. తన హయాంలో పేరు దక్కిందని చెపుతూ ఈ ఘనత గతంలో మంత్రిగా పని చేసిన అయ్యన్నపాత్రుడికే దక్కుతుందన్నారు. రాష్ట్రం లో ఏడు నక్షత్రాల ప్రణాళికపై ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్యేలు జీవీ ఆంజనేయులు, ఆలపాటి రాజేంద్రప్రసాద్ అడిగిన ప్రశ్నకు మంత్రి లోకేష్ సమాధానం చెప్పారు. రానున్న రోజుల్లో ప్రతి గ్రామ పంచాయితీలోని ప్రతి ఇంటికి తడి, పొడి చెత్త సేకరణ కు రెండు బుట్టలను ఇవ్వనున్నామన్నారు. ఇప్పటికే పశ్చిమ గోదావరి జిల్లాలో ఇది విజయవంతమైనట్లు చెప్పారు. రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వం వ్యక్తిగత మరుగుదొడ్లకు రూ.3వేలు అదనంగా సీఎం నారా చంద్రబాబు నాయుడు ఆలోచన మేరకు అంద జేస్తున్నామని, ఇది దేశంలోనే తొలిసారని చెప్పారు. అనేక ప్రాంతాల్లో పాఠశాలల ప్రహరీ గోడలు నిర్మించాలంటూ ప్రజా ప్రతిని ధులు కోరుతున్నట్లు చెపుతూ తొలుత బాలికల పాఠశాలలకు ప్రహరీ గోడలు నిర్మించనున్నట్లు చెప్పారు. ఆ తర్వాత అన్ని పాఠశా లలకు ప్రహరీ గోడలు నిర్మించడంతో పాటు బయో ఫెన్సింగ్ చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో శ్మశాన వాటికల కోసం ప్రత్యేకంగా స్థలాలు కేటాయిస్తామని, ప్రభుత్వ స్థలాలు లేని పక్షంలో సేకరించి ఇస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో గ్యాస్ కనెక్షన్లకోసం చిన్నపాటి సిలెండర్లను కూడా ఏర్పాటు చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉందన్నారు. ఫైబర్‌నెట్‌కు సంబంధించి గూగుల్‌తో ఒప్పందం చేసుకున్నామని, డిసెంబర్ 2018 నాటికి ప్రతి ఇంటికి వైఫై సౌకర్యం కలిపించనున్నట్లు మంత్రి లోకేష్ స్పష్టం చేశారు. అంతకు ముందు ఎమ్మెల్యేలు జీవి ఆంజనేయులు, కె.మృణాళిని, ఆలపాటి రాజేంద్రప్రసాద్, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, కూన రవికుమార్ తదితరులు టెన్‌స్టార్ రేటింగ్ కోసం మంత్రి లోకేష్ చేస్తున్న కృషిని ప్రశంసించారు.

మీరు ఫ్లోర్‌లీడర్!

అమరావతి, ఆంధ్రప్రభ: విష్ణుకుమార్ రాజు గారు..మీరు బీజేపీ పక్షనేత. మీరు మాట్లాడే ప్రతిమాట జాగ్రత్తగా మాట్లాడాలి అంటూ స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాదరావు హితవు చెప్పారు. పట్టణాలు, నగరాలలో మౌళిక సదుపాయాలు అనే అంశంపై మంత్రి పి.నారాయణ సమాధానం చెప్పిన తర్వాత ఇదే అంశంపై తనకు అవకాశం ఇవ్వాలంటూ విష్ణుకుమార్ రాజు స్పీకర్‌ను కోరారు. దీనికి స్పీకర్ అంగీకరించకపోవడంతో తమపై వివక్ష చూపుతున్నారంటూ ఆయన వ్యాఖ్యానించగా స్పీకరు అసహనం వ్యక్తం చేశారు. మీరు మీ నియోజకవర్గం గురించి చెపుతారని, విశాఖపట్టణంలోని మౌళిక సదుపాయాలపై ఎమ్మెల్యే వెలగపూడి కృష్ణబాబు సమగ్రంగా వివరించారన్నారు. ఏ విషయంలోనైనా ఇతర సభ్యులకంటే మీరే ఎక్కువ సార్లు మాట్లాడిన విషయం గుర్తుంచుకోవాలన్నారు. మంత్రి సమగ్ర సమాధానం చెప్పిన తర్వాత ఈ విధంగా వ్యాఖ్యానించడం భావ్యం కాదని ఆయన పేర్కొన్నారు. మంత్రి సిటీ ఎమ్మెల్యేలతో సమావేశం పెట్టినప్పుడు అన్ని మాట్లాడుకోవచ్చంటూ స్పీకర్ సూచించారు. మనకు ఉన్న సమయంలో అన్ని ప్రశ్నలు చూడాలి కదా? అంటూ స్పీకరు ప్రశ్నించారు. ముఖ్యమైన విషయం కానిదేమిటో మీరే చెప్పండంటూ స్పీకర్ అడగగా, విష్ణుకుమార్ రాజు ఏదో చెపబోయేందుకు ప్రయత్నించగా స్పీకర్ అంగీకరించలేదు.

కిడ్స్ పోర్న్ రాకెట్ గుట్టురట్టు

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : కిడ్స్ పోర్న్ రాకెట్‌ని సీబీఐ బట్టబయలు చేసింది. వివరాల్లోకి వెళితే.. వాట్సప్ గ్రూప్ పేరు కిడ్స్ ట్రిబుల్ ఎక్స్. మొత్తం 119 మంది సభ్యులు. 40 దేశాలకు చెందిన వారు ఇందులో సభ్యులు. దురదృష్టకరం ఏమిటంటే ఎక్కువ మంది ఇండియాకు చెందినవారే. 66 మంది ఇండియా వారు. 56 మంది పాకిస్థాన్‌కు చెందినవారు. 29 మంది అమెరికాకు చెందినవారు సభ్యులుగా ఉన్నారు. ఈ గ్రూప్‌ను ఉత్తరప్రదేశ్‌కు చెందిన వర్మ అనే యువకుడు నిర్వహిస్తున్నట్లు, అతడ్ని అరెస్టు చేసినట్లు సీబీఐ వెల్లడించింది. వర్మ నుంచి స్వాధీనం చేసుకున్న ల్యాప్‌టాప్, ఫోన్‌ను తిరువనంతపురంలోని ఫోరెన్సిక్ ఎగ్జామ్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ గ్యాడ్జెట్స్(సీడీఏసీ)లో పరీక్షించి నిజాలను బట్టబయలు చేశారు. ముంబైకి చెందిన సత్యేంద్ర చౌహాన్, ఢిల్లీకి చెందిన నఫీఫ్ రాజా, జాహిద్, నోయిడాకు చెందిన ఆదర్శ్‌లను గ్రూప్ అడ్మిన్లుగా పోలీసులు గుర్తించారు. పిల్లలను ఈ గ్రూప్‌లో చేర్చుకుని పోర్న్ చిత్రాలు, వీడియోలు పంపడానికి వర్మ డబ్బును డిమాండ్ చేసి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు.

కేప్‌టౌన్: ఓ గుణపాఠం!

(మొదటిపేజీ తరువాయి)

విడిది కేంద్రంగా నిత్యం నదులు, సరస్సుల్తో జలకళతో నిండిన కేప్‌టౌన్‌ను ఎంచుకున్నారు. ఇక్కడకు మకాం మార్చారు. రానురాను ఈ నగరం జనసమర్థంతో నిండిపోయింది. వాతావరణ మార్పుల్తో ఇక్కడి సరస్సులు ఎండిపోయాయి. నదుల్లో నీరు కనుమరుగైంది. సముద్ర మట్టం నగరంకంటే పెరగడంతో భూగర్భ జలాలన్నీ ఉప్పుకయ్యలుగా మారిపోయాయి.

ఇది కేప్‌టౌన్‌కే పరిమితం కాలేదు. ప్రపంచంలో అతిపెద్ద నగరాలు కూడా ఇప్పుడీ దుస్థితినెదుర్కొంటున్నాయి. ఇండోనేషియాలోని జకార్తా నగరం సముద్ర మట్టానికంటే దిగువకు దిగజారింది. నగరంలోని 40శాతం ప్రాంతం పూర్తిగా ఉప్పునీటి కయ్యగా మారిపోయింది. బావులు, చెరువులు, సరస్సులు కూడా ఉప్పునీటితో నిండిపోయాయి. ఇప్పుడీ నగరంలోని 1.78కోట్ల మంది జనాభా తీవ్ర తాగునీటి ఎద్దడినెదుర్కొంటున్నారు. మెక్సికోలో 2.10కోట్ల మంది జనాభా తాగునీటి కొరతతో సతమతమౌతున్నారు. ఇప్పుడా నగరంలో వారానికి కొన్ని గంటలు మాత్రమే ప్రభుత్వం నీటిని సరఫరా చేయగలుగుతుంది. భూ మట్టానికి 2వేల మీటర్ల లోతుకు భూగర్భ జలాలు దిగజారిపోయాయి. బ్రెజిల్ ఆర్థిక రాజధాని సావోపోలో 2005లో తొలిసారిగా నీటిఎద్దడినెదుర్కొంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో నగర జనాభా నీటి అవసరాల్లో నాలుగుశాతం మాత్రమే లభిస్తున్నాయి. నగరానికి నీటిని సరఫరా చేసే ప్రధాన రిజర్వాయర్లో నీటిమట్టం 11శాతానికి పరిమితమైంది. రెండువారాలకోసారి మాత్రమే ఇక్కడ తాగునీటిని సరఫరా చేయగలుగుతున్నారు. చైనా ఆర్థిక కేంద్రం బీజింగ్‌లో 2కోట్ల మంది నీటి ఎద్దడికి గురయ్యారు. ఈ నగరంలో ప్రతి వెయ్యిమందిలో ఒకరికి మాత్రమే తగినంత నీరు అందుబాటులో ఉందని ప్రపంచ బ్యాంక్ తాజా నివేదిక వెల్లడించింది. ప్రపంచ జనాభాలో సుమారు 20శాతం కలిగిన చైనాలో ఇప్పుడు ప్రపంచంలో అందుబాటులో ఉన్న సురక్షిత నీటిలో 7శాతం మాత్రమే కలిగుంది. ఈజిప్ట్‌కు తాగు, సాగునీరందిస్తున్న జీవనది నైలూ వాతావరణ, జీవరసాయ కాలుష్యానికి గురైంది. ఇప్పుడు కైరో నగరానికి నీటి సరఫరా నిల్చిపోయింది. 2025నాటికి నైలూ నది నీరు తాగేందుకెందుకూ పనికిరాదని ఓ అధ్యయనం తేల్చేసింది. ఐటి హబ్‌గా అభివృద్ధి చెందిన బెంగుళూరు నగరంలోని తాగునీటి వనరులు మురుగునీటి ప్రవాహాల్తో నిండిపోయాయి. ఇప్పుడు నగరంలోని 63శాతం మందికి తాగునీటి లభ్యతలేదు. జపాన్ రాజధాని టోక్యోలోని 3కోట్లమంది తాగునీటి కోసం వర్షాలపైనే ఆధారపడాల్సిన దుస్థితినెదుర్కొంటున్నారు. ప్రపంచంలోనే అత్యధిక వర్షపాతమున్న దేశంగా యునైటెడ్ కింగ్‌డమ్ గుర్తింపు పొందింది. కానీ దాని రాజధాని లండన్‌లో మాత్రం న్యూయార్క్, ప్యారీస్‌లకంటే కూడా వర్షపాతం 80శాతం తక్కువగా నమోదౌతోంది. లండన్ పరిసరాల్లోని నీటి వనరులన్నీ ఎండిపోయాయి. ప్రస్తుతం రెండు వారాలకోసారి మాత్రమే ఇక్కడ తాగునీటిని సరఫరా చేస్తున్నారు. ది గ్రేట్ లండన్ అథారిటీ 2025నాటికి తాగునీటి సరఫరా చేయలేమని చేతులెత్తేసింది. 2040నాటికి ప్రత్యామ్నాయ వనరుల్ని అభివృద్ధి చేస్తే తప్ప లండన్‌లో జనజీవనం సాగదని తేల్చేసింది.

వాస్తవానికి భూమ్మీద 71శాతం నీరుంది. ఇందులో తాగేందుకనువైనది 3శాతం మాత్రమే. ఇందులో మూడింట రెండొంతులు హిమానినదాలు, ధృవప్రాంతాల్లో ఘనీభవించుంది. మంచుపర్వతాలుగా మారిపోయింది. లభ్యత లోపం కారణంగా సరైన పారిశుధ్యాన్ని కూడా పాటించడంలేదు. ప్రపంచ వ్యాప్తంగా 147కోట్ల మందిసి పదిరోజులకోసారి మాత్రమే స్నానం చేసేందుకు అవసరమైన నీరు అందుబాటులో ఉంది. ఏటా కలుషిత నీటి కారణంగా కలరా, టైఫాయిడ్, విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. నీటి కారక వ్యాధుల్తో ఏటా 21లక్షల చనిపోతున్నారు. మరో 16లక్షల మంది పసిపిల్లలు ఈ వ్యాధుల కారణంగా మృత్యుబారిన పడుతున్నారు. నదులు, సరస్సులు, చెరువులు కాలుష్యం కారణంగా సగానికిపైగా మాయమైపోయాయి. వాతావరణ మార్పుల కారణంగా కొన్ని ప్రాంతాల్లో కరవు కాటకాలు మరికొన్ని ప్రాంతాల్లో వరదలు ఒకేసారి సంభవిస్తున్నాయి. 2025నాటికి ప్రపంచంలో ప్రతి



ముగ్గురిలో ఇద్దరికి నీటి లభ్యత ఉండదని ప్రపంచ బ్యాంక్ తేల్చేసింది.

ప్రపంచ వ్యాప్తంగా గత ఐదు దశాబ్ధాల్లో పట్టణ, నగరీకరణ జోరందుకుంది. 1950లో ప్రపంచ జనాభాలో 11శాతం మాత్రమే పట్టణాల్లో ఉంటే 2016నాటికిది 46.50శాతంగా నమోదైంది. అలాగే జనాభా అనూహ్యంగా పెరిగింది. వారి ఆహార అవసరాలు వృద్ధిచెందాయి. ఇందుకనుగుణంగా వ్యవసాయ ఆయకట్టును పెంచాల్సొచ్చింది. దీంతో అందుబాటులో ఉన్న మంచినీటిలో 88శాతం వ్యవసాయ అవసరాలకే తరలించక తప్పడంలేదు. ఇది తాగునీటి లభ్యతపై తీవ్ర ప్రభావం చూపిస్తోంది. ఈ ఏడాది జనవరిలో ప్రపంచ బ్యాంక్ జరిపిన అధ్యయన నివేదిక మేరకు ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా 110కోట్ల మంది వారానికోసారి మాత్రమే తాగునీటిని పొందగలుగుతున్నారు. 270కోట్ల మంది ప్రతినెలలో 8నుంచి 11రోజులు మాత్రమే నీటిని వినియోగించుకోగలుగుతున్నారు. 240కోట్ల మంది నీటి

భారత్‌లో పరిస్థితి ఇంతకంటే దారుణంగా ఉంది. నెల 12వ తేదీనాటికి దేశంలోని అతిపెద్ద ప్రధానమైన 91రిజర్వాయర్ల సామర్ధ్యంలో 34శాతం మాత్రమే నీటి నిల్వలున్నాయి. గతేడాది ఇదే సమయంతో పోలిస్తే నీటి అందుబాటు 7శాతంపైగా పడిపోయింది. ముఖ్యంగా దక్షిణ, ఉత్తర, మధ్యభారతంలో పరిస్థితి మరింత తీవ్రంగా ఉంది. కేంద్ర జలసంఘం అంచనాల మేరకు గతేడాది ఇదే సమయానికి దేశంలో తాగునీటి లభ్యత 61.208బిలియన్ క్యూబిక్ మీటర్లుంటే ఈ ఏడాది 54.394బిలియన్ క్యూబిక్ మీటర్లు మాత్రమే ఉంది. గతపదేళ్ళలో ఇదే అత్యల్ప నీటి అందుబాటు సామర్ధ్యంగా గుర్తించారు. గతేడాదితో పోలిస్తే గంగా బేసిన్‌లో నీటి లభ్యత 16.5శాతం తగ్గిపోయింది. నర్మదలో 13శాతం, తాపీలో 33.8శాతం, సబర్మతిలో 17.96శాతం, గోదావరిలో 11.81శాతం, కృష్ణలో 10.39శాతం, కావేరిలో 6.31శాతం తూర్పు నుంచి పశ్చిమానికి ప్రవహించే దక్షిణ నదుల్లో 8.04శాతం నీటి నిల్వలు పడిపోయాయి. దేశంలోని 22రాష్ట్రాల్లో సగటు కంటే 28శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. ఆరు రాష్ట్రాల్లో సాధారణ వర్షపాతం పడింది. గుజరాత్, మహరాష్ట్రల్లోని 27రిజర్వాయర్లలో 11.51 బిలియన్ క్యూబిక్ మీటర్లు మాత్రమే నీటి నిల్వ ఉంది. ఇది గతేడాదికంటే 37శాతం తక్కువ. అలాగే ఉత్తరప్రదేశ్‌లోని బుందేల్‌ఖండ్ ప్రాంతంలో నీటి లభ్యత 52శాతం పడిపోయింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణాల్లో గతేడాదికంటే భూగర్భ జలాల మట్టం దిగిపోయింది. 2017లో తెలంగాణాలో 657.4మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఇది అంతకుముందేడాదికంటే 11శాతం తక్కువ. ఆంధ్రప్రదేశ్‌లో 597.4మిల్లీమీటర్ల వర్షపాతం పడింది. ఇది జాతీయ సగటు 841.3తో పోలిస్తే చాలా తక్కువ. ఈ రాష్ట్రాల్లోని శ్రీశైలంలో గతేడాదికంటే 19శాతం, నాగార్జునసాగర్‌లో 8శాతం తక్కువ నీటి నిల్వలు నమోదయ్యాయి. గత పదేళ్ల సగటుతో పోలిస్తే శ్రీశైలంలో 30శాతం, నాగార్జున సాగర్‌లో 19శాతం నీటి నిల్వలు పడిపోయాయి. దేశం మొత్తమ్మీద ఇప్పటికే 34శాతం తాగునీటి నిల్వలు తగ్గిపోయాయని సౌత్‌ఏషియా నెట్‌వర్క్ ఆన్ డామ్స్ అండర్ రివర్స్ పీపుల్ సంస్థ డైరెక్టర్ హిమాంశుఠక్కర్ తన నివేదికలో వెల్లడించారు. కేంద్ర జలసంఘం నివేదిక మేరకు హిమాచల్‌ప్రదేశ్, పంజాబ్, రాజస్థాన్‌లలో కూడా నీటినిల్వలు పడిపోతున్నాయి.

భారత్‌లో ఈ దశాబ్ధంలోనే తీవ్ర తాగునీటి ఎద్దడి తప్పదని నివేదికలు తేల్చిచెబుతున్నాయి. ప్రభుత్వాలు మాత్రం తాగునీటి సమస్యపై ఇంతవరకు దృష్టిపెట్టలేదు. ఇది పూర్తిగా దైవప్రేరితంగానే పరిగణించి బాధ్యత నుంచి తప్పించుకుంటున్నాయి. దేశంలో కూడా ఓ వైపు వ్యవసాయ ఉత్పత్తుల పెంపునకు తీవ్ర ప్రయత్నాలు జరుగుతున్నాయి. దాదాపు ప్రతి ఏటా ప్రతి రాష్ట్రంలో ఆయకట్టు విస్తీర్ణాన్ని పెంచుతున్నారు. అలాగే పరిశ్రమల కోసం కేటాయిస్తున్న నీటి సామర్ధ్యం కూడా పెరుగుతోంది. ఇవన్నీ తాగునీటి సరఫరాపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తున్నాయి. ఇప్పటికే జాప్యం జరిగింది. ఉన్న నీటి వనరుల్నైనా సద్వినియోగం చేసుకోవడంతో పాటు వాతావరణ కాలుష్యం నుంచి చెరువులు, సరస్సులు, నదులను పరిరక్షించడం ద్వారా భవిష్యత్‌లో భారత్ తాగునీటి ఎద్దడికి గురికాకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది. కేప్‌టౌన్ పరిణామాల్నుంచి గుణపాఠం నేర్చుకోని పక్షంలో భారతీయులక్కూడా ఈ నీటి కష్టాలు తప్పవు. పైనున్న హిమనదాలు, సుదీర్ఘసముద్ర తీరం ఈ గండం నుంచి భారతీయుల్ని గట్టెక్కించలేవని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

నేడు మరో ఇద్దరిపై చర్య?

(మొదటిపేజీ తరువాయి)

ప్రవేశపెడుతున్నారా? అవుననే అంటున్నాయి తెరాస వర్గాలు. బడ్జెట్ సమావేశాల సందర్భంగా సోమవారం శాసనసభ రణరంగాన్ని తలపించిన సంగతి తెలిసిందే. గవర్నర్ ప్రసంగిస్తున్న సమయంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సంపత్‌లు హెడ్‌ఫోన్స్‌ను విసరగా అది మండలి చైర్మన్ స్వామిగౌడ్‌కు తగిలి కంటికి గాయమైన సంగతి తెలిసిందే. ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిన ప్రభుత్వం ఈ ఇద్దరు ఎమ్మెల్యేల సభ్యత్వాలను రద్దు చేయడంతో పాటు ఇందుకు సంబంధించిన గెజిట్ నోటిఫికేషన్‌ను జారీచేసి కేంద్ర ఎన్నికల సంఘానికి సమాచారం అందించింది. నల్గొండ, అలంపూర్ అసెంబ్లీ నియోజకవర్గాల ఎమ్మెల్యేల సభ్యత్వాలు రద్దు కావడంతో ఈ రెండు అసెంబ్లీ నియోజకవర్గాలకు ఎన్నికలు నిర్వహించాలని నోటిఫికేషన్ సారాంశంగా తెలుస్తోంది. ఇదిలా ఉండగా, శాసనసభలో అనుచితంగా ప్రవర్తించిన మరో ఇద్దరు సభ్యత్వాల రద్దుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. సోమవారం నాటి అసెంబ్లీ సమావేశాల సందర్భంగా వీడియో ఫుటేజీలను మంగళవారం సాయంత్రం మరోసారి ప్రదర్శింపజేసి వాటిని పరిశీలించిన స్పీకర్ మధుసూదనాచారి, శాసనసభ కార్యదర్శి నరసింహాచారి ఇతర అధికారులు హెడ్‌ఫోన్స్ విసిరిన ఘటనలో మరో ఇద్దరు ఎమ్మెల్యేల పాత్ర ఉందని గుర్తించారు. వికారాబాద్ జిల్లా పరిగి ఎమ్మెల్యే పి.రామ్మోహన్‌రెడ్డి, కల్వకుర్తి ఎమ్మెల్యే వంశీచంద్‌రెడ్డి, జగిత్యాల ఎమ్మెల్యే జీవన్‌రెడ్డిలు ఇందులో ఉన్నట్టు తెలుస్తోంది. జీవన్‌రెడ్డి సిఎల్‌పి ఉపనేతగా ఉన్నారు. మరి రామ్మోహన్‌రెడ్డితోపాటు వంశీచంద్ సభ్యత్వం రద్దవుతుందా లేదా జీవన్‌రెడ్డిదా అన్నది తేలవలసి ఉన్నది. ఒకవేళ మరో ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేల సభ్యత్వాలను రద్దు చేయాలనుకుంటే బుధవారం ఉదయం శాసనసభ సమావేశం ప్రారంభం కాగానే మంత్రి హరీష్‌రావు ప్రతిపాదనను ప్రవేశపెట్టే అవకాశం ఉంది. ఇప్పటికే పదకొండు మంది ఎమ్మెల్యేలపై వేటు వేసిన సంగతి తెలిసిందే. వీరిలో రామ్మోహన్‌రెడ్డితో పాటు వంశీచంద్‌రెడ్డి కూడా ఉన్నారు. మరో ఇద్దరిపై వేటువేస్తే రాష్ట్రంలో నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలకు ఉప ఎన్నికలు నిర్వహించవలసి ఉంటుంది. ఎమ్మెల్యేల సభ్యత్వాల రద్దును సవాల్ చేస్తూ బుధవారం హైకోర్టులో కేసు దాఖలు చేసేందుకు కాంగ్రెస్ పార్టీ పూర్తిస్థాయిలో సమాయత్తమైంది. కేసు దాఖలుకు సంబంధించి ఇప్పటికే ఆ పార్టీకి చెందిన మాజీ కేంద్రమంత్రి, న్యాయకోవిదుడు కపిల్ సిబాల్‌తో పాటు మరికొంత మంది సీనియర్ న్యాయవాదులతో మంతనాలు జరిపినట్టు సమాచారం. సస్పెన్షన్‌తో పాటు శాసన సభ్యత్వాల రద్దును వ్యవహారాన్ని కూడా కాంగ్రెస్ అధిష్టానం కూడా తీవ్రంగా పరిగణిస్తున్నట్టు సమాచారం. ఈ విషయాన్ని పార్టీ జాతీయ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ తెలుసుకుని కపిల్ సిబాల్‌తో చర్చించినట్టు ఇక్కడికి అందిన సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. బుధవారం హైకోర్టులో పిటిషన్ దాఖలయ్యాక విచారణ సమయంలో కపిల్ సిబాల్ ఇక్కడికి వస్తారని, ఒకవేళ ఈ కేసును ప్రాథమిక దశలో ఎటువంటి ఇబ్బందులు జరిగినా వెంటనే సుప్రీంకోర్టులో పోరాడేందుకు కూడా కాంగ్రెస్ అధినాయకత్వం అన్ని ప్రయత్నాలను ప్రారంభించినట్టు ప్రచారం జరుగుతోంది.

స్వామిగౌడ్‌పై దాడి దురదృష్టకరం

• ఎమ్మెల్యేలపై స్పీకర్ నిర్ణయం కరెక్టే: జోగు రామన్న

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్‌పై దాడి దురదృష్టకర మని బీసీ సంక్షేమం, అటవీ శాఖ మంత్రి జోగు రామన్న పేర్కొన్నారు. ఇలాంటి ఘట నలు ప్రజాస్వామ్యానికి మచ్చ తీసుకువస్తాయన్నారు. సరోజినీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మండలి చైర్మన్ స్వామిగౌడ్‌ను మంగళ వారం ఆయన పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి పై సూపరింటెండెంట్ రవీందర్ గౌడ్‌ను అడిగి తెలుసుకు న్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ స్వామి గౌడ్ త్వరగా కోలుకోవాలన్నారు. మెరుగైన వైద్యం అందించాలని సూపరింటెండెంట్‌కు ఆయన సూచిం చారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి దాడులను అందరూ ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై స్పీకర్ తీసుకున్న నిర్ణయం సరైనదేనన్నారు. మరోసారి ఇలాంటి ఘటనలు జరగకుండా వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. మంత్రి వెంట ఎమ్మెల్సీలు పురాణం సతీష్, కసిరెడ్డి నారాయణ రెడ్డి తదితరులు ఉన్నారు.

75 శాతం కోలుకున్నారు

సరోజినీ ఆస్పత్రి సూపరింటెండెంట్ రవీందర్ గౌడ్

రెండోరోజూ స్వామిగౌడ్‌కు మరిన్ని చికిత్సలు నిర్వహించామని సరోజినీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవీందర్‌గౌడ్ తెలిపారు. దీంతో కంటిలోని కార్నియా కొంత మెరుగుపడిందన్నారు. ప్రస్తుతం ఆయన 75 శాతం కోలుకు న్నారని, కంటికి సంబంధించి స్క్రీనింగ్ టెస్టులను నిర్వహించామన్నారు. ప్రస్తుతం స్వామిగౌడ్ వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారని ఆయన తెలిపారు. బుధవారం తదుపరి పరీక్షలతో పాటు చికిత్సను నిర్వహించి డిశ్చార్జి చేస్తామన్నారు.

పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలపై చర్యలేవీ?

• ఎమ్మెల్యేల సభ్యత్వాలను రద్దు చేయడం సరికాదు


• సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడా వెంకట్ రెడ్డి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు అసహనానికి గురవుతున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడా వెంకట్‌రెడ్డి అన్నారు. పార్లమెంట్‌లో టీఆర్‌ఎస్ ఎంపీ కవిత నిరసనలు చేస్తే ఒప్పయినప్పుడు.. అసెంబ్లీలో విపక్ష ఎమ్మెల్యేలు ఆందోళన చేస్తే తప్పెలా అవుతోందని ఆయన నిలదీశారు. శాసన సభ్యుల సభ్యత్వాలను రద్దు చేయడమంటే.. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసినట్లే అవుతోందన్నారు. మంగళవారం ఆయన సీపీఐ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. మండలి చైర్మన్ స్వామిగౌడ్‌పై హెడ్‌సెట్‌ను విసరడం తప్పేనని ఆయన తెలిపారు. అయితే సీసీ ఫుటెజీని పూర్తిగా పరిశీలించడమే కాగా సంబంధిత ఎమ్మెల్యేలకు ముందుగా నోటీసులు ఇవ్వాల్సి ఉండేదన్నారు. గతంలో హరీశ్ రావు కూడా గవర్నర్‌పై దాడి చేశారని ఆయన గుర్తు చేశారు. సభ నుంచి ప్రధాన ప్రతిపక్ష నేత జానారెడ్డిని సస్పెండ్ చేయడం సరికాదన్నారు. సభా సంప్రదాయాలపై ప్రభుత్వానికి గౌరవం ఉంటే పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలపైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. తమ పార్టీకి చెందిన ఎమ్మెల్యే రవీంద్రకుమార్‌పైన ఫిర్యాదు చేసినా ఎందుకు స్పందించలేదన్నారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం

• పెద్ద ఎత్తున రుణాలు మంజూరు • టీ-ప్రైడ్ పథకంలో మార్గదర్శకాలు • మండలి ప్రశ్నోత్తరాల్లో మంత్రి కేటీఆర్


హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఎస్సీ, ఎస్టీ ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందని మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. శాసనమండలి సమావేశాల్లో భాగంగా మంగళవారం సభ్యులు రాజేశ్వర్ రావు, రాములు నాయక్ తదితరులు అడిగిన ప్రశ్నలకు సమాధానంగా మంత్రి చెప్పారు. అలాగే మహిళా ఔత్సాహిక పారిశ్రా మిక వేత్తలను కూడా పెద్దఎత్తున ప్రోత్సహించ డంతో పాటు ప్రత్యేకంగా సబ్సిడీలను కూడా అందజేస్తు న్నామని వివరించారు. ఎస్‌సిపి నిధుల నుండి రూ. 200 కోట్లు, టిఎస్‌పి నిధుల నుండి రూ.100 కోట్లను కేటాయించామన్నారు. ఇందులో 70 శాతం కాల పరిమితి రుణం, 20శాతం మార్జిన్ మనీ రూపం, మిగి లిన 10శాతం లబ్దిదారుని విరాళం ఉంటుంద న్నారు. ఇందుకోసం టీ ప్రైడ్ పథకంలో ప్రత్యక్ష రుణ పథకాన్ని ఇప్పటికే ప్రతిపాదించామని కేటీఆర్ తెలిపారు. దీనికి సంబంధించిన మార్గదర్శకలు తుది దశలో ఉన్నామని ఆయన వివరించారు. ఎస్సీ, ఎస్టీ ఔత్సాగిక పారిశ్రా మిక వేత్తలకు ప్రాజెక్టు వ్యయంలో 35శాతం చొప్పున. మహిళా పారిశ్రామిక వేత్తలకు ప్రాజెక్టు వ్యవయంలో 45 శాతం పెట్టుబడి సబ్సిడీని సమకూరుస్తున్నామని ఆయన తెలిపారు.



త్వరలో పాలక వర్గాలను ఏర్పాటు చేస్తాం:మంత్రి కేటీఆర్

మన రాష్ట్రంలో పట్టణీకరణ శరవేగంగా సాగుతోందన్నారు. దేశ జనాభాలో ఇతర రాష్ట్రా ల్లో ని పట్టణాల్లో 35శాతం జనభా పట్టణాల్లో నివసిస్తుండగా,. హైదరాబాద్‌లో 40 శాతం మేరకు ఉంటున్నారని తెలిపారు. అందుకే పట్టణాల్లో ప్రజలకు కావాల్సిన మౌలిక సౌకర్యాలకు, అభివృద్ధి పనులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఇందులో భాగంగానే పంచాయితీల్లో 15వేల జనాభా దాటిన వాటిని నగర పంచాయితీలుగా చేయాలని నిర్ణయించామన్నారు. మండలిలో సభ్యులు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, నారదాసు లక్ష్మణ్‌రావు తదితరులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. గ్రామపంచాయితీలను నగర పంచాయితీలుగా మార్చే ప్రక్రియ పూర్తి అయితే మన రాష్ట్రంలోని జనాభాలో45 శాతం పట్టణాల్లో ఉంటుందన్నారు. దీనిని బట్టి మన రాష్ట్రంలో పట్టణీకరణ ఎంత శరవేగంగా జరుగుతున్నదో ఊహించవచ్చునన్నారు. అలాగే భారతదేశంలోని ఏ రాష్ట్రం చేపట్టని విధంగా కార్పొరేషన్లు, మున్సిపాలిటీలకు రాష్ట్ర బడ్జెట్‌లో నేరుగా నిధులు కేటాయించడం లేదన్నారు. కానీ తెలంగాణ రాష్ట్రప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తున్న విషయాన్ని ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ గుర్తు చేశారు. గత బడ్జెట్‌లో వరంగల్ కార్పొరేషన్‌కు రూ. 300 కోట్లుకేటాయించామన్నారు. అలాగే మరో నాలుగు కార్పొరేషన్లకు రూ.100 కేట్లు వెచ్చించామన్నారు. స్థానిక సంస్థలు తమ సొంత వనరుల ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ నిధులతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నిధులే కాకుండా ఆర్థికసంఘం ద్వారా కూడా నిధులు అందుతాయని మంత్రి కేటీఆర్ వివరించారు. జీహెచ్‌ఎంసీ వంటి అతిపెద్ద కార్పొరేషన్ నిధుల సమీకరణ కోసం దేశంలోనే మొట్టమొదటి సారిగా మున్సిపల్ బాండ్లను విడుదల చేశామన్నారు. తాజాగా కరీంనగర్ పట్టణాభివృద్ధి నిమిత్తం ప్రత్యేకంగా ఒక పట్టణాభివృద్ధి సంస్థను ఏర్పాటు చేయాస్తున్నామని మంత్రి కేటీఆర్ తెలిపారు.

ఒంగోలులో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



హైదరాబాద్, ఆంధ్రప్రభ: బిసిలకు రెండు రాజ్యసభస్థానాలు కేటాయించిన ముఖ్యమంత్రి కెసిఆర్ చిత్రపటానికి ఆంధ్రప్రదేశ్‌లో పాలాభిషేకం చేశారు. ఆంధ్రప్రదేశ్ యాదవ జెఎసి తెలంగాణ ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తూ ఒంగోలులో ర్యాలీ నిర్వహించడంతో పాటు ఒంగోలు కలెక్టరేట్ వద్ద కెసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కెసిఆరం వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు.

వెయ్యి కోట్ల ఆస్తులతో దేశంలోనే సంపన్న ఎంపీ జయాబచ్చన్



(మొదటిపేజీ తరువాయి)

ఆమె ఆస్తుల విలువ రూ. 493 కోట్లుండగా చరాస్తుల విలువ రూ.343 కోట్లున్నాయి. తాజా అఫిడవిట్ ప్రకారం జయా, అమితాబ్ దంపతుల స్థిరాస్తుల విలువ రూ. రూ.460 కోట్లకు చరాస్తుల విలువ రూ.543 కోట్లకు పెరిగాయి.

బంగారం, ఆభరణాలు విలువ రూ.62 కోట్ల కంటే ఎక్కువ

జయా, అమితాబ్ దంపతులు కలిగివున్న బంగారం, నగల విలువ రూ. 62 కోట్లను మించుతుంది. ఇందులో అమితాబ్ వ్యక్తిగత ఆభరణాల విలువ రూ. 36 కోట్లు. బచన్ దంపతులు 12 వాహనాలను కలిగివున్నారు. వీటి విలువ రూ.13 కోట్లు పైమాటే. ఇందులో ఒక రోల్స్ రాయిస్, మూడు మెర్సిడెస్ బెంజ్‌లు, పోర్చే, రేంజ్ రోవర్లున్నాయి. వీటికి అధనంగా అమితాబ్ ఒకటాటా నానోకార్, ట్రాక్టర్‌ను కలిగివున్నాడు. అమితాబ్ వాచ్‌ల విలువ రూ.3.4 కోట్ల వరకు ఉండగా, జయ వాచ్‌ల విలువ రూ.51లక్షల వరకు ఉంటుంది. కాగా ఈ దంపతులు ఫ్రాన్స్ లోని బ్రిగ్‌నొగన్ ప్లేజిలో 3,175 చదరపు మీటర్ల విస్తీర్ణమున్న రెసిడెన్షియల్ ప్రాప ర్టీతో పాటు.. నొయిడా, బోపాల్, పుణె, అహ్మదాబాద్, గాంధీనగర్‌లలో కూడా వారికి ఆస్తులున్నాయి. జయ తన పేరుమీద లక్నోలోని కాకోరిలో రూ.2.2 కోట్ల విలువైన 1.22 హెక్టార్ల వ్యవసాయ భూమిని కలిగివుండగా, అమితాబ్ బారాబంకి జిల్లాలోని దౌలత్‌పూర్‌లో రూ.5.7 కోట్ల విలువైన 3 ఎకరాల భూమిని కలిగివున్నాడు.





మావోల మెరుపుదాడి

(మొదటిపేజీ తరువాయి)

ఇద్దరు పరిస్థితి విషమంగా ఉంది. నలుగురు జవాన్లు తీవ్రగాయాల పాలయ్యారు. ఉదయం మావోయిస్టులకు, పోలీసులకు మధ్య కాల్పులు చోటు చేసుకున్నాయి. ఉన్నతాధికారులు 212 బెటాలియన్‌కు చెందిన సీఆర్పీఎఫ్ కోబ్రా దళాలను సంఘటన స్థలానికి వెళ్ళి కూంబింగ్‌కు పంపారు. వీరు ప్రయాణిస్తున్న బుల్లెట్‌ప్రూఫ్ వాహనాన్ని మావోయి స్టులు మాటు వేసి పేల్చివేశారు. జవాన్లు తేరుకునేలోపే మావోయిస్టులు మెరుపు దాడికి దిగారు. ఈ ఘటనలో ఏఎస్సై ఆర్కేఎస్ టోమార్, హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణ్, కానిస్టేబుల్స్ అజయ్ కుమార్ యాదవ్, మనోరంజన్ లంక, జితేంద్ర సింగ్, శోభిత్ కుమార్ శర్మ, మనోజ్ సింగ్, ధర్మేంద్ర సింగ్, డ్రైవర్ చంద్ర అక్కడక్కడే మృతి చెందారు. మదన్ కుమార్, రాజేష్ కుమార్ తీవ్రంగా గాయపడ్డారు. వీరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీస్ వర్గాలు పేర్కొన్నాయి. క్షతగాత్రులను పోలీసులు వెంటనే హెలికాప్టర్ ద్వారా రాయపూర్ వైద్యశాలకు తరలించారు. జవాన్ల భౌతికకాయాలను రాయపూర్ తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

యూనిఫాం శాపమైందా !

మావోయిస్టులు ధరించిన యూనిఫాం సీఆర్పీ ఎఫ్ జవాన్ల పాలిట శాపంగా మారినట్లు అక్కడ పోలీసు వర్గాలు భావిసున్నాయి. సంఘటన ప్రదేశాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తూ ప్రయాణిస్తున్న జవాన్లు రహదారికి పక్కనే ఉన్న మావోయిస్టులను చూశారు. వారు పోలీసు యూనిఫాంలో ఉండడంతో సహచర సీఆర్పీఎఫ్ జవాన్లనుకున్నారు. ఈలోగానే అనర్థం జరిగిపోయింది. సంఘటన ప్రదేశంలో మావోయి స్టులకు సంబంధించిన పిట్టు, పెంట్రోల్ బాంబ్, టిఫిన్ బాంబ్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ నెల 2న ఐదు రాష్ట్రాల పోలీసుల కూంబింగ్ సమయం లో చోటుచేసుకున్న 12 మంది మావోయిస్టుల ఎన్‌కౌంటర్‌కి ప్రతికారంగానే ప్రతి దాడికి దిగారు. తుపాకుల మోతలు, మందుపాతర పేలుళ్ళతో ఆ ప్రాంతం దద్దరిల్లిపోయింది.

ఆంధ్రా సరిహద్దుల్లో హై అలర్ట్

ఈ ఘటన కారణంగా ఆంధ్రా సరిహద్దుల్లో హై అలర్ట్ ప్రకటించారు. చింతూరు డివిజన్ తెలంగాణ, ఛతీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దును అనుకొని ఉండటంతో మావోయిస్టులు విధ్వంసకర సంఘటనలకు పాల్పడే అవకాశాలు ఉంటాయనే ఉద్దేశంతో తూర్పు గోదావరి జిల్లా పోలీసులను ఉన్నతాధికారులు అప్రమత్తం చేశారు.చింతూరు సబ్ డివిజన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చింతూరు, ఏటపాక పోలీస్‌స్టేషన్ పరిధిలో అప్రమత్తంగా ఉండి అటవీప్రాంతాల్లో కూంబింగ్ నిర్వ హిస్తున్నారు. ఏడుగుర్రాలపల్లి అవుట్ పోలీస్ స్టేషన్, ఏటపాక పోలీస్‌స్టేషన్ పరిధిలోని తెలంగాణ సరిహద్దు ప్రాంతా లలో పోలీసు బలగాలు గస్తీ నిర్వహిస్తున్నట్లు తెలుస్తుంది. సరిహద్దు గ్రామాలపై నిఘా ఏర్పాటు చేశారు. మావోయిస్టుల కదలికలపై అనుక్షణం సమాచారం సేకరిసున్నారు.

తెలంగాణ ఆర్థిక వృద్ధిరేటు గణనీయం

• ప్రభుత్వ విప్ కొప్పుల ఈశ్వర్



హెదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ ఆర్థిక వృద్ధి రేటు గణనీయంగా ఉందని ప్రభుత్వ చీఫ్‌విప్ కొప్పుల ఈశ్వర్ వివరించారు. దేశ వృద్ధి రేటుకంటే కూడా తెలంగాణ వృద్ధి రేటు అధికం అని పేర్కొన్నారు. దేశ వృద్ధి రేటు 7.5 శాతం కాగా రాష్ట్ర వృద్ధి రేటు 8.6 శాతం నమోదయిందన్నారు. దేశ తలసరి ఆదాయం రూ.1.03 లక్షలు కాగా, రాష్ట్ర తలసరి ఆదాయం రూ. 1.56 లక్షలు అని తెలిపారు. ఈ అంశాల ఆధారంగా రాష్ట్రం అభివృద్ధిని అర్దం చేసుకోవచ్చన్నారు. శాసనసభలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని ఆయన మంగళవారం సభలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా కొప్పుల ఈశ్వర్ మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని అన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు దేశంలోని ఇతర రాష్ట్రాలకు పాఠాలు నేర్పేవిగా ఉన్నాయని పేర్కొన్నారు. ప్రతి గడపను తట్టే విధంగా సంక్షేమ కార్యక్రమాలు అమలవుతున్నాయన్నారు. రాష్ట్ర సమస్యలు పరిష్కరించడంలో ముఖ్యమంత్రి కేసీఆర్ కంటే మంచి నాయకుడు మరొకరు లేరన్నారు. కొత్తగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమపాళ్లలో అమలు చేస్తున్నారని వివరించారు.

రెండు కులాలపై ప్రభుత్వం కక్ష కట్టింది



హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్రంలోని రెండు బలమైన సామాజిక వర్గాలపై తెలంగాణ ప్రభుత్వం కక్షగట్టిందని కాంగ్రెస్ నేత, ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన అసెంబ్లీ ఆవరణలో మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. గతేడాది జరిగిన బడ్జెట్ సమావేశాల్లో నాతో పాటు ఎస్సీల్లోని మాదిగ సామాజిక వర్గానికి చెందిన సండ్ర వెంకట వీరయ్యపై సమావేశాల మొత్తం సభ నుంచి సస్పెండ్ చేశారని రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ బడ్జెట్ సమావేశాల్లో కూడా కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో పాటు అలంపూర్ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ సభ్యత్వాలను తెలంగాణ ప్రభుత్వం రద్దు చేసే విధంగా చర్యలు తీసుకున్నదని ఆయన వివరించారు. అయితే గతంలో తాము టీడీపీలో ఉన్నప్పుడు సభ నుంచి బయటికి పంపిన సమయంలో కాంగ్రెస్ పార్టీ గట్టిగా స్పందిస్తే ఇప్పుడు ఇంత వరకు వచ్చేది కాదని ఆయన వెల్లడించారు. ఈ రెండు వర్గాల ప్రజలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్నట్లు టీఆర్‌ఎస్ నేతలు భావిస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

పేదలకోసమే డయాగ్నస్టిక్ సెంటర్లు

- ప్రశ్నోత్తరాల సమయంలో వైద్య ఆరోగ్య శాఖా మంత్రి లక్ష్మారెడ్డి సమాధానం

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : వ్యాధినిర్ధారణ కచ్చితంగా గుర్తిస్తేనే చికిత్స అందించ వచ్చు. ప్రస్తుతం వైద్య విభాగంలో అదే పద్ధతి కొన సాగుతోంది. అయితే చికిత్స కంటే వ్యాధి నిర్ధారణకు అయ్యే ఖర్చులే అధికంగా ఉంటున్నాయన్నది ప్రజల ఆవేదన. ఈ సమస్యను దృష్టిలో పెట్టుకొని సీఎం కేసీఆర్ ఆలోచనల మేరకు తెలంగాణ డయాగ్నస్టిక్ పథకానికి రూపకల్పన చేశామన్నారు వైద్య ఆరోగ్య శాఖా మంత్రి డాక్టర్ లక్ష్మారెడ్డి. బడ్జెట్ సమావేశాల్లో భాగంగా మంగళవారం ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్యేలు ఆశన్న గారి జీవన్‌రెడ్డి, గంగుల కమలాకర్, పువ్వాడ అజయ్‌కుమార్, వి.శ్రీనివాసగౌడ్ తదితరులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. ప్రజలు వైద్యం కోసం పెట్టే ఖర్చులో ఎక్కువగా వ్యాధి నిర్ధారణ పరీక్షలపైనే ఉంటుందన్నారు. ఖర్చుతో పాటు వ్యాధి నిర్ధారణ పరికరాలు ప్రభుత్వ దవాఖానాల్లో అందు బాటులో లేకపోవడంతో చాలావరకు జబ్బులను త్వరితగతిన గుర్తించి చికిత్స అందించలేకపోతున్నామ న్నారు. ప్రజలకు కావాల్సిన వ్యాధి నిర్ధారణ పరీక్షలకు సంబంధించిన మరియు వాటికి అవరమైన పరికరాల కొనుగోలుకు తగిన ఆర్థిక వనరులను కేటాయించడం జరిగిందన్నారు. ఇప్పటికే దాదాపు రూ.70 కోట్లతో 8 సీటీ స్కాన్‌ను, 3 డీఆర్ మిషిన్‌లను, 48 సీఆర్ మిషిన్, 195 అల్ట్రాసౌండ్, 123 ఎక్స్ రే మిషన్ తదితర పరికరాలను కొనుగోలు చేశామన్నారు. కేంద్రీకృత మందుల సరఫరా మాదిరిగా డయాగ్నస్టిక్ పరికరాలను అవసరమైన వాటిని టీఎస్ఎంఎస్ఐడీసీ ద్వారా ఆయా దవాఖానాలకు త్వరలోనే సరఫరా చేయడం జరుగుతుందన్నారు. డయాగ్నస్టిక్‌ను మరింత పటిష్ట పరచడానికి తెలంగాణ డయాగ్నస్టిక్ పథకం ద్వారా హబ్‌స్పోక్ మోడల్‌లో 20 సీడీసీలను హబ్ కేంద్రాలుగా అభివృద్ధి చేయడానికి నిర్ణయించామన్నారు. ఇప్పటికే ఐపీఎం నారాయణగూడ లో అత్యాధునిక ల్యాబ్‌ను సమకూర్చామన్నారు. దీనిలో భాగంగా ఇప్పటికే 19,044 వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించామన్నారు. 19 హబ్ సెంటర్స్‌ను త్వరలోనే ప్రారంభించి జిల్లా స్థాయిలోనే దాదాపు అన్నిరకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలను జరుపుతామన్నారు.

అవిశ్వాసం పెట్టమన్న పవన్ ఏమయ్యాడు?



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : కేంద్ర ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం పెట్టాలని సవాల్ విసిరిన జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఏమైపోయాడని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎంపీలు ప్రశ్నించారు. మంగళవారం పార్లమెంటు భవనం ప్రధాన ద్వారం వద్ద ధర్నా చేపట్టిన ఎంపీలు ప్రత్యేక హోదా ఇవ్వాలంటూ నినాదాలు చేశారు. ప్లకార్డులు పట్టుకుని ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీ విజయసాయి రెడ్డి మాట్లాడుతూ రైల్వే జోన్ సాధ్యం కాదంటూ హోంశాఖ కార్యదర్శి చేసిన వ్యాఖ్యల్ని ఖండించారు. విభజన చట్టంలో పొందుపర్చిన అంశంపై ఇలాంటి వ్యాఖ్యలు చేయరాదని అన్నారు. ఒకవేళ సాధ్యపడదు అని చెప్పడానికి నాలుగేళ్ల సమయం తీసుకోవాల్సిన అవసరం లేదని, ఇవ్వాలనుకుంటే ఎలాగైనా ఇవ్వవచ్చని అన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత మేకపాటి రాజమోహన్ రెడ్డి మాట్లాడుతూ ప్రత్యేక హోదా సహా విభజన హామీలన్నీ అమలు చేసే వరకు తాము అన్ని రూపాల్లో పోరాటాన్ని ఉధృతం చేస్తామని అన్నారు. కేంద్రంపై అవిశ్వాస తీర్మానం పెట్టాలంటూ సవాల్ విసిరిన జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఏమైపోయారని ప్రశ్నించారు. అవిశ్వాస తీర్మానానికి తాను ఢిల్లీలో వివిధ పార్టీల మద్ధతు కూడగడతానని పవన్ కళ్యాణ్ అన్న మాటల్ని ఆయన గుర్తుచేశారు.

దాడిని సమర్థించుకుంటున్నారు

- కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై మంత్రుల ధ్వజం

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : శాసపమండలి చైర్మన్ స్వామిగౌడ్‌పై దాడి చేయడమే కాకుండా ఆ దాడిని కాంగ్రెస్ వారు సమర్థించుకుంటు న్నారని విద్యుత్ శాఖా మంత్రి జగదీశ్వర్ రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ సభ్యులు ప్రజలను తప్పుదోవ పట్టించడానికి మీడియా ఎదుట తమ ఇష్టం వచ్చినట్టుగా మాట్లాడుతూ ప్రభుత్వంపై బురదజల్లుతున్నారని ఆయన పేర్కొన్నారు. స్వామిగౌడ్‌పై ఒకరకంగా మధుసూదనా చారిపై మరోరకంగా దాడి చేస్తూ లబ్ధిపొందాలని చూస్తున్నారన్నారు. నిబంధనల మేరకు స్పీకర్ నిర్ణయం తీసుకున్నారని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ సభ్యులు వ్యవహరించిన తీరుపై క్రిమినల్ చర్యలు తీసుకునే హక్కు కూడా స్పీకర్‌కు ఉందన్నారు.

ముందస్తు ప్రణాళిక ప్రకారమే: మంత్రి మహేందర్ రెడ్డి

కాంగ్రెస్ సభ్యులు దాడి చేశారని మంత్రి మహేందర్ రెడ్డి ఆరోపించారు. అసెంబ్లీలో ప్రతిపక్ష ఎమ్మెల్యేలు ఇలా వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. ప్రతిపక్షాలు మాట్లాడేందుకు ఎక్కువ సమయం ఇస్తానని గతంలోనే కేసీఆర్ పేర్కొన్నారని అయినా కావాలని ప్రతిపక్షాలు వారికి ఏమీ మాట్లాడే తెలియక ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తున్నాయన్నారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకపోతున్నాయ్: టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

దేశం మొత్తం తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన పలు సంస్కరణలపై అభినందిస్తుంటే ప్రతిపక్షాలు ఓర్చుకోలేక పోతున్నాయని ఎమ్మెల్యేలు వేముల వీరేశం, భాస్కర్ రావు, ఆళ్ల వెంకటేశ్వర రెడ్డిలు ఆరోపించారు. రాష్ట్రానికి శతవిధాలా చెడ్డపేరు తీసుకురావడానికి కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రయత్నిస్తున్నారన్నారు. ప్రజా సమస్యలపై ఏమీ మాట్లాడో తెలియని కాంగ్రెస్ వారు ప్రభుత్వంపై నిందలు వేయడం తగదన్నారు. మొదటగా ప్రజా సమస్యలను పరిష్కరించడానికి వారికి చిత్తశుద్ధి లేదన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలను కీలుబొమ్మగా మార్చిందన్నారు.

సభలో 20 అంశాలను ప్రస్తావించనున్న తెదేపా

- వ్యవసాయం, నిరుద్యోగ సమస్యలకే ప్రాధాన్యం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలుగుదేశంపార్టీ తెలంగాణ శాసనసభ సమావేశాల్లో 20 ప్రజా సమస్యలను ప్రస్తావించాలని నిర్ణయించింది. స్వల్పకాలిక చర్చ, లఘు చర్చ, ప్రశ్నోత్తరాల సమయాల్లో తమకు వచ్చే కొద్దిపాటి సమయాన్ని సద్వినియోగం చేసుకుని ప్రజా సమస్యలను లేవనెత్తనున్నామని ఆ పార్టీ శాసనసభ్యుడు సండ్ర వెంకటవీరయ్య తెలిపారు. ప్రధానంగా రైతాంగ, నిరుద్యోగ, బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి సంబంధించిన సమస్యలపై ప్రస్తావిస్తామని చెప్పారు.

నకిలీ విత్తనాలు ముంచేశాయ్

- సచివాలయంలో నాగార్జునసాగర్ ఎడమ కాలువ
- ఆయకట్టు రైతుల ఆందోళన
- వ్యవసాయ మంత్రి పోచారం, డిప్యూటీ సీఎం కడియంతో భేటీ
- నష్టపరిహారం చెల్లించాలి : జూలకంటి డిమాండ్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ప్రభుత్వం ఎన్ని కఠినమైన నిర్ణయాలు తీసుకుంటున్నా రాష్ట్రంలో నకిలీ విత్తనాల సమస్యలు మిన్నంటుతున్నాయి. నాణ్యతలేని విత్తనాలను విక్రయించే వారిపై పీడీ యాక్టు ప్రయోగిస్తున్నా నియంత్రించడం కష్టతరమవుతోంది. ఈ క్రమంలో రైతుల్లో ఆందోళన తీవ్రమవుతోంది. నకిలీ వరి విత్తనాలు తమను ముంచేశాయంటూ నాగార్జుల సాగర్ ప్రాజెక్టు ఎడవ కాలువ ఆయకట్టు రైతులు మంగళవారం సచివాలయానికి తరలివచ్చారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని, విత్తన సంస్థలను గుర్తించి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, నష్టపరిహారం చెల్లించాలని నినాదాలు చేస్తూ ముఖ్యమంత్రి కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. నల్గొండ జిల్లాకు చెందిన సీపీఎం నాయకుడు జూలకంటి రంగారెడ్డి నేతృత్వంలో రైతులు కాసేపు ఆందోళన వ్యక్తం చేశారు. విషయాన్ని గుర్తించిన వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి వారిని తన కార్యాలయానికి పిలిపించి చర్చించారు. మిమ్మల్ని మోసం చేసిన విత్తన సంస్థలను గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం రైతులు ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరిని కూడా కలిసి జరిగిన మోసాన్ని వివరించారు.

ఉప ఎన్నికలకు టీఆర్ఎస్ రెడీ



- నల్లగొండ ఇన్‌ఛార్జిగా హరీష్.. ఆలంపూర్‌కు కెటిఆర్?
- కర్ణాటక అసెంబ్లీతో పాటు రెండుస్థానాలకు ఎన్నికలు జరుగుతాయని టిఆర్ఎస్ అంచనా
- రెండు జిల్లాల మంత్రులు, నేతలు అప్రమత్తం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్రశాసనసభలో ఇద్దరి సభ్యత్వంపై వేటువేసి.. ఎన్నికల కమిషన్‌కు శాసనసభ తీర్మానం పంపిన నేపథ్యంలో.. ఉప ఎన్నికలు ఖాయమని టిఆర్ఎస్ భావిస్తోంది. శాసనసభ తీసుకున్న చర్యను, ఖాళీలను ఈసికి పంపిన నేపథ్యంలో త్వరలో జరగనున్న కర్ణాటక శాసనసభ ఎన్నికలతో పాటు నల్లగొండ, ఆలంపూర్ అసెంబ్లీస్థానాలకు కూడా ఎన్నికలు జరుగుతాయని టిఆర్ఎస్ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇందుకు సన్నద్ధమవుతున్నాయి. నల్లగొండ శాసనసభ్యుడు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఆలంపూర్ ఎమ్మెల్యే సంపత్‌కుమార్‌లు శాసనసభ తీసుకున్న రద్దు చర్య కారణంగా మాజీలేనని, సాధారణ ఎన్నికలకు ఇంకా ఏడాది వ్యవధి ఉన్నందున ఆ రెండు స్థానాలకు ఎన్నికలు ఖాయమని టిఆర్ఎస్ ముఖ్యనేతలు చెబుతున్నారు. రాష్ట్రాల శాసనసభ వ్యవహారాల్లో కోర్టులు కూడా జోక్యం చేసుకున్న సందర్భాలు లేవని, స్పీకర్ నిర్ణయమే ఫైనల్ అని నేతలు గుర్తుచేస్తున్నారు. ఈ రెండు అసెంబ్లీస్థానాలకు.. అడుగుపెడితే విజయం ఖాయం చేసుకుని వచ్చే ఇద్దరు నేతలను ఇన్‌ఛార్జిలుగా నియమిస్తారని పార్టీవర్గాలలో చర్చ జరుగుతోంది. ఆలంపూర్ అసెంబ్లీకి రాష్ట్ర ఐటీశాఖా మంత్రి కెటిఆర్, నల్లగొండ అసెంబ్లీ స్థానానికి రాష్ట్ర నీటిపారుదల శాఖామంత్రి హరీష్‌రావును ఇన్‌ఛార్జిగా నియమించే అవకాశం ఉందని టిఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే రెండు అసెంబ్లీ నియోజకవర్గాల పరిస్థితులపై ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రత్యేక నివేదిక తెప్పించుకున్నారని.. ఈ ఇరువురు నేతలు అడుగు పెడితే వార్ వన్‌సైడ్‌గా మారుతుందని పార్టీలో ధీమా వ్యక్తమవుతోంది. రెండు స్థానాలకు ఎన్నికలు జరిగే అవకాశాలున్న నేపథ్యంలో.. టిఆర్ఎస్ శ్రేణులు ఒక్కసారిగా అలర్ట్ అయ్యాయి.

రెండు జిల్లాల్లో.. వ్యూహతంత్రం

నల్లగొండలో రాజకీయ పరిస్థితులు, ఎన్నికల వ్యవహారాలపై మంత్రులు హరీష్‌రావు, జగదీష్‌రెడ్డితో పాటు జిల్లా ఎమ్మెల్యేలు చర్చించారు. ఇటీవల కాలంలో కోమటిరెడ్డి వెంకటరెడ్డి ముఖ్యమంత్రి కెసిఆర్‌ను లక్ష్యంగా చేసుకుని పరుషంగా దూషిస్తుండగా, టిఆర్ఎస్ శ్రేణులు తీవ్ర ఆగ్రహంగా ఉన్నాయి. ఈ క్రమంలో కోమటిరెడ్డి శాసనసభ సభ్యత్వంపై వేటుపడడంతో టిఆర్ఎస్ శ్రేణులు సంతోషం వ్యక్తం చేస్తున్నాయి. నల్లగొండ శాసనసభ స్థానంలో గులాబీజెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేస్తున్నాయి. నల్లగొండ అసెంబ్లీపై ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రత్యేకదృష్టిపెట్టినట్టు గత కొంతకాలంగా ప్రచారం జరుగుతుండగా, ఇపుడు శాసనసభలో జరిగిన ఘటనల నేపథ్యంలో.. అనూహ్యంగా కోమటిరెడ్డిపై సభ ద్వారా వ్యూహాత్మకవేటు వేశారు.

తాజా రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో నల్లగొండ జిల్లానేతలందరినీ పార్టీ అప్రమత్తం చేసింది. ఎన్నికలను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని నేతలకు సూచించడంతో ఒక్కసారిగా రాజకీయవాతావరణం వేడెక్కింది. నల్లగొండ అసెంబ్లీ ఎన్నికకు ట్రబుల్‌షూటర్‌గా పేరున్న మంత్రి హరీష్‌రావును ఇన్‌ఛార్జిగా పంపే అవకాశమున్నట్లు పార్టీవర్గాలలో చర్చ జరుగుతోంది.

పాలమూరు నేతల అప్రమత్తం..

ఆలంపూర్ ఎమ్మెల్యే సంపత్‌కుమార్‌పై వేటువేసిన నేపథ్యంలో.. పాలమూరు నేతలంతా అప్రమత్తంగా ఉండాలని, ఎన్నికను దృష్టిలో పెట్టుకుని సన్నద్ధం కావాలని టిఆర్ఎస్ హైకమాండ్ నిర్దేశించింది. మంత్రులు జూపల్లి కృష్ణారావు, డాక్టర్ లక్ష్మారెడ్డిలతో పాటు ఎమ్మెల్యేలను అలర్ట్ చేసింది. కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉన్న ఈ నియోజకవర్గంలో గులాబీజెండా ఎగరేయాలని టిఆర్ఎస్ వ్యూహరచన చేస్తోంది. ఎన్నిక వస్తే విజయం సాధించేలా సన్నద్ధమవుతోంది. ఒంటిచేత్తో.. సంచలన విజయాలు అందించిన మంత్రి కెటిఆర్‌ను ఈ నియోజకవర్గానికి ఇన్‌ఛార్జిగా నియమించే అవకాశం ఉందని పార్టీవర్గాలలో చర్చ జరుగుతోంది. ఈ రెండు ఉప ఎన్నికల ఫలితాలు 2019అసెంబ్లీ ఎన్నికలకు టానిక్‌లా ఉపయోగపడతాయని, పార్టీ శ్రేణులకు ఉత్సాహాన్నిస్తాయని టిఆర్ఎస్ లెక్కలు వేసుకుంటోంది. ఎన్నికలకమిషన్ వెంటనే ఈసభ్యత్వ రద్దు నిర్ణయాన్ని ఆమోదిస్తుందా.. టిఆర్ఎస్ భావిస్తున్నట్లు కర్ణాటక శాసనసభ ఎన్నికలతో పాటు ఉప ఎన్నికలు వస్తాయా అన్నదానిపై ఉత్కంఠ నెలకొంది.

ఆ నలుగురే సంతోషంగా ఉన్నారు

- న్యాయం జరుగుతుందన్న నమ్మకం లేదు
- అయినా తొలగించిన హోంగార్డులను ఆదుకోవాలని
- అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావిస్తా... డాక్టర్ కె.లక్ష్మణ్



హైదరాబాద్, ఆంధ్రప్రభ : ప్రస్తుత ప్రభుత్వంలో న్యాయం జరుగుతుందన్న నమ్మకం లేకపోయినా తొలగించిన హోంగార్డులకు తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావిస్తానని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ హోంగార్డ్స్ సాధన సమితి అధ్యక్షతన హైదరాబాద్ సిటీలో తొలగించిన 250 మంది హోంగార్డ్సుకు న్యాయం చేయాలని కోరుతూ మంగళవారం నిర్వహించిన సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై ప్రసంగించారు. సమైక్య రాష్ట్రంలో అనేక అవమానాలకు గురైనా తెలంగాణ రాష్ట్రం వస్తే తమ సమస్యలన్నీ తీరిపోతాయని అంతా భావించారన్నారు. అయితే తెలంగాణలో ఆ నలుగురు తప్ప ఎవరూ సంతోషంగా లేరని ఆరోపించారు. గత మూడున్నరేళ్లలో రాష్ట్రంలో నాలుగువేల మంది రైతులు ఆత్మ హత్యలు చేసుకున్నారన్నారు. సీఎం కేసీఆర్ సెక్రటేరియేట్‌కు రాకుండా ప్రగతి భవన్‌కే పరిమితమయ్యారని విమర్శించారు. మూతపడిన కంపెనీలను తెరిపి స్తామని చెప్పి సిర్పూర్‌కాగజ్‌నగర్ పేపర్ మిల్లు, నిజాం షుగర్స్ కంపెనీలను మూసి వేశారని ఆయన ప్రభుత్వ తీరుని తూర్పారబట్టారు. 250 మంది తొలగించిన హోంగార్డ్సు వారి కుటుంబసభ్యులతో సమావేశానికి హాజరయ్యారన్నారు. పోరు సాగిద్దాం.. ఈ ప్రభుత్వాన్ని మెడలు వంచైనా మన సమస్యలను సాధించుకుం దామన్నారు. నిరుత్సాహపడవద్దని ఆయన ఈ సందర్భంగా వారికి సూచించారు. ఆర్డర్ కాపీలు లేవని అకారణంగా విధుల నుంచి తొలగించారని 250 మంది హోంగార్ఢ్స తరపున వై.రమేష్, మనోహర్, తులసీరామ్, రామ్‌లక్ష్మణ్‌లు ప్రసంగించారు. 9 నుండి 10 సంవత్సరాలుగా హైదరాబాద్ సిటీలో వివిధ పోలీస్‌స్టేషన్స్‌లో, ఇతర విభాగాల్లో హోంగార్డ్సుగా సేవలందించిన తమను ఉమ్మడి రాష్ట్రంలో అకారణంగా తొలగించారన్నారు. తాము ఏ తప్పు చేశామని వారు ప్రశ్నించారు. అప్పటి హోం మినిస్టర్ సబితా ఇంద్రారెడ్డి నుంచి ఇప్పటి ప్రభుత్వంలో వున్న అమాత్యులలో దాదాపు 100 మందిని కలిసి తమ గోడు వినిపించుకున్నా ఎవరూ పట్టించుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమలో ప్రతి ఒక్కరికీ ఐడీకార్డు, బ్యాంకు ఎకౌంట్, ఏటీయం కార్డు, హెల్త్ కార్డు, ఎక్స్‌పీరియన్స్ సర్టిఫికెట్ ఇచ్చారని, కేవలం ఆర్డర్ కాపీలు లేవన్న సాకుతో మమ్ములను తొలగించడం ఎంతవరకు భావ్యమని వారన్నారు. తమ సమస్య పరిష్కారం కోసం హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డిని కలిసిన సందర్భంలో తన ఉద్యోగానికే గ్యారంటీ లేదని, ఇంకా మీకేం చేయగలనని అన్నారని వారు ఆవేదనా పూరిత స్వరంతో చెప్పారు. ఏ తప్పు చేయలేదని మరోసారి వారు గుర్తు చేశారు. అటు అమాత్యులు, ఇటు పోలీస్ బాస్‌లు చుట్టూ ప్రదక్షణాలు చేసినా తమ గోడును వినే వారే కరవయ్యారన్నారు. తమలో కొందరు విగతజీవులయ్యారన్నారు.

రాష్ట్రంలో అప్రకటిత ఎమర్జెన్సీ

- ఇది రైతులకు బేడీలు వేసిన ప్రభుత్వం
- బీజేపీ ఎమ్మెల్సీ రామచంద్రరావు



హైదరాబాద్,ఆంధప్రభ: తెలంగాణ రాష్ట్రంలో అప్రకటిత ఎమర్జెన్సీ నడుస్తోందని బీజేపీ ఎమ్మెల్సీ రామచంద్రరావు అన్నారు. మంగళవారం శాసనమండలిలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపేతీర్మానంపై జరిగిన చర్చలో భాగంగా రామచంద్రరావు మాట్లాడుతూ రాష్ట్రంలో టీఆర్ఎస్ ప్రభుత్వం అప్రజాస్వామికంగా వ్యవహరిస్తూ పోలీసు పాలన సాగిస్తోందన్నారు. ప్రజలకు తమ సమస్యలు చెప్పుకునే అవకాశం లేకుండా , ధర్నాలు , నిరసనలు తెలిపే హక్కును కూడ కాలరారాయిటం రాష్ట్రంలో శాంతిభద్రతలు కాపాడినట్టు కాదన్నారు. గవర్నర్ ప్రసంగ పాఠం పరిశీలిస్తే కొత్త అంశాలు ఏవీలేవన్నారు. ప్రజల ఆకాంక్షలకు తగ్గట్టుగా ప్రభుత్వం వ్యవహరించటం లేదన్నారు. రాష్ట్రంలో తలసరి ఆదాయం పెరిగిందని చెపి ్పన ప్రభుత్వం మరి తలసరి అప్పుల ప్రస్తావన కూడా చెపి ్పవుంటే బాగుండేదన్నారు. వ్యవసాయరంగంలో మార్పులు రావాలన్నారు. ప్రభుత్వం వ్యవసాయం పట్ల శ్రద్ధ చూపివుంటే రాష్ట్రంలో నాలుగువేల మంది రైతులు ఎందుకు ఆత్మహత్యలు చేసుకుంటారని ప్రశ్నించారు. మహారాష్ట్రలో రైతులు చేసిన ఉద్యమానికి స్పందించిన అక్కడి ముఖ్యమంత్రి వెంటనే వ్యవసాయరంగానికి 15వేల కోట్లు ప్రకటించారని, అదే తెలంగాణలో ఇక్కడి కేసీఆర్ ప్రభుత్వం రైతులకు బేడీలు వేయించిందన్నారు. గవర్నర్ ప్రసంగంలో కేంద్రప్రభుత్వ పథకాలను , నిధులను ఎందుకు ప్రస్తావించలేదన్నారు. తెలంగాణ రాష్ట్రలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని , ప్రభుత్వం పాతబస్తీని అసలు పట్టించుకోవటం లేదన్నారు. వర్షం వస్తే నగరం మునకేస్తుందన్నారు.

శాసన సభకు ఆ అధికారం ఉంది

- మాజీ అడ్వకేట్ జనరల్ కె రామకృష్ణారెడ్డి



హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : ఇద్దరు కాంగ్రెస్ సభ్యులను శాసనసభ నుంచి బహిష్కరించే అధికారం శాసనసభకు ఉంటుందని ఉమ్మడి హైకోర్టు పూర్వ అడ్వకేట్ జనరల్ కె రామకృష్ణారెడ్డి అభిప్రాయపడ్డారు. శాసనసభకు ఉన్న అధికారాలతో సభ్యుడి సభ్యత్వాన్ని రద్దు చేసే అధికారం సభకు ఉందని, ఈ విషయాన్ని గతంలో పలు హైకోర్టులతో పాటు సుప్రీంకోర్టు కూడా తీర్పులు వెలువరించాయని పేర్కొన్నారు. చట్ట సభల అధికారాల విషయంలో కోర్టులు జోక్యం చేసుకోలేవని, సూచనలు మాత్రమే చేయగలవని అభిప్రాయపడ్డారు. రాష్ట్ర శాసనసభలో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఇద్దరు సభ్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎస్ఎ సంపత్ కుమార్‌లను సభ నుంచి బహిష్కరించిన నేపథ్యంలో మాజీ అడ్వకేట్ జనరల్ కె రామకృష్ణారెడ్డి ఆంధ్రప్రభతో మాట్లాడారు. ఎమ్మెల్యే,ఎంపీలు లేదా ఎమ్మెల్సీలు సభ నిబంధనలు ఉల్లంఘించే విధంగా వ్యవహరిస్తే సభ నుంచి బహిష్కరించే అధికారం శాసనసభకు ఉంటుందని స్పష్టం చేశారు. వ్యక్తిగతంగా స్పీకర్‌కు ఉండవని తెలిపారు.

ఒకే భూసేకరణకు రెండు నోటిఫికేషన్లా?

- హైకోర్టు విస్మయం భూసేకరణ నిలిపివేయండి
- తెలంగాణ సర్కారుకు హైకోర్టు ఆదేశం.
- సూర్యపేట-ఖమ్మం 4లేన్ల జాతీయ రహదారి విస్తరణ పనులు.



హైదరాబాద్, ఆంధ్రప్రభ: సూర్యాపేట - ఖమ్మం జాతీయ రహదారి 4 లేన్ల విస్తరణ నిమిత్తం ఒకే భూసేకరణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేర్వేరుగా రెండు నోటిఫికేషన్లు జారీ చేయడం పట్ల హైకోర్టు విస్మయం వ్యక్తం చేసింది. అలాగే రైతుల సమ్మతితో పరిహారం చెల్లింపు, భూముల నుంచి ఖాళీ చేయించడం వంటి చర్యలను నిలిపివేయాలని హైకోర్టు తెలంగాణ సర్కారును ఆదేశించింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ కె.విజయలక్ష్మి తో కూడిన డివిజన్ బెంచ్ మంగళవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. ఈ ప్రజాహిత వ్యాజ్యాన్ని ఖమ్మం జిల్లా కూసుమంచి గ్రామానికి చెందిన తాళ్లూరి.వెంకటేశ్వరరావు దాఖలు చేశారు.

ఈ సందర్భంగా పిటిషనర్ తరపు న్యాయవాది బి.రచనారెడ్డి వాదనలు వినిపిస్తూ..జాతీయ రహదారి విస్తరణ కోసం భూసేకరణ నోటిఫికేషన్ తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిందని తెలిపారు. ఈ భూసేకరణ ను వ్యతిరేకిస్తూ తాండాలకు చెందిన గిరిజనులు కేంద్ర మంత్రి నితిన్ గడ్గరీ కి వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. ఆ రైతులను సమ్మతిపత్రాలపై సంతకం చేయాలని, భూములను ఖాళీ చేయాలంటూ రెవెన్యూ అధికారులు బెదిరిస్తున్నట్లు తెలిపారు.

దీనిపై తెలంగాణ అడ్వకేట్ జనరల్ డి.ప్రకాశ్ రెడ్డి స్పందిస్తూ..ఈ వ్యవహారాన్ని కేంద్రం రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించాలని నిర్ణయించినట్లు తెలిపారు. శీఘ్రంగా పూర్తి చేయాలని ప్రభుత్వం భావించడం వల్లనే ఎక్కడో తత్తరపాటు నెలకొందన్నారు. అందువల్ల కేంద్రం జారీ చేసిన నోటిఫికేషన్ ఉపసంహరించుకోలేదన్నారు. రాష్ట్రం ముందుకెళ్లేందుకు కేంద్రం నోటిఫికేషన్ విరమించుకుం టుందన్నారు. ఈ దశలో ధర్మాసనం జోక్యం చేసుకుంటూ.. కేంద్ర చట్టం అమల్లో ఉన్నందువల్ల రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విరమించుకోవాలని సూచించింది. ఒక వేళ నోటిఫికేషన్ ను ఉపసంహరించుకునేందుకు కేంద్రం నిరాకరించిన పక్షంలో రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్లు విరమించుకోవాల్సి ఉంటుందని టీఏజీకి ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వ వైఖరిని తెలుసుకునేందుకు గడువు కావాలని సహాయ సోలిటర్ జనరల్ కె.లక్ష్మణ్ అభ్యర్థించారు.

పార్టీ ఫిరాయించిన22 మంది ఎమ్మెల్యేలకు హైకోర్టు నోటీసులు

- వారి సభ్యత్వాన్ని రద్దు చేయండి
- హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం.

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఎన్నికల్లో వైకాపా నుంచి గెలుపొంది ఆ తర్వాత అధికార తెదేపాలోకి ఫిరాయించారని , వారి సభ్యత్వాన్ని రద్దు చేయాలని అభ్యర్థిస్తూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యంపై హైకోర్టు విచారణ జరిపింది. ఈ ప్రజాహిత వ్యాజ్యాన్ని అనుమతించక ముందే ప్రతివాదులందరికీ (నోటిస్ బిఫోర్ అడ్మిషన్)హైకోర్టు నోటీసులు జారీ చేసింది. పార్టీ ఫిరాయించిన రాష్ట్ర మంత్రులు సహా మొత్తం 22 మంది ఎమ్మెల్యేలు, అసెంబ్లీ కార్యదర్శి, శాసన వ్యవహారాలు, న్యాయ శాఖ ముఖ్యకార్యదర్శులకు నోటీసులు జారీ చేయాలని హైకోర్టు రిజిస్ట్రీని ఆదేశించింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ కె.విజయలక్ష్మి తో కూడిన డివిజన్ బెంచ్ మంగళవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ రెండు వారాలకు వాయిదా వేసింది. ఈ ప్రజాహిత వ్యాజ్యాన్ని ప్రకాశం జిల్లాకు చెందిన మాజీ శాసనసభ్యుడు అన్నా.వెంకట రాంబాబు దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది సివి.మోహన్ రెడ్డి వాదనలు వినిపిస్తూ..ఎమ్మెల్యేలుగా పార్టీ ఫిరాయించినందువల్ల అమర్‌నాథ్ రెడ్డి, సుజయ కృష్ణ, రంగారావు, ఆదినారాయణరెడ్డి, భూమా అఖిలప్రియ మంత్రులు గా కొనసాగేందుకు అనర్హులన్నారు. పార్టీ ఫిరాయించిన సదరు ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏపీ అసెంబ్లీ కార్యదర్శికి సమర్పించిన ఫిర్యాదు ఇంకా పెండింగ్ లోనే ఉందన్నారు. ఫిరాయించిన ఎమ్మెల్యేలు అనర్హులని రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్ 2(1)(ఎ) స్పష్టం చేసిందన్నారు.

హెచ్‌సీఏ వ్యవహారంలో.. పరిపాలకుల కమిటీని కొనసాగించండి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) పరిపాలకుల కమిటీ(సీఓఏ) ని మరి కొంత కాలం కొనసాగించాలని బీసీసీఐ హైకోర్టును అభ్యర్థించింది. ఈ మేరకు బీసీసీఐ సీఈవో రాహుల్ జోహరీ హైకోర్టులో ప్రమాణపత్రం దాఖలు చేశారు. తమ అవినీతి నిరోధక విభాగం సిద్ధం చేసిన నివేదికను బీసీసీఐ హైకోర్టుకు సమర్పించింది. ఈనేపథ్యంలో అవినీతి నిరోధక విభాగం సిద్ధంచేసిన నివేదికను వ్యాజ్యంలోని పార్టీలందరికీ అందజేయాలని హైకోర్టు బీసీసీఐని ఆదేశించింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ కె.విజయలక్ష్మి తో కూడిన డివిజన్ బెంచ్ మంగళవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ వారం రోజులు వాయిదా వేసింది.హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) నిధుల దుర్వినియోగం, అక్రమాలపై నిధులు విచ్చలవిడిగా ఖర్చు చేసిన వ్యవహారంలో పరిపాలకుల కమిటీ హైకోర్టుకు నివేదికను సమర్పించిన విషయం తెలిసిందే. దీంతో పరిపాలకుల కమిటీ బాధ్యత ముగిసింది. అయితే ఈ పరిపాలకుల కమిటీని మరికొంత కాలం కొనసాగించాలని అభ్యర్థిస్తూ బీసీసీఐ హైకోర్టులో ప్రమాణ పత్రం దాఖలు చేసింది. . అలాగే హెచ్‌సీఏ అధ్యక్ష, కార్యదర్శులను వారి పదవుల నుంచి అంబుడ్స్ మన్ తొలగించిన విషయాన్ని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వ సలహాదారు జి.వివేక్ నేతృత్వంలోని నూతన కమిటీ కూడా సుప్రీంకోర్టు ఆమోదించిన జస్టిస్ లోధా కమిటీ సిద్ధం చేసిన బైలాస్ ఈ వ్యవహారంలో వెనుకంజ వేసినట్లు ఆ కమిటీ హైకోర్టుకు ఫిర్యాదు చేసింది. తేది.7.1.2018న జరిగిన సర్వసభ్య సమావేశంలో జస్టిస్ లోధా కమిటీ సిఫారసుల మేరకు బైలాస్ ను ఆమోదించినట్లు పరిపాలకుల కమిటీకి వివేక్ నేతృత్వంలోని కమిటీ తెలిపింది. అయితే సీఈవో నియామకం, ప్రత్యేక కార్యక్రమాలు, అర్హతల వ్యవహారంలో మాత్రమే నూతన బైలాస్ ను ఆమోదించినట్లు పరిపాలకుల కమిటీ పరిశీలనలో తేలిందన్నారు. ఈ పరిస్థితుల్లో పరిపాలకుల కమిటీ మరికొంత కాలం కొనసాగించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఇటీవల నిర్వహించిన జి.వెంకటస్వామి స్మారక తెలంగాణ టీ-20 క్రికెట్ మ్యాచ్ ను హెచ్‌సీఏ సర్వసభ్య సమావేశం అనుమతి లేకుండానే నిర్వహించినట్లు ఫిర్యాదులందాయని తెలిపారు. ఈ సందర్భంగా బీసీసీఐ అవినీతి నిరోధక విభాగం సిద్ధం చేసిన నివేదికను బీసీసీఐ తరపు న్యాయవాది ప్రియదర్శన్ రెడ్డి ధర్మాసనానికి అందజేశారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ..ఈ ప్రతిని పార్టీలందరికీ ఇవ్వాలని సూచించింది.

తెలుగు రాష్ట్రాలకు విడివిడిగా బార్ కౌన్సిల్

- 3 నెలల్లోగా విభజన పూర్తి చేసి, ఎన్నికలు నిర్వహించాలి
- తేల్చి చెప్పిన సుప్రీంకోర్టు ధర్మాసనం

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : ఎట్టకేలకు తెలుగు రాష్ట్రాలకు విడివిడిగా బార్ కౌన్సిళ్లు ఏర్పాటు కానున్నాయి. ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాలకు ఉమ్మడిగా ఒకే హైకోర్టు ఉన్నందున బార్ కౌన్సిల్ విభజనలోనూ జాప్యం జరుగుతూ వచ్చింది. ఈ జాప్యంపై బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సుప్రీంకోర్టులో వ్యాజ్యం దాఖలు చేయడంతో దీనిపై మంగళవారం విచారణ జరిగింది. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న బార్ కౌన్సిల్‌ను రెండుగా విభజించి తెలంగాణకు, ప్రస్తుత ఆంధ్రప్రదేశ్‌కు విడివిడిగా బార్ కౌన్సిళ్లను ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు ధర్మాసనం ఆదేశించింది. విభజన ప్రక్రియను పూర్తి చేసి, దేశవ్యాప్తంగా అన్ని బార్ కౌన్సిళ్లకు 3 నెలల్లోగా ఎన్నికలు నిర్వహించాలని పేర్కొంది.

అలాగే ఉమ్మడి బార్ కౌన్సిల్‌లో సభ్యులుగా ఉన్న న్యాయవా దులకు ఏ రాష్ట్రం ఎంచుకోవాలన్న విషయంపై స్వేచ్ఛనిస్తూ, నిర్ణయించుకునేందుకు కొంత సమయం కూడా ఇవ్వాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. జూన్ నెలాఖరు లోపు ఈ ప్రక్రియను పూర్తి చేసి నివేదికను తమకు అందజేయాలని ఆదేశించింది.

రెండు నిమిషాల్లోనే...

● పార్లమెంట్ సమావేశాలు కుదించే యోచనలో ప్రభుత్వం

● బ్యాంకు కుంభకోణాలపై మెట్టుదిగని అధికార, విపక్షాలు

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ:పార్లమెంటు సమావేశాలు వరుసగా రెండోవారం స్తంభించిపోయాయి. కాంగ్రెస్, టీడీపీ, టీఆర్ఎస్, వైఎస్సార్సిపి, అన్నాడిఎంకె ఎంపీల ఆందోళనలతో ఉభయసభలు దద్దరిల్లాయి. దాంతో వరుసగా ఏడో రోజు పార్లమెంటు సమావేశాలు తుడిచిపెట్టుకుపోయాయి. వివిధ అంశాలపై జాతీయ, ప్రాంతీయ పార్టీల ఎంపీలు నినాదాలతోహోరెత్తించడతో పార్లమెంట్ ఉభయ సభలు స్తంభించిపోయాయి. మంగళవారం లోక్‌సభ కార్యకలాపాలు ప్రారంభం కాగానే స్పీకర్ సుమిత్రా మహాజన్ ప్రశ్నోత్తరాల కార్యక్రమాన్ని చేపట్టారు. దాంతో కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, వైఎస్సార్ కాంగ్రెస్, అన్నాడిఎంకె, టీఆర్ఎస్ టీడీపీ ఎంపీలు వెల్‌లోకి దూసుకెళ్లి నినాదాలు చేశారు. నీరవ్ మోడీ కుంభకోణంపై చర్చించాలని కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్ వెల్‌లోకి దూసుకెళ్లి నిరసన తెలిపాయి. రిజర్వేషన్ల కోటా పెంచాలని టిఆర్ఎస్, ఏపీ విభజన చట్టం హామీలు అమలు చేయాలని టీడీపీ, ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని వైఎస్సార్సిపి, కావేరి నదీ బోర్డు ఏర్పాటు చేయాలని అన్నాడిఎంకె ఎంపీలు స్పీకర్ పోడియంను చుట్టుముట్టారు. సభ కార్యకలాపాలు సాగేందుకు సహకరించాలని స్పీకర్ సుమిత్రా మహాజన్ పదే పదే విజ్ఞప్తి చేశారు. అయినా సభ్యులు పట్టించుకోక పోవడంతో సభను తొలుత మధ్యాహ్నం 12గంటలకు వాయిదా వేశారు.

పార్లమెంటు సమావేశాల కుదింపు!

పార్లమెంటు రెండోవిడత బడ్జెట్ సమావేశాలు సజావుగా నడిచే పరిస్థితి లేకపోవడంతో సెషన్‌ను కుదించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు తెలిసింది. ద్రవ్య వినిమయ బిల్లును ఆమోదించిన తర్వాత సభను నిరవధిక వాయిదా వేసే దిశగా ప్రభుత్వం యోచిస్తున్నట్లు సమాచారం. పంజాబ్ నేషనల్ బ్యాంక్ కుంభకోణానికి సంబంధించిన చర్చపై అధికార, విపక్షాల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడంతో ఏడురోజులుగా సభా కార్యక్రమాలు పూర్తిగా స్తంభించిపో యాయి. ప్రభుత్వం వైపు నుంచి కూడా సభ నడిపేందుకు ఆసక్తి కనబర్చడం లేదనే వాదన వినిపిస్తోంది. కీలకమైన ఫైనాన్స్ బిల్లును గందరగోళం మధ్యే ఆమోదించి ముగించే అవకాశాలున్నాయి. ఏప్రిల్ 6వరకు జరగాల్సి ఉండగా సభలో నెలకొన్న ఈ పరిస్థితి నేపథ్యంలో ప్రభుత్వం కుదించాలని ఆలోచిస్తోంది.

రిజర్వేషన్లపై పట్టు వీడేది లేదు



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో వివిధ సామాజికవర్గాల స్థితిగతుల ఆధారంగా రిజర్వేషన్లు కల్పించే అధికారాన్ని ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకే అప్పగించాలన్న తెలంగాణ రాష్ట్ర సమితి ఎంపీల ఆందోళన పార్లమెంటులో వరుసగా ఏడో రోజు కూడా కొనసాగింది. పార్లమెంటు ఆవరణలోని మహాత్మా గాంధీ విగ్రహం ఎదుట ఎంపీలు జితేందర్ రెడ్డి, బి. వినోద్ కుమార్, బాల్క సుమన్, సీతారాం నాయక్, నగేష్, కొత్త ప్రభాకర్ రెడ్డి తదితరులు ఈ ధర్నాలో పాల్గొన్నారు. రిజర్వేషన్ల అంశంపై కేంద్రం స్పందించాలని ఎంపీలు ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. రిజర్వేషన్లతో ఒరిగేదేమీ లేదంటూ తమను బుజ్జగించే ప్రయత్నాలు చేసిన నితిన్ గడ్కరీ తీరుపై జితేందర్ రెడ్డి మాట్లాడారు. ఆయన సొంత రాష్ట్రం మహారాష్ట్రలోనూ 50 శాతం మించి రిజర్వేషన్లు అమలవుతున్నాయని గుర్తుచేసినట్టు చెప్పారు. న్యాయబద్ధమైన ఆందోళనపై వెనక్కి తగ్గేది లేదని ఆయన స్పష్టం చేశారు. మరో ఎంపీ సీతారాం నాయక్ మాట్లాడుతూ, పంజాబ్ రాష్ట్రంలో ఎస్టీ రిజర్వేషన్లు అమల్లో లేవని అన్నారు. ఆ రాష్ట్రంలో ఎస్టీ జనాభా లేదు కాబట్టి అమలు చేయడం లేదని, అలాగే జనాభా ఎక్కువగా ఉన్న తెలంగాణ రాష్ట్రంలో రిజర్వేషన్ల శాతాన్ని పెంచితే ఎందుకు తప్పుబడుతున్నారని కేంద్రాన్ని ప్రశ్నించారు. ఇప్పటికే అండమాన్, నికోబార్ దీవుల్లో కొన్ని రకాల గిరిజన, ఆదివాసీ జాతులు అంతరించిపోయే ప్రమాదంలో ఉన్నాయని వ్యాఖ్యానించారు.

యూపీఏ పక్షాలకు సోనియా విందు

● ప్రతిపక్షాలను ఏకం చేసే పనిలో కాంగ్రెస్



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : యూపీఏ భాగస్వామ్యపక్షాలకు మంగళవారం సోనియాగాంధీ తన నివాసంలో విందు ఇచ్చారు. రాహుల్‌గాంధీ కాంగ్రెస్ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత కాంగ్రెస్ పార్టీ ఈ సమావేశాన్ని నిర్వహిస్తోంది. లోక్‌సభ ఎన్నికలకు మరో ఏడాది సమయం మాత్రమే ఉండడంతో ప్రతిపక్షాలన్నింటిని ఏకం చేయాలని సోనియాగాంధీ భావిస్తున్నారు. ఇందులో భాగంగా వివిధ ప్రతిపక్ష పార్టీలను విందుకు ఆహ్వానించారు. నూతనంగా కాంగ్రెస్ అధ్యక్షుడైన రాహుల్‌గాంధీతో ఇతర పక్షాలన్నింటికి సత్సంబంధాలు నెలకొల్పడం కోసం ఈ విందు సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. దీంతో పాటు మోడీకి వ్యతిరేకంగా ప్రతిపక్షాలన్నింటిని ఏకం చేసి ఎన్నికలనాటికి బలమైన యూపీఏను నిలబెట్టాలని కాంగ్రెస్ పార్టీ వ్యూహ రచన చేసింది. మొత్తం 17 పార్టీలకు సోనియా ఆహ్వానం పంపారు. విందుకు ఎన్సీపీ నేత శరద్‌పవార్, ఎన్‌సి నేత ఒమర్ అబ్దుల్లా, డిఎంకె ఎంపీ కనిమొళి, ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ హాజరయ్యారు. కాగా, సమావేశానికి బెంగాల్ సీఎం మమతాబెనర్జీ, సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి హాజరుకాకపోవడం గమనార్హం.

నేనింకా పూరిస్థాయి నేతగా మారలేదు



డెహ్రాడూన్ (ఉత్తరాఖండ్): హిమాలయాల్లో తీర్థ యాత్ర చేస్తున్న సూపర్ స్టార్ రజనీకాంత్ మీడియాతో మాట్లాడుతూ తాను పూర్తి స్థాయి రాజకీయ నేతగా మారలేదని అన్నాడు. మంగళవారం ఇక్కడ మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు రజనీకాంత్ బదులిస్తూ.. 'నేను పూర్తి స్థాయి రాజకీయ నేతగా మారలేదు. నా పార్టీని ఇంతవరకు ప్రకటించలేదు. మీరడుగుతున్న రాజకీయ ప్రశ్నలకు నేను సమాధానాలు చెప్పను. ఇక్కడికి నేనొక తీర్థ యాత్రికుడిగా వచ్చాను. ఇది ఆధ్యాత్మిక యాత్ర. రాజకీయాలతో సంబంధం లేదు' అని చెప్పాడు. శనివారం నుంచి హిమాలయాల్లో పర్యటిస్తున్న రజనీకాంత్ ఆధ్యాత్మిక భావనతోనే ఈ ప్రయాణం సాగిస్తున్నానని తెలిపారు.

అమితాబ్ ఆరోగ్యంకోసం దేవున్ని ప్రార్థించా

అమితాబ్ ఆరోగ్యంపై ఇప్పుడే నాకు సమాచారం అందింది. ఆయన బాగుండాలని నేను దేవుడిని ప్రార్థిస్తున్నాను అని చెప్పారు. జోద్‌పూర్‌లో జరగుతున్న తగ్స్ ఆఫ్ హిందూస్థాన్ సినిమా షూటింగ్ సమయంలో సెట్‌లో అమితాబ్ పడిపోయాడు. దీనితో ముంబైనుంచి వైద్యుల బృందం హుటాహుటిన జోద్‌పూర్‌కు చేరుకుని అమితాబ్‌కు చికిత్స అందిస్తున్నది. జయలలిత మరణాంతరం తమిళనాడులో రాజకీయ శూన్య పరిస్థితి నెలకొందని రజనీకాంత్ వ్యాఖ్యానిస్తూ.. త్వరలో తాను రాజకీయాల్లోకి వస్తానని ప్రకటించిన విషయం తెలసిందే.

మంగళవారమూ మారని సీన్

● రైల్వే జోన్ అంశంపై మండిపడ్డ టీడీపీ ● కేంద్రంపై ప్రశ్నల వర్షం కురిపించిన ఎంపీలు



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: మంగళవారం కూడా అదే సీన్ రిపీట్ అయ్యింది. రోజు మారినా, వారం మారినా మా డిమాండ్లు మారవని తెలుగుదేశం మరోమారు తేల్చి చెప్పింది. ఉదయం పది గంటల నుంచి ఆ పార్టీ ఎంపీలు పార్లమెంట్ ప్రాంగణంలోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేపట్టారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా కల్పించాలని, విభజన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. రైల్వే జోన్ అంశంపై సోమవారం కేంద్రం ఇచ్చిన సమాధానం బాధ్యతారాహిత్యంగా ఉందని మాజీ కేంద్ర మంత్రి సుజనా చౌదరి ఆరోపించారు. తమ రాష్ట్రానికి రైల్వే జోన్ ఇచ్చే ఆలోచన ప్రభుత్వానికి లేనప్పుడు అసలా అంశాన్ని బిల్లులో ఎందుకు పెట్టారని ఆయన ప్రశ్నించారు. తెలుగు ప్రజల కోరికలను, ప్రత్యేక హోదా అంశాన్ని ఎందుకు సెంటిమెంట్‌గా మీరు తీసుకోవడం లేదో చెప్పే బాధ్యత మీపై ఉందని మరో ఎంపీ నిమ్మల కిష్టప్ప అన్నారు. రకరకాల గెటప్‌లకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన చిత్తూరు ఎంపీ శివప్రసాద్ మంగవారం సర్దార్ వల్లభాయ్ పటేష్ వేషధారణలో వచ్చి వినూతనంగా నిరసన తెలిపారు. స్టాచ్యూ ఆఫ్ యూనిటీ సిద్ధాంతాలను పాటించే మోడీ ముఖ్య మంత్రి చంద్రబాబుని హేళన చేయడం, ఏపీ కు అన్యాయం చేయ డం సరికా దని తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.



తెలుగు ప్రజల మీద శత్రుత్వం పెట్టుకున్నారు
ఎంపీ నిమ్మల క్రిష్టప్ప

పార్లమెంట్ సాక్షిగా బీజేపీ, కాంగ్రెస్ రాష్ట్రాన్ని చీల్చినప్పుడు విభజన చట్టంలో ఇచ్చిన హామీలు నెరవేర్చగలమా లేదా అని మీ మేధావులకు అప్పుడు తెలియలేదా? ఇచ్చిన హామీలను నెరవేర్చే బాధ్యత మీపై ఉంది. సెంటిమెంట్ ఆధారంగా రాష్ట్రాన్ని రెండు గా చీల్చారు. తెలుగు ప్రజల కోరికలను, ప్రత్యేక హోదాని ఎందుకు సెంటిమెంట్‌గా తీసుకోవడం లేదు. సెంటిమెంట్‌గా భావించి ఇవ్వలేమనడమేంటి... మహారాష్ట్రలో రైతులందరు కలిసి వచ్చి రుణమాఫీ చేయాలని కోరితే కేంద్రం సరేనంది. మరి తెలుగు ప్రజలంటే ఎందుకు శత్రుత్వం. ఇలా తెలుగు ప్రజలకు అన్యాయం చేయడం సమంజసమా? ఇచ్చిన హామీలు వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేస్తున్నాం.



సర్దార్ వల్లబాయ్ గెటప్‌లో
ఎంపీ శివ ప్రసాద్

స్టాచ్యు ఆఫ్ యూనిటీ పేరుతో ఎక్కడ లేని విధంగా సర్దార్ పటేల్ విగ్రహాన్ని మోడీ నిలబెట్టినందుకు సంతోషం. ఏపీకి ఇచ్చిన హామీలు నెరవేర్చి. 5 కోట్ల ఆంధ్రుల ఆత్మ గౌరవాన్ని కాపాడమని మోదీని కోరు తున్నా. అభివృద్ధి పనులకు నిధులు ఇవ్వకపో వడం సమంజసనం కాదు. నేను (సర్దార్ పటేల్) సంతృప్తిగా ఉండలేను. నువ్వు నన్ను అభిమానించే వాడివి నా మాట విను మోడీ. మిత్రపక్షాలను దూరం చేసుకోకు, ముఖ్యంగా చంద్రబాబును దూరం చేసుకోకు. నా మాట వింటావని, ఆంధ్ర ప్రజల ఆత్మ గౌరవాన్ని కాపాడతావని ఆశిస్తున్నాను



రైల్వే జోన్‌పై కేంద్రం బాధ్యతార హితంగా వ్యవహరిస్తోంది. ఈ అంశంపై

బాధ్యతా రహితంగా వ్యవహరిస్తున్న కేంద్రం

ఎంపీలందరూ పోరాడుతున్నారు కాబట్టి జాగ్రత్త గా సమాధానం ఇవ్వాల్సింది. రైల్వే జోన్ ఇవ్వకపోతే తీరని అన్యాయం చేసినట్టే. రైల్వే జోన్ సాధించే దిశగా కృషి చేస్తాము. జోన్ ఇస్తే ఒరిగేదేమీ లేదనే బదులు ఇస్తే మంచిది కదా. ఇవ్వ కూడదు అనుకున్నప్పుడు అస లు బిల్లులో ఎందుకు పెట్టారు.

హోదాలేదు... జోన్ రాదు

● చివరకు అపాయింట్‌మెంట్ కూడా కుదరదు

● టీడీపీకి నై, వైకాపాకు సై

● రైల్వేమంత్రి పీయూష్ గోయల్ తీరు

● మంత్రికి పార్లమెంట్ స్థాయి సంఘం చైర్మన్‌కు ఎంపీ రామ్మోహన్ లేఖ

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ :ప్రత్యేక హోదా సహా విభజన హామీలను అమలు చేయాలంటూ తెలుగుదేశం పార్టీ ఎంపీలు ఎంత స్వరం పెంచినా ఫలితం పెద్దగా కనిపించడం లేదు. ఏపీ నేతలు అడుగుతున్న వాటిలో అతి ముఖ్యమైన ప్రత్యేక హోదా ఇవ్వలేమంటూ ఇప్పటికే చేతులెత్తేసిన కేంద్రం, తాజాగా రైల్వే జోన్ విషయంలోనూ అదే తీరు కనబర్చింది. ఇదెక్కడి అన్యాయమంటూ రైల్వే మంత్రిని కలిసి నిలదీద్దామ నుకున్న టీడీపీ ఎంపీల ప్రయత్నాలను సైతం కేంద్రం సాగనివ్వలేదు. రైల్వే మంత్రి పీయూష్‌గోయల్ అపాయిమెంట్ కోసం ఉదయం నుంచి ప్రయ త్నించినా ఫలితం లేకుండా పోయింది. ఒక దశలో సాయంత్రం గం. 4.00 సమయంలో రైల్వే మంత్రిని ఎంపీల బృందం కలవనుందని తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ కార్యాలయం మీడియాకు సమాచారమిచ్చింది. ఆ తర్వాత కేంద్ర మంత్రితో భేటీ వాయిదా పడిందని తెలిపింది. కానీ రైల్వే మంత్రి అసలు అపాయింట్మెంటే ఇవ్వలేదన్న సంగతి తర్వాత బయటపడింది. ఇదిలా ఉంటే సాయంత్రం దాదాపు అదే సమయానికి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన తిరుపతి పార్లమెంట్ సభ్యులు వరప్రసాద్ రైల్వే మంత్రిని కలిసి తన నియోజకవర్గం పరిధిలోని వివిధాంశాల గురించి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ చర్య తెలుగుదేశం వర్గాలకు మరింత అసహనం కలిగించింది. చివరకు చేసేదేం లేక శ్రీకాకుళం ఎంపీ కే. రామ్మోహన్ నాయుడు రైల్వే మంత్రికి లేఖ రాశారు. రైల్వే జోన్ సాధ్యం కాదని కేంద్ర హోంశాఖ కార్యదర్శి రాజీవ్ గాబా చేసిన వ్యాఖ్యల కారణంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడతాయని లేఖలో పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజ న చట్టంలోని 13వ షెడ్యూల్‌లో ప్రత్యేక రైల్వే జోన్ ఏర్పాటు చేసే విషయాన్ని ప్రస్తావించారని రామ్మోహ న్ నాయుడు గుర్తుచేశారు. వాల్టేర్, విజయవాడ, గుంటూరు, గుంతకల్ డివిజన్లను కలిపి ఒక జోన్‌గా ఏర్పాటు చేయాలని తమ ఏపీ సీఎం ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి సూచించా రు



మళ్లీ తూలిన హిల్లరీ
కాలికి స్వల్ప గాయం

న్యూయార్క్: మధ్య ప్రదేశ్‌లో పర్యటిస్తున్న అమెరికా మాజీ ప్రథమ మహిళ హిల్లరీ క్లింటన్ మెట్లు దిగుతూ తూలడంతో కాలికి గాయం అయింది. ఐదు నెలల కింద లండన్‌లో ఒక హోటల్ వద్ద ఇదే మాదిరిగా హిల్లరీ కాలు జారడంతో కాలి బొటనవేలికి గాయం అయింది. 2016 అధ్యక్ష ఎన్నికల్లో ఓటమిగురించి వివరిస్తూ రాసిన 'వాట్ హప్పెన్డ్' పుస్తకం ప్రమోషన్‌కోసం హిల్లరీ భారత్‌లో పర్యటిస్తున్నారు. సోమవారం మండులోని జహాజ్ మహ ప్యాలెస్‌లో మెట్లు దిగుతూ కొన్ని మెట్లను దాటడంలో తొందర పాటుకు గురికావడంతో రెండు సార్లు తూలారు. అయితే ఆమె వ్యక్తిగత సహాయకులు అమెను పట్టుకున్నారు. హిల్లరీ కాలుకు స్వల్ప గాయమైంది. గాయాన్ని లెక్కచేయ కుండా హిల్లరీ లెక్కచేయకుండా సాండిల్స్ విడిచిపెట్టి ముందుకు సాగారు.

లండన్‌లో రెండు మసీదులకు వారసత్వ హోదా

లండన్:లండన్‌లో చారిత్రక ,సాంస్కృతిక ప్రాధాన్యం కలిగిన రెండు మసీదులను చారిత్రక, పురావస్తు వాసత్వ సంపదగా గుర్తించి ప్రభుత్వం వాటిని ప్రత్యేక హోదా జాబితాలో చేర్చింది. సెంట్రల్ లండన్‌లోని రీజింట్ పార్క్ లో ఉన్న కేంద్ర మసీదు ఇస్లామిక్ సాంస్కృతిక కేంద్రం, ఫాజీ మసీదు చారిత్రక ప్రాధాన్యాన్ని కలిగి ఉన్నాయని హెరిటేజ్ మంత్రి మైఖేల్ ఇల్లీస్ తెలిపారు. బ్రిటిష్ సాంస్కృతిక శాఖ ఈ రెండు మసీదులను గ్రేడ్ టూగా ప్రకటించింది.ఈ రెండు మసీదులకూ వారసత్వ సంపద హోదాని ఇవ్వడం వల్ల వీటిని పరిరక్షించడమే కాకుండా, ప్రపంచ వ్యాప్తంగా ముస్లిం పర్యాటకులను ఆకర్షించేందుకు వీలవుతుందని ఆయన అన్నారు. లండన్‌లో సెంట్ల ల్ మసీదు నిర్మాణానికి నిధిని 1910 లో ఏర్పాటు చేారనీ, రీజెంట్ పార్క్ లో దాని నిర్మాణం 1940లో చేపట్టా రనీ, అది 1977నాటికి పూర్తి అయిం దని ఆయన వివరించారు. ఫాజీ మసీదు అహ్మదీయ ముస్లిం సమా జానికి చెందిందనీ, దీనిని 1926లో నిర్మించారని ఆయన చెప్పారు. వీటిల్లో వారసత్వ సంపద హోదాకి అర్హమైనవి కొద్దిమాత్రమే ఉన్నాయి.

2025లోగా టీబీని తరిమేద్దాం

టీబీ నిర్మూలన శిఖరాగ్ర సదస్సులో ప్రధాని మోడీ



న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోడీ మంగళవారం ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో టీబీ నిర్మూలన శిఖరాగ్ర సమావేశం (ఎండ్ టీబీ సమ్మిట్)ను ప్రారంభించారు. ఈ శిఖర సమ్మేళనాన్ని ఆరోగ్య మంత్రిత్వ శాఖ, ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో), ఆగ్నేయాసియా ప్రాంతీయ కార్యాలయం, స్టాఫ్ టీబీ పార్టనర్‌షిప్‌లు సంయుక్తంగా నిర్వహించాయి. కేంద్ర ఆరోగ్య శాఖ, డబ్ల్యూహెచ్‌వో సంయుక్తంగా ఈ సదస్సు కార్యక్రమంలో పాల్గొన్నాయి. విదేశాలకు చెందిన అనేకమంది నేతలు ఈ సదస్సుకు హాజరయ్యారు. అయితే, క్షయ వ్యాధిని 2025లోగా రూపుమాపుతామని, అది తన విజన్ అని మోడీ అన్నారు. ప్రపంచం నుంచి క్షయవ్యాధిని తరిమేందుకు 2030 వరకు డెడ్‌లైన్ పెట్టుకున్నామని, కానీ భారత్‌లో అయిదేళ్లు ముందుగానే, అంటే 2025లోపే టీబీని అంతం చేస్తామని ప్రధాని తెలిపారు. 2016లో టీబీ మహమ్మారితో సుమారు 17 లక్షల మంది మరణించారు. టీబీ ఫ్రీ ఇండియా కార్యక్రమాన్ని కూడా ఆయన ఈ సందర్భంగా ప్రారంభించి, నేషనల్ స్ట్రాటజిక్ ప్లాన్(ఎన్ఎస్‌పీ) మిషన్‌లో భాగంగా క్షయవ్యాధి నివారణకు వివిధ రకాల కార్యక్రమాలు చేపడతామన్నారు. ముందుగా పరిస్థితిని సమీక్షించి... వ్యాధిని నిర్మూలించేందుకు కావాల్సిన చర్యలను చేపట్టాలని ఆయన సూచించారు. రాబోయే మూడు సంవత్సరాల్లో ఈ వ్యాధి నిర్మూలనకు ఉద్దేశించిన ఎన్ఎస్‌పీకి రూ.12 వేల కోట్లకు పైగా ఆర్థిక సహాయాన్ని అందిస్తామన్నారు.అయితే, క్షయవ్యాధిని అరికట్టేందుకు ఎన్నో కార్యక్రమాలు చేపట్టారని, కానీ అనుకున్నంత విజయవంతం కాలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు కూడా టీబీ నిర్మూలనకు చేయూతనివ్వాలన్నారు. టీబీపై పోరాటం చేయాలని అన్ని రాష్ట్ర ముఖ్యమంత్రులకు లేఖలు రాసినట్లు మోడీ తెలిపారు. భారత్‌లో టీబీ ఇంకా ప్రబలుతున్నదని, మారుమూల ప్రాంతాల్లో నివసిస్తున్న వారిలో, ముఖ్యంగా పేదల్లో ఈ వ్యాధి ఎక్కువగా కనిపిస్తున్నదన్నారు. నేషనల్ రివైజ్డ్ టీబీ కంట్రోల్ ప్రోగ్రాం అనేది డైరెక్ట్ అబ్జర్వ్‌డ్ ట్రీట్‌మెంట్(డీఓటీ) ద్వారా క్షయ రోగులకు చికిత్స అందించడానికి ఈ పథకాన్ని ప్రవేశపెట్టారని, ఈ పథకం దేశం మొత్తం విస్తరించిందని పేర్కొన్నారు.



ఖగోళంలో కొత్తగా సూపర్ ఎర్త్

న్యూఢిల్లీ: ఒక సూపర్ ఎర్త్ తో కలిపి 15 కొత్త గ్రహాలను సైంటిస్టులు కనుగొన్నారు. సైంటిస్టులు కనుగొన్న ఈ సూపర్ ఎర్త్‌పై నీటితో కూడిన చిన్న, చిన్న నక్షత్రాలున్నాయని, ఇవి సూర్య వలయానికి చేరువలో వున్నాయని తెలిసింది. ఈ నక్షత్రాలు ఖగోళ పరిశోధనలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. జపాన్‌లోని టోక్యో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆధ్వర్యంలోని శాస్త్రవేత్తల బృందానికి తెరుయుకి హిరానో అనే సైంటిస్ట్ నాయకత్వం వహించారు. అరుణవర్ణంలో బాగా కాంతులు వెదజల్లుతున్న నక్షత్రానికి కె2-155 అని నామకరణం చేశారు. ఇది భూమి నుంచి 200 కాంతి సంవత్సరాల దూరంలో వుందని శాస్త్రవేత్తలు తెలిపారు. ఈ నక్షత్రాల మధ్య 1.6 రెట్ల వ్యాసార్థంతో వున్న సూపర్ ఎర్త్ కి కె2-155డి అని పేరు పెట్టారు. అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ(నాసా) డేటాను అనుసరించి ప్రచురించిన ఒక ఖగోళ మేగజైన్‌లో ఈ విషయాలు వెల్లడించారు. ఈ సూపర్ ఎర్త్ ఉపరితలంలో ద్రవరూప పదార్థం వున్నట్టు పరిశోధనలలో వెల్లడైంది. సూర్యకుటుంబంలోని గ్రహాలకున్న లక్షణాలే కొత్తగా కనుగొన్న నక్షత్రాలకు కూడా వున్నట్టు ఈ పరిశోధనలు వెల్లడించడం విశేషం.

పాలస్తీనా ప్రధానికి తృటిలో తప్పిన ప్రమాదం

● పర్యటనకు ముందే పేలుడు

గాజా: పాలస్తీనా ప్రధాని రమి హమ్‌దల్లా మంగళవారం గాజాలో పర్యటించాల్సి ఉంది. అయితే ఆయన పర్యటనకుముందు గాజాలో పేలుడు ఘటన చోటుచేసుకుంది. ప్రధాని హమ్‌దల్లా ఓ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించేందుకు గాజాకు వస్తున్నారని తెలిసి ముందే పేలుడుకు పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. పేలుడు వల్ల కొందరికి స్వల్ప గాయాలయ్యాయి. అయితే, ప్రధాని హమ్‌దల్లాకు ఎటువంటి ప్రమాదం జరగలేదు. ఆయన సురక్షితంగా ఉన్నారు. పేలుడు ఘటన తర్వాత యథావిధిగా ఆయన గాజాలో పర్యటించారు. ఎరిజ్ చెక్‌పాయింట్ నుంచి ప్రధాని హమ్‌దల్లా గాజాలోకి ఎంటర్ అయ్యారు. ఎరిజ్ చెక్‌పా యింట్ నుంచి ప్రధాని హమ్‌దల్లా గాజాలోకి ప్రవేశించారు. పేలుడులో చాలా వాహనాలు ధ్వంసమైనట్లు సెక్యూరిటీ వర్గాలు పేర్కొన్నారు.

విదేశీ న్యాయవాద సంస్థలకు చెక్
సుప్రీంకోర్టు స్పష్టం

న్యూఢిల్లీ: విదేశీ న్యాయవాద సంస్థలు భారత దేశంలో తమ కార్యాలయాలను ఏర్పాటుచేయరాదని సుప్రీంకోర్టు మంగళవారం స్పష్టం చేసింది. అయితే విదేశీ న్యాయవాద సంస్థల న్యాయవాదులు విదేశీ చట్టాలపై న్యాయ సలహాలు ఇవ్వవచ్చునని పేర్కొంది. విదేశీ న్యాయవాదులు భారతదేశం వచ్చి, అంతర్జాతీయ వ్యాపార వివాదాల పరిష్కారంలో పాల్గొనవచ్చునని తెలిపింది. జస్టిస్ ఆదర్శకుమార్ గోయల్, జస్టిస్ ఉదయ్ ఉమేస్ లలిత్ ధర్మాసనం ఈ తీర్పు వెలువరించింది.పరిమిత ప్రయోజనాల కోసం అయినప్పటికీ విదేశీ న్యాయవాదులు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ప్రవర్తనా నియమావళికి లోబడి పనిచేయవలసిందేనని జస్టిస్ గోయల్ తెలిపారు. న్యాయ సేవలను అందజేసే బీపీఓ కంపెనీలు అడ్వకేట్ చట్టం పరిధిలోకి రాబోవని వివరించింది. అటువంటి కంపెనీలు భారతదేశంలో కార్యకలాపాలను నిర్వహించవచ్చునని తెలిపింది.

నరేష్ మా పార్టీ వీడడం మాకే మేలు
ములాయం స్పందన



న్యూఢిల్లీ: వివాదాస్పద వ్యాఖ్యలతో తరచు వార్తల్లో కనిపించే సమాజ్‌వాదీ పార్టీ సీనియర్ నేత నరేష్ అగర్వాల్ బీజేపీలో చేరడం వల్ల తమ పార్టీకి వచ్చే నష్టం లేదని ఎస్పీ వ్యవస్థాపకుడు ములాయం సింగ్ యాదవ్ అన్నారు. రాజ్యసభ సీటును తనను కాదని జయాబచ్చన్‌కు కేటా యించడంపై అసంతృప్తితో ఉన్న రేష్ అగర్వాల్ సోమవారం బీజేపీలో చేరారు. దీనిపై ములాయం స్పందించారు. 'ఆయన పార్టీని విడిచిపెట్టడం మా పార్టీకే మేలు. ఆయన రాజీనామా చేస్తే పార్టీకి నష్టమని మేము ఏనాడూ అనుకోలేదు' అని ములాయం కుండబద్దలు కొట్టారు. జయాబచ్చన్ ఓ డ్యాన్సర్ అని, డ్యాన్సర్ వల్ల తాను టిక్కెట్ కోల్పోయాడని నరేస్ అగర్వాల్ చేసిన వ్యాఖ్యలపై ములాయంను స్పందించమని కోరగా, జయాబచ్చన్ గురించి ఆయన ఏమీ చెప్పదలచుకున్నారో బహిరంగంగానే ఆయన చెప్పారని, ఆ విషయం మీడియాకు తెలిసిందేనని' ఆయన సమాధానమిచ్చారు. కాగా, నరేస్ అగర్వాల్ వ్యాఖ్యలను బీజేపీ నుంచి మొదటగా కేంద్ర మంత్రి సుష్మా స్వరాజ్ ఖండించగా, మరో మంత్రి స్మృతి ఇరానీ కూడా మంగళవారం తీవ్రస్థాయిలో ఖండించారు. మహిళల గౌరవానని ఎవరు సవాలు చేసినా రాజకీయాలకు అతీతంగా అంతా ఒకటై తిప్పికొడతామని స్మృతి హెచ్చరించారు.

' నాట్యకత్తె' అనటం తప్పే

రాజ్యసభ సభ్యురాలు జయా బచ్చన్‌పై తాను చేసిన వ్యాఖ్యల పట్ల తాజాగా బీజేపీలో చేరిన నరేష్ అగర్వాల్ విచారం వ్యక్తం చేశారు. తన మాటలను మీడియా వక్రీకరించిందని ఆరోపించారు. బీజేపీ తీర్థం పుచ్చుకున్న తర్వాత ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ సినిమాల్లో నటించి, నాట్యంచేసే వ్యక్తి కోసం తనకు రాజ్యసభ సభ్యత్వం ఇవ్వకుండా తప్పించుకుం దని ఆరోపించారు. దీంతో ఆయన వెనుకకు తగ్గారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఇతరుల మనోభావాలను గాయపరచడం తన ఉద్దేశం కాదన్నారు. తనమాటలు ఎవరినైనా గాయపరచి నట్లయితే తాను విచారం వ్యక్తం చేస్తున్నానని, ఆ వ్యాఖ్యలను ఉపసంహరించుకుంటున్నానన్నారు. అంతేకాకుండా, తన వ్యాఖ్యలను మీడియా వక్రీకరించిందని ఆయన పేర్కొన్నారు.

క్రీడాప్రభ



ప్రముఖ వాచీ కంపెనీ టిస్సాట్ ప్రమోషన్‌లో భాగంగా ఫోటోలకు ఫోజిస్తున్న విరాట్ కోహ్లీ

టెన్నిస్ అకాడమీల రెగ్యులేషన్ దిశగా ఐటా

న్యూఢిల్లీ: టెన్నిస్ అకాడమీల్లో సమస్యలను పరిష్కరించే దిశగా ఐటా(ఆల్ ఇండియా టెన్నిస్ అసోసియేషన్) అడుగులు వేస్తోంది. అన్ని ప్రైవేట్ అకాడెమీల్లోనూ ఒకే రకమైన విధానాలు అమలయ్యేలా దేశంలోని అన్ని టెన్నిస్ అకాడెమీలు తమ వద్ద రిజిస్టర్ చేయించుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. రిజిష్టర్ చేయించుకోని అకాడెమీలు భవిష్యత్తులో టోర్నమెంట్‌లు నిర్వహించే అధికారాలను కోల్పోతాయని హెచ్చరించింది.

ప్రైవేట్ టెన్నిస్ అకాడెమీలు నిర్వహిస్తున్న టోర్నమెంట్‌లు ప్రొఫెషనల్‌గా జరగడం లేదనీ, కొన్ని టోర్నమెంట్‌లలో కనీసం అబ్బాయిలకు, అమ్మాయిలకు వేరు వేరుగా టాయిలెట్లు కూడా లేని పరిస్థితిలున్నాయని ఫిర్యాదులు వెల్లువెత్తడంతో ఐటా ఈ చర్యలకు పూనుకుంది.

టెన్నిస్ టోర్నమెంట్లు - బంగారు బాతుగుడ్లు

టెన్నిస్ టోర్నమెంట్లు బంగారు బాతుగుడ్లుగా మారాయని ఐటా వ్యాఖ్యానించింది. సరైన విధివిధానాలు లేకుండా, సదుపాయాలు అందించకుండా కేవలం డబ్బులకోసం టోర్నీలు నిర్వహిస్తున్నారని, ఇలాంటి విధానానికి చరమగీతం పాడాలని నిర్ణయించుకున్నట్టు తెలిపింది.

''ఒక సూపర్ సిరీస్ టోర్నమెంట్ నిర్వహిస్తే.. కనీసం 500 ఎంట్రీ ఫీజు అనుకున్నా తక్కువలో తక్కువ 100 ఎంట్రీలు వస్తున్నాయి. మొత్తం రూ.50000 అవుతోంది. టెన్నిస్ బాల్స్‌కి రూ.15000 మించి అవ్వదు. అంటే టోర్నీకి రూ.35000 లాభం. మరి అలాంటి టోర్నీలు ఒకే ఆర్గనైజర్ వేరు వేరు ప్రాంతాల్లో ఏడాదికి 25 నిర్వహించాడనుకుంటే ఎంత లాభమో ఆలోచించండి'' అని ఓ ఐటా అధికారి వివరించాడు. ఐటా అధికారి లెక్కల ప్రకారం దగ్గర దగ్గర రూ.9 లక్షల ఆదాయం ఉత్తి పుణ్యాన ఆర్గనైజర్లు సంపాదిస్తున్నారన్నమాట..

నెంబర్ వన్ బౌలర్ రబాడా

దుబాయ్: రబాడా నెంబర్ వన్ బౌలర్ అంట. ఈ విషయం వాళ్లూ, వీళ్లూ చెప్పడం లేదండి బాబూ. తాజాగా విడుదల చేసిన ఐసీసీ ర్యాంకింగ్స్ చెప్తున్నాయి. ఆసీస్‌తో జరిగిన రెండో టెస్టులో 11 వికెట్లు తీయడంతో పాయింట్లు అమాంతం పెరిగి మనోడు టెస్టు ర్యాంకింగ్స్‌లో నెంబర్ వన్ స్థానానికి చేరిపోయాడు. అయితే రెండు టెస్టుల బ్యాన్ విధించడంతో ఈ ర్యాంకు ఎక్కువ రోజులు వుండకపోవచ్చు. మరో వైపు భారత్‌కు చెందిన అశ్విన్ రెండు స్థానాలు ఎగబాకి నాలుగో స్థానానికి చేరుకున్నాడు. రవీంద్ర జడేజా మూడో స్థానంలో స్థిరంగా వున్నాడు.

ఇక బ్యాటింగ్‌లో ఆసీస్‌పై సెంచరీ సాధించిన డివిలియర్స్ 5 స్థానాలు ఎగబాకి 7వ ర్యాంకు సాధించాడు. అర్థసెంచరీతో ఫామ్ దొరకబుచ్చుకునేందుకు ప్రయత్నించిన హషీమ్ ఆమ్లా ఒక ర్యాంకు ఎగబాకి 9వ ర్యాంకులో నిలిచాడు. ఇక తొలి రెండు స్థానాల్లో ఎప్పట్లాగే ఆసీస్ కెప్టెన్ స్టీవ్ స్మిత్, భారత్ కెప్టెన్ విరాట్ కోహ్లీ నిలిచారు.

- **ఐసీసీపై పీటర్సన్ ఆగ్రహం :** రబాడాపై రెండు మ్యాచ్‌ల నిషేధం విధించిన ఐసీసీపై మాజీ ఇంగ్లాండ్ క్రికెటర్ కెవిన్ పీటర్సన్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఈతరంలో టెస్ట్ క్రికెట్ ఆడనందుకు సంతోషిస్తున్నానని ట్విట్టర్ ద్వారా తెలిపాడు.
- **దేశవాళీల్లో డీఆరెస్ కావాలి :** రంజీ కెప్టెన్-అంపైర్ కాన్‌క్లేవ్‌లో దేశవాళీల్లో డీఆరెస్ కావాలని ఆటగాళ్లు డిమాండ్ చేశారు. అంపైర్ల తప్పిదాల వల్ల కెరీర్ ప్రమాదంలో పడే అవకాశం వుందని తెలిపారు. కూకబుర్రా స్థానంలో ఎస్‌జీ బంతులను వాడడంపై కూడా ఆటగాళ్లు అభ్యంతరం వ్యక్తం చేశారు.
- **మోసపోయిన ద్రావిడ్, సైనా:** ఓ మోసపూరిత స్కీమ్‌లో ద్రావిడ్, సైనా, ప్రకాశ్ పదుకునే వంటి ప్రముఖులు డబ్బులు పోగొట్టుకున్నట్టు కర్ణాటక పోలీసులు తెలిపారు. ప్రముఖ స్పోర్ట్స్ జర్నలిస్టు సూత్రం సురేశ్ ఈ స్కీమ్‌లో డబ్బులు పెట్టుబడి పెట్టేలా ప్రోత్సహించినట్టు సమాచారం.



ఖాయం చేస్తారా?

ఆడిన మూడు మ్యాచుల్లో రెండు మ్యాచ్‌లు గెలిచి పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉన్నప్పటికీ... ఫైనల్‌లో స్థానం ఖాయం చేసుకోవాలంటే భారత్‌కు ఇంకో విజయం అవసరం ఉంది. నేడు బంగ్లాదేశ్‌తో జరుగనున్న మ్యాచ్‌లో విజయం సాధిస్తే మిగిలిన మ్యాచ్‌ల ఫలితాలతో సంబంధం లేకుండా భారత్ ఫైనల్‌కు చేరిపోతుంది. అయితే చూడబోతే అంత వీజీలా కనిపించడం లేదు. ఇప్పటికే లంకపై భారీ స్కోరు ఛేదించిన బంగ్లాదేశ్ మరో సంచలనం సృష్టించేందుకు సిద్ధంగా వుంది.

- భారత్ గెలిస్తే ఫైనల్‌కే
- ఓడితే మారనున్న సమీకరణాలు
- సంచలనానికి సిద్ధమంటున్న బంగ్లాదేశ్

టాస్ కీలకం

ప్రపంచంలో ఏమూల క్రికెట్ జరిగినా టాస్ గెలవడం కీలకం అయిపోయింది. ప్రస్తుతం శ్రీలంకలో మరీనూ. టాస్ గెలిచి మరో ఆలోచన లేకుండా బ్యాటింగ్ ఎంచుకునేందుకు జట్లు మొగ్గుచూపుతున్నాయి. ఇప్పటి వరకూ జరిగిన అన్ని మ్యాచుల్లోనూ చేజింగ్ చేసిన జట్లే గెలవడం అందుకు కారణం. తొలుత బ్యాటింగ్ చేసిన జట్లు మంచి ఆరంభాలు దక్కినా భారీ స్కోరు చేయలేని సందర్భాలు ఎక్కువగా కనిపిస్తుంటే.. భారీ స్కోరు చేసినా ఛేదించిన మ్యాచ్ కూడా చూశాం. కాబట్టి మరోసారి టాస్ గెలిచిన జట్టు ఫీల్డింగ్ ఎంచుకోవడం, విజయం మీద ధీమాతో ఫీల్డ్‌లోకి దిగడం ఖాయంగా కనిపిస్తోంది. జట్ల బలాబలాలతో సంబంధం లేకుండా అదే ఆలోచనతో ముందుకు దిగనున్నాయి. ఇప్పటి వరకూ ఏ జట్టూ లక్ష్యాన్ని కాపాడుకునే బౌలర్లు మాకున్నారు అనే ధీమాతో లేదు. లక్ష్య ఛేదనలో ప్రత్యర్థి బ్యాట్స్‌మెన్ బాదుతుంటే నిలబడి చూడటం తప్ప కెప్టెన్లు ఏమీ చేయలేని పరిస్థితి.

ఓడినా అవకాశాలున్నాయి

రెండు మ్యాచ్‌లు గెలవడంతో నాలుగు పాయింట్లతో పాటూ 0.21 నెట్ రన్‌రేట్‌తో భారత్‌కు ఓడినా ఫైనల్‌కు అవకాశాలున్నాయి. మరీ బంగ్లాదేశ్ భారత్ మీద భారీ విజయం సాధిస్తే తప్పించి ఇబ్బంది లేదు. అందుకని బంగ్లాని తేలిగ్గా తీసుకునే అవకాశం లేదు. ఇదే సిరీస్‌లో 215 పరుగుల లక్ష్యాన్ని అలవోకగా ఛేదించిన బంగ్లాను తేలిగ్గా తీసుకోవడం వల్లనష్టమే గానీ లాభం అయితే వుండబోదు.

అటు వైపు బంగ్లాదేశ్ పరిస్థితి కూడా అంతే. ఈ మ్యాచ్‌లో ఓడినా శ్రీలంకపై భారీ విజయం సాధిస్తే ఆ జట్టుకూ అవకాశాలుంటాయి. మొత్తంగా ఎవరు గెలిచినా, ఎవరు ఓడినా ఇరు జట్లకూ ఫైనల్ దారులు ఇంకా తెరిచే ఉంటాయి.

రిస్కు తీసుకుంటారా?

ఆరంభ మ్యాచ్‌లో శ్రీలంక చేతిలో పరాజయం పాలవ్వడం రోహిత్ సేనకు పెద్ద షాక్. దాంతో తర్వాతి మ్యాచుల్లో రిస్కు చేయలేని పరిస్థితిలోకి జట్టు వెళ్లిపోయింది. అక్సర్ పటేల్, దీపక్ హుడా, మొహమ్మద్ సిరాజ్ లాంటి సత్తా వున్న ఆటగాళ్లకు కూడా ఇంకా ఆడే అవకాశం రాలేదు. నేటి మ్యాచ్‌లో కూడా వారిది అదే పరిస్థితి కావొచ్చు. మహాఅయితే విఫలమవుతూ వస్తున్న రిషబ్ పంత్ స్థానంలో లోకేశ్ రాహుల్‌ను తీసుకొచ్చినట్టే.. బౌలింగ్‌లో ధారలంగా పరుగులిస్తున్న ఉనద్కత్ స్థానంలో సిరాజ్‌కు అవకాశం ఇవ్వొచ్చు. స్పిన్నర్లు వాషింగ్టన్ సుందర్, చాహల్‌లు కూడా రాణిస్తుండడంతో అంతకుమించి జట్టులో మార్పులకు అవకాశం లేనట్టే.

ఓపెనింగ్ వైఫల్యాలు

రోహిత్ శర్మ ఓపెనర్‌గా విఫలమవుతూ వస్తుండడం భారత్‌ను ఇంకా కలవరపెడుతోంది. తొలి రెండు మ్యాచ్‌లు అదరగొట్టిన శిఖర్ ధావన్ నుంచి మరిన్ని మ్యాచ్‌ల్లో భారీ స్కోర్లు ఆశించడం అత్యాశే అవుతుంది. ఈ పరిస్థితుల్లో పరిస్థితులకు తగ్గట్టు ఆడగల రాహుల్‌ని ఓపెనింగ్ ఆడించి, కెప్టెన్ రోహిత్ నాలుగో స్థానంలోకి వెళ్తే బాగుంటుందని విశ్లేషకుల మాట. ఇదే స్థానంలో ఆడుతూ ముంబయి ఇండియన్స్ జట్టుకి ఒకటి కంటే ఎక్కువ సార్లు ఐపీఎల్ కప్ అందించిన ఘనత రోహిత్‌ది. అదే ఫార్ములా కొనసాగించడమా, లేక ఓపెనర్‌గానే ఓ భారీ స్కోరు చేయడమా అనేది రోహిత్ చేతుల్లోనే వుంది.

DSPORT

నేటి సాయంత్రం 7 గంటలకు ప్రత్యక్ష ప్రసారం డీ స్పోర్ట్స్, జియో టీవీలో

ఆల్ ఇంగ్లాండ్ గెలుస్తారా?

- శ్రీకాంత్, సింధూలపై ఆశలు
- సైనాకు క్లిష్టమైన డ్రా

న్యూఢిల్లీ : ఆల్ ఇంగ్లాండ్ చాంపియన్ షిప్స్ గెలవడం అంటే బ్యాడ్మింటన్ ర్యాకెట్ పట్టుకున్న ఆటగాడికి ప్రపంచాన్ని గెలిచినంత సంబరం. వందేళ్ల ఘన చరిత్రగల టోర్నీని మరోసారి గెలిచేందుకు భారత బృందం సిద్ధమైంది. సైనా నెహ్వాల్, పి.వి సింధు, శ్రీకాంత్, హెచ్ ఎస్ ప్రణయ్, సాయి ప్రణీత్ లతో భారత్ తరపున టైటిల్ నెగ్గగల ఆటగాళ్లకు కొదవలేదు. అయితే గత 17 ఏళ్ల నుంచీ ఓ భారత స్టార్ ఇక్కడ టైటిల్ నెగ్గలేదు.





చివరిసారి పుల్లెల గోపిచంద్ 2001లో టైటిల్ తీసుకొస్తే.. 1980లో మొదటిసారి ప్రకాశ్ పదుకునే చరిత్ర ఆ తర్వాత 2015లో సైనా నెహ్వాల్ ఫైనల్‌కు చేరడమే భారత్ అత్యున్నత ప్రదర్శన. పి.వి గతంలో క్వార్టర్ ఫైనల్ వరకూ చేరగలిగింది. నిరుడు తొలి రౌండ్‌లోనే నిష్క్రమించిన శ్రీకాంత్ ఈసారి మెరుగైన ప్రదర్శన చేయాలని ఆరాటపడుతున్నాడు. ఇక ప్రణయ్, ప్రణీత్‌లు సంచలనాలు సృష్టించగల సమర్థులు. ఏమైనా భారత బ్యాడ్మింటన్ స్వర్ణయుగంలో కొనసాగుతున్న సమయంలో మరోసారి ఆల్ ఇంగ్లాండ్‌ను గెలవగలదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

నేటినుంచే టోర్నీ మొదలుకానుండగా.. ఈ నెల 18వ తేదీన విజేతలెవరో తేలిపోతుంది.

రెండు మ్యాచ్‌లు గెలిపించలేరా?



కింగ్స్ ఎలెవన్ పంజాబ్ కెప్టెన్ అశ్విన్‌తో కోచ్ సెహ్వాగ్

- గేల్, యువీలపై సెహ్వాగ్

న్యూఢిల్లీ: గేల్ ప్రపంచంలోని విధ్వంసకర ఆటగాళ్లలో ఒకడు. యువరాజ్ భారత్‌కు టీ20, వన్డే ప్రపంచకప్ అందించడంలో కీలక పాత్ర పోషించిన ఆటగాడు. అయితే ఆ ఇద్దరు ఆటగాళ్లు రెండు మ్యాచ్‌లు గెలిపించినా చాలు అంటున్నాడు కింగ్స్ ఎలెవన్ పంజాబ్ మెంటర్ సెహ్వాగ్.

ఐపీఎల్‌లో ఆ ఇద్దరి ఆటగాళ్లను ఏ ఐపీఎల్ జట్టు కొనేందుకు సిద్ధపడకపోగా.. 2 కోట్ల బేస్ ప్రైస్‌కు పంజాబ్ జట్టు వారిని సొంతం చేసుకుంది. ఎవరికీ అవసరం లేని వాళ్లని కొనుగోలు చేయడం అనవసర పెట్టుబడి అనిపించలేదా అని విలేకరులు అడిగిన ప్రశ్నకు కనీసం రెండు మ్యాచ్‌లు గెలిపించినా మా పెట్టుబడి మాకు వచ్చేసినట్టే అనే సమాధానమిచ్చాడు సెహ్వాగ్. ఎక్కువ మంది బిడ్డర్లు లేకపోవడం మంచికే అయిందనీ.. మిగిలిన జట్లు కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపించి వుంటే ఈ స్టార్ ఆటగాళ్ల రేటు భారీగా పెరిగేదని, ఆ రకంగా వారిని తక్కువకే సొంతం చేసుకున్నందుకు సంతోషంగా వుందన్నాడు.

ఈసారి కప్పు గెలుస్తాం

తొలి సారి ఐపీఎల్ కప్పు గెలిచేందుకు కింగ్స్ ఎలెవన్ పంజాబ్ జట్టు సిద్ధంగా ఉందని సెహ్వాగ్ తెలిపాడు. గత పదేళ్లలో అత్యున్నత పంజాబ్ జట్టు ఇదేనని అభిప్రాయపడ్డాడు. అశ్విన్‌ను ట్రంప్ కార్డ్‌గా అభివర్ణిస్తూ.. ఒక బౌలర్ కెప్టెన్‌గా వుండడం జట్టుకు కలిసొస్తుందని చెప్పాడు. ఆఖరి ఓవర్లో 10, 15 పరుగులు అవసరమైతే.. ఆ సమయంలో ఒక బౌలర్ మాత్రమే గెలిపించగలడు, బౌలర్ కెప్టెన్ మరిన్ని మ్యాచ్‌లు గెలిపించగలడు అని సెహ్వాగ్ వ్యాఖ్యానించాడు.

ఇప్పటివరకూ జరిగిన టోర్నీల్లో బ్యాటింగ్ పరంగా బలంగా వున్న పంజాబ్ ఎలెవన్ జట్టు.. బౌలింగ్ లోపాల వల్ల చాలా మ్యాచ్‌లు కోల్పోతూ వస్తుండడం విశేషం.

'సిస్టర్స్ పోరు'లో వీనస్ గెలిచింది

ఇండియన్‌వెల్స్: అక్కా చెల్లెల పోరులో అక్కనే గెలిచింది. దాదాపు 14 నెలల విరామం అనంతరం బరిలోకి దిగిన సెరీనా విలియమ్స్ తన అక్క వీనస్ విలియమ్స్ చేతిలో 3-6, 4-6 తేడాతో ఓడిపోయింది. నాలుగు గ్రాండ్ స్లామ్ టోర్నీల తర్వాత అతి పెద్ద టోర్నీగా పేరుపొందిన డబ్ల్యుటీఏ/ఏటీపీ ఇండియన్ వెల్స్ టోర్నీలో సెరీనా విలియమ్స్ రెండు రౌండ్లు తేలికగానే గెలిచింది. అయితే మూడో రౌండ్లో తన సోదరీ 10వ సీడెడ్ వీనస్‌ను ఢీకొంది. ఇప్పటివరకు అక్కా చెల్లెళ్లు 29 సార్లు పలు టోర్నీల్లో పోటీ పడ్డారు. మంగళవారం నాటి మ్యాచ్‌కంటే ముందు.. చివరిసారిగా 2017 ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్లో ఇద్దరు చెల్లెళ్లు పోటీపడ్డారు. తొలిసారిగా వీరిద్దరు 1998లో ఆస్ట్రేలియన్ ఓపెన్‌లోనే పోటీ పడ్డారు. ఈ విజయంతో వీనస్ నేరుగా 16వ రౌండ్లోకి ప్రవేశించింది. ఈ రౌండ్లో అనస్తాసిజా సెవస్తోవాతో లేదా 12వ సీడెడ్ జులియా గోర్జెస్‌తో ఆడుతుంది. అంతకు ముందు ఇద్దరు సోదరీమణులు కలిసి గోల్ఫ్ కార్ట్‌లో స్టేడియం వద్దకు చేరుకున్నారు. అనంతరం టన్నెల్ మార్గం ద్వారా కోర్టులోకి ప్రవేశించారు. ప్రేక్షకులు వీరిద్దరికి చప్పట్లతో స్వాగతం పలికారు. వీనస్ ఆరు ఏస్‌లను సాధించగా, ఎనిమిది డబుల్ ఫాల్ట్‌లను చేసింది. సెరీనా నాలుగు ఏస్‌లను సాధించగా, ఆమె సర్వీస్‌లను వీనస్ నాలుగు సార్లు బ్రేక్‌చేసి పాయింట్లు సాధించింది. ఈ టోర్నీని సెరీనా, వీనస్‌లు 17 ఏళ్ల అనంతరం ఆడుతున్నారు. 2001లో బూయింగ్ (వ్యతిరేకంగా ప్రేక్షకులు గేలిచేయటం) ఘటన అనంతరం వీరిద్దరు 14 ఏళ్ల పాటు ఈ టోర్నీకి దూరంగా ఉన్నారు. అనంతరం విలియమ్స్ సోదరీమణులతో ఇండియన్ వెల్స్ టోర్నీ నిర్వాహకుల చర్చల అనంతరం వీరు తిరిగి ఈ టోర్నీలోకి అడుగుపెట్టారు.



స్లోనె స్టీఫెన్స్ ఓటమి

యుఎస్ ఓపెన్ ఛాంపియన్ స్లోనె స్టీఫెన్స్ మూడో రౌండ్లో ఓటమి పొందింది. అన్‌సీడెడ్ 24 ఏళ్ల అమెరికన్ టెన్నిస్ బామ స్లోనె స్టీఫెన్స్ ప్రపంచ నం.19 డారియా కసాత్‌కినా చేతిలో 4-6, 3-6 తేడాతో ఓడిపోయింది. వచ్చే వారంలో 25వ వడిలోకి ప్రవేశిస్తున్న స్లోనె 30 ఏళ్లు వచ్చేవరకు ఆడతానని పేర్కొంది. విలియమ్స్ సోదరీ మణులను ఓడించిన రెండో అమెరికా క్రీడాకారిణి స్లోనె స్టీఫెన్స్. అంతకు ముందు లిండ్సే డావెన్‌పోర్ట్, సెరీనా, వీనస్‌లను ఓడించింది. ఆస్ట్రేలియన్ ఓపెన్ ఛాంపియన్ నెదర్లాండ్స్ క్రీడాకారిణి కరొలినా వొజ్నియాక్కి, బెలారస్ క్రీడాకారిణి అలియాకసాండ్రా సస్నోవిచ్‌పై 6-4, 2-6, 6-3 తేడాతో గెలిచి నాలుగో రౌండ్లోకి ప్రవేశించింది.

పురుసుల సింగిల్స్‌లో...

ప్రపంచ నం.1 స్విట్జర్లాండ్ టెన్నిస్ దిగ్గజం రోజర్ ఫెదరర్, సెర్బియాకు చెందిన ఫిలిప్ క్రజినొవిక్‌పై 6-2, 6-1 తేడాతో గెలిచి తర్వాతి రౌండ్లోకి దూసుకుపోయాడు. 36 ఏళ్ల ఫెదరర్ తన ప్రత్యర్థిని ఓడించడానికి 58 నిమిషాలను మాత్రమే తీసుకున్నాడు. 'ఈ రోజు ఆటలో నేను అన్ని రకాల ప్రయోగాలను చేస్తూ ఆటను ఆస్వాధించాను. ఎక్కువ శాతం అటాకింగ్‌తోనే నా ఆట కొనసాగింది' అని ఫెదరర్ మ్యాచ్ అనంతరం మీడియాతో వ్యాఖ్యానించాడు. తర్వాతి రౌండ్లో ఫెదరర్ జెరిమి చార్డితో తలపడనున్నాడు.

Printed & Published by MOOTHA GOUTAM on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.

Lively Interaction For Ever
ఆంధ్రప్రభ
lifepage2012@gmail.com
లైఫ్
బుధవారం
14 మార్చి 2018



రేపటి నుంచి పదవ తరగతి పరీక్షలు

ఒత్తిడిని జయించండిలా!

కొందరు విద్యార్థులు ..విద్యాసంవత్సరం అంతా తరగతి గదిలో చురుగ్గా ఉంటారు. స్లిప్ టెస్టులు, యూనిట్ టెస్టులు, త్రైమాసిక, అర్థవార్షిక, ప్రీఫైనల్ పరీక్షలు చాలా బాగారాస్తారు. టీచర్లతో సెహబాష్ అనిపించుకుంటారు. కాని ఫైనల్ ఎగ్జామ్స్‌కు వచ్చేసరికి తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతారు. మరీ ముఖ్యంగా పదవ తరగతి వార్షిక పరీక్షలనగానే ఏడాదంతా లేని భయం పట్టుకుంటుంది. ఎందుకు? వారిలో రాసే సామర్థ్యం లేకనా? కాదు. ఏదో ఆత్మన్యూనతా భావం వారిని వెంటాడుతుంది. అంతవరకు ఉన్న ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తుంది. అందుకే వారు తీవ్ర మానసిక ఒత్తిడికి లోనవుతారు. తల్లిదండ్రులు ,గురువులు ధైర్యం చెప్పినా..పాస్ అవుతామా? లేదా? అనే భయం వారిని పట్టి పీడిస్తుంది. అలాంటి విద్యార్థులు ఈ ఒత్తిడిని జయించి, ఆత్మ స్థైర్యంతో పరీక్షలు రాయాలంటే ఏం చేయాలి? అందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏంటి? పదవ తరగతి పరీక్షలు రాసేందుకు సిద్ధమవుతున్న విద్యార్థుల ఉత్తీర్ణతను కాంక్షిస్తూ.. ఆంధ్రప్రభ లైఫ్ అందిస్తున్న ప్రత్యేక సమాచారం!

రాష్ట్రవ్యాప్తంగా రేపటి (15వ తేదీ) నుంచి పదోతరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే చాలా మంది విద్యార్థులు పూర్తిస్థాయిలో పరీక్షలకు సిద్ధం అయ్యారు. కాని మరికొందరు మాత్రం కొన్నిరకాల ఆలోచనలతో అనవసరమైన ఒత్తిడికి లోనవడం సర్వసాధారణం. ఈ భయాందోళనలను, ఒత్తిడిని జయించి మానసికంగా పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలో, ఎలాంటి ప్రణాళికలు ముందస్తుగా అమలు చేయాలో తెలుసుకుందాం!

మానసిక సంసిద్ధత

ప్రతి విద్యార్థి ముందుగా తనను తాను విశ్లేషించుకోవడం చాలా అవసరం. రాష్ట్రంలో నేను ఒక్కడినే పది పరీక్షలు రాయడం లేదు. నాతోపాటు దాదాపు 4 లక్షల మంది రాస్తున్నారు. వారిలో నేనూ ఒక్కడిని. ఇంతమందికి లేని భయం, ఆందోళన నాకే ఎందుకుండాలి? అవసరం లేదు. రాష్ట్రంలో ఎస్ఎస్‌సీ బోర్డు స్థాపించినప్పటి నుంచి ఎన్నో ఏండ్లుగా, ఎన్నో లక్షల మంది ప్రతి ఏడాది ఈ పరీక్షలకు హాజరవుతున్నారు. తమ శక్తి మేరకు ఫలితాలు సాధిస్తున్నారు. జీవితంలో వివిధ రకాల స్థాయిల్లో విజయకేతనం ఎగురవేస్తున్నారు. ఇంతమంది, ఇన్ని రకాలుగా ఆయా రంగాల్లో విజయం సాధించినప్పుడు మనమెందుకు సాధించలేమని ఆలోచించాలి. ఇలా చేయడంవల్ల విద్యార్థి మానసికంగా పరీక్షలకు సిద్ధమైనట్లే!

స్వయం విశ్లేషణ

విద్యా సంవత్సరం (2017, జూన్) ప్రారంభం నుంచి ఇప్పటి వరకు మనమందరం మన శక్తి మేరకు ప్రతి సబ్జెక్టులో, ప్రతి పరీక్షలో బాగానే ఫలితాలు రాబట్టామని గ్రహించాలి. మన హాజరు శాతం పాఠశాలలో బాగానే ఉందని గుర్తుతెచ్చుకోండి. మిమ్మల్ని మీరు నమ్మండి. మనలో దాగి ఉన్న అనంతమైన శక్తిని, నైపుణ్యాలను, విషయ పరిజ్ఞానాన్ని విశ్వసించాలి. ఇటీవల ముగిసిన ప్రీఫైనల్ పరీక్షలు కూడా బాగా రాశారని గుర్తుకు తెచ్చుకోండి. Formative assessment ఎగ్జామ్స్, మీ సబ్జెక్టుల్లో మీరు చేసిన ప్రాజెక్ట్ వర్క్స్, సృజనాత్మకతను పెంచే వివిధ అంశాలను చక్కగా రికార్డ్స్‌లో నిక్షిప్తం చేశారని గ్రహించండి. ఇప్పటివరకు మన తల్లిదండ్రులు, అధ్యాపకులు, శ్రేయోభిలాషులు ఎంతగానో ప్రోత్సహించారని మరువ వద్దు. పెద్దల సహకారం, మార్గదర్శనం, ఆశీర్వాదం ఉందని బలంగా నమ్మండి. మనల్ని మనం అన్ని కోణాల్లో విశ్లేషించుకుని, మన శక్తిసామర్థ్యాలను బేరీజు వేసుకొని, మనం ఎవరి కంటే తక్కువ కాదని నమ్ముతూ ఒత్తిడిని జయించాలి.

పక్కా ప్రణాళిక

ప్రతి సబ్జెక్టులో ఇప్పటివరకు మనం రాసిన అన్ని రకాల ప్రశ్న, జవాబు పత్రాలను మరోసారి తిరగేద్దాం. మన తప్పొప్పులను తెలుసుకుందాం. తప్పులను సరిదిద్దుకునే ప్రయత్నం చేద్దాం. అన్ని ముఖ్యమైన అంశాల పునశ్చరణ చేసుకుందాం. ప్రతి సబ్జెక్టులో ప్రభుత్వ పాఠ్యపుస్తకాల్లోని మౌలిక అంశాలను, విద్యా ప్రమాణాలను మననం చేసుకుందాం. ప్రతి సబ్జెక్టు పరీక్షకు ముందు ఒక్కసారి ఈ విషయాలను పునరావలోకనం చేసుకోవడం అత్యవసరం.

పాటించాల్సిన సూచనలు

పబ్లిక్ ఎగ్జామ్స్‌లో పాటించాల్సిన సూచనల్లో అతి ముఖ్యమైనది.. మన ప్రజంటేషన్. స్కూల్ టాపర్ అయినా, ఎంత గొప్ప పరిజ్ఞానం ఉన్నా.. పరీక్షల్లో జవాబులను రాసే విధానం కీలకం. ఈ విధానం మీ నైపుణ్యాలను ఆవిష్కరింపజేయడంతో పాటు వ్యక్తిత్వాన్ని ప్రతిబింబింపజేస్తుంది. అంటే ఒక విద్యార్థిగా ఎంత సీరియస్‌గా, జాగ్రత్తగా ఉంటే పరీక్షల ఫలితాలు అంత బాగుంటాయి. ప్రజంటేషన్ అనేది ఏడాదికాలం పడ్డ కష్టానికి, తెలివితేటలకు, భవిష్యత్ ప్రణాళికలకు కొలమానం. ఇందులో ముఖ్యంగా చేతిరాత కీలకం. జవాబు పత్రాల మూల్యాంకనం చేసే అధ్యాపకులకు మన శక్తి ఏ పాటిదో తెలియజేస్తుంది. అందుకే చేతిరాత, అక్షరాలు వీలైనంత మేరకు గుండ్రంగా, చక్కగా, పొందికగా, అందరికీ అర్థమయ్యేరీతిలో ఉండాలి. కొట్టివేతలు, దిద్దుబాట్లు లేకుండా చూసుకోవాలి. బాగా తెలిసిన జవాబులనే ముందుగా రాయాలి. ప్రశ్నల క్రమ సంఖ్యను తారుమారు చేయకూడదు. జీవశాస్త్రం, భౌతికశాస్త్రంలో బొమ్మలు వేయాల్సి వస్తే నీట్‌గా వేసి, భాగాలు గుర్తించండి. గణితంలో చిత్తుపని కోసం కేటాయించిన చోటే ఆ పనిచేయండి. మార్జిన్స్ కొట్టి జవాబులు రాయాలి. సోషల్‌సైన్స్‌లో మ్యాప్ పాయింటింగ్‌లో జాగ్రత్తగా ఉండాలి. తెలుగు, హిందీ, ఇంగ్లీష్‌లలో స్పెల్లింగ్ మిస్టేక్స్ లేకుండా రాయాలి. సబ్జెక్టు ఏదైనా ఆబ్జెక్టివ్ ప్రశ్నలు కూడా 10/10 జీపీఏలో కీలకం.



తీసుకోవాల్సిన జాగ్రత్తలు

♦ ఇక సామాజిక అంశాల విషయానికొస్తే.. ఇప్పటివరకు వ్యక్తిగత శ్రద్ధ, సంసిద్ధత, ప్రణాళికల గురించి చూశాం. ఇప్పుడు పరీక్షలకు వెళ్లే ముందు పరీక్షా కేంద్రాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి చూద్దాం.

♦ సమయపాలన అన్నింటి కంటే ముఖ్యమైంది. పరీక్ష కేంద్రాలకు అరగంట ముందుగానే చేరుకోవాలి.

♦ ఒకరోజు ముందుగానే పెద్దలతో కలిసి వెళ్లి పరీక్ష కేంద్రాలను, సెంటర్ కోడ్‌ను నిర్ధారించుకోవాలి.

♦ హాల్‌టికెట్‌ను ఒకటి లేదా రెండు జిరాక్స్ ప్రతులు తీయించి ఒకటి తల్లిదండ్రుల వద్ద, మరొకటి ఇంటి వద్ద భద్రంగా ఉంచండి. పాఠశాలలో ఎలాగో ఒక జిరాక్స్ ప్రతి సిద్ధంగా ఉంటుంది.

♦ ఒకటి కంటే ఎక్కువ పెన్నులు, పెన్సిళ్లు, ఎరైజర్లు, కంపాస్ బాక్సు ఇతర సామగ్రి తీసుకెళ్లాలి.

♦ ప్రస్తుతం ప్రతి పరీక్ష కేంద్రం వద్ద సీసీ కెమెరాల నిఘా ఏర్పాటు చేశారని తెలుసుకోండి. జాగ్రత్తగా మసులుకోండి.

♦ ఎగ్జామ్ హాల్‌లో ఎవరైనా కాపీయింగ్‌కు పాల్పడుతున్నారేమో చూసుకొని, వారి చెడు ప్రభావం పడకుండా జాగ్రత్త పడాలి.

♦ ఎవరైనా మీకు సమాధానాలు చెప్పినా వాటిని నమ్మవద్దు.

♦ పరీక్ష రాస్తున్నప్పుడు ఎవరి సహాయం తీసుకోకూడదు, ఎవరికీ సహాయం చేయకూడదని గుర్తుపెట్టుకోండి. అనవసరమైన ఇబ్బందులు కొని తెచ్చుకోవద్దు. పైస్థాయి అధికారులు తనిఖీ బృందాలుగా ఏర్పడి.. విస్తృతంగా పర్యటిస్తారని మరువ వద్దు.

♦ పరీక్షలు పూర్తయ్యేవరకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు తెచ్చుకోవద్దు. తగినంత నీరు తాగుతూ ఉండాలి. సరైన ఆహారం తీసుకోవాలి. మసాలాలు, వేపుళ్లు, జంక్‌ఫుడ్స్ వంటివి తీసుకోవద్దు.

పై అంశాలను దృష్టిలో ఉంచుకొని పరీక్షకు సిద్ధం కండి.
పదోతరగతిలో మీరు ఉత్తీర్ణత సాధించడం ఖాయం.
విద్యార్థులూ ఆల్ ది బెస్ట్!

నేను-నా ప్రజలు

ఆయన... ఎర్ర దొంగల పాలిట సింహస్వప్నం. ఆయన పేరు చెబితే.. అవినీతిపరుల గుండెల్లో.. రైళ్లు పరిగెత్తుతాయి. ఆయనకు ...పోలీసు సేవలతో పాటు, పేద ప్రజలకు ఏదో చేయాలన్న తపన.... పోలీసు వ్యవస్థపై.. ప్రజలకు నమ్మకం కలిగించాలన్న ఆరాటం. 75వేల రూపాయల జీతం వచ్చే సాఫ్ట్‌వేర్ కొలువును వదులుకుని.. పోలీసు శాఖలో అడుగుపెట్టినవైనం. అతనే నెల్లూరు జిల్లా ఎస్పీ పీహెచ్‌డీ రామకృష్ణ జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన అతి తక్కువ సమయంలోనే ఎర్రచందనం స్మగ్లర్లు, క్రికెట్ బెట్టింగ్, ఇసుక మాఫియాల ఆట కట్టించి వారి పాలిట యమకింకరుడిలా మారారు. పోలీసులపై ఎంతో నమ్మకంతో తమ సమస్యలను చెప్పుకోవడానికి వచ్చిన ప్రతి ఒక్కరికీ వీలైనంత త్వరగా న్యాయం చేయడంతో పాటు పోలీసు వ్యవస్థపై ప్రజలకు మరింత నమ్మకం పెరిగేలా జిల్లా పోలీసు శాఖలో కొత్త సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. ఆయన చర్యలతో జిల్లాలో అక్రమ రవాణా, చీకటి కార్యకలాపాలు చాలావరకు తగ్గుముఖం పట్టాయి. నిత్యం విధి నిర్వహణలో ముక్కుసూటిగా వ్యవహరిస్తూ....ఇటు తమశాఖ.....అటు ప్రజల మన్ననలు పొందుతున్న ఎస్పీ రామకృష్ణను ఆంధ్రప్రభ పలకరించింది. వివరాలు ఆయన మాటల్లోనే....!



నెల్లూరు ఎస్పీ రామకృష్ణ

సంస్కరణలకు శ్రీకారం

సాఫ్ట్‌వేర్ టెక్నాలజీతో...

మానాన్న వెంకటేశ్వర్లు, వృత్తిరీత్యా ప్రభుత్వ ఉపాధ్యాయుడైనా.. జర్నలిస్టుగా కూడా పలు పత్రికల్లో పనిచేస్తూ ప్రజాసేవలో ముందుండే వారు..ఆయన ఆలోచనా విధానమే నాది కూడా.అందుకే ఉద్యోగ ధర్మం నెరవేరుస్తూనే..ప్రజలకు ఏదైనా చేయాలన్నది నా తపన. నేను భీమవరం ఇంజనీరింగ్ కాలేజీలో ఎంటెక్ పూర్తిచేసిన తరువాత సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం వచ్చింది.,ఏడాది కాలం పాటు ఆ సంస్థలో పనిచేస్తూనే గ్రూప్-1కు సెలెక్ట్ అయి డీఎస్పీగా పోలీసు శాఖలో అడుగుపెట్టాను. 75 వేల రూపాయల జీతం వచ్చే సాఫ్ట్‌వేర్ ఉద్యోగాన్ని వదులుకుని, 8 వేల రూపాయల జీతానికి పోలీసు శాఖలో చేరడానికి కారణం ప్రజలకు ఏదో చేయాలన్న తపనే. జీతం కంటే ప్రజాసేవ చేయడంలో ఎంతో ఆనందం ఉంటుంది. నల్గొండ జిల్లా దేవరకొండ డీఎస్పీగా బాధ్యతలు చేపట్టినప్పుడు నాకు నా పరిధిలో ప్రజలకు సేవచేసే అవకాశం లభించింది. నక్సల్స్ ప్రభావిత ప్రాంతం కావడం...కారణాలు ఏవైనా.. ప్రజలు నక్సల్స్‌కు సహకరిస్తున్న విషయం తెలుసుకున్నా. ముందుగా ప్రజల్లో మార్పు కోసం ప్రయత్నించా. డీఆర్‌డీఏ ద్వారా ఆ ప్రాంతంలోని 800 మందికి వివిధ రంగాల్లో శిక్షణ కూడా ఇప్పించాను. దీంతో ప్రజలకు పోలీసుల మీద నమ్మకం పెరిగింది. మాకు సహకరించారు. జిల్లా కలెక్టర్‌తో పాటు రాష్ట్ర ప్రభుత్వం ప్రశంసలు అందుకున్నా. 2004లో వరంగల్ జిల్లా పరకాల డీఎస్పీగా ఉన్నప్పుడు.. నక్సలైట్లు ఎన్నికలను బహిష్కరించారు. దీన్ని సవాల్‌గా తీసుకున్న... సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టి, ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చి,వారిని పోలింగ్ కేంద్రాలకు క్యూకట్టేలా చేశాను. తూర్పుగోదావరి జిల్లా రంపచోడవరం డీఎస్పీగా.. గిరిజనులకు సేవచేసే ఛాన్స్ దక్కింది. ఇతర దేశాల్లో సాఫ్ట్‌వేర్‌గా పనిచేస్తున్న స్నేహితుల సహకారంతో ఆ ప్రాంతంలో ఎంప్లాయిమెంట్ క్లబ్ ఏర్పాటుచేసి సుమారు 500 మందికి శిక్షణ ఇప్పించాను. వారిలో 300 మందికి 16వ బెటాలియన్‌లో ఉద్యోగ అవకాశాలు లభించాయి. దీంతో నిరుపేద కుటుంబాల్లో కొత్త వెలుగులు నింపానన్న ,సంతృప్తి మిగిలింది. ఇక 20009లో నల్లగొండ ఓఎస్‌డీగా బాధ్యతలు నిర్వహించా. అక్కడ కనుమరుగైన మావోయిస్టు దళాలు తిరిగి తమ కార్యకలాపాలను పారంభించాయి. ఎలాగైనా నక్సల్స్‌కు చెక్ పెట్టాలని నిర్ణయించుకున్నా. సాఫ్ట్‌వేర్ టెక్నాలజీని ఉపయోగించి వారి రహస్యాలను తెలుసుకోగలిగాను. మావోయిస్టుల కార్యకలాపాలు అడ్డుకోగలిగాను. మరో తృప్తికరమైన విషయం ఏమిటంటే.... ఇదే టెక్నాలజీని ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, ముంబాయి, బెంగుళూరు వంటి మహానగరాల్లో కూడా ఉపయోగించడం., దాని ద్వారా ఆయా ప్రాంతాల్లో ఉన్న 25 మంది ఉగ్రవాదుల సమాచారాన్ని తెలుసుకొని, నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఏ) వారిని అరెస్ట్ చేయడం!

అతి తక్కువ సమయంలోనే ఐపీఎస్ క్యాడర్

ప్రజల పక్షాన నిలవడం.. విధినిర్వహణలో చిత్తశుద్ధికి నాకు మంచి గుర్తింపు ఇచ్చింది. పోలీసు శాఖలో చేరిన 8 సంవత్సరాలలోనే ఐపీఎస్ క్యాడర్ దక్కింది. 2013లో చిత్తూరు జిల్లా ఎస్పీగా బాధ్యతలు తీసుకున్నా. 2014 ఎన్నికలను విజయవంతంగా నిర్వహించగలిగాను. ఎర్రచందనం స్మగ్లింగ్‌ను అడ్డుకోవడంలోను కీలకపాత్ర పోషించాను. రేపిస్ట్‌గ్యాంగ్‌ను అరెస్ట్ చేసి..మహిళల ఆదరణ పొందగలిగాను. ఎర్రస్మగ్లర్లు పలమనేరులో ఇద్దరు అటవీశాఖ అధికారులను హత్యచేయడంతో స్పెషల్ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటుచేసి 50 మంది జాతీయ, అంతర్జాతీయ ఎర్రచందనం స్మగ్లర్లను అదుపులోకి తీసుకుని ముఖ్యమంత్రి ప్రశంసలు అందుకున్నాను. గుంటూరు, కడప జిల్లాల్లో ఎస్పీగా పనిచేసినప్పుడు శాంతి భద్రతలతో పాటు..ప్రజలకు నావంతు సేవచేయగలిగాను. ప్రస్తుతం నెల్లూరు ఎస్పీగా జిల్లా ప్రజల నుంచి మన్ననలు పొంద గల్గుతున్నాను.

అదే పెద్ద మలుపు..

ఇక ప్రతి ఒక్కరి జీవితంలో కొన్ని మలుపు లుంటాయి. నేను యావరేజ్ స్టూడెంట్‌ను. అది గమనించి మానాన్న నన్ను టీచర్ సుబ్రహ్మణ్యంశాస్త్రి వద్ద ట్యూషన్ చేర్పించడం, సోదరి వసంత ప్రోత్సాహంతో విద్యలో ఉన్నతి సాధించాను. ఈ రోజు ఎస్పీగా ఉండగలిగాను. అందుకే ట్యూషన్ మాస్టర్ వద్ద చేరడమే నా జీవితంలో పెద్ద మలుపు. ఇక మాది కృష్ణా జిల్లా కైకలూరు.. నాన్న వెంకటేశ్వర్లు, అమ్మ సత్యవతి. మధ్యతరగతి కుటుంబం.. పేదల కష్టాలు,మధ్యతరగతి బాధలు తెలుసు. అందుకే వారికి ఏదో చేయాలనేది నాతపన!

-వల్లూరు వెంకటేశ్వర్లు, ఆంధ్రప్రభ బ్యూరో, నెల్లూరు

తైక్వాండోలో సాయి గిన్నిస్ రికార్డు

బాల్యం నుంచే ఏదో సాధించాలన్న తపన..పాఠశాలలో మార్షల్ ఆర్ట్స్ ప్రదర్శన చూసాక..ఆ పసి హృదయం తైక్వాండోపై మనసు పారేసుకుంది. తండ్రి సాదారణట్రక్ డ్రైవర్. కొడుకు తపన చూసి ప్రోత్సహించారు. ఇంకేముంది ఆ బాలుడు అనుకున్నది సాధించాడు. తైక్వాండోలో గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించాడు. ఆ బాలుని పేరే బోదె సాయి దీపక్. సొంతూరు వరంగల్ జిల్లా నర్సంపేట. తండ్రి వృత్తిరీత్యా హైదరాబాద్‌లో స్థిరపడ్డారు.

సాయిదీపక్ రెండవ తరగతి నుంచే మార్షల్ ఆర్ట్స్‌పై మక్కువ పెంచుకున్నారు. తను 8వ తరగతి చదువుతుండగా ... బీజింగ్‌లో జరిగిన ఒలంపిక్స్ లో అభినవ బింద్రా షూటింగ్‌లో గోల్డ్ మెడల్ సాధించడం ఆతనిపై ప్రభావం చూపింది. బింద్రాలాగే తాను ప్రపంచ స్థాయిలో ఏదో సాధించాలని కలలు కన్నాడు. కొడుకు తపనను గమనించిన తండ్రి అతనికి తైక్వాండోలో శిక్షణ ఇప్పించారు. మాస్టర్ మొయుద్దీన్, గ్రాండ్ మాస్టర్ జయంత్ రెడ్డి వద్ద శిక్షణ తీసుకున్న సాయి దీపక్ .. గిన్నిస్ రికార్డును సృష్టించారు., ఓ పక్క తైక్వాండో శిక్షణ తీసుకుంటున్నా.. విద్యను మాత్రం నిర్లక్ష్యం చేయలేదు సాయిదీపక్. స్పోర్ట్స్ కోటాలో సీఎంఆర్ కాలేజ్‌లో సీటు సంపాధించి బీటెక్ పూర్తి చేశారు. సీఎంఆర్ టెక్నికల్ క్యాంపస్‌లో ఎంబీఏ చదువుతున్నారు.

గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ యాజమాన్యం తైక్వాండోలో కొత్తగా ప్రవేశపెట్టిన రెండు రికార్డులు సాధించిన మొదటి వ్యక్తిగా సాయిదీపక్ రికార్డు సృష్టించారనే చెప్పాలి. కొత్తగా ప్రవేశపెట్టిన దాని ప్రకారం ..మోస్ట్ ఫుల్ కాంటాక్ట్ ఎల్‌బో స్ట్రైక్ (ఆల్టర్ నేట్ ఎల్బోస్) విభాగంలో ఒక నిమిషంలో 80ఎల్‌బో స్ట్రైక్స్ చేస్తే రికార్డు దక్కుతుంది. కాని సాయిదీపక్ మాత్రం ఒక్క నిమిషంలో 142 స్ట్రైక్స్ చేసి రికార్డు సొంతం చేసుకున్నారు. ఇక మోస్ట్ ఫుల్ కాంటాక్ట్ నీ(మోకాలు) స్ట్రైక్స్ (సింగల్ లెగ్) విభాగంలో త్రీ మినట్స్‌లో 150 నీ.. స్ట్రైక్స్ చేస్తే వరల్డ్ రికార్డు. సాయి మాత్రం 205 స్ట్రైక్స్



చేశారు..175 స్ట్రైక్స్‌కి గిన్నిస్ యాజమాన్యం అప్రూవ్ చేసింది. దీంతో ఎంగెస్ట్ ఇండియన్ త్వైక్వాండో ప్లేయర్ టూ హోల్డ్... 2 గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ సర్టిఫికెట్‌ను అందజేసింది. ఈ రెండు రికార్డులు కొత్తగా ప్రవేశ పెట్టారు..మొదటిసారి ఈ రికార్డు సాధించిన మొదటి వ్యక్తిగా సాయి గుర్తింపు పొందడం విశేషం! ఇకపోతే సాయి దీపక్....ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతున్నప్పుడే.... స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్... నిర్వహించిన తైక్వాండో పోటీల్లో రంగారెడ్డి జిల్లా తరుపునపాల్గొని 4 స్థానంలో నిలిచారు. 2017 మేలో ఢిల్లీలోని తల్‌కతోరా ఇండోర్ స్టేడియంలో జరిగిన ఇండియన్ ఇంటర్నేషనల్ తైక్వాండో ఛాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొని ....స్పారింగ్ కేటగిరిలో బ్రాంజ్ మెడల్ దక్కించుకున్నారు. 2017 లో హైదరాబాద్‌లో నిర్వహించిన తైక్వాండో స్టేట్ లెవల్ ఓపెన్ చాంపియన్ షిప్ పోటీలో గోల్డ్ మెడల్, 2017 మార్చిలో నేపాల్‌లోని కాంట్మాండ్‌లో నిర్వహించిన .. ఇండో- నేపాల్ ఓపెన్ తైక్వాండో ఛాంపియన్ షిప్-2017 పోటీలో స్పారింగ్ గ్ కేటగిరీలో రెండోసారి స్వర్ణ పతకం సాదించారు. అలాగే అక్టోబర్ 2, 2017న జేఆర్ ఇంటర్నేషనల్ తైక్వాండో అకాడమి, యూనిక్ తైక్వాండో అకాడమి సంయుక్తంగా నిర్వహించిన ..మోస్ట్ మార్షల్ ఆర్ట్స్ కిక్స్ విభాగంలో వన్ మినట్‌లో 273 కిక్స్ చేసి, హైరేంజ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ సాయిదీపక్ దక్కించుకున్నారు. సాయిదీపక్ భవిష్యత్తులో మరిన్ని ప్రపంచ స్థాయి రికార్డులు సాధించి దేశానికి పేరు తేవాలని ఆకాంక్షిద్దాం!

జ్యోతిషంలో కర్మఫలం

జ్యోతిషం భూత భవిష్యత్ వర్తమానాలను తెలుపుతుంది. అయితే మానవుని జీవితం కర్మ ఫలాన్ని బట్టి ఉంటుంది. అందువల్ల జ్యోతిషానికి కర్మ ఫలానికి సంబంధం ఉంది. సకల శాస్త్రాలలో జ్యోతిష శాస్త్రాన్ని ప్రత్యక్ష శాస్త్రంగా పేర్కొంటారు. మంత్రాలలో గాయత్రీ మంత్రానికి ఎంత ప్రాధాన్యత ఉందో శాస్త్రాలలో జ్యోతిష శాస్త్రానికి అంత ప్రాధాన్యత ఉంది. ఇది వేదాలకు నేత్రం వంటిదని చెబుతారు. ఈ శాస్త్రం భూత భవిష్యత్ వర్తమానాలు తెలిపేదైనందున దానిని నేత్రమని అన్నారు.



ఆకాశంలోని నక్షత్రాలకు, గ్రహాలకు జ్యోతులు (వెలుగులు) అని పేరు. అటువంటి జ్యోతులకు సంబంధించినది కనుక దానికి జ్యోతిష శాస్త్రమని పేరు. అంతేకాక జ్యోతి (దీపం) ఇంటికి ఏ విధంగా వెలుగునిస్తుందో అదే విధంగా జ్యోతిష శాస్త్రం మానవునికి వెలుగునిస్తుంది. జీవితాన్ని కాంతివంతంగా చేస్తుంది. ఈ శాస్త్రానికి రవి, చంద్రులే సాక్షీభూత నాయకులుగా పేరొందారు. వారు సృష్టికి మాతా పితరులుగా ఉన్నారు. తక్కిన గ్రహాలు పంచ భూతాలుగా ఉన్నాయి.

ప్రతి మానవుని జీవితం వారి వారి కర్మానుసారం నడుస్తుంటుందని భారతీయ సిద్ధాంతం. మనం చేసే ప్రతి పని కర్మే అవుతుంది. కర్మనే వృత్తి అని కూడా అంటుంటారు. కర్మకు ఆధారం కోరిక, ఆ కోరికకు ఆధారం మనస్సు. ఆ కోరిక వృత్తి రూపంలో మానవుని చేత అనేకపనులు చేయిస్తోంది. సత్కర్మల వల్ల సుఖాదులు, దుష్కర్మల వల్ల దుఃఖాదులను అనుభవించవలసి వస్తుంది. ఈ సృష్టి కాలవశాన జరుగుతుంది. జీవుడు చేసే ప్రతి పని (కర్మ) కాలంతో ముడిపడి జరుగుతుంది. ఆ మనస్సు చేత ప్రేరేపింపబడిన కర్మలకు పరమాత్మ కాలరూపుడై (జీవికి) శుభాశుభ ఫలితాలను ఇస్తాడు. జీవుడు తాను చేసిన కర్మ ఫలాలనుభవించటానికి జన్మనెత్తుతున్నాడు. తాను చేసే కర్మఫలాన్ని అనుభవించేందుకు కాలాన్ని నిర్ణయించుకుంటున్నాడు. కాలం లేనిదే కర్మ లేదు. అందుకే పెద్దలు కాలం, కర్మం కలసి రావాలంటారు. కాలకర్మల అనుభవాన్ని చెప్పేదే జ్యోతిషశాస్త్రం. కాలకర్మానుసారం గ్రహాలు ఫలితాలు ఇస్తాయి.

కర్మ విజ్ఞానం

స్వప్రయోజనాలు ఆశించకుండా ప్రతి ఒక్కరి శ్రేయస్సును కోరి చేసే క్రియలను కర్మ లేదా నిష్కామ కర్మ అంటారు.

శుభ ఫలితాలను ఆశించి చేసే మంచి క్రియలను అకర్మ అంటారు.

స్వార్థ సహిత జీవనం కోసం చేసే ధర్మ రహిత కర్మలను వికర్మలంటారు.

జీవుడికి అకర్మ, నిష్కామ కర్మల వల్ల పుణ్యం, వికర్మల వల్ల పాపం సంక్రమిస్తుంది.

కర్మ మూడు రకాలు

సంచితం

పూర్వ జన్మలలో తాను సంపాదించి, కూడబెట్టుకున్న పాప పుణ్యాలు. అంటే జీవుడు భోగించుటకు సిద్ధంగా ఉన్న మొత్తం పుణ్య పాప కర్మ బీజాలు.

ప్రారబ్ధం

ప్రారబ్ధ కర్మ అంటే సంచిత కర్మలోని పుణ్య పాప కర్మలలో కొద్ది భాగాన్ని మాత్రమే అనుభవించేందుకు జీవుడు భూమిపై జన్మనెత్తడం. ఈ పుణ్యపాప కర్మల ఫలాన్ని జీవుడు కాలానుగుణంగా శారీరకంగాను, మానసికంగాను అనుభవిస్తాడు. పుణ్యం వలన సుఖం, లాభం, పాపం వలన నష్టం వియోగం పొందుతాడు.

ఆగామి


కర్మజీవుడు ప్రారబ్ధ కర్మ ఫలాన్ని అనుభవించేటప్పుడు చేసే పాప పుణ్య కర్మలను ఆగామి కర్మ అంటారు. ఈ ఆగామి కర్మ జీవుని మరణానంతరం సంచిత కర్మలో కలిసిపోతుంది.

కర్మ స్వాతంత్ర్యం

కర్మ స్వాతంత్ర్యం అనేది కర్మఫలాన్ని జీవుడు తనకు అనుకూలంగా మార్చుకుని అనుభవించడం కోసం ఇవ్వబడిన అవకాశం. నిష్కామ కర్మ, అకర్మల వల్ల జీవునికి కర్మ స్వాతంత్ర్యం సంక్రమిస్తుంది. దీనికి గురువులు, శాస్త్రం సహాయపడతాయి.

జీవుడి పాప పుణ్య కర్మలు అతని స్వభావంపై ప్రభావం చూపుతాయి. జీవుడి స్వభావం వల్ల ఏర్పడే పాప పుణ్య కర్మలకు భగవంతుడు కారణం కాని, కారకుడు గాని కాజాలడు. జీవుడి స్వభావం ఆధారంగానే నిష్కామ కర్మలు, అకర్మలు, వికర్మలు సంక్రమిస్తాయి. అందువలన జ్యోతిష శాస్త్రంలో జీవుడి స్వభావాన్ని బట్టి పుణ్య పాప కర్మలు పరిశీలించి కర్మ ఫలాన్ని, కర్మ స్వాతంత్ర్యాన్ని తెలుసుకోవాలి.

గ్రహాల విషయానికి వస్తే అవి జీవుడి దోషాలకు, పూర్వ జన్మ కర్మలకు కారణం కాదు. అవి గడియారంలోని ముళ్ళ లాగ కేవలం జరగగల ఫలితాలను మాత్రమే సూచిస్తాయి. గడియారంలోని ముళ్లు కాలాన్ని సూచిస్తాయి గాని కాలానికి అవి కారణం కాదు కదా! గత జన్మలో తాను చేసిన చెడు పనుల ఫలితాలను గ్రహాలు దోషాలుగా సూచిస్తాయి. అనగా అనుభవానికి తెస్తాయి. అనుభవించవలసిన కాలం కనుక తక్కువ ఉంటే ఫలితం ఈ జన్మలోనే వస్తుంది. ఫలితం ఆలస్యంగా వస్తే కర్మ ఫలితం మరు జన్మలో వస్తుంది.



మనిషి చేసిన చెడు కర్మ తాలూకు ప్రభావం (కర్మ ఫలం) అతడి తలపైన సహస్రార కేంద్రం వద్ద గూడు కట్టుకుని ఉంటుంది. అందుకే తానికి కర్మ స్థానమనే పేరు కూడా ఉంది. శిరస్సే కర్మ స్థానం. దీనికి యోగ శాస్త్రంలో రుజువులు దొరుకుతాయి. యోగికి కర్మ క్షయం అయిన వెంటనే జీవుడు శిరస్సును ఛేదించుకుని కర్మ స్థానం నుంచి వడివడి జ్యోతి రూపంలో ముక్తిని పొందుతున్నాడు. గురువులు ఎరికైనా ఉపదేశం చేయదలిస్తే శిరసును తాకి చేస్తారు. ఆ విధంగా చేయాలని శాస్త్రాలు విధించాయి. అలానే పాదనమస్కారం చేసినపుడు తలపై అక్షింతలు వేసి గురువులు ఆశీర్వదిస్తారు. ఆ విధంగా గురువు తపశ్శక్తి మన కర్మను తగ్గించడానికి ఉపయోగపడుతుంది. ఒక మనిషి మరణించినపుడు అతనికి కర్మ చేసే అధికారం ఉన్న వాడు కొడుకు. కొడుకే తలకొరివి పెడతాడు. అంటే అతనికి , మరణించినవానికి గల కర్మ సంబంధాన్ని తల వద్దనే దగ్ధం చేయాలి. తల కర్మ స్థానం అవడం వల్లనే జీవితాంతం ఆయుష్షను తెలిపే శీర్షోదయ సమయాన్ని లెక్క కడతారు. అనగా పుట్టిన శిశువు శిరస్సు ఉదయించే వేళే అతడి విషయంలో కర్మ ప్రారంభమయ్యే సమయం అవుతుంది. దీనినే జ్యోతిషంలో జాతకంలోని కర్మ స్థానం (లగ్న స్థానం)గా తెలుసుకోవాలి. ఆ సమయంలో అతి సున్నితంగా ఉన్న మాడు పైన ప్రసరించే గ్రహాలలోని కరెంటు వంటి శక్తి పుట్టిన వాని జాతకంపైన జీవితాంతం పనిచేస్తుంది. వివాహ సమయంలో కాబోయే భార్యాభర్తలు ఒకరి శిరస్సుపై ఒకరు చేతిని ఉంచిన సమయమే వివాహ సుముహూర్తం అవుతుంది. దీని వల్ల కర్మ స్థానమైన శిరస్సు నుంచి సుఖ దుఃఖాల కలయికను పాప పుణ్యాల మేళవింపుగా ఒకరి కర్మను ఒకరు ఇచ్చిపుచ్చుకుంటారు. తద్వారా ఇద్దరి జీవితాలు ముడి (కొంగుల ముడి) వేసుకుంటున్నాయి. పుణ్యానికి బెల్లం, కష్టానికి జీలకర్ర ఈ రెండింటిని సుఖ దుఃఖాలకు చిహ్నంగా ఏర్పాటు చేశారు శాస్త్ర నిర్ణయాధికారులు.

జాతకం= జీవుడి జనన కాలం = జీవుడి ప్రారబ్ధ కర్మ


జాతక చక్రం= పూర్వ జన్మ పాపపుణ్య ఫలితాలను ధృవీకరించే పత్రం అనగా ప్రోగ్రెస్ రిపోర్టు లాంటిది.

- శ్రీహయగ్రీవ జ్యోతిష పరిశోధనా కేంద్రం
9949514583

చింతన

శ్రీ రమణాశ్రమ లేఖలు, స్మృతులు

అక్షయలోకం



శ్రీరమణాశ్రమం
18-7-47

మొన్న మధ్యాహ్నం తమిళ యువకుడొకడు శ్రీవారిని సమీపించి ''స్వామీ, నేను ధ్యానం చేసుకుంటూ పడుకుంటే నిద్రపట్టింది. ఎవరైనదీ ఇప్పుడు గుర్తురాదు గాని, కలలో ఒకరు కనుపించారు. వారు నన్ను చూచి దృఢస్వరంతో 'భగవంతుడు పదునారు తలలతో కల్క్యావతారం ఎత్తాడు. ఒకచోట పెరుగుతున్నాడు' అని చెప్పి మాయమైనారు. ఆ కల్కిమూర్తి ఎక్కడున్నాడో, భగవాన్ సెలవీయగలరని వచ్చా'' నన్నాడు. ''సరి సరి. ఆ కలలో కనుపడిన వారినే అడక్కపోయినారా? అప్పుడే అడగవలసింది. ఇప్పుడు మాత్రం ఏం పోయిందీ? వారే తిరిగి వచ్చి చెప్పేవరకూ ధ్యానం చేయండి'' అన్నారు భగవాన్. ఆ యువకుడది ఛలోక్తిగా గ్రహించలేక ''ధ్యానం చేస్తూ ఉంటే వారు తిరిగి కనుపడి, యథార్థంగా వారు ఎక్కడుండేదీ చెపుతారా?'' అన్నాడు. ''ఆ అవతార పురుషుడు ఎక్కడుండేదీ చెప్పనీ, చెప్పకపోనీ, ధ్యానం మాత్రం విడువకుండా చేస్తుంటే యథార్థమేదో గోచరిస్తుంది. అప్పుడు ఏ సందేహాలకూ తావుండదు'' అన్నారు భగవాన్.

ఇదే సందని మరొకరందుకొని ''భగవంతుడు అక్షయలోకంలో ఉంటాడంటారే, నిజమేనా?'' అన్నారు. ''మనము క్షయమయ్యే లోకంలో ఉంటే, ఆయన అక్షయలోకంలో ఉంటాడు. క్షయమయ్యే లోకంలో మనము న్నామా? లేదా? ఇది నిజమైతే అదీ నిజమే. మనం లేనిది లోకమేది? కాల మేది?'' అన్నారు భగవాన్.

ఇంతలో నాలుగేండ్ల కుర్రవాడొకడు ఆడుకునే చిన్న మోటారుకారొకటి చేత్తో పట్టుకొని హాల్లో ప్రవేశించాడు. భగవాన్ చూచి, 'అరే, మోటారు మనల్ని మోసే బదులు, మనమే మోటారును మోస్తున్నామే, బలే బాగుం దిరా''అని నవ్వి. ఆ వెనుక అందరినీ కలయజూచి, ''ఇదుగో చూడండి. ఇది కూడా ఒక ఉపమానంగా తీసుకోవచ్చును. మోటారులో మనం కూర్చు న్నామనీ, మోటారు మనల్ని మోస్తున్నదనీ, తలచి, మేం కారులో వచ్చాం. కారు మమ్ము తీసుకుని వచ్చింది అంటాం. మనం నడపకుంటే జడమైన కారు నడుస్తుందా? లేదు. నడిపేదెవరు? మనమే. అట్లాగే ఈ లోకమున్నూ. మనంలేని లోకం ఎక్కడున్నది? చూచేవాడుంటే ఆ సృష్టివైచిత్ర్యం గోచరించేది? చూచేదెవరు?తానే. తానే, సర్వత్రా నిండి ఉన్నాడు. ఇక క్షయ మేదీ? అక్షయమేది? తానెవరో విచారించి తెలుసుకుంటే ఏ గొడవలూ ఉం డవు'' అన్నారు. సద్విద్య (ఉన్నది నలుబది)లో ఇదే భావం సూత్రప్రాయంగా భగవాన్ వ్రాసే ఉన్నారు.

సద్విద్య (ఉన్నది నలువది)

**16. మనము లేక కాలమేది? దేశమేది?మనము దేహమనినచో
కాలదేశములకు లోబడగలము. మనము దేహమా? మనమి
ప్పుడప్పుడెప్పుడు నొకరము. ఇక్కడక్కడెక్కడ నేకమే.కనుక,
కాలదేశము లేని మనమే యున్నారము.**

- సూరి నాగమ్మ

శ్రీ రమణాశ్రమము, తిరువణ్ణామలై వారి సౌజన్యంతో

Facebook page https://www.facebook.com/ Sri Ramana Telugu
website http://www.sriramanamaharshi.org/ tel/

భగవద్గీత



అవ్యక్తమనేదే నా దివ్యధామం

అధ్యాయం 8,
శ్లోకం 21

**అవ్యక్తోక్షర ఇత్యుక్తః
తమాహుః పరమాం గతిమ్।
యం ప్రాప్య న నివర్తంతే
తద్ధామ పరమం మమ ॥**

తాత్పర్యం

వేదాంతులు దేనిని అవ్యక్తము, అక్షరమని వర్ణింతురో, ఏది పరమ గమ్యస్థానముగా తెలియబడుచున్నదో, ఏ స్థానం పొందిన పిమ్మట మనుజుడు వెనకకు తిరిగిరాడో అదియే నా దివ్యధామము.

భాష్యం

బ్రహ్మదేవుడు 'బ్రహ్మసంహిత' అనే గ్రంథంలో శ్రీ కృష్ణుని ధామాన్ని గురించి వర్ణించినాడు. అది చింతామణి ధామమని, అనేక కల్ప వృక్షములను కలిగి, కామధేనువుల వంటి సురభి ఆవులతో నిండి ఉంటుందని, లక్షల కొలదీ లక్ష్మీదేవులు శ్రీకృష్ణుని సేవిస్తూ ఉంటారని వివరించినాడు. సర్వకారణులకు కారణుడైన శ్రీకృష్ణుడు గోవిందుడుగా పిలవబడతాడని, అతడు వేణువును ఊదుతూ, పీతాంబరాన్ని ధరించి పూలమాలతో అలంకరించబడి, తలలో నెమలి పింఛం, నీలమేఘ చాయను, కమలముల వంటి కన్నులను కలిగి వేల కొలది మన్మథుల కంటే ఆకర్షణీయంగా ఉంటాడని చెప్పియున్నాడు. ఇక్కడ భగవద్గీత యందు కేవలము కొద్దిపాటి వివరణ మాత్రమే ఇవ్వబడినది. అలాగే శ్రీకృష్ణుడు ఈ భూమిపై అవతరించినప్పుడు, ఢిల్లీకి ఆగ్నేయమున 90 మైళ్ల దూరములో ఉన్న బృందావనమున తన లీలలను చేసెను. దీని విస్తీర్ణము 84 చదరపు మైళ్లు, ఇది మధుర జిల్లా క్రిందకు వస్తుంది. ఈ బృందావనము శ్రీకృష్ణుని ధామము కన్న భిన్నం కాదు.

అంతర్జాతీయ కృష్ణ చైతన్యసంఘ సంస్థాపకాచార్యులు కృష్ణ కృపామూర్తి శ్రీశ్రీల ఎసి భక్తి వేదాంతస్వామి ప్రభుపాదులు రచించిన 'భగవద్గీత' యధాతథము ఆధారంగా సమర్పిస్తున్నాము.



పురాణ ప్రతిపాదిత నది కృష్ణ

ఎన్నో పుణ్య నదులు ప్రవహించే భూమి ఈ భారతదేశం. ఇక్కడి నదులన్నిటికీ వాటి ఆవర్భావాన్ని వివరించే పురాణ ప్రతిపాదిత కథలున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో ప్రవహించే నదుల్లో గోదావరి, కృష్ణవేణి ముఖ్యమైనవి. కృష్ణ అంటే మనస్సుని ఆకర్షించేది అని వ్యుత్పత్తి అర్థం. కృష్ణ అంటే నలుపు రంగు, మిరియం అనే అర్థాలు కూడా ఉన్నాయి. కృష్ణ వేణి అనేది రెండు నదుల కలయిక వల్ల వచ్చిన పదం. కృష్ణ వేణి నదుల కలయిక వల్ల కృష్ణవేణి అనే పేరు వచ్చింది. కృష్ణ విష్ణు స్వరూపం కాగా, వేణి శివ స్వరూపమైనది. కృష్ణమ్మ త్రిమూర్తి స్వరూపమై పవిత్రతను పొందింది. 8 ముఖాలతో ప్రవహిస్తూ జీవుల్ని విష్ణులోకానికి చేరుస్తూ ఉందని శివ పురాణంలో ఉంది. కృష్ణానది ప్రాముఖ్యత స్కాంద, మత్స్య, బ్రహ్మాండ, పద్మ, వాయు వామన పురాణాల్లో చెప్పబడింది.

ఒకప్పుడు బ్రహ్మ విశ్వశాంతికై యజ్ఞం చేయాలని సంకల్పించాడు. అయితే ముహూర్తం అప్పటికప్పుడే ఉందని తెలిసింది. దానితో తొందరపడి యజ్ఞం ప్రారంభించడంలో గణపతి పూజ చేయడం మరిచాడు. హరిహరులు, సమస్త దేవతలతో కలిసి యాగం త్వరితగతిన చేయాలని భార్య సరస్వతిని పిలిచాడు. ముహూర్త సమయానికి ఆమె రావడం ఆలస్యం కావడంతో విష్ణువు సలహాపై రెండవ భార్య అయిన గాయత్రీ దేవిని కూర్చోబెట్టి యాగం మొదలు పెట్టాడు. త్వరగా పూర్తి చేశాడు శివుడు. తన స్థానంలో సవతి అయిన గాయత్రీ దేవి కూర్చుండటాన్ని చూసి భరించలేని సరస్వతి దీనికంతకీ కారకులైన త్రిమూర్తులను నదులుగా మారమని శపించింది. అలాగే తన స్థానంలో కూర్చున్నందున ఎవరికీ కనిపించని, అంతగా ప్రాధాన్యతలేని నదిలా ప్రవహించమని గాయత్రిని శపించింది. (గాయత్రీ నది మహారాష్ట్రలోని పాత మహాబలేశ్వరంలో పుట్టి కృష్ణలో కలుస్తుంది). దీనితో గాయత్రి కోపం ఆపుకోలేక నదీ రూపం పొందమని సరస్వతికి ప్రతి శాపం ఇచ్చింది. అయితే తాము నదుల రూపం ధరిస్తే లోక పాలన సాగదని, శాపాన్ని ఉపసంహరించుకోమని వారు సరస్వతిని కోరారు. ఆమె ఆలోచిస్తూ ఉండగా దేవ గురువు బృహస్పతి వచ్చి, ఈ గందరగోళానికంతకూ గణపతి పూజ చేయకపోవడమే కారణమని చెప్పాడు. దానితో వారు ముందుగా గణపతి పూజ చేశారు. దానితో గణపతి ప్రత్యక్షమై త్రిమూర్తులు స్వయంగా నదీ రూపాలు పొందకపోయినా వారి అంశలతో నదులను సృష్టించి సరస్వతి మాటను నిలబెట్టాలని మినహాయింపు సూచించాడు. దానితో సరస్వతి గాయత్రితో కలిసి గంగగా అవతరించింది. విష్ణువు కృష్ణగా, ఈశ్వరుడు వేణిగా, బ్రహ్మ కకుర్మతి నదిగా అవతరించాడు. మహాబలేశ్వర ప్రాంతంలో ఆవిర్భవించింది కృష్ణమ్మ. అక్కడి నుంచి కర్నాటక మీదుగా తెలంగాణను తరింపజేసింది. ఆ తర్వాత ఆంధ్ర ప్రాంతాన్ని పునీతం చేస్తూ కృష్ణా జిల్లాలోని హంసలదీవి వరకూ కొనసాగింది. పద్మ పురాణం ప్రకారం కృష్ణ వేణి నది 8,81,080 సంవత్సరాల క్రితం పుట్టింది. ఈ జీవ నదిలో స్నానం, దానం, జపార్చనలు ముక్తికి సోపానాలని మహర్షులు పేర్కొన్నారు.

- లక్ష్మణరేఖ గోపాలకృష్ణ
9493053206

దినఫలాలు

మేష రాశి: కోర్టు సంబంధిత వ్యవహారాల్లో సానుకూలత ఉంటుంది. పనులలో శ్రమ అధికంగా ఉంటుంది. ఆరోగ్యంలో మంచి మార్పులు చేకూరుతాయి. శుభవార్తలు వింటారు. ఆదాయంలో మెరుగైన వాతావరణం ప్రారంభమవుతుంది.

వృషభ రాశి: అసహన పరిస్థితులు ఆర్థికంగా కొనసాగుతాయి. ప్రయాణాల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. ఆరోగ్య సమస్యలకు పరిష్కారాలు పొందుతారు. కుటుంబ వ్యవహారాల్లో చిరుసమస్యలు ఎదురవుతాయి. ఆదాయ మార్గాలు అన్వేషించగలుగుతారు.

మిథున రాశి: వాహన నిర్ణయాలు లాభిస్తాయి. గృహకార్యాలు, కార్యక్రమాలు కలసి వస్తాయి. మానసిక ధైర్యం పెరుగుతుంది. ఆర్థిక అవమాన పరిస్థితులు కొనసాగుతాయి. ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు పాటించాలి. గతంలోని ఒప్పులు ఇప్పుడు తప్పులుగా మారతాయి. అధిక ప్రయత్నాలతో ఆదాయ పరంగా అనుకూల పరిస్థితులు ఉంటాయి.

కర్కాటక రాశి: దూరప్రయాణాలు కలసి వస్తాయి. అభివృద్ధి కుటుంబరీత్యా ఆనందాన్ని కలిగిస్తుంది. పిల్లల విషయంలో శ్రద్ధ తప్పనిసరి. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. ఆలోచనదోషాల ద్వారా సమస్యలు, అవమానాలు ఉంటాయి. కాబట్టి జాగ్రత్తలు పాటించాలి. ఆదాయ మార్గాలు అనుకూలం.

సింహ రాశి: ఆర్థిక ప్రయత్నాలు ఊరట కలిగిస్తాయి. వినోదాల్లో పాల్గొంటారు. ఆరోగ్యం పర్వాలేదు. ఆర్థిక విషయాల్లో సులువుగా అవకాశాలు లభిస్తాయి. ఆదాయంలో ఆశాజనకమైన వాతావరణం ఉంటుంది.

కన్యా రాశి: ఉద్యోగ ప్రయత్నాలు అనుకూలం. ఆహ్లాద పరిస్థితులు గృహ రీత్యా ఉంటాయి. సంబంధ, బాంధవ్యాల విషయంలో మనస్పర్థలు చోటు చేసుకుంటాయి. కాబట్టి జాగ్రత్తలు పాటించాలి. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. స్థిరాస్తి విషయాల్లో చిరాకులు కొనసాగుతాయి. ఆదాయ మార్గాలు సులభతరమవుతాయి

తులా రాశి: విదేశీ లావాదేవీలు లాభిస్తాయి. కళారంగంలో ప్రతిభ గుర్తించబడుతుంది. ముఖ్యమైన పనులలో జాప్యాలు కొనసాగుతాయి. ఆరోగ్యంలో అనుకూలత ఉంటుంది. ఆదాయంలో ప్రోత్సాహ పరిస్థితులు ఆనందాన్ని కలిగిస్తాయి.


వృశ్చిక రాశి: వ్యాపార ఒప్పందాలు అనుకూలం. ఉద్యోగ వ్యవహారాల్లో ఆశించిన ఫలితాలు లభిస్తాయి. మానసిక చిరాకులు కొనసాగుతాయి. ఆరోగ్యంలో ఖర్చులు పెరుగుతాయి. చేపట్టే కార్యాలలో వేగం తగ్గుతుంది. ఆదాయంలో అనుకూల/ప్రతికూలతలు ఉంటాయి.

ధనూ రాశి: ఉద్యోగ ప్రయత్నాలు లభిస్తాయి. ఆదాయంలో అనుకూల పరిస్థితులు ప్రారంభం. వేగంగా నిర్ణయాలు తీసుకోలేకపోతారు. ఆరోగ్యంలో ఖర్చులు తగ్గుతాయి. గతంలోని పొరపాట్లు సరిదిద్దుకోగలుగుతారు. ఆదాయంలో మెరుగైన అవకాశాలు దగ్గరవుతాయి.

మకర రాశి: ఆరోగ్య పరీక్షలు మేలును కలిగిస్తాయి. విదేశీ లావాదేవీలు ఊరట కలిగిస్తాయి. ఆరోగ్య రక్షణ తప్పనిసరి. ఆరోగ్య ఖర్చులు పెరుగుతాయి. మంచికి పోయి చెడు కోరి తెచ్చుకొంటారు. ఆర్థిక వ్యవహారాలు గట్టి ప్రయత్నాలతో మాత్రమే సాధ్యం.

కుంభ రాశి: నూతన స్నేహాల ద్వారా లబ్ధి చేకూరుతుంది. గృహకార్యాలు, కార్యక్రమాలు ఉపకరిస్తాయి. శుభవార్తలు వింటారు. ఆరోగ్య క్రమశిక్షణ ఏర్పడుతుంది. ఆరోగ్యంలో ప్రతికూలత తగ్గుతుంది. వ్యాపార అనుకూలత ఉంటుంది. ఆదాయంలో ప్రోత్సాహ పరిస్థితులు ఆనందాన్ని కలిగిస్తాయి.

మీన రాశి: విద్యా ప్రయత్నాలు అనుకూలం. నూతన స్నేహాలు అనుకూలిస్తాయి. ఆరోగ్యంలో ఆకస్మిక ప్రతికూలత ఉంటుంది. ఆరోగ్య ఖర్చులు పెరుగుతాయి. కోర్టు వ్యవహారాల్లో ప్రతికూల ప్రభావం ఉంటుంది. ఆదాయంలో అనుకూల మార్పులు గోచరిస్తాయి.



శ్రీ నూకల సూర్యనారాయణ
nookalasuryanarayana@gmail.com



లేడీ లెజెండ్స్

వైద్యో నారాయణో హరి!

వైద్యవృత్తిని పవిత్రంగా భావించే డాక్టర్ అరుణ



వైద్యో నారాయణో హరి.. అంటారు. నిజమే డాక్టర్ దేవునితో సమానం. పోయే ప్రాణాన్ని నిలబెడతాడని నమ్మకం. అందుకే వైద్య వృత్తి ఎంతో పవిత్రమైంది. కాని ప్రస్తుతం వైద్యం కూడా వ్యాపారంగా మారింది. కాసుల గలగలలో కొట్టుకు పోతోంది. అలాగని అందరు వైద్యులు అలా ఉండరు కదా.ఈ రోజుల్లోను వైద్యవృత్తిని పవిత్రంగా భావించేవాళ్లున్నారు. ఆ కోవకే చెందుతారు ఉస్మానియా మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణా రామయ్య. సికింద్రాబాద్‌కు చెందిన డాక్టర్ అరుణ స్థానిక సెయింట్ ఆన్స్ స్కూల్‌లో పదోతరగతి వరకు చదువుకున్నారు. సెయింట్ ఫ్రాన్సెస్ జూనియర్ కాలేజ్‌లో ఇంటర్ పూర్తి చేశారు. ఉస్మానియా మెడికల్ కాలేజ్‌లో ఎండి డీజీవో పూర్తిచేసి Obstetrics & Gynecology లో పట్టా పుచ్చుకున్నారు. ల్యాప్రోస్కోపిక్‌లో స్పెషలైజేషన్ చేశారు. అనంతరం డాక్టర్‌గా ప్రభుత్వ ఉద్యోగంలో చేరారు. ప్రస్తుతం తాను చదివిన ఉస్మానియా మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఆమె భర్త సుశీల్ కుమార్ రిటైర్డ్ ఐపీఎస్ అధికారి. విషయానికి వస్తే.., డాక్టర్ పట్టా పుచ్చుకున్న తర్వాత ప్రైవేటు క్లినిక్‌లు ప్రారంభించడం..,నాలుగు రాళ్లు వెనుకేసుకోవడం నేటి ట్రెండ్.ప్రభుత్వ కొలువులో చేరినా క్లినిక్ మాత్రం రన్ చేస్తూనే ఉంటారు. అయితే ఇందుకు అరుణ పూర్తి విరుద్ధం.మరో నెల రోజుల్లో ఆమె రిటైర్ కాబోతున్నారు. కాని ఇంతవరకు ఆమె ప్రైవేటు క్లినిక్ పెట్టిన, ప్రైవేటు ఆస్పత్రిలో పనిచేసిన దాఖలాలు లేవు. అంతే కాదు రిటైర్ అయిన తర్వాత కూడా ప్రజలకు ఉచితంగా వైద్యం చేయాలన్నదే ఆమె కోరిక. ఆమె నిస్వార్థ సేవల గురించి తెలిసి లేడీ లెజెండ్స్ అక్లాడ్స్ టీం అరుణను కలిసింది. లేడీ లెజెండ్స్ అక్లాడ్స్ నామినేట్ చేయమని కోరింది.

ప్రజాసేవే లక్ష్యంగా...

తల్లిదండ్రులు ఉన్నత స్థితిలో ఉన్నారు. తండ్రి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మంత్రిగా కొనసాగుతున్నారు. ఆస్తిపాస్తులకు కొదువ లేదు. అయినా స్వయం కృషితోనే ఎదగాలనేది ఆమె లక్ష్యం. అందుకే తన జీవితం కేక్వాక్ కాదంటారు. ఆమే నారాయణా గ్రూప్ ఆఫ్ కాలేజెస్ ఛైర్మన్ నారాయణ కూతురు శరణి పొంగూరు. ఆమె విదేశాల్లో చదువుకొని వచ్చి, తన కాళ్లపై తాను నిలబడాలని అనుకున్న తరుణంలో తండ్రి నారాయణ రాజకీయాల్లోకి వెళ్లడంతో నారాయణా గ్రూప్ ఆఫ్ కాలేజెస్‌కు డైరెక్టర్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రి గంటాశ్రీనివాసరావు కుమారుడు రవిని ఆమె పెళ్లిచేసుకున్నారు. దీంతో అతను నారాయణ కాలేజీల మార్కెటింగ్ బాధ్యతలు చేపట్టారు. భర్త సహకారం లభించడంతో .. విద్యారంగంలో ఎదురైన ఎన్నో సవాళ్లను అధిగమిస్తూ....గతం రెండేళ్లుగా ఉత్తమ ప్రమాణాలతో కాలేజీలను తీర్చిదిద్దుతున్నారు. ఉన్నత చదువులు చది వినా..ఉన్నతమైన పదవిలో ఉన్నా.. లక్షలకు పడగలెత్తినా ఆమె దృష్టి అంతా ప్రజాసేవ మీదే. ఆమెకు పేదలకు తన వంతు సేవచేయాలన్న తపన ఎక్కువ. అందుకే తన పుట్టిన రోజును ఎక్కువగా అనాథ శరణాలయాల్లో గడుపుతారు. అంతేకాదు వారి కోసం అత్యాధునిక సౌకర్యాలతో శరణాలయం నిర్మించాలని యోచిస్తున్నారు. తన సోదరుని అకాల మరణంతో అతని పేరు మీద ఒక ట్రస్టు ఏర్పాటు చేసి, వివిధ రంగాలలో తన వంతు సేవలు అందించేందుకు రెడీ అవుతున్నారు. అవార్డులు, రివార్డుల కోసం కాకుండా ప్రజలకు సేవచేయడమే తన లక్ష్య మంటారు శరణి. తన కొడుకు మొదటి పుట్టిన రోజు నాటికి కొందరు అనాథలను దత్తత తీసుకునేందుకు శరణి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఆమె గురించి తెలిసి లేడీ లెజెంట్స్ అక్లాడ్స్ టీమ్ ఆమెను కలిసింది. లేడీ లెజెండ్స్ అక్లాడ్స్ కు నామినేషన్ వేయమని కోరింది.





ఎన్టీఆర్ మెచ్చిన అరుణ రాగం

అరుణ సుబ్బారావు, పేరెడీ సింగర్

మాటల్లో లాలిత్యం......గాత్రంలో మాధుర్యం..నందమూరి తారాక రామారావునే తన్మయత్వంలో ముంచిన కోకిల స్వరం.. ఆమే.. పేరడీ సింగర్ అరుణా సుబ్బారావు. వివరాల్లోకి వెళితే...ఎన్టీఆర్ తెలుగు దేశం పార్టీని స్థాపించి..ప్రచార రథంపై జనంలోకి దూసుకెళ్తున్న రోజులు. అందులో భాగాంగా..రామారావు... ప్రజల్లో చైతన్యం కోసం సింగర్‌లచేత మేలుకొలుపు పాటలు పాడించేవారు. అలా ఓ రోజు ఓ పాట ఆయనను పరవశున్ని చేసింది. పాట విన్న వెంటనే ఆ పాట పాడింది ఎవరో పిలిపించమని ఆర్డర్ వేశారు. ఆయన ముందు ప్రత్యక్షమైన సింగర్‌ను చూసి ఆశ్చర్యపోయారట. ఆ పాటపాడింది 14 సంవత్సరాల అమ్మాయి. నీ గానామృతంతో నన్ను మైమరిపించావు అంటూ మెచ్చుకున్నారట. అంతేకాదు అప్పటి నుంచి ఆమె చేతనే మేలుకొలుపు పాటలు పాడించేవారు రామారావు. ఆ అమ్మాయే ప్రస్తుతం మనం చెప్పుకునే పేరెడీ సింగర్ అరుణా సుబ్బారావు. విజయనగరం జిల్లాకు చెందిన అరుణ..హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. తన మధుర స్వరంతో అనేక పాటలు పాడారు. హరికథలు చెప్పారు. ఆమె నిర్వహించిన టీవీషో చాంగ్ చాంగ్ రే.. అప్పట్లో చాలా ప్రాచుర్యం పొందింది. ఇప్పటి వరకు అమె 1800 ప్రోగ్రామ్స్ వరకు ఇచ్చారు. ఇస్తూనే ఉన్నారు. బహుళ ప్రజాదరణ పొందిన తెలుగు పాటల బాణీలో ..కాస్త వెటకారం జోడించి రాసేవే పేరెడీ సాంగ్స్. అవి నవ్వును తెప్పిస్తాయి. ఆలోచింప చేస్తాయి. అలాంటి పేరెడీ పాటలు పాడడంలో ఆరితేరిన అరుణా సుబ్బారావుకు 1000 వరకు అవార్డులు, రివార్డులు దక్కాయి. ఆమెలోని ప్రత్యేకతను గుర్తించిన లేడీ లెజెండ్స్ అక్లాడ్స్ టీం అరుణను కలిసింది. లేడీ లెజెండ్స్ అక్లాడ్స్ నామినేట్ చేయమని కోరింది.

మీకు తెలిసిన.. ఆయారంగాలలో రాణిస్తూ..సమాజం గుర్తించని మహిళలు (UNSUNG WOMAN) ఉంటే మాకు తెలియజేయండి.
www.ladylegends.org
nominations@ladylegends.org

'గురి' కుదిరింది!

విజేత



విజయానికి వయసుతో నిమిత్తం లేదని, దృఢమైన లక్ష్యాలను మనసులో ఏర్పరుచుకుంటే వాటి సాధనలో తప్పకుండా గెలుపు సాధిస్తారని ఆమెను చూస్తే అర్థమవుతుంది. పోటీలకు వెళ్లినప్పుడు ఆమె తల్లిదండ్రులు కూడా ఇంతటి విజయాన్ని సాధిస్తుందని ఊహించలేదు. ఆమే మనుభాకర్.

ఐసిసిఎఫ్ వరల్డ్ కప్‌లో మహిళా షూటింగ్ (పిస్టల్) విభాగంలో పదహారు సంవత్సరాల మనుభాకర్ గోల్డ్ మెడల్‌ను సాధించింది. మెక్సికోలోని గ్వాదలాజరాలో జరుగుతున్న ఐసిసిఎఫ్ వరల్డ్ కప్‌లో ఆమె ఈ పతకాన్ని సాధించింది. ఎంతో నిపుణులైన వారితో పోటీకి దిగి ఆమె విజయం సాధించింది. ముందుగా ఆమె 8.5 మీటర్ల దూరంలో ఉన్న పాయింట్‌ని షూట్ చేసింది. తరువాత 10.6 మీటర్ల దూరంలో ఉన్న పాయింట్‌ని షూట్ చేసింది. మనుభాకర్ ఈ పోటీల గురించి తొమ్మిది నెలల నుంచి సాధన చేస్తుంది.

హర్యానాలోని దాద్రి జిల్లాకు చెందిన మనుభాకర్ తండ్రి పేరు రామకిషన్ భాకర్ మర్చంట్ నావీలో చీఫ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు. తల్లి గృహిణి. ఆమె మొదటి కోచ్ పేరు నరేష్. నేషనల్ పిస్టల్ కోచ్ జస్పాల్ రాణా. తక్కువ సమయంలోనే కోచ్‌లిద్దరు ఆమెలోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించారు. జజ్జర్‌లోని యూనివర్సల్ సీనియర్ సెకండరీ స్కూల్‌లో ఆమె నాలుగు నుండి ప్రతిరోజూ ఐదుగంటలు శిక్షణ పొందేది. ఆమె రెండు సంవత్సరాల క్రితమే ఈ రంగంలోకి వచ్చింది. అనతి కాలంలోనే ఆమె ఈ విభాగంలో నైపుణ్యం సాధించడమే కాకుండా జాతీయ స్థాయిలో రికార్డును కూడా సృష్టించింది. షూటింగ్‌లోకి రాకముందు ఆమెకు బాక్సింగ్, థాంగ్‌టా (మణిపురి మార్షల్ ఆర్ట్) అంటే చాలా ఇష్టం. బాక్సింగ్‌లో ఎదుటివారిని కొట్టేటప్పుడు చాలా ఆనందించేదాన్నని ఆమె చెబుతుంది. కేవలం పోటీలో పాల్గొనడమే కాకుండా ప్రత్యర్థులతో పోరాడి గెలుపును సాధించేది. థాంగ్‌టలో జాతీయ ఛాంపియన్‌షిప్‌లో కొన్ని మెడల్స్‌ను కూడా గెలుచుకుంది. ఒకసారి బాక్సింగ్ చేసేటప్పుడు ఆమె కంటికి దెబ్బ తగిలింది. దీనితో ఆమె తల్లి బాక్సింగ్ రంగానికి స్వస్తి చెప్పించింది. ''మా అమ్మాయి ప్రతిభ, సామర్థ్యాల మీద నాకు నమ్మకం ఉంది. 2020 ఒలింపిక్స్‌లో ఆమె స్వర్ణపతకాన్ని తప్పకుండా సాధిస్తుంది. ఇది నా నమ్మకం. ఆమె షూటింగ్‌లోనే రాణించి పేరు తెచ్చుకోవాలనే నేను బాక్సింగ్, థాంగ్‌టా నుండి అమ్మాయి దృష్టిమరల్చాను'' అని ఆమె తల్లి తెలిపారు. గత డిసెంబర్ నెలలో తిరువనంతపురంలో 61వ నేషనల్ షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో ఆమె పదిమీటర్ల పిస్టల్ విభాగంలో హీనా సృష్టించిన పెద్ద రికార్డును బ్రేక్ చేసింది.

షూటింగ్ మీద ఆసక్తితో తన తండ్రిని పిస్టల్ అడిగింది. దానికి ఆయన ఎదురుచెప్పకుండా 1.5లక్షల రూపాయలతో ఒక పిస్టల్‌ని ఆమెకు కొనిపెట్టారు. ఒక నెల తరువాత ఆమె సాధించిన రికార్డులను చూసి తన డబ్బులు వృధా కాలేదు అని సంతృప్తి పడ్డారు. దానితో ఆమె నేడు స్వర్ణపతకాన్ని సాధించింది. టెన్నిస్‌లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో కూడా ఆమె పద్నాలుగు సంవత్సరాల వచ్చే వరకు ఆడింది. ఆ తరువాతే షూటింగ్‌మీద దృష్టిపెట్టింది. ఆమె గెలిచిన పతకాలను, సాధించిన రికార్డులను చూస్తుంటే ఆమె మంచి నిర్ణయాన్ని తీసుకుందని అనిపిస్తుందని ఎంతో సంతోషంతో ఆమె తండ్రి రామ్‌కిషన్ భాకర్ చెబుతున్నారు.

ఆమె రెండుసార్లు స్వర్ణపతకం సాధించిన మెక్సికోకి చెందిన అలెజాండ్రా జావలా, ఫ్రాన్స్‌కి చెందిన సెలైన్ గోబర్‌విలే (వరల్డ్ కప్‌లో మూడుసార్లు పతకం సాధించింది)మీద గెలిచింది. ఏప్రిల్ 28కి నేను పిస్టల్ షూటింగ్‌కి చేరి రెండు సంవత్సరాలవుతుందని ఆమె ఎంతో ఉత్సాహంగా చెప్పింది. ఆమె తన ఈ షూటింగ్‌తో రికార్డులను తిరగరాస్తుంది. క్రిందటి సంవత్సరం కేరళలో జరిగిన 2017 ఏసియన్ జూనియర్ ఛాంపియన్‌షిప్ జాతీయస్థాయి పోటీలలో వరల్డ్ కప్ మెడలిస్ట్ హీనా సింధు చేసిన రికార్డు 240.8ని ఆమె 242.3 పాయింట్లు ఫైనల్‌లో సాధించి తిరగరాసింది. అప్పుడు ఆమె రజత పతకాన్ని సాధించింది. నేను ఇంతటి విజయాలు సాధించడానికి కారణం మా తల్లిదండ్రుల ప్రోత్సాహమే అని సంతోషంగా చెబుతుంది మనుభాకర్.

ఈశాన్యంలో విరిసిన 'పారిజాతం'

చైతన్యం



- శానిటరీ ప్యాడ్స్‌పై అవగాహన కల్పిస్తున్న యువతి
- ఆమె సారథ్యంలోని అకాడమీలో అవగాహన సదస్సులు
- రీయూజబుల్ ప్యాడ్స్ పంపిణీ..నిరుపేదలలో పెరిగిన చైతన్యం

నేటి యువతుల ఆలోచనాధోరణి శానిటరీ నాప్‌కిన్స్ వాడుక విధానంలో చాలా మార్పు కనిపిస్తోంది. నగరంలోనే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లోని యువతులు కూడా ఈ విషయంలో తమ ఆలోచనా విధానాలను మార్చుకుంటున్నారు. అక్షయ్‌కుమార్ ప్యాడ్ మ్యాన్ సినిమాతో ఈ శానిటరీ నాప్‌కిన్స్‌పై అవగాహన ఉద్యమంలా ప్రతీచోట వెల్లువెత్తుతున్నది. అలా ఒక మారుమూల గ్రామీణ యువతుల ఆలోచనల ఫలితమే రీ యూజబుల్ ప్యాడ్స్ తయారీ....

అస్సాం రాజధాని గువహతి శివార్లలోని చిన్న పల్లెటూరు పమోహి. ఈ గ్రామంలో నివసిస్తున్న వారిలో అత్యధికులు కర్బీ తెగకు చెందిన గిరిజనులే. నెలసరి గురించి మాట్లాడే సాహసం ఇక్కడి మహిళలెవరూ చేయరు. ఇక ప్యాడ్స్ గురించి ఎవరు మాట్లాడతారు. కానీ..గడచిన కొద్ది నెలల నుంచి అక్కడి పరిస్థితులలో విప్లవాత్మక మార్పు వచ్చింది. అక్షయ్ కుమార్ నటించిన ప్యాడ్‌మాన్ సినిమా విడుదల కాకముందే అక్కడ ఈమార్పు ఆరంభమైంది. ఇప్పుడు అక్కడి యువతులు రుతుక్రమ సమయంలో తమ బాధల గురించి విడమరిచి మాట్లాడుకుంటున్నారు. ఆ సమయంలో సరైన ప్యాడ్స్ వాడకపోవడంవల్ల ఏర్పడే విపరీత పరిణామాల గురించి తెలుసుకుంటున్నారు. వారు అవగాహన పొందడమే కాకుండా మిగతా వారికి వాటి అవసరాన్ని తెలియజేసేలా ఉద్యమాన్ని చేపట్టి, అందరికీ అవగాహన కల్పించేదిశగా ముందుకు సాగుతున్నారు. ఉత్తమ్‌టెరోన్, అయిమోనిల కృషి ఫలితమే ఈ మార్పు. వారి ఆధ్వర్యంలో నడుస్తున్న పారిజాత్ అకాడమీలో జరిగిన ఒక అవగాహన సదస్సులో వారు ఈ విషయాన్ని తెలుసుకుని అప్పటి నుంచి ఉచితంగా ప్యాడ్స్‌ను పంపిణీ చేశారు.

''సహజంగా పెద్ద కుటుంబంలో ఉన్న మహిళలే తమ నెలసరి బాధలను మగవారి ముందు మాట్లాడటానికి సిగ్గుపడతారు. అలాంటిది గ్రామంలో ఏర్పాటు చేసిన సభలలో ఎలా మాట్లాడగలరు'' అని ఫాంగ్షో స్పష్టం చేసింది. మాగ్రామంలోనే కాదు చుట్టుపక్కల గ్రామంలో కూడా చాలామంది చదువుకోకుండా పేదరికంలో ఉన్న మహిళలే ఉన్నారు. వాళ్లు ఎక్కువగా ఈ సమయంలో క్లాత్‌నే వాడేవారు అని ఫాంగ్షో చెప్పింది. టెరోన్, అతని భార్య అయిమోని పారిజాత్ అకాడమీని నడుపుతున్నారు. పమోహిలోని వెనకబడిన పిల్లలకోసం ఏర్పాటు చేసిన స్కూలు ఇది. దాదాపు పది సంవత్సరాల నుండి నడుస్తుంది. చుట్టుపక్కల పిల్లలకోసమే కాకుండా దూరంగా ఉన్న పిల్లలకోసం కూడా రెసిడెన్షియల్ సదుపాయాలను బాలురకు, బాలికలకు ఇక్కడ కల్పిస్తున్నారు. ఆ స్కూల్‌లోనే ఒక ట్రైనింగ్ సెంటర్‌ని నడుపుతున్నారు. అక్కడ మహిళలకు టైలరింగ్, చేతులతో తయారుచేసే కళాకృతులను తయారుచేయడం వంటివి నేర్పిస్తుంటారు. ఈ విషయం ద్వారా ప్రతిరోజూ వారు గ్రామస్తులతో మాట్లాడేవారు. తనదగ్గరకు వచ్చిన వారితో అయిమోని ఈవిషయాలను కూడా చర్చించేది. తర్వాతర్వాత గ్రామంలోని ప్రజలతో కూడా మాట్లాడడం మొదలుపెట్టింది ప్రజలలో అవగాహనను, ఆలోచనావిధానాన్ని మార్చడం అంత సులువేమీ కాదని ఆమెకు అర్థమైంది. ఇది ఒక్కరోజులో జరిగే పోరాటం కాదని టెరోన్ అన్నారు. కాని మేమిద్దరం కనబరుస్తున్న శ్రద్ధను చూసి గ్రామంలోని మగవాళ్లు కూడా ఈ విషయాల్లో ఆసక్తి కనబరచడం మొదలుపెట్టారు.

కుడు బోంగ్రాంగ్ ఆ ఊరి రైతు. గువాహతి సరిహద్దులలో ఉన్న గర్భాంగా గ్రామంలో ప్రజలను ఒకేచోట చేరేలా చేస్తే ఆ సభలో ఉత్తమ్ టెరోన్, అయిమోని శానిటరీ ప్యాడ్స్ గురించి అవగాహన కల్పించే ప్రయత్నం చేశారు.



నెలసరి సమయంలో పరిశుభ్రత నివేదికలో మనదేశం సి గ్రేడ్

నేషనల్ హెల్త్ సర్వే రిపోర్ట్ టేబుల్ 4.0 ప్రకారం భారతదేశ మహిళల్లో 15 సంవత్సరాల నుండి 24 సంవత్సరాల యువతులు 42శాతం శానిటరీ నాప్‌కిన్స్ వాడుతున్నారని 62శాతం క్లాత్‌ను వాడుతున్నారని, 16శాతం లోకల్‌గా తయారుచేసిన శానిటరీ నాప్‌కిన్స్‌ని వాడుతున్నారని వెల్లడైంది. మొత్తానికి 58 శాతం మహిళలు హైజెనిక్ పద్ధతిలో నెలసరిసమయంలో సురక్షితమైన విధానాలను పాటిస్తున్నారు.

అస్సాంలో మాత్రం కేవలం 41శాతం గ్రామీణ మహిళలు ఈవిధంగానే పాటిస్తున్నారని,70శాతం మహిళలు శానిటరీ పాడ్స్‌ను వాడటంలో వెనుకబడి ఉన్నారని, దీనివల్ల అక్కడ మహిళలు ఎన్నో వ్యాధులకు గురవుతున్నారని గువాహతిలోని రీసెర్చ్ స్కాలర్, ఉద్యమకారిణి రెహానా సుల్తానా చెబుతున్నారు. భారత ప్రభుత్వం 2011 నుండి మెన్‌స్ట్రువల్ హైజీన్ స్కీమ్ (ఎమ్‌హెచ్‌ఎస్)కింద శానిటరీ ప్యాడ్స్‌ను తక్కువధరకు కొన్ని ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు. కాని అనుకున్నంతగా లక్ష్యాన్ని సాధించలేకపోయారు. నెలసరి సమయంలో సురక్షితంగా ఉండకపోతే ఇన్‌ఫెక్షన్స్ త్వరగా వచ్చే అవకాశాలున్నాయి. అంతేకాదు పెల్విక్ ఇన్‌ఫ్లామేటరీ డీసీజ్‌కు కూడా దారితీస్తుంది. ఇది చాలా ప్రమాదకరమైన విషయం అని, ఇది క్లాత్ వాడడం వల్ల త్వరగా వచ్చే అవకాశం ఉందని అనుధృతి దత్తా (గువాహతిలోని ప్రతీక్షా హాస్పిటల్)గైనకాలజిస్ట్‌చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ పరిస్థితులను వివరించి వారిలో సత్వరమే మార్పు తీసుకురావాలని ఆమె పిలుపునిచ్చారు.

రీయూజబుల్ ప్యాడ్స్

పారిజాత్ అకాడమీలో ఉన్న బాలికలకోసం ఫ్లోరిడా నుంచి కొంతమంది వాలంటీర్లు వచ్చి ఈ అంశం మీద ప్రచారం చేయడంతో ఈ అవగాహన ఉద్యమం మొదలైందని చెప్పవచ్చు. అయిమోని ఆ టీమ్ దగ్గర నుండి రీయూజబుల్ ప్యాడ్స్ గురించి, కాటన్ క్లాత్స్‌తో వాటిని ఎలా తయారుచేయాలో తెలుసుకుంది. ఫ్లోరిడా నుంచి వచ్చిన టీమ్‌తో అక్కడ పరిసరాల్లోని పేదబాలికలకు ఆరోగ్యపరీక్షలు నిర్వహించినప్పుడు చాలా బాధవేసిందని, వాళ్లు చాలా భయంకరమైన పరిస్థితులలో ఉన్నారనిపించిందని అయిమోని చెప్పింది. ఆ స్కూల్‌లోని ట్రైనింగ్ సెంటర్‌లో 15మంది బాలికలు వీటిని తయారుచేయడం నేర్చుకున్నారు.

ఈ ప్యాడ్స్ రెండు రకాలుగా ఉంటాయి. ఒకటి కవరు, లైనర్ ఉండేది. బాలికలు వీటిమీద మూడు ముక్కలుగా కాటన్, ఫ్లానెల్ క్లాత్‌ని వాడుతున్నారు. దానికి రెండు ప్లాస్టిక్ బటన్స్‌ని పెట్టి అండర్ గార్మెంట్స్‌లో వాడుకోవాలి. ఇరుపక్కల డ్రస్‌కి లీక్‌కాకుండా పాలియుథరైన్ లామినేట్ ఫ్యాబ్రిక్ క్లాత్ లోపల పెడతారు. దీనివల్ల బయటకి డ్రస్‌కి ఎటువంటి మరకలు కాకుండా ఉంటాయి.

అందుబాటు ధరలలో...

ఈ రీ యూజబుల్ ప్యాడ్స్ ధర పెద్ద సైజువి 110 రూపాయల నుండి చిన్నవి 80 రూపాయల వరకు ఉంటుందని ఆమె చెప్పింది. ఈ ప్యాడ్స్‌ను మూడు సంవత్సరాల వరకు వాడుకోవచ్చునని చెబుతుందామె. వీటిమీద అందరికీ అవగాహన కల్పించడానికి చుట్టుపక్కల ప్రాంతాలైన గర్భాంగా గ్రామంలోని పేదకుటుంబాల్లోని తల్లులకు, విద్యార్థులకు ఫ్రీ సాంపిల్స్ పంపించారు. దీనివల్ల



చాలామందికి వీటి గురించి తెలిసింది. వీటిని పెద్ద మొత్తంలో తయారుచేసి మాకు అందజేస్తే మేము మరిన్ని వెనకబడిన ప్రాంతాల్లో ఫ్రీగా పంపిణీ చేస్తామంటూ ఎన్నో ఆర్డర్లు వస్తున్నాయని అయిమోని సంతోషంగా చెబుతుంది. ఇగ్టి వీటికి ప్రారంభకర్త. ఆర్థికంగా ఆమె అన్ని సమకూరిస్తే అయిమోని వాటికి రూపు తెస్తుంది. పొలాల్లో తక్కువ వేతనానికి పనిచేసే మహిళలకు వీటిని ఉచితంగానే ఇచ్చే ఏర్పాట్లు చేస్తున్నారు.

ముందుకు కదలాలి

సమయం వచ్చింది ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకుని స్వతంత్రంగా ముందుకు సాగుతూ నెలసరి సమయంలో మహిళల ఆరోగ్యం, పరిశుభ్రత మీద అవగాహన కల్పించాలని టెరోన్ అంటున్నారు. లక్షమంది బాలికలకు ఈ రీయూజబుల్ ప్యాడ్స్‌ను ఉచితంగానే పంచిపెట్టాలనే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని చెబుతున్నారు. పారిజాత్ అకాడమీలో బాలికలు ప్రతిఒక్కరూ రోజుకి 30 ప్యాడ్‌లను తయారుచేస్తున్నారని, వీటిని తయారుచేయడంతో వారికి జీవనోపాధికోసం నెలకు మూడువేల రూపాయలు లభిస్తున్నాయని, జమునా బోరో చెబుతుంది. మేము వీటిని గ్రామాలలో పంచిపెడుతున్నప్పుడు ప్రతి ఒక్కరి నుంచి మంచిపని చేస్తున్నావంటూ వస్తున్న స్పందన మాకు ఎంతో సంతోషాన్నిస్తుందని ఆనందంతో చెబుతున్నారు టెరోన్, అయిమోని దంపతులు.


దీపికాపదుకొనే

నవరసాల సమ్మేళనం సినిమా అంటారు. కథ, పాత్రకు అనుగుణంగా ఎలాంటి రసాన్ని అయినా పండించగల సామర్థ్యం నటీనటులకు ఉన్నప్పుడే పరిపూర్ణత కలిగిన కళాకారులుగా స్థానం సంపాదించుకుంటారని అంటారు. అలాంటి వారినే ఆల్‌రౌండర్స్‌గా పిలుస్తుంటారు. ఈ కోవలో నటులకు ధీటుగా నవరసాల పోషణలో...ముఖ్యంగా అత్యంత క్లిష్టమైన స్టంట్స్ (పోరాటాలు) చేయడంలో కూడా తామేమీ తీసిపోమని నటీమణులు సైతం పాతతరం చిత్రాల నుంచే చాటుతున్నారు.

సాహస నాయికలు


కాక్షిచౌదరి

హీరోలకు ధీటుగా స్టంట్స్ చేస్తున్న హీరోయిన్లు


ఒకప్పుడు విజయలలిత, జ్యోతిలక్ష్మి వంటి తారలు ఫైట్స్ సన్నివేశాల్లో కూడా తమ ప్రతాపం చూపారు. వారి తర్వాత నిన్నటి తరం కథానాయికలు కూడా ఈ తరహా సన్నివేశాలలో తామేంటో చాటుకున్నారు. వారిలో విజయశాంతికి ఓ ప్రత్యేక గుర్తింపు ఉంది. రాను రాను సాంకేతికత కొత్త పుంతలు తొక్కడంతో పాటు కొత్తదనం కలిగిన చిత్రాలకే ప్రేక్షకులు కడుతుండటంతో హీరోలే కాదు హీరోయిన్లు సైతం రిస్క్ చేయక తప్పడం లేదు.
పాత్రలో ఒదిగిపోయేందుకు గ్లామర్‌గా కనిపించడమే కాదు సన్నివేశాలకు తగ్గట్టు రౌద్ర రసం, వీర రసం కూడా అద్భుతంగా పలికించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఒక్క బాలీవుడ్, టాలీవుడ్ అనే కాదు కోలీవుడ్ వంటి ఏ భాషకు చెందిన పరిశ్రమలోనైనా కొన్ని సినిమాల కోసం నటీమణులు చేస్తున్న స్టంట్స్ ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నాయి. డూప్ లేకుండా రిస్కీ సన్నివేశాలలో తామే నేరుగా పాల్గొంటూ...షూటింగ్‌కు ముందు కఠోర శిక్షణ పొందుతున్నారు. గుర్రపు స్వారి, కత్తి ఫైట్, కిక్ బాక్సింగ్ వంటివాటితో పాటు మార్షల్ ఆర్ట్స్‌లో ప్రత్యేకంగా శిక్షణ తీసుకుని మరీ సినిమాలలో నటించేందుకు నటీమణులు సంసిద్ధం కావడంతో కథానాయికలకు అత్యంత ప్రాధాన్యమిచ్చే సినిమాలు వస్తున్నాయి. టాలీవుడ్‌లో రూపొందిన అరుంధతి, రుద్రమదేవి, బాహుబలి సినిమాలలో అనుష్క చేసిన స్టంట్స్ ఓ ప్రత్యేకతను సంతరించుకున్నాయి. పాత్రల డిమాండ్ మేరకు ఆమె కత్తి ఫైట్‌లో కూడా శిక్షణ పొందడం వృత్తిపట్ల అంకితభావాన్ని తెలియజేస్తుంది. అలాగే తమన్నా కూడా బాహుబలి సినిమా కోసం స్టంట్స్ చేసిన విషయం తెలియంది కాదు. లోగడ అల్లరి నరేష్ నటించిన జేమ్స్‌బాండ్ చిత్రం ఎలా ఆడినప్పటికీ స్టంట్స్‌లో కథానాయిక సాక్షిచౌదరికి ప్రత్యేక గుర్తింపు లభించింది. ఇప్పుడామె త్వరలో విడుదల కానున్న ఊ.పె.కు.హ. చిత్రం కోసం మళ్లీ స్టంట్స్ సన్నివేశాలు చేయడం ఓ విశేషం. రాజేంద్రప్రసాద్ ప్రధాన పాత్రలో రూపొందిన ఈ చిత్రంలో సాక్షి మరోసారి తన స్టంట్స్ ప్రతాపాన్ని చూపిందట. ఇక బాలీవుడ్‌లో కూడా ఎందరో నటీమణులు స్టంట్స్‌లో కూడా తమకు తామే సాటి అని నిరూపించుకున్నారు. మేరీకోమ్ సినిమా కోసం ప్రియాంకచోప్రా, డస్ చిత్రం కోసం శిల్పాశెట్టి, అకీరా సినిమా కోసం సోనాక్షిసిన్హా, ఈ మధ్యనే పద్మావత్ చిత్రం కోసం దీపికాపదుకొనె కూడా తమ స్టంట్స్ ప్రావీణ్యాన్ని చూపెట్టారు. ఇక తెలుగు, హిందీ, తమిళ భాషల్లో రూపొందుతున్న మణికర్ణిక చిత్రంలో కంగనారనౌత్ స్టంట్స్ విన్యాసాన్ని చూడవచ్చునని అంటున్నారు. ఇప్పటికే ఈ చిత్రం ఫైట్స్ సన్నివేశాలలో ఒకసారి కత్తి గాటు కంగనా ముఖంపై తగిలింది. దాంతో ఆమె ఆస్పత్రిలో చేరి చికిత్స పొంది, ముఖంపై ఆ గాటు కనిపించకుండా ప్లాస్టిక్ సర్జరీ కూడా చేయించుకున్నట్లు అప్పట్లో వార్తలొచ్చిన విషయం తెలిసిందే. ఇదే చిత్రం సెట్స్‌లో మరోసారి ఆమె గాయపడ్డారు కూడా. అయినా మొక్కవోని ఆత్మవిశ్వాసంతో, పట్టుదలతో తన పాత్రకు న్యాయం చేకూర్చేందుకు ఆమె ఎంతో కష్టపడుతున్నారని చిత్రబృందం అంటోంది. వీరందరి సంగతి ఇలా వుంటే...తాజాగా మరో అందాల బాలీవుడ్ భామ జాక్విలాన్ ఫెర్నాండెజ్ కూడా తాను నటించబోయే రేస్-3 చిత్రం కోసం మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ పొందుతోందని అంటున్నారు. సల్మాన్‌ఖాన్ నటిస్తూ, నిర్మిస్తున్న ఈ చిత్రంలో జాక్విలాన్ పోరాటాలు ఆసక్తికరంగా ఉండేలా ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. ఫిట్‌నెస్ ట్రైనర్ కుల్‌దీప్ శశి సారథ్యంలో జాక్విలాన్ కఠోర శిక్షణ పొందుతోందట. కిక్కింగ్, పంచింగ్‌లపైనే ఆమె స్టంట్స్ సీన్లు ఉంటాయని చెబుతున్నారు. ఇందుకోసం ఆహార నియమాలను కూడా ఆమె కచ్చితంగా పాటిస్తున్నారట. కేలరీలు తక్కువగా ఉండే ఆహారానికి ప్రాధాన్యం ఇస్తూ పాత్రలో ఒదిగిపోయేందుకు ఆమె ఎంతో అభిరుచితో తనవంతు ప్రయత్నం చేస్తోందని అంటున్నారు.


కంగనా


తమన్నా


జాక్వెలిన్‌ఫెర్నాండెజ్


అనుష్క



ఉగాదికి రవితేజ ఫస్ట్‌లుక్

మాస్ మహరాజా రవితేజ కొత్త సినిమా లుక్‌ను ఉగాది రోజున విడుదల చేయనున్నారు. ఎస్ఆర్‌టి ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ తాజా చిత్రాన్ని నిర్మిస్తోంది. సోగ్గాడే చిన్నినాయనా, రారండోయ్ వేడుక చూద్దాం చిత్రాల ఫేమ్ కల్యాణ్ కృష్ణ ఈ చిత్రానికి దర్శకుడు. రామ్ తాళ్లూరి నిర్మిస్తున్న ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ను ఉగాదికి విడుదల చేయనున్నట్టు యూనిట్ ప్రకటించింది.
ఇప్పటికే అరవై శాతం షూటింగ్ పూర్తిచేశారు. మే చివరివారంలో ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తారు.
రవితేజ సరసన మాళవిక శర్మ నాయికగా నటిస్తోంది. జగపతిబాబు, బ్రహ్మానందం, జయప్రకాష్, రఘుబాబు, సుబ్బరాజు, అలీ, పోసాని కృష్ణమురళి, అన్నపూర్ణ, ప్రియదర్శి, సురేఖావాణి, ప్రవీణ్ ఇతర పాత్రధారులు.
ఫిదా ఫేమ్ శక్తికాంత్ కార్తీక్ సంగీతం, చోటా కె. ప్రసాద్ కూర్పు, బ్రహ్మ కడలి కళ, ముఖేష్ ఛాయాగ్రహణం సమకూరుస్తున్నారు.

సితార అచ్చం మా అమ్మలాగే ఉంది

- మహేష్‌బాబు



తన కుమార్తె బేబి సితార అచ్చం తన తల్లి ఇందిరాదేవిలాగే ఉందంటూ ప్రముఖ కథానాయకుడు మహేష్‌బాబు ఆనందాన్ని వ్యక్తంచేశారు. పింక్...గర్ల్ పవర్...చూడటానికి అచ్చం మా అమ్మలాగే ఉంది అంటూ సితార ఫొటోతో సోషల్ మీడియాలో ఆయన ఓ పోస్టు పెట్టారు. దీనికి హార్ట్ సింబల్స్‌ను జత చేశారు. ఈ పోస్ట్‌కు ఇప్పటికే అభిమానుల నుంచి ఒక లక్షా ఎనిమిదివేలకు పైగా లైక్స్ వచ్చాయి. సితార చాలా అందంగా ఉందంటూ కామెంట్లు వెల్లువెత్తాయి. ఇదిలావుండగా...మహేష్‌బాబు కథానాయకుడిగా తెరకెక్కుతున్న భరత్ అనే నేను చిత్రం ఏప్రిల్‌లో విడుదల కానున్న విషయం తెలిసిందే. మరోవైపు ఆయన వంశీ పైడిపల్లి దర్శకత్వంలో వేరొక చిత్రంలో నటించనున్నారు.

ఎన్టీఆర్ బయోపిక్‌లో విద్యాబాలన్!



మహానటుడు ఎన్టీఆర్ జీవిత చరిత్రను సినిమాగా రూపొందిస్తున్న విషయం తెలిసిందే. నందమూరి బాలకృష్ణ నటిస్తూ నిర్మిస్తున్న ఈ చిత్రానికి తేజ దర్శకత్వం వహిస్తున్నారు. ఈనెల 29న షూటింగ్ ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నారు. కీరవాణి సంగీతం అందిస్తున్నారు. చిత్ర నిర్మాణంలో సాయి కొర్రపాటి కూడా భాగస్వామిగా ఉన్నారు.
ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఎన్టీఆర్ బయోపిక్‌లో ఎవరెవరూ నటిస్తారనే దానిపై సస్పెన్స్ కొనసాగుతోంది. ఎన్టీఆర్ నట జీవితంలో, రాజకీయ జీవితంలో అనేక పాత్రధారులు ఉంటారు. ఆ పాత్రలను ఎవరిచేత నటింపజేస్తారనే దానిపై పరిశ్రమలో, అభిమానుల్లో ఆసక్తి నెలకొనిఉంది. తాజాగా సమాచారం ఏమంటే ఎన్టీఆర్ సతీమణి బసవతారకం పాత్రకు బాలీవుడ్ నటి విద్యాబాలన్‌ను ఎంపికచేసినట్టు సమాచారం. ఇప్పటికే దర్శకుడు తేజ ముంబాయిలో విద్యాబాలన్‌ను సంప్రదించి, కథ గురించి వివరించారని, ఆమె నటించడానికి అంగీకరించారని సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. ఈ సినిమాలో నటించే ఇతర నటుల వివరాలను చిత్రం ప్రారంభం రోజునే వెల్లడించే అవకాశం ఉంది.

పాటల్లో సంత

సూర్య భరత్ చంద్ర, శ్రావ్యారావు జంటగా నటిస్తున్న చిత్రం సంత. శ్రీ సుబ్రమణ్య పిక్చర్స్ పతాకంపై జై వర్ధన్ బోయనేపల్లి నిర్మిస్తున్నారు. మట్టి మనుషుల ప్రేమకథ అనేది ఉప శీర్షిక. నెల్లుట్ల ప్రవీణ్ చందర్ దర్శకత్వం వహిస్తున్నారు. ఓ సంత నేపథ్యంలో జరిగే ప్రేమకథగా రూపొందిస్తున్నారు. వినోదానికి ప్రాధాన్యత ఉంది. ప్రస్తుతం పాటల చిత్రీకరణ జరుపుతున్నారు.
దర్శకుడు మాట్లాడుతూ ఇప్పటికే తొలి షెడ్యూల్ పూర్తిచేశాం. బుధవారం నుండి పాటలను, టాకీ చిత్రీకరణ జరుగుతుంది. హైదరాబాద్, వరంగల్ పరిసర ప్రాంతాల్లో పాటలను చిత్రీకరిస్తాం. ఈ షెడ్యూల్‌తో సినిమా మొత్తం పూర్తవుతుంది అని చెప్పారు.
ఇతర పాత్రల్లో కిన్నెర, మధుమణి, ఫణి, ప్రసన్న, ఆర్ఎస్. నందా, దుర్గేష్ తదితరులు నటిస్తున్నారు. ఈ చిత్రానికి మాటలు ఎస్.కె.అనీఫ్, డా.పసునూరి రవీందర్, పాటలు గోరెటి వెంకన్న, కాసర్ల శ్యామ్, మౌనశ్రీ మల్లిక్, మాట్లా తిరుపతి, ఛాయాగ్రహణం ఫణీంద్ర వర్మ అల్లూరి.


సూర్య భరత్ చంద్ర, శ్రావ్యారావు

కామెడీ మిఠాయి

కమల్ కామరాజ్, రవివర్మ, రాహుల్ రామకృష్ణ ప్రియదర్శి, శ్వేతావర్మ, భూషణ్ కల్యాణ్, అజయ్ ఘోష్ ప్రధాన పాత్రధారులుగా రూపొందుతున్న చిత్రం మిఠాయి. ప్రశాంత్ కుమార్ దర్శక, నిర్మాణంలో తెరకెక్కుతోంది. రెడ్ యాండ్స్ పతాకంపై రూపొందుతున్న ఈ చిత్రం చిత్రీకరణ వికారాబాద్ వేసిన సెట్‌లో జరిగింది.
దర్శక, నిర్మాత మాట్లాడుతూ వికారాబాద్‌లో వేసిన ప్రత్యేక సెట్‌లో లిబరేషన్ పాటని చిత్రీకరించాం. దీంతో తొలి షెడ్యూల్ పూర్తయింది. ఈ నెల 17 నుండి తదుపరి షెడ్యూల్ ప్రారంభిస్తాం. పెళ్లిచూపులు చిత్రానికి సంగీతం అందించిన వివేక్ సాగర్ మా సినిమాకు బాణీలు అందిస్తున్నారు. డార్క్ కామెడీ జోనర్‌లో విభిన్నమైన పాత్రల నడుమ సాగే సినిమా ఇది అని అన్నారు.


కమల్ కామరాజ్, శ్వేతావర్మ

కొండవీటి కోట నేపథ్యంలో

హాస్యనటులు హీరోలుగా, ముఖ్యపాత్రధారులుగా అనే చిత్రాలు వచ్చాయి. తాజాగా చిత్రం శీను ప్రధాన పాత్రలో ఓ చిత్రం తెరకెక్కనుంది. సోలోస్టార్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సురేంద్ర కమల్ నిర్మిస్తున్న చిత్రం విశ్వదాభిరామ. ఈ చిత్రానికి ముగ్గురు దర్శకత్వం వహిస్తున్నారు. సురేష్ కాశీ, సురేంద్ర కమల్, అశోక్ చక్రం త్రయం దర్శకత్వం వహిస్తుండడం విశేషం. చిత్రం శీను ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ చిత్రంలో భువన్ తేజ్, అనిల్, ఆనంద్, సహస్ర, రాజారెడ్డి, మానస ఇతర ముఖ్యపాత్రధారులు.
దర్శకుడు మాట్లాడుతూ కొండవీటి కోట నేపథ్యంలో జరిగే డేత్ గేమ్ థ్రిల్లర్ విశ్వదాభిరామ చిత్ర కథ. ఇప్పటి వరకు కామెడీ కామెడీ పాత్రల్లో నటించి అలరించిన చిత్రం శీను తొలిసారి విలన్‌గా మా చిత్రంలో కనిపిస్తాడు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తిచేశాం. ప్రస్తుతం నిర్మాణానంతర పనులు జరుగుతన్నాయి. త్వరలో విడుదల తేదీని వెల్లడిస్తాం అని చెప్పారు.
ఈ చిత్రానికి కథ, కథనం, మాటలు సురేష్‌కాశి, ఛాయాగ్రహణం అజీమ్, తరుణ్ సోనూ, నిర్మాత సురేంద్ర కమల్ (సురేంద్ర వంటిపులి), దర్శకత్వం సురేష్ కాశి, సురేష్ కమల్, అశోక చక్రం.


శ్రీను